ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ ద్వాదశి, సా.5.13 వరకు అనంతరం త్రయోదశి; నక్షత్రం: రోహిణి ఉ.9.32 వరకు అనంతరం మృగశిర; అమృతకాలం:ఉ.6.35 నుండి 8.10 వరకు, రా.12.20 నుండి 1.55 వరకు; వర్జ్యం: మ.2.56 నుండి 4.28 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు, మ.12.24 నుండి 1.12 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ.3.00 నుండి 4.30 వరకు;

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com Journalism first!

సంపుటి:57 • సంచిక:273 • శుక్రవారం 18 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

స్పీకర్ పోచారం



పోచారానికి సీఎం కేసీఆర్ అభినందనలు

• ఏకగ్రీవంగా ఎన్నిక.. కేసీఆర్ ప్రతిపాదనకు కాంగ్రెస్ మద్దతు
• సీనియారిటీకే పట్టం • నేడు అధికారిక ప్రకటన

ఆంధ్రప్రభ, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా నిజామాబాద్ జిల్లా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఉదయం ఈ ఎన్నికను లాంఛనంగా ప్రకటించనున్నారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి పేరు ప్రతిపాదించి ఏకగ్రీవం కోసం కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ పక్షాలను సంప్రదించారు. అందరూ కేసీఆర్ ప్రతిపాదనను ఆమోదించారు. స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డిని ప్రతిపాదిస్తూ నామినేషన్ పత్రాలపై సీఎం కేసీఆర్, మల్లుభట్టివిక్రమార్కలు సంతకాలు చేశారు. మొత్తం ఆరుసెట్ల నామినేషన్ల పత్రాలు దాఖలు కాగా, కేసీఆర్, మల్లు భట్టివిక్రమార్కతో పాటు అహ్మద్‌బలాల, రేఖానాయక్, అబ్రహాం, తలసాని శ్రీనివాసయాదవ్‌లు పోచారం అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించి బలపరిచారు. స్పీకర్ పదవికి ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో సభాపతిగా పోచారం శ్రీనివాసరెడ్డి ఎన్నికైనట్లే. అధికారికంగా దీనిని శుక్రవారం ప్రకటించనున్నారు. ఇక నామినేషన్ పత్రాల దాఖలు కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేటీరామారావు, ఇంద్రకరణ్‌రెడ్డి, ఈటల రాజేందర్, రసమయి బాలకిషన్, సుధీర్‌రెడ్డి, బలాల, అబ్రహాం, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్పీకర్ అభ్యర్థిగా ఎంపికై నామినేషన్ పత్రాలు దాఖలుచేసిన పోచారం శ్రీనివాసరెడ్డిపై అభినందనల జల్లు కురిసింది. టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీరామారావు, రాజ్యసభసభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్, హోంమంత్రి మహమూద్ అలీ,

➩ 2వ పేజీలో...

“ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అను నేను..!



అసెంబ్లీ సమావేశాల తొలిరోజు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

కొలువుదీరిన కొత్త సభ

తొలిరోజు ప్రమాణస్వీకారాలు

• సభలో అందరికన్నా సీనియర్ తెరాస అధినేత కేసీఆరే • 8సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఘనత ఆయన సొంతం • శాసనసభలో అడుగుపెట్టిన 23 మంది కొత్త ఎమ్మెల్యేలు
• అసెంబ్లీలో ఆరుగురు మహిళా ఎమ్మెల్యేలు
• ఎమ్మెల్యేలుగా ఇద్దరు ఎంపీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ కొత్త శాసనసభ గురువారం కొలువుదీరింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత ఏర్పడిన రెండో శాసనసభ, ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 36 రోజుల తర్వాత సమావేశమైంది. తాత్కాలిక స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ తొలుత సభా నాయకుడైన ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ప్రమాణ స్వీకారం చేయించగా, ఆ తర్వాత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ అసెంబ్లీ నుంచి ఎన్నికైన అజ్మీరా రేఖానాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెతో పాటు అసెంబ్లీకి ఎన్నికైన మిగతా ఐదుగురు మహిళా ఎమ్మెల్యేలు అక్షర క్రమంలో ప్రమాణం చేశారు. ఆ తర్వాత అదే అక్షర క్రమంలో

➩ 3వ పేజీలో...





తెరాసలోకి వంటేరు!

• వంటేరుతో పాటు నేడు కారెక్కనున్న సండ్ర? • కేసీఆర్ సమక్షంలో చేరికలు?

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. టీడీపీ, కాంగ్రెస్ ముఖ్యనేతలు కారెక్కేందుకు లైన్‌క్లియర్ చేసుకుంటున్నారు. సత్తుపల్లి టిడిపి అభ్యర్థిగా గెలిచిన సండ్రవెంకటవీరయ్య శుక్రవారం కారెక్కబోతున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసి ఆయన గులాబీతీర్థం పుచ్చుకుంటారని పార్టీవర్గాలలో చర్చ జరుగుతోంది. ఇప్పటికే నియోజకవర్గనేతలకు ఈ సమాచారం చెప్పినట్లు తెలుస్తోంది. ఇక ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సొంత నియోజకవర్గంలో ప్రధానప్రత్యర్థిగా ఉండి ఆరేడేళ్ళుగా ఆయనపై పోరాడుతున్న

➩ 9వ పేజీలో...

తొందరేముంది? డిప్యూటీ స్పీకర్‌పై మళ్లీ సస్పెన్స్ 2 లో



భట్టి వైపే మొగ్గు

సీఎల్పీ నేతను నేడు ప్రకటించనున్న అధిష్ఠానం 2 లో



14న అమరావతికి కేసీఆర్?

జగన్ గృహప్రవేశానికి హాజరయ్యే అవకాశం

21 నుంచి ప్రారంభమయ్యే ఎర్రవల్లి యాగానికి జగన్‌కు ఆహ్వానం?

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ సీఎం కేసీఆర్ ఫిబ్రవరి 14న అమరావతి వెళుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్మించిన నివాస గృహ ప్రవేశ కార్యక్రమం 14వ తేదీన జరుగుతుండడంతో ఈ కార్యక్రమానికి కేసీఆర్‌ను ఆహ్వానించినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో భాగంగా కేసీఆర్ మంగళ, బుధవారాల్లో వైఎస్ జగన్‌తో టెలిఫోన్ మంతనాలు జరిపిన సంగతి తెలిసిందే. దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలను ఒక వేదికపైకి తీసుకువచ్చి బలమైన ప్రత్యామ్నాయ శక్తిని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉన్న కేసీఆర్ ఈ కూటమిలోకి వైకాపాను కూడా ఆహ్వానించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తన తనయుడు, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు, కరీంనగర్ ఎంపీ వినోద్, రాజ్యసభ సభ్యుడు సంతోష్, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మరో నేత శ్రవణ్ కుమార్‌రెడ్డి బృందాన్ని గురువారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో ఉన్న జగన్ నివాసానికి పంపించి చర్చలు జరిపించిన సంగతి తెలిసిందే. ఈ చర్చలు సాగుతున్న సమయంలోనే కేసీఆర్ జగన్‌కు ఫోన్ చేయడం, 14న అమరావతి పరిధిలోని తాడేపల్లిలో నిర్మించిన తన సొంత ఇంటి గృహ ప్రవేశానికి రావలసిందిగా ఆహ్వానించారని అందుకు కేసీఆర్ సుముఖత వ్యక్తంచేశారని ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే జగన్‌తో చర్చల అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌పై చర్చించేందుకు త్వరలోనే కేసీఆర్ విజయవాడ వెళతారన్న విషయాన్ని

➩ 9వ పేజీలో...

మీ విజయాలకు మేం ఫిదా

ఆర్థిక బంధాలు పెంచుకుందాం





సీఎం కేసీఆర్‌కు సింగపూర్ వాణిజ్య మంత్రి ఈశ్వరన్ అభినందన లేఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇటీవలి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సీఎం కేసీఆర్‌ను సింగపూర్ వాణిజ్య సంబంధాల ఇంఛార్జి మంత్రి ఎస్.ఈశ్వరన్ అభినందించారు. సీఎం కేసీఆర్‌ను డియర్ ఎక్సలెన్సీ శ్రీ చంద్రశేఖరరావు అని సంభోదిస్తూ గురువారం ఆయన ఒక లేఖలో శుభాకాంక్షలు తెలిపారు. మీ నాయ కత్వంలో తెలంగాణ 17.17 శాతం వార్షిక ఆదాయం నమోదు చేసుకోవడం ప్రశంస నీయమని పేర్కొన్నారు. తెలంగాణ పెట్టుబడులకు అనువైన కేంద్రంగా ఉందని సింగపూర్ కంపెనీలు భావిస్తున్నాయని పేర్కొన్నారు. డవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ సింగపూర్ కేంద్ర కార్యాలయాన్ని సింగపూర్ తర్వాత హైదరాబాద్‌లోనే నెలకొల్పింద ని, అలాగే అసెండాస్ సింగపూర్‌ను తెలంగాణలో విస్తరించనున్నట్లు ఈశ్వరన్ పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ, సింగపూర్ మధ్య ఆర్థిక బంధాలు బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధి లో తమ దేశ సంస్థలు భాగస్వామ్యం అవుతాయన్నారు. ఈ లేఖను చెన్నైలో ఉన్న రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ కాన్సులేట్ జనరల్ రాయ్‌ఖో ద్వారా పంపించారు.



ప్రక్షాళన దిశగా సీబీఐ

ఆస్తానాకి ఉద్వాసన

ఆగమేఘాల మీద బదలీ

ఆస్తానాతో పాటు ఇంకా ముగ్గురిపై వేటు

ఇందులో ఇద్దరు అలోక్‌వర్మకి సన్నిహితులు

ఈ నెల 24న సీబీఐకి కొత్త డైరెక్టర్ ఎంపిక

న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్ల మధ్య చిచ్చులో ఒకరు ఇంటిబాట పట్టగా, మరొకరు ఏజెన్సీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మతో విభేదాల కారణంగా వార్తల్లోకి ఎక్కిన స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్తానాకి చుక్కెదురైంది. అలోక్ వర్మతో విభేదించిన ఆస్తానా తదుపరి సీబీఐ డైరెక్టర్ అవుతారని తలపోస్తున్న తరుణంలో గురువారం జారీ చేసిన ప్రభుత్వ జీవో ఆయన ఆశలపై నీళ్లు చల్లింది. సీబీఐలో రాకేశ్ ఆస్తాన్ పదవీ కాలాన్ని కుదిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రాకేశ్ ఆస్తానాతో పాటు అలోక్ వర్మకి సన్నిహితులుగా భావిస్తున్న జాయింట్ డైరెక్టర్ అరుణ్ కుమార్ శర్మ, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ మనీశ్ కుమార్ సిన్హానూ సీబీఐ బాధ్యతల నుంచి తప్పించారు. వీరితో పాటు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి అధికారి జయంత్‌పైనా వేటు పడింది. సీబీఐకి పూర్తి స్థాయి డైరెక్టర్ నియామకం కోసం ప్రధాని నరేంద్ర మోడీ

➩ 9వ పేజీలో...



మహారాష్ట్రలో డ్యాన్స్ బార్లపై

ఆంక్షలు సడలింపు

సీసీటీవీ కెమేరాలు వద్దు

వ్యక్తిగత గోప్యతకు భంగం

డ్యాన్సర్లపై కరెన్సీనోట్లు విసరొద్దు

సుప్రీంకోర్టు ఆదేశాలు

వివరాలు 10లో...



టార్గెట్ పూర్తి చేయలేదని

పాకించారు

చైనా సంస్థ అమానుష చర్య

అంతర్జాలంలో వీడియో వైరల్

రంగంలోకి పోలీసులు

కంపెనీ సీజ్

వివరాలు 10లో...

నామినేషన్ దాఖలు చేస్తున్న పోచారం, చిత్రంలో సీఎం కేసీఆర్, మల్లు భట్టివిక్రమార్క




స్పీకర్ పోచారం

(మొదటిపేజీ తరువాయి)

మండలి విప్ పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంపాగోవర్ధన్, హన్మంత్‌షిండే తదితరులు పోచారంను అభినందనల్లో ముంచెత్తారు.

నాలుగు దశాబ్దాల రాజకీయప్రస్థానం

పోచారం శ్రీనివాసరెడ్డి బాన్సువాడ శాసనసభ స్థానం నుండి ఆరుసార్లు పోటీచేసి, ఐదుసార్లు విజయం సాధించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అందరికన్నా సీనియర్ రాజకీయనాయకుడిగా కొనసాగుతున్నారు. 1976 లో రాజకీయాల్లో అడుగుపెట్టిన పోచారం 1977లో దేశాయిపేట సింగిల్‌విండో ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1987లో డీసీసీబీ ఛైర్మన్‌గా పనిచేశారు. 1994లో తొలిసారి బాన్స్ వాడ నుండి టిడిపి తరుపున పోటీచేసి ఎమ్మెల్యే అయ్యారు. 1998లో గృహనిర్మాణశాఖామంత్రిగా పనిచేశారు. 1999లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది భూగర్భగనులు, జలవనరుల శాఖామంత్రిగా పనిచేశారు. కొంతకాలం పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా కూడా ఉన్నారు. 2004లో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2009లో టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధిం చిన పోచారం 2011లో టీడీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనా మా చేసి తెరాసలో చేరారు. అనంతరం జరిగిన ఉప ఎన్ని కల్లో 49వేల మెజారిటీతో గెలుపొందారు. 2014ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తన పనితీరుతో లక్ష్మీపుత్రునిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసలు అందుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బాన్స్‌వాడ నియోజకవర్గం నుండి ఐదోసారి ఘనవిజయం సాధించారు.



మండలి చైర్మన్ స్వామిగౌడ్‌తో పోచారం ఆత్మీయ ఆలింగనం

సీనియారిటికే పట్టం

- స్పీకర్ ఎంపికపై చివరి వరకూ సస్పెన్స్.. ప్రచారంలో ఎందరున్నా ఎంపికపై గోప్యత
- పోచారంవైపే సీఎం మొగ్గు.. వారసుడి భవిష్యత్‌కు హామీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆఖరి నిమిషం వరకు అంతులేని గోప్యత పాటించిన సీఎం కేసీఆర్ స్పీకర్ పదవికి సర్వసభ్యామోదం ఉన్న సీనియర్‌కే పట్టం కట్టారు. తెలంగాణ శాసనసభస్పీకర్‌గా సీఎం కేసీఆర్ ఎవరిని ఎంపికచేస్తారన్న ఉత్కంఠ గత నెలరోజులకు పైగా కొనసాగుతోంది.

ఆరుపేర్లు విస్తృతంగా ప్రచారం జరగ్గా.. గురువారం ఉదయం కూడా పోచారం శ్రీనివాసరెడ్డితో పాటు నిర్మల్ శాసనసభ్యుడు ఇంద్రకరణ్‌రెడ్డిని సీఎం ప్రగతిభవన్‌కు ఆహ్వానించడం, తన వెంటబె ట్టుకుని రావడంతో సస్పెన్స్ కొనసాగింది. ఆఖరిని మిషం వరకు సస్పెన్స్ కొనసాగించాలన్న వ్యూ హంతోనే సీఎం ఎక్కడ లీక్ కాకుండా జాగ్రత్తపడ్డా రు. కేసీఆర్ మాట కాదనలేక.. స్పీకర్ పదవికి తన పేరు వినిపించిన నాటి నుండీ వయసు, ఆరోగ్యసమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్ళిన పోచారం గతంలో మంత్రిగా ఉన్న సమ యంలోనూ ఎదురైన ఆరోగ్యసమస్యలను సీఎంకు వివరించారు. వైద్యులు కూడా తనను ఒత్తిడి పెట్టుకోవొద్దని చెప్పారని వివరించేయత్నం చేసినా, సభ హుందాతనం దృష్ట్యా పోచారం శ్రీనివాసరెడ్డి అయితేనే న్యాయం జరుగుతుందని సీఎం కేసీఆర్ భావించారు. అపార రాజకీయ అనుభవం, మంత్రిగా 14ఏళ్ళకు పైగా పనిచేసిన అనుభవం ఉన్న పోచారం శ్రీనివాసరెడ్డిని స్పీకర్‌గా ఎంపికచేస్తే సభ ఔన్నత్యం కాపాడబడుతుందని సీఎం భావించినట్లు తెలుస్తోంది. ఇక దేవాదాయశాఖా మంత్రిగా కేసీఆర్ గత క్యాబినెట్‌లో పనిచేసిన ఇంద్రకరణ్‌రెడ్డి పేరు కూడా చివరివరకు వినిపించగా, ఒక దశలో స్పీకర్ ఛైర్‌కు నేతల్లో ఉన్న సెంటిమెంట్ దృష్ట్యా ఆయన అనుచరులు ఆందోళనకు గురయ్యారు. సెంటిమెంట్ రీత్యా పోచారం శ్రీనివాసరెడ్డిని లక్ష్మీపుత్రుడుగా భావించే కేసీఆర్ ఆయన ఉంటే సభలో తిరుగుండదని, ఆహ్లాదంగా సభాకార్యక్రమాలు సాగిపోతాయని భావించినట్లు తెలుస్తోంది. అందుకే ఆరోగ్యసమస్యలు ఉన్నాయని చెప్పే ప్రయత్నం చేసినా కేసీఆర్ ఒత్తిడి పడనివ్వమని భరోసానిచ్చినట్లు తెలుస్తోంది. వయోభారం రీత్యా వచ్చే ఎన్నికల్లో పోచారం శ్రీనివాసరెడ్డి తనయునికి రాజకీయ అవకాశం కల్పించడంతో పాటు భవిష్యత్తును తాను చూసుకుంటానని భరోసానిచ్చినట్లు తెలుస్తోంది.

స్పీకర్‌గా పోచారం ఉంటేనే బాగుంటుందన్న అభిప్రాయానికి కేసీఆర్ రావడంతో ఆయన కాదనలేకపోయారు. స్పీకర్ పదవికి పోచారంను ఒప్పించిన కేసీఆర్ తర్వాత కార్యక్రమాలకు చకచకా పావులు కదిపారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో నామినేషన్ పత్రాలు సిద్ధం చేస్తున్నట్లు, మధ్యాహ్నం 2గంటలకు పోచారం శ్రీనివాసరెడ్డి నామినేషన్ వేయబోతున్నట్లు లీకులుఅందాయి. అప్పటిదాకా సస్పెన్స్ కొనసాగింది. గోప్యత పాటించినా సభపై సంపూర్ణ అవగాహన ఉన్న సీనియర్‌కే పట్టంకట్టారంటూ స్పీకర్ నిర్ణయంపై రాజకీయవర్గాల్లో ప్రశంసల జల్లుకురిసింది.

కేసీఆర్‌కు పోచారం కృతజ్ఞతలు



స్పీకర్‌గా ఎంపికైన పోచారం శ్రీనివాసరెడ్డి సీఎం కేసీఆర్ ఛాంబర్‌కు వెళ్ళి కృతజ్ఞతలు తెలిపారు. టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక తనకు సభాపతి అవకాశం కల్పించి నందుకు ధన్యవా దాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకం నిలుపుకునే విధంగా పనిచేస్తానన్నారు.

ఆహార్యం... అనుభవం... అదుర్స్

- మంచితనమే అలంకారం
- వివాదరహితుడిగా ప్రజల్లో గుర్తింపు
- 1976లో రాజకీయ ప్రవేశం
- సహకార సంఘం అధ్యక్షుడి నుంచి శాసనసభ స్పీకర్ స్థాయికి
- సీఎంతో సాన్నిహిత్యం

నిజామాబాద్, ప్రభన్యూస్ బ్యూరో: రాష్ట్ర శాసనసభ రెండవ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్న మాజీమంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి మంచితనమే అలంకారంగా ప్రజల్లో ఆదరణ పొందారు. రాజకీయ, పరిపాలనా రంగాలలో విశేష అనుభవంతోపాటు, నిండైన విగ్రహం, ఆహార్యం కొత్త బాధ్యతలకు వన్నె తెస్తాయనడంలో సందేహమే లేదు. సహకార సంఘం అధ్యక్షుడిగా రాజకీయ అరగేట్రం చేసిన పోచారం... చివరకు ఉన్నతమైన రాజ్యాంగ పదవిని అధిష్ఠించడనుండడంతో జిల్లా ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో ఎమ్మెల్యే పదవిని తృణప్రాయంగా వదిలేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. కేసీఆర్‌తో అత్యంత ఆత్మీయుడిగా ఉండే పోచారంను లక్ష్మీపుత్రుడిగా కేసీఆర్ అభివర్ణిస్తూండటం తెలిసిందే. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన పోచారం ప్రజల మనిషి, మృదుస్వభావి. ఉన్నత విద్యావంతుడైన ఆయనకు అన్ని శాఖలపై అపారమైన అనుభవం, పట్టు ఉంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకునే ఆయనకు ముక్కుసూటిగా మాట్లాడటం అలవాటు. 42 ఏళ్ళ సుదీర్ఘ రాజకీయాల్లో అనేక పదవులు నిర్వర్తించిన శ్రీనివాస్‌రెడ్డి మంత్రిగా చేసిన ప్రతి శాఖలో తనదైన ముద్ర వేశారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పోచారం సమర్ధవంతంగా నిర్వహించి, అనేక రైతు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. దేశంలోనే ఆదర్శ పథకాలుగా పేరొందిన రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ ఎక్కడా వివాదాలు, సమస్యలు తలెత్తకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి దక్కేలా చేయడంలో పోచారం కృషి చేశారు. మంత్రిగా తీరిక లేకుండా ఉన్నప్పటికీ తన సొంత బాన్సువాడ నియోజకవర్గంను అభివృద్ధి పథంలో తీసుకెళ్లి అనేక ఏళ్ళ పెండింగ్ పనులను పూర్తి చేసి, ఆదర్శంగా నిలిపారు.

కాంగ్రెస్‌తో తొలి అడుగు

బి.ఇ చదివిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి 1970లో కాంగ్రెస్ పార్టీలో చేరి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1977లో అప్పటి బాన్సువాడ తాలుకాలోని దేశాయిపేట్ సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. టీడీపీ ఆవిర్భావంతో 1984లో కాంగ్రెస్ పార్టీని వీడి పార్టీలో చేరారు.



అసెంబ్లీలో గురువారం ఎంపీ సంతోష్‌తో పోచారం

బాన్స్‌వాడ బాద్‌షా

1989లో నిజామాబాద్ పార్లమెంట్‌కు పోటీ చేసి ఓటమి పాలైన పోచారం1987లో జిల్లా సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1994లో బాన్సువాడ ఎమ్మెల్యేగా పోటీ చేసి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1998లో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టారు. 1999లో రెండవసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన పోచారం గనులు, భూగర్భ శాఖ మంత్రిగా, 2000లో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా కీలక శాఖలను సమర్ధవంతంగా నిర్వర్తించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌పై ఓటమిపాలయ్యారు. 2009లో తిరిగి టీడీపీ అభ్యర్థిగా బాన్సువాడ నుంచి 3వ సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం తీవ్రస్థాయిలో ఉన్న కీలకసమయంలో 2011లో టీడీపీ పార్టీకి, ఎమ్మెల్యేకు రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి కేసీఆర్‌తో నడిచారు. 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో 4వ సారి పోచారం గెలుపొందారు. స్వరాష్ట్రంలో 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా 5వ సారి ఎన్నికై కీలకమైన వ్యవసాయ శాఖ మంత్రిగా నియమితులయ్యారు. ఇటీవల డిసెంబర్ 2018లో జరిగిన ఎన్నికల్లో 6వ సారి కూడా బాన్సువాడ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై అత్యున్నతమైన శాసనసభాపతిగా ఏకగ్రీవంగా నేడు ఎన్నిక కానున్నారు. ఏ పదవి చేపట్టినా వన్నె తెచ్చిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి శాసనసభాపతిగా రాణిస్తాడనే పూర్తి నమ్మకంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక బాధ్యతను అప్పగించారు.

వ్యవసాయంపై మక్కువ

వ్యవసాయం అంటే ఇష్టపడే పోచారం 70 ఏళ్ళ వయస్సులోనూ స్వయంగా ట్రాక్టర్ నడుపుతారు. ఇప్పటికి పోచారం గ్రామంలో వ్యవసాయం చేయిస్తారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉంటూ అందరితో ఆత్మీయంగా ఉండే ఆయన ఊరు పేరే ఇంటిపేరుగా మారింది. అసలు పేరు పరిగి శ్రీనివాస్‌రెడ్డి కాగా ప్రజలు ఆయన పుట్టిన ఊరు పేరును ఇంటి పేరుగా మార్చారు. వెనుకబడిన బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో తీర్చిదిద్దిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి అప్పట్లోనే బి.ఇ సివిల్ ఇంజనీరింగ్‌గా పట్టా పొందారు. కన్న ఊరికి సేవ చేయాలనే సంకల్పంతో ఉన్నత ఉద్యోగ అవకాశాలు వచ్చినా వదులుకుని రాజకీయాల్లోకి వచ్చి, ప్రజల అవసరాలను తీర్చడంతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ఇలా కుగ్రామం నుంచి రాజకీయాల్లో తనదైన స్థానం పొందిన ఆయనకు ఊరి పేరు ఇంటి పేరుగా మారింది. ఇదిలా ఉంటే అత్యున్నత శాసనసభాపతిగా నేడు ఎన్నిక కానున్న సందర్భంగా పోచారం గ్రామం మురిసిపోతున్నది.

ఊరి పేరే... ఇంటి పేరు

బాన్సువాడ మండలం పోచారం గ్రామంలో సాధాణ వ్యవసాయ కుటుంబంలో పరిగి శ్రీనివాస్‌రెడ్డి 10 ఫిబ్రవరి 1949లో జన్మించారు. తల్లిదండ్రులు పాపమ్మ, రాజారెడ్డి, భార్య పుష్ప ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రవీందర్‌రెడ్డి డాక్టర్ వృత్తిలో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. రెండవ కుమారుడు సురేందర్ రెడ్డి రాజకీయాల్లో కొనసాగుతూనే వ్యాపారంలో రాణిస్తున్నారు. చిన్న కుమారుడు భాస్కర్‌రెడ్డి దేశాయిపేట్ సింగిల్ విండో చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

రాహుల్‌జీ.. సీఎల్పీ నేత ఎవరో మీరే తేల్చండి!

- అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడతాం
- సీఎల్పీ నేతపై రాహుల్ మాటే ఫైనల్
- ఏకవాక్య తీర్మానం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- ఇక అందరి చూపూ ఢిల్లీ వైపే



గురువారంనాడు అసెంబ్లీ ఆవరణలో కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశానికి వెళ్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత ఎంపిక వ్యవహారం తుది దశకు చేరింది. సీఎల్పీ నేతను ఎంపిక చేసే బాధ్యత ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి అప్పగిస్తూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏకవాక్య తీర్మానం చేశారు. సీఎల్పీ పదవి ఎవరికిచ్చినా అభ్యంతరం లేదంటూ పార్టీకి చెందిన 19 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేస్తూ రాహుల్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. అయితే సీఎల్పీ పదవికి తమ పేరును పరిశీలించాలని కొందరు నేతలు తమ మనుసులో మాటలను వెలిబుచ్చినట్లుగా తెలిసింది. గురువారం అసెంబ్లీ కమిటీ హాల్లో సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పరిశీలకుడిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రామచంద్ర కుంతియాతో పాటు ఏఐసీసీ కార్యదర్శులు, పార్టీకి చెందిన 19 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎల్పీ నేత విషయంపై చర్చించారు. ఆ తర్వాత విడివిడిగా ఒక్కొక్కరితో అభిప్రాయ సేకరణ చేశారు. చాలామంది ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై గట్టిగా పోరాటంచేసే వారిని ఎంపిక చేయాలని సూచించినట్లుగా తెలిసింది. కొంతమంది సీనియర్లు మాత్రం తమ పేరును పరిశీలించాలని హైకమాండ్ దూత కేసీ వేణుగోపాల్ ముందు పార్టీ ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సీఎల్పీ నేత ఎన్నిక విషయం హై కమాండ్‌కు అప్పగించడంతో.. ఇప్పుడు అందరి చూపు ఢిల్లీ వైపు మళ్లింది. సీఎల్పీ పదవి ఎవరిని వరిస్తుందోననే ఉత్కంఠ కాంగ్రెస్ నేతల్లో నెలకొన్నది.

రాహుల్ నిర్ణయిస్తారు: కేసీ

సీఎల్పీ నేత ఎన్నిక విషయంలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నిర్ణయానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కట్టుబడి ఉంటారని, ఆయన నిర్ణయమే ఫైనల్ అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభాపక్ష నేత ఎన్నిక వ్యవహారంలో ఎమ్మెల్యేలు, పార్టీ నేతల అభిప్రాయాలు తీసుకున్నామని, ఆ వివరాలను అధిష్టానానికి నివేదించామని ఆయన చెప్పారు. కాగా సీఎల్పీ నేత ఎన్నిక విషయంపై పార్టీ కోర్ కమిటీలోనూ చర్చించామని, పార్టీ సీనియర్ల అభిప్రాయలు, సూచనలను కూడా అధిష్టానం పరిగణనలోకి తీసుకుంటుందని ఆయన తెలిపారు. అందరి అభిప్రాయాల మేరకే సీఎల్పీ నేత ఎంపిక ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నేనే సీనియర్... నాకే అవకాశం ఇవ్వాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో తనకంటే సీనియర్ నేత ఎవరూ లేరని, సీఎల్పీ పదవి తనకే ఇవ్వాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే డి. సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ బలోపేతం కావాలంటే కొత్త రూపం ఇవ్వాలన్నారు. కీలక పదవుల్లో ఉన్న నేతలకు.. వారి కుటుంబ సభ్యులే ఓటు వేయని దుస్థితి నెలకొందంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపాయి. ఈ వ్యాఖ్యలను ఎవరినుద్దేశించి అన్నారోనని చర్చ మొదలైంది. పార్టీ పదవుల్లో కొత్త వారికి అవకాశం ఇచ్చి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. సీఎల్పీ నేత విషయంలో రాహుల్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని ఆయన తెలిపారు.

సామాజిక సమీకరణం

ఇదిలా ఉండగా సీఎల్పీ నేత ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం సామాజిక సమీకరణను పరిగణలోకి తీసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఆ పదవి కోసం టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, సబితా ఇంద్రా రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పోటీ పడుతున్న విషయం తెలిసిందే. అయితే సీఎల్పీ సమావేశం రోజే ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేరు కూడా తెరపైకి రావడం చర్చనీ యాంశంగా మారింది. ఈ పదవికోసం ఎందరు పోటీపడు తున్నప్పటికీ అధిష్టానం మాత్రం భట్టి విక్రమార్క వైపే మొగ్గు చూపుతున్నట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. భట్టి విక్రమార్క ప్రభుత్వ చీఫ్ విప్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా పని చేసిన అనుభాన్ని అధిష్టానం పరిగణనలోకి తీసుకున్నట్లుగా సమా చారం. అంతే కాకుండా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఈ అవకాశం ఇచ్చి.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్థానంలో టీ పీసీసీ పదవిని రెడ్డి సామాజిక వర్గానికి అప్పగించాలనే ఆలోచనతో హై కమాండ్ ఉన్నట్లుగా సమాచారం.

కోమటిరెడ్డికి అవకాశం ఇవ్వాలి: చిరుమర్తి

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలంటే పార్టీలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతం, ప్రజాసమస్యలపై ప్రభుత్వంతో పోరాటం చేయాలంటే సీఎల్పీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. పార్టీ నాయకత్వం మారితేనే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 10 ఎంపీ సీట్లు గెలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

తొందరేముంది

డిప్యూటీ స్పీకర్‌పై మళ్ళీ సస్పెన్స్

ఫిబ్రవరిలోనా..? జూన్‌లోనా?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్పీకర్ పదవికి అభ్యర్ధిని ఎంపికచేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ డిప్యూటీస్పీకర్ పదవిపై మళ్ళీ సస్పెన్స్ కొనసాగేలా చేస్తున్నారు. అనూహ్య ఉత్కంఠకు తెరతీశారు. కేవలం స్పీకర్ పదవికి మాత్రమే అభ్యర్ధిని ఎంపికచేసిన కేసీఆర్ డిప్యూటీస్పీకర్ పదవిపై చర్చవస్తే.. తొందరేముంది సమయం చూసి చేద్దాం అని గురువారం సన్నిహితులతో సరదాగా వ్యాఖ్యానించినట్లు తెలిసింది. పదవుల విషయంలో అత్యంత పక్కాగా, ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్న కేసీఆర్ తన చుట్టూ ఉండేవారి ఊహకు కూడా అంతుచిక్కకుండా వ్యవహరిస్తున్నారు. స్వయంగా సీఎం గుప్పిటవిప్పితే తప్ప ఏం చేస్తారో నేతలు అంచనాకు రాలేకపోతున్నారు. ఎమ్మెల్సీలు, ఎంపీ అభ్యర్ధులు, పార్లమెంటరీ కార్యదర్శులు, మంత్రిపదవులు, విప్‌లు ఇలా అనేకపదవులకు నేతలను ఎంపికచేయాల్సి ఉండడం, నాలుగేళ్ళు ప్రగతిరథచక్రం, పార్టీ చక్రాలు అత్యంత సాఫీగా పరుగెత్తేలా ప్రణాళికలు రూపొందించాల్సి ఉండడంతో ఈసారి పదవులు ఆషామాషీగా ఎవరికీ దక్కవన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఈ కసరత్తులన్నీ ఒకదానితో ఒకటి ముడిపడిఉండడం, జాతీయరాజకీయాల్లో కీలకభూమిక పోషించేందుకు, అధికారాన్ని మళ్లీ నిలుపుకునేదిశగా నియామకాలు, ప్రణాళికలు ఉండాలని భావిస్తుండడంతో పదవుల భర్తీ వ్యవహారం ఇప్పటికిపుడు తేలేదికాదన్న చర్చ పార్టీవర్గాల్లో జరుగుతోంది. ఫిబ్రవరి 5నుండి ప్రారంభమయ్యే మాఘమాసంలో పదవుల భర్తీ జరుగుతుందా.. లేక లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ వ్యవహారంపై సీఎం దృష్టిపెట్టి తేల్చేస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల కోలాహలం కొనసాగుతుండగా, పదవుల భర్తీ అంశంపై ఎలాంటి స్పష్టత, సంకేతాలు లేకపోవడంతో అనుచరగణం వేస్తున్న ప్రశ్నలకు గతంలో వివిధ పదవులు అనుభవించిన నేతలు సమాధానాలు చెప్పలేకపోతున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఉత్కంఠ మరికొన్నిరోజులు కొనసాగనుంది. అయితే బడ్జెట్ సమావేశాలకైనా తెగుతుందా లేదా అన్న సస్పెన్స్ కొనసాగుతోంది.

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం అవుదాం

పార్టీ ముఖ్యనేతలతో కుంతియా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్ర కుంతియా సూచించారు. నూతన జిల్లాలకు సమర్ధులైన వారిని పార్టీ అధ్యక్షులను నియమించుచాలన్నారు. గురువారం ఒక ప్రైవేట్ హోటల్‌లో కాంగ్రెస్ ముఖ్యనేతలు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శులు బోసు రాజు, సలీమ్, శ్రీనివాసన్, టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు తదితర నేతలు హాజరయ్యారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమిపై నియోజక వర్గాల వారీగా సమీక్షించుకుంటూనే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించే విధంగా వ్యూహాలను సిద్ధం చేయాలని కుంతియా సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటి చేసే అభ్యర్ధుల విషయంపైన కూడ దృష్టిసారించాలన్నారు. కేంద్రంలో యూపీఏ ప్రభుత్వమే వస్తుందని, రాహుల్‌గాంధీ ని ప్రధాన మంత్రిగా చూడాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు తేడా ఉంటుందని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, లోక్‌సభ ఎన్నికలు జాతీయ పార్టీల మధ్యే జరుగుతాయని ఆయన వివరించారు. అందుకు పార్టీ శ్రేణులను కూడా సన్నద్ధం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

భట్టి వైపే మొగ్గు!

- సీఎల్పీ నేత పేరు నేడు ప్రకటించనున్న అధిష్ఠానం
- ఉత్తమ్‌కు ఒకరిద్దరే మద్దతు
- మెజారిటీ సభ్యులు విక్రమార్క వైపే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ శాసన సభాపక్షనేత పదవి ఎవరిని వరిస్తుందోననే విషయంపై కాంగ్రెస్‌లో చర్చగా మారింది. సామాజికకోణాన్ని పరిగణలోకి తీసుకుంటారా..? లేదంటే పైరవీలకే ప్రాధాన్యత కల్పిస్తారా..? అనే అంశంపైన కాంగ్రెస్ నాయకులు చర్చించుకుంటున్నారు. గురువారం అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన సీఎల్పీ సమావేశంలో అధిష్ఠానం దూత కేసీ వేణుగోపాల్ పార్టీ ఎమ్మెల్యేలతో అభిప్రాయం సేకరణ చేశారు. అయితే మెజర్టీ ఎమ్మెల్యేలు ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క పేరునే సూచించినట్లుగా సమాచారం. అయితే టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రం సీఎల్పీ పదవి తనకు ఇవ్వాలని కోరినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఉత్తమ్‌కు మద్దతుగా ఒకరిద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే నిలిచినట్లుగా తెలిసింది. ఇకపోతే సీఎల్పీ రేసులో ఉన్న మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి, సుధీర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు మాత్రం.. సీఎల్పీ పదవి ఇస్తే తమకు ఇవ్వండి లేదంటే భట్టి విక్రమార్కకు అవకాశం ఇవ్వాలని సూచించారు. దీంతో ఎమ్మెల్యేల అభిప్రాయలను తీసుకున్న కేసీ వేణుగోపాల్.. సీఎల్పీ నేత ఎంపిక అధిష్టానమే నిర్ణయం తీసుకుంటుందని, అందరి అభిప్రాయాలను రాహుల్‌గాంధీకి నివేదిక ఇస్తానని తెలిపారు. తుది నిర్ణయం రాహుల్‌గాంధీనే తీసుకుంటారని వివరించారు. అయితే ఈ పదవిపై కన్నేసిన ఒకరిద్దరూ సీనియర్లు మాత్రం ఢిల్లీ స్థాయిలో అప్పడే పైరవీ మొదలుపెట్టినట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయం సాధించింది 19 మంది ఎమ్మెల్యేలే అయినప్పటికి.. వారి అభిప్రాయాలు తెలుసుకుని ఇక్కడనే సీఎల్పీ నేతను ప్రకటిస్తే భాగుండేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సీఎల్పీ నేత ఎంపిక ఇప్పటికే జాప్యం జరిగిందనే వాదనలు కూడ వినిపిస్తున్నాయి.

టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే దళితుడినే సీఎం చేస్తానని గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. తీరా అధికారంలోకి వచ్చాక కేసీఆరే సీఎంగా కూర్చున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శించిన విషయం తెలిసిందే. ఇప్పుడు సీఎల్పీ నేత పదవి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన భట్టి విక్రమార్కకు అప్పగించి.. టీఆర్ఎస్‌కు గట్టి సమాధానం ఇవ్వాలని రాహుల్‌గాంధీ ఒక నిర్ణయానికి వచ్చారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.





కొలువుదీరిన కొత్త సభ

115 మంది ప్రమాణం

● ఐదుగురు గైర్హాజరు ● విపక్ష సభ్యులను అభినందించిన సీఎం కేసీఆర్ ● గులాబీ మయంగా మారిన అసెంబ్లీ హాల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శాసనసభలో గురువారం మొత్తం 115 మంది ఎంఎల్ఎలు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో ఎన్నికల్లో గెలుపొందిన ఎంఎల్ఎలు 114 మంది ఉండగా, నామినేటెడ్ ఎంఎల్ఏ స్టీఫెన్‌సన్ కూడా ఉన్నారు. మొదట ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రమాణం చేయగా, ఆ తర్వాత సభలోని ఆరుగురు మహిళా ఎంఎల్ఏలు ప్రమాణం చేశారు. వీరిలో అజ్మీరా రేఖానాయక్, అనసూయ, గొంగిడి సునీత, పద్మా దేవేందర్‌రెడ్డి, సబిత ఇంద్రారెడ్డిలున్నారు. తర్వాత ఆంగ్లఅక్షర క్రమం ప్రకారం ఆలంపూర్‌కు చెందిన అబ్రహంతో పురుష ఎంఎల్ఏల ప్రమాణ స్వీకారం ప్రారంభమై బాల్కొండ ఎంఎల్ఏ వేముల ప్రశాంత్‌రెడ్డితో ముగిసింది. ఈ ప్రమాణ కార్యక్రమం దాదాపు రెండున్నర గంటల పాటు సాగింది.

వీల్ చైర్‌పై సభకు వచ్చిన సాయన్న



శాసనసభలో సభ్యుల ప్రమాణ కార్యక్రమానికి కంటోన్మెంట్ టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన జి. సాయన్న సభకు వీల్‌చైర్‌లో వచ్చారు. శాసనసభ ఎన్నికల ఫలితాల రోజైన డిసెంబర్ 7న సాయన్నకు బైపాస్ సర్జరీ జరిగింది. అప్పటి నుంచి ఆయన విశ్రాంతిలోనే ఉన్నారు. శాసనసభలో సభ్యుల ప్రమాణ స్వీకారం కోసం గురువారం సభకు వీల్‌చైర్‌లోనే రావడంతో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఆయనకు మినహాయింపులు ఇచ్చా రు. సభ్యుడు వీల్‌చైర్‌లో కూర్చునే ప్రమాణం చేయవచ్చని, ప్రమా ణం అనంతరం స్పీకర్‌చైర్ వద్దకు రావడంలోనూ మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో సాయన్న వీల్‌చైర్‌లోనే కూర్చుని సభ్యుడిగా ప్రమాణం స్వీకారం చేశారు. అనంతరం సిబ్బంది ఆయన వద్దకు రిజిస్టర్ తీసుకువెళ్ళి సంతకం చేయించుకుని శాసనసభ నిబంధనల పుస్తకాలున్న బ్యాగును అందించారు. ప్రమాణ కార్యక్రమం ముగిసిన వెంటనే సాయన్న సభ నుంచి వెళ్ళిపోయారు.

అయిదుగురు సభ్యులు గైర్హాజరు

ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి అయిదుగురు సభ్యులు గైర్హాజరయ్యారు. ఎంఐఎంకు చెందిన అక్బరుద్దీన్ ఒవైసీ, జాఫర్‌హుసేన్‌లతో పాటు టీఆర్ఎస్ పార్టీకి చెందిన మాధవరం కృష్ణారావు, టీడీపీకి చెందిన సండ్ర వెంకట వీరయ్య, బీజేపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న టి. రాజాసింగ్‌లు గురువారం సభకు రాలేదు. ఎంఐఎం ఎల్ఎల్ఏ ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఉన్నందున ప్రమాణ కార్యక్రమానికి దూరంగా ఉంటానని బీజేపీ ఎంఎల్ఏ రాజాసింగ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎంఐఎం ఎంఎల్ఏ అక్బరుద్దీన్ ఒవైసీ అస్వస్థతతో ఉన్నందున మెరుగైన వైద్యం కోసం విదేశాలకు వెళ్ళడంతో సభకు రాలేకపోయారు. ఇకపోతే జాఫర్ హుసేన్, మాధవరం కృష్ణారావు, సండ్ర వెంకట వీరయ్యలు నియోజకవర్గాలలో పనుల కారణంగా సభకు హాజరు కాలేకపోయారని తెలిసింది.

ఉర్దూలో ముగ్గురు... ఆంగ్లంలో ఎనిమిదిమంది ప్రమాణం

ఎంఐఎంకు చెందిన ముగ్గురు ఎంఎల్ఏలు కౌసర్ మొయినుద్దీన్, పాషాఖాద్రీ, మహ్మద్ మొజం ఖాన్‌లు ఉర్దూలో ప్రమాణం చేశారు. వివిధ పార్టీలకు చెందిన ఎనిమిది మంది ఆంగ్లంలో ప్రమాణం చేశారు. వీరిలో రేఖానాయక్, హరిప్రియ, అహ్మద్‌బిన్ బలాలా, మైనంపల్లి హన్మంతరావు, కాలేరు వెంకటేష్, షకీల్ అమీర్ అహ్మద్, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలతో పాటు నామినేటెడ్ ఎంఎల్ఏ స్టీఫెన్‌సన్ ఉన్నారు.

విపక్ష సభ్యులతో కేసీఆర్ కరచాలనం

తెలంగాణ రెండవ అసెంబ్లీ మొదటి రోజు సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సభలోకి అడుగిడిన వెంటనే శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ దగ్గరకు వెళ్ళి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. తర్వాత విపక్ష సభ్యుల స్థానాల వైపు వెళ్ళారు. విపక్షసభ్యుల సీట్లలో ఉన్న కాంగ్రెస్ ఎంఎల్ఏలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, వనమా వెంకటేశ్వరరావు తదితరులతో కరచాలనం చేశారు. అనంతరం ఎంఐఎం సభ్యులు పాషాఖాద్రీ తదితరులతో కరచాలనం చేసి ఆలింగనం చేసుకున్నారు.

గులాబీ శోభ

సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా గురువారం మొదటి రోజు సభకు వచ్చిన టీఆర్ఎస్ ఎంఎల్ఎలందరూ గులాబీ కండువాలతో సభలో ఆసీనులు కావడంతో సభ గులాబీమయంగా కనిపించింది. శాసనసభకు జరిగిన ఎన్నికలో టీఆర్ ఎస్ 88 స్థానాలలో విజయం సాధించగా, స్వతంత్ర ఎంఎల్ ఎలిద్ద రూ టీఆర్ ఎస్‌లో చేరడంతో ఆ పార్టీ ఎంఎల్ఎల సంఖ్య 90కు చేరింది. వీరితో పాటు నామినేటెడ్ ఎంఎల్ఏ స్టీఫె న్‌సన్ కూడా గులాబీ కండు వాను కప్పుకున్నారు. టీఆర్ ఎస్‌కు చెందిన 90 మంది ఎంఎల్ ఎలు గులాబీ కండువాతో సభలో కూర్చోవడంతో సభ గులాబీవర్ణంతో కళకళలాడింది.

కాంగ్రెస్ ఎంఎల్ఎల మువ్వన్నెల మురిపెం

కాంగ్రెస్ పార్టీకి చెందిన 19 మంది ఎంఎల్ఎలు మువ్వన్నెల కండువాలు కప్పుకుని సభలో ఆసీనులయ్యారు. కాంగ్రెస్ సభ్యులందరూ స్పీకర్ చైర్‌కు ఎడమ వైపున ఉన్న సీట్లలో ఆసీనులవగా, ఎంఐఎం ఎంఎల్ఎలు తమ రొటీన్ దుస్తులతో వచ్చి రద్దయిన అసెంబ్లీలో తాము కూర్చున్న సీట్లలోనే ఆసీనులయ్యారు.

అభినందనలు, ఆలింగనాలు

ప్రమాణస్వీకారం సందర్భంగా సభలో సుహృద్భావ వాతావరణం కనిపించింది. ఎన్నికలైన తర్వాత తొలిసారి సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సభలోని అన్ని పార్టీల సభ్యులు పరస్పరం అభినందనలు తెలుపుకుని, ఆలింగనాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు జోక్‌లు వేసుకుని నవ్వుకోవడం కనిపించింది. టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఒకరి స్థానాల దగ్గరకు ఒకరు వెళ్ళి మరీ అభినందించుకున్నారు.

ప్రమాణ పత్రం చదవలేక....



రాజేంద్రనగర్ ఎంఎల్ఏ టి. ప్రకాష్‌గౌడ్ ప్రమాణ పత్రం చదివేందుకు ఇబ్బందిపడ్డారు. ప్రమాణపత్రం తెలుగులో ఉన్నప్పటికీ ఆయన తడబ డ్డారు. దీంతో అసెంబ్లీ సహాయకులు ప్రమాణ పత్రంలోని పదాలను చెప్పి ప్రమాణం చేయించారు. ఆ తరువాత కూడా ప్రకాష్ గౌడ్ తడబడు తుండటంతో సీఎం కేసీఆర్ ఆయనను చూసి ప్రొటెం స్పీకర్‌ను కలవాలని సూచిం చారు. దీంతో ప్రకాష్‌గౌడ్ ప్రొటెం స్పీకర్‌ను కలిశారు.

సహాయకుడితో దానం

ఖైరతాబాద్ ఎంఎల్ఏ దానం నాగేందర్ కొంత కాలంగా అనా రోగ్యంతో బాధపడుతున్నారు. ఇబ్బంది కరంగా నడుస్తూ సభలోకి వచ్చి న నాగేందర్ ప్రమాణ కార్యక్రమం అనంతరం అసెంబ్లీలోని అటెండర్ సహాయంతో ప్రొటెం స్పీకర్‌ను కలిసి కరచాలనం చేశారు. ఈ సందర్భం గా తన కుడికాలితో ఉన్న ఇబ్బందిని ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు వివరించారు. తర్వాత రిజిస్టర్‌తో సంతకం చేసి సభ నుంచి వెళ్ళిపోయారు.



(మొదటిపేజీ తరువాయి)

గద్వాల జిల్లా అలంపూర్ తెరాస ఎమ్మెల్యే అబ్రహం తొలుత ప్రమాణం చేయగా, చివరిలో నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చేత తాత్కాలిక స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

సీనియర్ కేసీఆరే..

శాసనసభలోని 120 (ఎన్నికైనవారు 119, నామి నేటెడ్ 1) ఎమ్మెల్యేల్లో అందరికన్నా సీనియర్ ముఖ్య మంత్రి కేసీఆర్ కావడం గమనార్హం. ఉప ఎన్నికతో పాటు ఎనిమిది దఫాలు ఎమ్మెల్యేగా కేసీఆర్ విజయం సాధించారు. కేసీఆర్‌కన్నా శాసనసభలో ఇతర ఏ ఎమ్మె ల్యే ఎనిమిదికన్నా ఎక్కువసార్లు శాసనసభకు పోటీచేసి విజయం సాధించిన దాఖలాలు లేవు. ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా పనిచేసి తిరిగి ఇటీవల ఎన్నికల్లో పోటీచేసి గెలిచిన వారు ఈ సభలో 16 మంది ఉన్నారు. 2014 శాసనసభ ఎన్నికల్లో పోటీచేసి గెలిచిన 76 మంది ఈ ఎన్నికల్లోనూ బరిలోకి దిగి ఆయా పార్టీల తరపున విజయం సాధించిన వారున్నారు. ఇరువురు ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేసి ఎమ్మెల్యేలుగా పోటీచేసి విజయం సాధించారు. మల్కాజ్‌గిరి ఎంపీ చామకూర మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గం నుంచి విజయం సాధించగా, పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ చెన్నూరు అసెంబ్లీ బరిలో దిగి గెలుపొందారు. ముగ్గురు శాసన మండలి సభ్యులు ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా పోటీచేసి శాసనసభలోకి అడుగు పెట్టారు. కొడంగల్ నుంచి గెలిచిన పట్నం నరేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి పోటీకి దిగి విజయం సాధించిన మైనంపల్లి హనుమంతరావు, ఉమ్మడి నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అసెంబ్లీలోకి అడుగు పెట్టారు. రాజగోపాల్‌రెడ్డి గతంలో భువనగిరి ఎంపీగా ఐదేళ్ళపాటు కొనసాగారు. శాసనసభకు ఎనిమిది మంది మైనారిటీ శాసనసభ్యులు ఎన్నిక కాగా, వీరిలో ఏడుగురు ఒక్క ఎంఐఎం పార్టీ నుంచే ఉన్నారు. తెరాస నుంచి నిజామాబాద్ జిల్లా బోధ న్ నియోజకవర్గం నుంచి పోటీచేసిన షకిల్ అమీర్ అహ్మ ద్ కూడా మైనారిటీ సామాజికవర్గానికి చెందినవారు.

ఇవీ బలాబలాలు

ఎన్నికలు జరిగిన 119 అసెంబ్లీ నియోజక వర్గాల్లో 88 స్థానాలను తెరాస కైవసం చేసుకుంది. 19 స్థానాలను కాంగ్రెస్, రెండు స్థానాలను తెదేపా, ఏడు స్థానాలను ఎంఐఎం, ఒక స్థానంలో భాజపా గెలిచింది. మరో రెండు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఆరుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యేలుగా రికార్డు సృష్టించిన సభ్యులు కూడా ఈ సభలో ఉన్నారు. మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, ఈటల రాజేందర్, రెడ్యానాయక్, ఎర్రబెల్లి దయా కర్ రావు, ఎమ్మెల్యేలు కొప్పుల ఈశ్వర్, ముంతాజ్ అహ్మద్ ఖాన్ తదితరులు ఉపఎన్నికలతో కలిపి ఆరు సార్లు శాసన సభకు ఎన్నికైతమ సత్తా చాటారు.

పెద్దా..చిన్నా ఖమ్మం నుంచే...

ఈ సభలో వయసురీత్యా పెద్ద, చిన్న శాసన సభ్యులిద్దరూ ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తూండటం విశేషం. కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వనమా వేంకటేశ్వర రావు వయసులో అతిపెద్దవారు. ఆయనకు 76 సంవత్సరాలు. మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ శాసనసభలో అతిపిన్న వయస్కురాలు. ఆమెకు 29 సంవత్సరాలు.

ఆరుగురు మహిళా సభ్యులు

శాసనసభలో ఆరుగురు మహిళలు ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఇందులో ముగ్గురు తెరాస, మిగిలిన ముగ్గురు కాంగ్రెస్ పార్టీకి చెందినవారు. తెరాస నుంచి గెలుపొందిన ముగ్గురు ఎమ్మెల్యేలు గత శాసనసభ లోనూ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. కాంగ్రెస్ నుంచి అసెంబ్లీ లోకి తాజాగా అడుగు పెట్టిన ముగ్గురు మహిళల్లో సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా, అనసూయ (సీతక్క) ములు గు అసెంబ్లీ నుంచి ఈ ఎన్నికల్లో పోటీచేసి గెలిచారు. గతంలో అనసూయ తెదేపా ఎమ్మెల్యేగా ఇదే నియోజ కవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఎన్నికలకు ఆమె రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సబిత గతంలో హోం, గనులశాఖ మంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలో పనిచేశారు. అసెంబ్లీలోకి 23 మంది కొత్త శాసనసభ్యులు అడుగు పెట్టారు. వీరిలో కొందరు గతం లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి పరాజయం పా లైన వారు కూడా ఉన్నారు. మరికొందరు నేరుగా అసెం బ్లీ బరిలో దిగి ఆయా పార్టీల నుంచి విజయం సాధిం చారు.

కొత్త సభలో.. కొత్త ముఖాలు!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ శాసనసభలో ఈసారి 27 మంది తొలిసారిగా ఎంఎల్ఏలు ఎన్నికైన వారున్నారు. 119 శాసనసభ స్థానాలకు ఎన్నికలు జరుగగా 88 సీట్లలో విజయం సాధించిన టీఆర్ఎస్ అధికారాన్ని చేజిక్కించుకుంది. మహాకూటమిగా కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, టీజేఎస్ జట్టుకట్టి పోటీ చేసినప్పటికీ 19 స్థానాల్లో కాంగ్రెస్, రెండు స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించగా, ఎంఐఎం 8 చోట్ల బీజేపీ ఒక చోట, స్వతంత్రులు రెండు చోట్ల విజయం సాధించిన విషయం తెలిసిందే.

తొలిసారి అసెంబ్లీలో అడుగిడిన ఎమ్మెల్యేలు వీరే

1. హరిప్రియ నాయక్ - కాంగ్రెస్ (ఇల్లందు)
2. నాగేశ్వరరావు - టీడీపీ (అశ్వారావుపేట)
3. సురేందర్ - కాంగ్రెస్ (ఎల్లారెడ్డి)
4. సుంకె రవిందర్ - టీఆర్ఎస్ (చొప్పదండి)
5. మెతుకు ఆనంద్ - టీఆర్ఎస్ (వికారాబాద్)
6. రోహిత్‌రెడ్డి - కాంగ్రెస్ (తాండూరు)
7. హర్షవర్ధన్‌రెడ్డి - కాంగ్రెస్ (కొల్లాపూర్)
8. కాలేరు వెంకటేష్ - టీఆర్ఎస్ (అంబర్‌పేట)
9. ఉపేందర్‌రెడ్డి - కాంగ్రెస్ (పాలేరు)
10. సీహెచ్ మల్లారెడ్డి - టీఆర్ఎస్ (మేడ్చల్)
11. బాల్క సుమన్ - టీఆర్ఎస్ (చెన్నూరు)
12. రాములు నాయక్ - స్వతంత్ర (వైర)
13. కొరికంటి శంకర్ - స్వతంత్ర (రామగుండం)
14. నన్నపనేని నరేందర్ - టీఆర్ఎస్ (వరంగల్ వెస్ట్)
15. పెద్ది సుదర్శన్‌రెడ్డి - టీఆర్ఎస్ (నర్సంపేట)
16. బేతి సుభాష్‌రెడ్డి - టీఆర్ఎస్ (ఉప్పల్)
17. ముఠా గోపాల్ - టీఆర్ఎస్ (ముషీరాబాద్)
18. కృష్ణమోహన్‌రెడ్డి - టీఆర్ఎస్ (గద్వాల్)
19. పి. నరేందర్‌రెడ్డి - టీఆర్ఎస్ (కొడంగల్)
20. బొల్లం మల్లయ్యయాదవ్ - టీఆర్ఎస్ (కోదాడ)
21. కంచర్ల భూపాల్‌రెడ్డి - టీఆర్ఎస్ (నల్గొండ)
22. డాక్టర్ సంజయ్ - టీఆర్ఎస్ (జగిత్యాల)
23. క్రాంతి కిరణ్ - టీఆర్ఎస్ (ఆందోల్)
24. ఎస్. నిరంజన్‌రెడ్డి - టీఆర్ఎస్ (వనపర్తి)
25. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి - కాంగ్రెస్ (మునుగోడు)
26. మాణిక్‌రావు - టీఆర్ఎస్ (జహీరాబాద్)
27. కొప్పుల మహేష్‌రెడ్డి - టీఆర్ఎస్ (పరిగి)

అసెంబ్లీకి సండ్ర డుమ్మా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : శాసన సభ్యునిగా ప్రమాణ స్వీకారోత్సవానికి తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డుమ్మా కొట్టారు. వెంకటవీరయ్యతో పాటు ఆ పార్టీ మరో సభ్యుడు మెచ్చా నాగేశ్వ రరావు ఉదయం ఎన్‌టీఆర్ ఘాట్‌కు వచ్చి నివాళులర్పించిన తర్వాత శాసనసభకు వస్తారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ ప్రకటిం చారు. ఇద్దరు ఎమ్మెల్యేల్లో సండ్ర రాకపోవడంతో తెదేపా నేతలు తీవ్ర నిరుత్సా హానికి గురయ్యారు.

తెదేపా ఎమ్మెల్యే వెంకటవీరయ్య పార్టీ ఫిరాయించి తెరాసలో చేరుతున్నట్లు గత పదిహేను రోజులుగా ప్రచారం జరుగుతోంది. పార్టీ నాయకులకు కూడా అందుబాటులో లేకపోవడంతో ఈ ప్రచారానికి బలం చేకూరింది. అయితే వెంకటవీరయ్యను జిల్లా తెదేపా నాయకులు కలిసి పార్టీలోనే ఉండేలా ఒప్పించారని సమాచారం. అలాగే పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతో మాట్లాడించి పార్టీలోనే కొనసాగుతాననే హామీ ఇప్పించారు. ఇదే విశ్వాసంతో సండ్ర గురువారం ఎన్‌టీఆర్ ఘాట్‌కు వస్తున్నట్టు ప్రచారం చేశారు. ఇదిలా ఉండగా, వెంకటవీరయ్య పంచాయితీ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలతో ఉన్నందున రాలేకపోయారంటూ పార్టీ నాయకులు వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. మరో రెండు రోజుల్లో శాసనసభకు వచ్చి పార్టీ ఎమ్మెల్యేగానే ప్రమాణ స్వీకారం చేస్తారని రమణ స్పష్టంచేశారు.

కేసీఆర్ అను నేను...



"కుల్వకుంట్ల చంద్రశేఖరరావు అనే నేను.. శాసనసభ సభ్యునిగా ఎన్నికైనందున శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడుతానని నేను స్వీకరించబోయే కర్తవ్యాన్ని శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను."

రెండోస్సారి...

● తెలంగాణ సీఎం కేసీఆర్ రికార్డు
● ఒక ఓటమి.. ఎనిమిది విజయాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ సీఎం కేసీఆర్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. 1983లో రాజకీయ ఆరంగేట్రం నుంచి మొన్నటి శాసనసభ ఎన్నికల వరకు మొత్తం ఎనిమిదిసార్లు (ఉప ఎన్నికలు కలుపుకుని) ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అసెంబ్లీకి ప్రస్తుతం ఎన్నికైన వారిలో ముఖ్యమంత్రి కేసీఆరే సీనియర్. తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో (1983) పోటీచేసిన కేసీఆర్ ఓటమి పాలైన తర్వాత వరుసగా అప్పటి నుంచి ఎనిమిదిసార్లు ఆయన అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2009లో మహబూబ్‌నగర్ లోక్‌సభ నుంచి ఎంపీగా గెలిచారు. 1985 నుంచి ఇప్పటి వరకు పోటీచేసిన అన్ని ఎన్నికల్లోనూ ఆయన గెలుపొందుతూ వచ్చారు. ఎనిమిదిసార్లు అసెంబ్లీలో అడుగు పెట్టిన కేసీఆర్ అనేక కీలక పదవులు నిర్వర్తిం చారు. ఉప సభాపతిగా, మంత్రిగా, ప్రజా పద్దు ల సంఘం చైర్మన్‌గా, శాసనసభ కమిటీల్లో సభ్యుడిగా, తెలంగాణ రాష్ట్ర మొదటి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ మొన్నటి ఎన్నికల్లోనూ 88 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుని తిరుగులేని నేతగా పేరు తెచ్చుకున్నారు. కేసీఆర్ తర్వాత ఆరుసార్లు గెలిచిన నేతలుగా ముగ్గురు ఎమ్మెల్యేలు స్థానం సంపా దించారు. తాత్కాలిక స్పీకర్‌గా వ్యవహరిస్తున్న ముంతాజ్ అహ్మద్ ఖాన్, సీనియర్ శాసనస భ్యులు రెడ్యానాయక్, ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. రెడ్యా నాయక్, ఎర్రబెల్లి ఇరువురూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందినవారు కావడం విశేషం. 2014-18 మధ్య ఎమ్మెల్యేలుగా ఉన్న వారిలో 76 మంది మళ్ళీ గెలవగా, 2009-14 మధ్య ఎమ్మెల్యేలుగా గెలిచి 2014 ఎన్నికల్లో ఓడిపోయిన వారిలో 16 మంది తిరిగి అసెంబ్లీకి వచ్చారు.

పెరిగిన బలంతో తెరాస

ముందస్తు ఎన్నికలతో ఘన విజయం సాధించిన తెరాస రెండోసారి అధికారాన్ని చేపట్టింది. గత ఎన్నికలతో పోలిస్తే తెరాస ఎమ్మెల్యేల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎంఐఎం పాత స్థానాలను తిరిగి నిలబెట్టుకోగా, మిగిలిన అన్నీ రాజకీయ పక్షాల సీట్లు తగ్గిపోయాయి. వైకాపా ఎన్నికల్లో పోటీకే దిగలేదు.

సభ్యులకు రాజ్యాంగ ప్రతులు

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఓ చేతి సంచిని శాసనసభ సచివాలయం అందజేసింది. ఇందులో భారత రాజ్యాంగం, భారత రాజ్యాంగ పరిచయం, శాసనసభ నిబంధ నావళి (తెలుగు, హిందీ, ఉర్దూ), సభ్యులు హ్యాండ్ బుక్, లైబ్రరీ ఎట్ ఏ గ్లాన్స్, సభ్యులకు ఉండే వసతులు, సౌకర్యాలు, అసెంబ్లీ ప్రశ్నల నియమావళి, సీపీఏ ఇన్ఫర్మేషన్ బుక్‌లెట్, బయో డేటా ఫాం, సాలరీ ఫాం, టీఏ ఫామ్స్, క్వశ్చన్ ఫాం, మూడు రకాల లెటర్‌హెడ్లు, ఫాం-3 (ఫిరాయింపుల నియమావళి), స్క్రిబ్లింగ్ ప్యాడ్, యూఏ బాల్‌పెన్స్ ఉన్నాయి.

పార్టీ	2018	2014
తెరాస	88	63
కాంగ్రెస్	19	21
ఎంఐఎం	7	7
తెదేపా	2	15
భాజపా	01	05
ఏఐఎఫ్‌డి	01	00
స్వతంత్రులు	1	01
వైకాపా	0	03
బీఎస్పీ	0	02
సీపీఎం	0	01
సీపీఐ	0	01



అసెంబ్లీలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్‌రెడ్డితో సీఎం కేసీఆర్ కరచాలనం



పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే భట్టి విక్రమార్కతో సీఎం కేసీఆర్



మండలి చైర్మన్ చాంబర్‌లో సీఎం కేసీఆర్, ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్, భట్టి, పోచారం

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 18 జనవరి 2019

థెరిసా మే ఒక గెలుపు.. ఒక ఓటమి..!

బ్రిటిష్ ప్రధాని థెరిసా మే ఇరవై నాలుగు గంటల వ్యవధిలో ఒక ఓటమినీ, ఒక విజయాన్ని చవిచూశారు. యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలగాలన్న తీర్మానం పార్లమెంటు దిగువ సభలో వీగి పోగా, ఆ మరునాడే ఆమెపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం 19 ఓట్ల తేడాతో వీగి పోయింది. ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగాలన్న ప్రతిపాదనను 432 మంది వ్యతిరేకించగా, 202 మంది మాత్రమే మద్దతు పలికారు. ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన వారిలో థెరిసా మే సొంత పార్టీ (కన్సర్వేటివ్) ఎంపీలు కూడా ఉన్నారు. మరో వంక ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగేందుకు (బ్రెగ్జిట్‌కు) గడువు మార్చి 29వ తేదీతో ముగియనుంది. ఈ లోగా బ్రిటిష్ పార్లమెంటు చేత ఈ తీర్మానాన్ని ఆమోదింపజేసుకోవల్సి ఉంది. అయితే, దిగువ సభలో చుక్కెదురు కావడంతో థెరిసా మే ప్రతిపక్షాలను చర్చకు ఆహ్వానించారు. బ్రెగ్జిట్ విషయంలో బ్రిటన్‌లో ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు థెరిసా మే ఎంతో కాలంగా కృషి చేస్తున్నారు. ఇప్పటికి ఎన్నో విడతల చర్చలు జరిపారు. బ్రెగ్జిట్ ప్రతిపాదనకు గత జూన్‌లో బ్రిటిష్ రాణి ఎలిజబెత్ ఆమోదం లభించింది. ఈ ప్రతిపాదనను ఆమోదించిన వారికీ, వ్యతిరేకించిన వారికీ మధ్య తేడా అప్పట్లో తక్కువ ఉండేది. ఇప్పుడు సగానికి సగం మంది పైగా వ్యతిరేకిస్తున్నారు.

ఇది పూర్తిగా బ్రిటన్ ఆంతరంగిక వ్యవహారం అయినప్పటికీ, ఒకప్పుడు రవి అస్తమించని ఆంగ్ల సామ్రాజ్యానికి నేతృత్వం వహించిన బ్రిటన్‌తో అన్ని దేశాలకూ దౌత్య, వాణిజ్య సంబంధాలు ఉంటాయి కనుక బ్రిటన్‌లో ఏం జరిగినా దాని పరిణామం ప్రపంచమంతటా ఉంటుంది. బ్రిటన్ ఇంతవరకూ యూరోపియన్ యూనియన్ దేశాల్లోనే కాదు, కామన్వెల్త్ దేశాలకు పెద్దన్న పాత్ర పోషిస్తోంది. ఒకప్పుడు ప్రపంచ మంతటా బ్రిటిష్ సామ్రాజ్యం విస్తరించి ఉండేది. అందుకే రవి అస్తమించని ఆంగ్ల సామ్రాజ్యం అనే పేరు వచ్చింది. బ్రిటిష్ వారి పెత్తనాన్ని భారతీయులే కాకుండా ప్రపంచంలోని ఇతర దేశాల వారూ వ్యతిరేకించి స్వాతంత్ర్యాలను సాధించుకున్నారు. ఆ దేశాలన్నీ కామన్వెల్త్‌లో భాగస్వామ్యాన్ని ఇప్పటికీ కలిగి ఉన్నాయి. యూరోపియన్ ఎకనామిక్ కమ్యూనిటీగా ఉండిన ఈయూలో బ్రిటన్ దే పెత్తనం. ఈయూలో ఆర్థికంగా తీవ్ర సంక్షోభాలను ఎదుర్కొన్న దేశాలు కూడా ఉన్నాయి. వాటి వల్ల తమ వాణిజ్యానికి దెబ్బతగులుతోందని బ్రిటిష్ వ్యాపారవేత్తలూ, పారిశ్రామికవేత్తలు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడైన తర్వాత అక్కడ బలపడిన స్థానిక వాదం ప్రభావం బ్రిటన్‌లో కూడా కనిపించింది. ఈయూ భాగస్వామ్య దేశాల వారు తమ ఉద్యోగావకాశాలను కొల్లగొడుతున్నారంటూ బ్రిటన్‌లోని యువకులు, నిరుద్యోగులు ఆందోళనలు చేశారు. యూరోపియన్ యూనియన్ మాతృక అయిన యూరోపియన్ ఎకనామిక్ కమ్యూనిటీలో సభ్యత్వాన్ని కలిగి ఉన్న నాటి నుంచి బ్రిటన్ స్వీయ రక్షణ విధానాలనే అనుసరిస్తోంది. బ్రిటన్ వైదొలగినంత మాత్రాన ఈయూ సభ్యత్వం గల దేశాలకు పెద్దగా నష్టమేమీ లేదు. మార్చి 29వ తేదీ లోగా ఈ తీర్మానాన్ని బ్రిటిష్ పార్లమెంటు ఆమోదించకపోతే నష్టపోయేది బ్రిటనే. పార్లమెంటు ఆమోదించకపోయినా బ్రిటన్‌తో తెగతెంపులు అయినట్టు ఈయూ భావించే అవకాశం ఉంది. దీని వల్ల బ్రిటన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. ఈ తీర్మానాన్ని 400మందికి పైగా ఎంపీలు వ్యతిరేకించడానికి ప్రధాన కారణం ఇదే. మందులు, ఆహారోత్పత్తులతో సహా ఇతర నిత్యావసర వస్తువులకు తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. ప్రభుత్వం మీద మోయలేని ఆర్థిక భారం పడుతుంది. బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉంది. గ్రీస్ సంక్షోభం ప్రభావం తమ దేశం మీద పడినప్పుడు ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగాలని పట్టుబట్టిన ఎంపీలే ఇప్పుడు అందుకు వ్యతిరేకంగా ఓటు వేయడం గమనార్హం. ప్రస్తుత ప్రధాని థెరిసామేకి ముందు ఆ పదవిని నిర్వహించిన డేవిడ్ కామెరూన్ ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగేందుకు కృషి చేస్తానని గట్టి హామీ ఇచ్చినప్పటికీ ఆయన వల్ల కాలేదు. దాంతో ఆయన ఈ అంశంపై రిఫరెండం జరిపించగా, ఈయూలో కొనసాగేందుకు అనుకూలంగా 48 శాతం మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 52 శాతం మంది ఓటు వేశారు. ఈ తీర్మానానికి అనుకూలురు, ప్రతికూలుర మధ్య తేడా అప్పట్లోనే నాలుగు శాతం మాత్రమే ఉంది. ఈయూలో కొనసాగడం వల్లనే ఎక్కువ లాభాలున్నాయని వారు క్రమంగా గుర్తించడం వల్లనే బ్రెగ్జిట్‌ని ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారు. బ్రెగ్జిట్‌పై తాత్కాలిక ముసాయిదాను తయారు చేసి దానికి ఈయూ దేశాలు అంగీకరించేట్టు చేయడంలో థెరిసామే కృషి చేశారు. ఈ ముసాయిదాలో వాణిజ్య పరమైన వెసులుబాట్లు కొన్నింటిని చేర్చారు. దాని వల్ల దేశంలో కంపెనీలు, పారిశ్రామిక సంస్థలకు పెద్దగా ఇబ్బందులు ఉండవని భావించారు. ఈ ముసాయిదాను కూడా ఎంపీలు ఇప్పుడు అంగీకరించడం లేదు. ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకృత విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛాయుత మార్కెట్ ప్రపంచమంతటా విస్తరించింది. దాంతో ఈయూ వంటి కూటముల ప్రాభవం బాగా తగ్గింది. బ్రిటన్ మాదిరిగానే స్వీడన్ కూడా ఈయూ నుంచి వైదొలగేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది.

మధ్య ఆసియా దేశాల్లో ఏర్పడిన సంక్షోభాల కారణంగా శరణార్థుల తాకిడి ఈయూ దేశాలపై పడింది. శరణార్థుల భారాన్ని పంచుకోవడానికి ఏ దేశమూ సిద్ధంగా లేదు. స్వీడన్‌లో కూడా ఈయూ నుంచి వైదొలగాలన్న డిమాండ్ తెరమీదికి రావడానికి కారణం. అయితే, ఈయూలో కొనసాగితేనే స్వీడన్ ప్రయోజనాలు భద్రంగా ఉంటాయని వాదించేవారు ఎక్కువ మంది ఉన్నారు. అందువల్లనే అక్కడ బ్రిటన్‌లో మాదిరి పరిస్థితి ఇంకా ఏర్పడలేదు. వాస్తవానికి ఈయూ వల్ల బ్రిటిష్ పౌరులు ఎక్కువ ప్రయోజనాలు పొందుతున్నారు. ఈయూ దేశాల పౌరులు బ్రిటన్‌లో ఉపాధి అవకాశాలనూ పొందుతున్నారు. పరస్పర ప్రయోజనకరంగా ఉన్న ఈ సంబంధాలు ఇలాగే కొనసాగాలని కోరుకునే వారూ ఉన్నారు. ఈయూ నుంచి వైదొలగే ప్రక్రియను థెరిసా మే అధికారంలోకి వచ్చిన తర్వాత వేగిర పర్చిన దృష్ట్యా ఇప్పుడు పార్లమెంటు చేత ఇందుకు సంబంధించిన బిల్లును ఆమోదింపజేసుకోవడం ఆమెకు ప్రతిష్ఠాత్మకంగా తయారైంది. అందుకే, మరో దఫా చర్చలు జరిపేందుకు ఆమె ప్రతిపక్ష ఎంపీలను చర్చలకు పిలిచారు. చర్చలు విఫలమైతే ఈ అంశంపై మరోసారి రిఫరెండంను నిర్వహిస్తారా అన్న సందేహాలు బ్రిటిష్ పౌరులను వెంటాడుతున్నాయి.


చరిత్రలో ఈరోజు

ఓపెన్ హార్ట్ సర్జరీకి శ్రీకారం!




హృద్రోగ శస్త్ర చికిత్సలో జనవరి 18వ తేదీకి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇదే రోజున 1893లో అమెరికా వైద్యుడు డేనియల్ హెలే విలియమ్స్ ఓపెన్ హార్ట్ సర్జరీని నిర్వహించి చరిత్ర సృష్టించారు. క్షురకుని కుమారుడిగా జన్మించిన విలియమ్స్ చెప్పులు కుట్టే వృత్తిలో స్థిరపడ్డారు. తరువాత చదువుపై దృష్టి మళ్లి.. చికాగో యూనిర్సిటీలో వైద్య పట్టా పొందారు. అదే చికాగో మెడికల్ కాలేజీలో సర్జన్‌గా, అధ్యాపకునిగా పని చేశారు. అమెరికాలో తొలిసారిగా నల్ల జాతీయులకు కోసం హాస్పిటల్‌ను ప్రారంభించారు. జేమ్స్ కోర్నిష్ అనే యువకుడు కత్తిపోట్లకు గురై హాస్పిటల్‌లో చేరినప్పుడు అతన్ని బతికించడానికి విలియమ్స్ తొలిసారిగా ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. సర్జరీ అయిన 51 రోజుల తరువాత కోర్నిష్ స్వయంగా హాస్పిటల్ నుంచి నడుచుకుంటూ రావడంతో విలియమ్స్ చేసిన ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతమైనట్లు యావత్ ప్రపంచం గుర్తించింది. 1913లో మృతి చెందిన డేనియల్ హెలే విలియమ్స్‌ని ఓపెన్ హార్ట్ సర్జరీ పితామహునిగా గుర్తించడం విశేషం.

సెక్యులర్ రిపబ్లిక్‌కి నాంది!



దేశంలో కుల, మతాలు ఉండరాదని, పారిశ్రామిక భారతంగా అవతరించాలని తలపోసిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1950, జనవరి 18న సెక్యులర్ రిపబ్లిక్‌ని ప్రకటించారు. ఇదే రోజున హిందీని అధికార భాషగా ప్రకటించారు. పది హేను సంవత్సరాల పాటు ఇంగ్లీషును అధికార భాషగా కొనసాగించడానికి నిర్ణయం తీసుకున్నారు. పద్నాలు భారతీయ భాషలను గుర్తించారు. పొరుగు దేశాలతో శాంతిని నెలకొల్పుకోవడానికి పాకిస్థాన్‌తో యుద్ధాన్ని నివారించే ఒప్పందానికీ ఇదే రోజున నెహ్రూ మంత్రి వర్గం పచ్చ జెండా ఊపింది. అయితే 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సెక్యులర్, సోషలిస్టు రిపబ్లిక్ అనే పదాలను రాజ్యాంగ అవతారికలో చేర్చారు. సోషలిస్టు అనే పదాన్ని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో చేర్చడం జరిగింది. 1968లో జనవరి 18న హిందీని అధికార భాషగా కొనసాగించడానికి పార్లమెంటు ఉభయసభలూ తీర్మానం చేశాయి. ఇదే రోజునే త్రిభాషా విధానానికీ అంకురార్పణ పడడం విశేషం. హిందీ లేదా ఇంగ్లీషును తప్పనిసరిగా విద్యార్థులు అభ్యసించాలనీ తీర్మానించారు.

ఎమర్జెన్సీ నుంచి విముక్తి!



జనవరి 18, 1977న మొరార్జీ దేశాయ్, ఇతర విపక్షాల నేతలు జైలు నుంచి విడుదల అయ్యారు. ఆనాటి కాంగ్రెస్ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీలో భాగంగా జైలు పాలైన విపక్ష నేతలకు ఇదే రోజున జైలు నుంచి విముక్తి లభించింది. ఎమర్జెన్సీ కాలంలో దేశంలో ప్రజలకే కాకుండా న్యాయస్థానాలకు, అధికార యంత్రాంగానికి, చట్ట సభలకు, పత్రికా రంగానికి రాజ్యాంగ పరంగా సంక్రమించిన అన్ని హక్కులు కాల రాశారు. వీటిపై మొరార్జీదేశాయ్ తదితర విపక్ష నేతలు తీవ్రస్థాయిలో గళమెత్తారు. ఎమర్జెన్సీని నిరసిస్తూ ఉద్యమాలు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారే ఆరోపణలపై మొరార్జీ దేశాయ్‌ను జైల్లో నిర్బంధించారు. మార్చి 21, 1977న ఎమర్జెన్సీని ఎత్తివేశారు. దీని కన్నా ముందే జనవరిలోనే దేశవ్యాప్తంగా జైళ్లలో నిర్బంధించిన విపక్ష నేతలకు విముక్తి కలిగింది. అందులో భాగంగానే జనవరి 18, 1977న మొరార్జీ వంటి కీలక నేతలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు.

స్మృతిపథంలో ఎన్‌టిఆర్

1984 సెప్టెంబర్ 16 మధ్యాహ్నం ఒంటి గంటా ఇరవై నిమిషాలకు విజయవాడ రేడియో కేంద్రం నుంచి ప్రాంతీయ వార్తలు మొదలయ్యాయి. కొద్దిసేపు గడిచిందో లేదో వార్తలు చదివేవ్యక్తి ''ఇప్పుడే అందిన వార్త'' అంటూ ఒక సంచలన వార్తను వినిపించారు.

''గవర్నర్ డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు సమర్పించిన రాజీనామాను ఆమోదించారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎన్టీ రామారావును ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాల్సిందిగా ఆహ్వానించారు'' ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమం సాధించిన విజయ సమాచారం ఆనాటి రేడియో వార్త ద్వారా రాష్ట్రం నలుమూలలకు చేరిపోయింది. ఆరోజు హైదరాబాదు రాజభవన్ సెంట్రీ రూములోని ఫోనుద్వారా బెజవాడ రేడియో కేంద్రానికి ఈ వార్తను అందించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజాస్వామ్య ఉద్యమం సాగుతున్నరోజులు. ముఖ్యమంత్రినందమూరి తారక రామారావును అధికారం నుంచి అక్రమంగా తొలగించారని, ఆయన్నివెంటనే తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ ఆ ఉద్యమం మొదలయింది. ఎన్టీఆర్‌ని సమర్ధిస్తున్న టీడీపీ సభ్యులతోపాటు మిత్ర పక్షా లకు చెందిన ఎమ్మెల్యేలు కూడా హైదరాబాదు, ముషీరాబాద్ లోని రామక ష్ణా స్టుడియోలో బస చేస్తున్నారు. అందులోకి పోవాలన్నా, బయటకి రావాలన్నా బోలెడన్ని ఆంక్షలు ఉండేవి. అయితే విలేకరులు మాత్రం తమ గుర్తింపు కార్డులు చూపించి వెళ్ళే వెసులుబాటు వుండేది. ఇక రేడియో విలేకరిగా నేను దాదాపు ప్రతిరోజూ వెళ్లి వస్తుండేవాడిని. ఒకరోజు స్టూడియో అంతా సందడిగా వుంది. ఎమ్మెల్యేలు పేపర్లు చదువుతూ, పచార్లు చేస్తూ అటూ ఇటూ తిరుగుతున్నారు. చంద్రబాబునాయుడు కూడా హడావిడిగా తిరుగుతూ పైనుంచి అన్నీ కనుక్కుంటూ వున్నారు. ఆయన్ని పలకరించి, ఖమ్మం సీపీఎం ఎమ్మెల్యే మంచికంటి రాంకిషన్ రావు గారి వద్దకు వెళ్ళాను. మాకు బంధువు కూడా. ఆయన కాస్త దిగులుగా కనిపించారు. భార్యకు ఒంట్లో నలతగా వున్నట్టు ఇంటి నుంచి కబురు వచ్చినట్టు వుంది. ఆయన మాతో చెప్పారు. ''రామారావు గారితో విషయం చెప్పి ఓ రెండు రోజులు ఖమ్మం వెళ్లి వద్దామని వారి దగ్గరకు వెళ్లాను. మా ఆవిడ సుస్తీ సంగతి చెప్పాను. ఆయన ఇలా అన్నారు. 'రాం కిషన్ రావు గారు, మీరు పెద్దవారు. మీకు చెప్పదగిన వాడిని కాను. కానీ నా విషయం తీసుకోండి. మా ఆవిడ (శ్రీమతి బసవ తారకం) మద్రాసు కేన్సర్ ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య వుంది. అయినా నేను వెళ్ళలేని పరిస్తితి. పెద్ద మనసుతో కాస్త అర్ధం చేసుకోండి' అని ఆ పెద్దమనిషి అంటుంటే ఇక నేనేమి మాట్లాడను?'' అని ఆయనన్నారు. ఒకరోజు గండిపేటలో తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం జరుగుతోంది. నేను గోడకు ఆనుకుని నిలబడి వున్నాను. మరి కొద్ది నిమిషాల్లో సాయంత్రం ప్రాంతీయ వార్తలు మొదలవుతాయి. నాకు టెన్షన్ పెరుగుతోంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గారి ప్రసంగం అనర్ఘళంగా సాగుతోంది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎవరన్నది ఆరోజు ప్రకటిస్తారు. సాయంత్రం వార్తల సమయం అయిపోయిందంటే ఇక మరునాడు ఉదయం విజయవాడ నుంచి వెలువడే వార్తల వరకు వేచి వుండాలి. పత్రికలు కూడా తెల్లవారినదాకా రావు. అందుకే రేడియో వార్తలకు, ముఖ్యంగా 'ఇప్పుడే అందిన వార్తలకు' అంత గిరాకీ. ఆ రోజుల్లో గండిపేట నుంచి హైదరాబాదుకు డైరెక్టు టెలిఫోను సదుపాయం లేదు. ట్రంకాల్ బుక్ చేయాలి. అంత వ్యవధానం లేదు. నేను నిలబడ్డ కాంపౌండ్ వాల్ వెనుక ఎన్టీఆర్ కుటీరం వుంది. ముఖ్యమంత్రి కాబట్టి అందులో ఎస్టీడీ సౌకర్యం వున్న ఫోను ఏర్పాటు చేసారు. అది ముందుగానే తెలుసుకుని, విలేకరుల వరుసలో కాకుండా ఆ గోడ దగ్గర కాచుకుని వున్నాను. ఇంతలో ఎన్టీఆర్ నోటినుంచి 'మన పార్టీ ప్రధాన కార్యదర్శిగా చం.....' అనే మాట వినబడింది. అంతే! నేను ఒక్క క్షణం వ ధా చేయకుండా ఆ గోడ దూకేసాను. సెంట్రీ ఎవరు ఎవరని వెంటపడ్డాడు. లెక్కచేయకుండా లోపలకు దూరి వెళ్లి ఫోను తీసుకుని రేడియోకు ఫోను చేసాను. అవతల మా న్యూస్ ఎడిటర్ నా గొంతు విని 'ఎవరు?' అని క్లుప్తంగా అడిగారు. నేను 'చంద్రబాబు' అని అంతే క్లుప్తంగా వగరుస్తూ చెప్పాను. మరునిమిషంలో టీడీపీ నూతన ప్రధాన కార్యదర్శిగా శ్రీ చంద్రబాబునాయుడ్ని నియమించిన సమాచారం, 'ఇప్పుడే అందిన వార్తగా' రాష్ట్రం నలుచెరగులకూ రేడియో ద్వారా చేరిపోయింది. ఎన్టీ రామారావు రాజకీయాల్లోకి రాకమునుపే జగత్ ప్రసిద్ధ తెలుగు సినీ నటుడు. మద్రాసులోని ఆయన ఇంటి ముందు ప్రతి ఉదయం రెండు మూడు టూరిస్టు బస్సులు నిలిపివుండేవి. ఆయన అలా బయటకు వచ్చి మేడమీది వరండాలో నిలబడగానే అప్పటి వరకు ఆయనకోసం ఆశగా ఎదురుచూస్తున్న అభిమానుల ఆనందానికి అలవి వుండేది కాదు. అద ష్టవశాత్తు దర్శన భాగ్యం లభించిన వాళ్ళు ఆయన కాళ్ళకు సాష్టాంగనమస్కారం చేసేవాళ్ళు. ఆయనకు ఓ అలవాటు ఉండేదని చెప్పుకునేవారు, కాళ్ళమీద పడిన వాళ్ళు తమంతట తాము లేవాలే కానీ ఆయన లెమ్మని చెప్పేవాళ్ళు కాదని. పైగా కాళ్ళ మీద పడుతున్నవారిని వారించేవారు కాదు. తెలుగు దేశం పార్టీ పెట్టి, తొలి ఎన్నికల్లోనే కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించి, అఖండ విజయం సాధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొట్టమొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా ఈ పాద నమస్కారాల ప్రహసనం కొనసాగింది. తెలుగుదేశం పార్టీలో మహిళా నాయకురాళ్ళు ఎలాంటి సంకోచం లేకుండా ఆయనకు నిమిషాల తరబడి పాద నమస్కారాలు చేసేవాళ్ళు. ఇది ఎంతవరకు ముదిరింది అంటే బేగం పేట విమానాశ్రయంలో ఎన్టీఆర్ విమానం దిగివస్తున్నప్పుడు టార్మాక్ మీదనే వాళ్ళు పోటీలు పడి ఆయన కాళ్ళు కడిగి నెత్తిన చల్లుకుని మరీ పాద నమస్కారాలు చేయడం ఆ రోజుల్లో ఒక సంచలన వార్తగా మారింది. అది ఇంతింతై, అంతింతై దేశం నలుమూలలకు పాకింది. ఢిల్లీ నుంచి ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా విలేకరి ఎన్టీఆర్ ని ఇంటర్వ్యూ చేయడానికి హైదరాబాదు వచ్చారు. అప్పుడు ముఖ్యమంత్రి ప్రధాన పౌరసంబంధాల అధికారిగా భండారు పర్వతాల రావు పనిచేస్తున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన విలేకరికి తెల్లవారుఝామున నాలుగు గంటలకు టైం ఇచ్చారు. కొద్ది ముందుగానే ఆ విలేకరి ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్నారు. సరిగ్గా ఇచ్చిన టైముకల్లా, కిర్రు చెప్పులు చప్పుడు చేస్తుండగా ఎన్టీఆర్ కిందికి దిగివచ్చారు. ఢిల్లీ విలేకరి కుర్చీ నుంచి లేచి ఎన్టీఆర్ పాదాలకు సాష్టాంగనమస్కారం చేసారు. చేసిన మనిషి లేవకుండా అలాగే కాసేపు వుండిపోయారు. కొద్ది సేపటి తర్వాత లేచి కూర్చుని 'నేను విన్నది నిజమే!' అని అంటూ ఇంటర్వ్యూ ప్రారంభించారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమం యధావిధిగా కొనసాగింది. అది వేరే సంగతి. కొసమెరుపు ఏమిటంటే తరువాత చాలా రోజులకు ఆ పత్రిక ప్రచురించిన కధనం, ఈ పాద నమస్కారం ప్రహసనంతోనే మొదలవుతుంది.

ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో ఆయన గండిపేట నివాసంలో 'శవపూజలు' చేస్తున్నారన్న వదంతులు వ్యాపించాయి. వాటిని తిప్పి కొట్టడానికి హైదరాబాదు నుంచి కొందరు విలేకరులను (అప్పుడు గండిపేట దూరమే అనిపించేలా వుండేది) అక్కడికి తీసుకు వెళ్ళారు. రామారావు గారు స్వయంగా విలేకరులను వెంటబెట్టుకుని ఆశ్రమంలో అణువణువూ చూపించారు. ఆ సందర్భంలో రెడియోకోసం కాసేపు మాట్లాడారు. ఆశ్రమం వెలుపల ఒక చప్టా లాంటి దానిమీద ఎన్టీఆర్ బాసింపట్టు వేసుకు కూర్చున్నారు. ఆయన ముందు టేప్ రికార్డర్ పెట్టి, ఆయన్ని అనుకరించడమే మనవంతు. ఇక రేడియోకి, రామారావు గారికీ నడుమ సాగిన ఒక వివాదం చెప్పి ముగిస్తాను. ముప్పయి అయిదేళ్ళ క్రితంసంగతి టీడీపీ ఆవిర్భావం తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల దరిమిలా రాష్ట్రంలో మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రభుత్వ పాలన మొదలయింది. కేంద్రంలో కాంగ్రెస్, రాష్ట్రంలో టీడీపీ అధికారంలో వుండడంతో రాజకీయ క్రీనీడలు అన్ని వ్యవస్థల్లో మాదిరిగానే రేడియో, దూరదర్శన్ ల మీద కన్నాడా పడ్డాయి. ఆ రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని అనావ ష్టి ప్రాంతాల్లో పర్యటించి వచ్చిన ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, ప్రెస్ మీట్ పెట్టి రేడియో, దూరదర్శన్ లకు కన్నాడా కబురు పంపారు. కరవు ప్రాంతాలలో ప్రభుత్వం తీసుకునే చర్యలు గురించి ముఖ్యమంత్రి ప్రసంగ పాఠాన్ని రికార్డ్ చేసి సందేశం రూపంలో ప్రసారం చేయాలని కోరారు.

ఆబిడ్స్ లోని ముఖ్యమంత్రి నివాసాన్ని చేరుకున్న మా సిబ్బంది రికార్డింగ్ పరికరాలను సిద్ధం చేసుకున్నారు. కొద్దిసేపటికి ఎన్టీఆర్ కిర్రు చెప్పులు చప్పుడు చేసుకుంటూ మెట్లు దిగివచ్చారు. ముఖ్యమంత్రి ప్రధాన పౌర సంబంధ అధికారి తయారు చేసిన సందేశం ప్రతిని ఆమూలాగ్రం ఓ మారు తిరగేసి, తాము సిద్ధం అన్నట్టు తలపంకించారు. రికార్డింగు మొదలయింది.

''ప్రియమైన రాష్ట్ర ప్రజలారా!...'' అని ప్రసంగం ప్రారంభించారు. అదే స్పీడులో కొనసాగుతుందని అంతా అనుకున్నాం. కానీ ఆయన హఠాత్తుగా ఆపి, 'కట్ వన్ -టేక్ టు' అన్నారు. మా వాళ్ళు రికార్డింగు ఆపేశారు. వందల సినిమాల్లో అనర్ఘళంగా డైలాగులు చెప్పిన అనుభవం ఆయనది. ఏ పదాన్ని ఎక్కడ ఒత్తి పలకాలో, ఏ వాక్యాన్ని ఎక్కడ విరిచి చెప్పాలో ఆయనకు కొట్టిన పిండి. కానీ, ఇక్కడే ఎదురయింది మాకు వూహించని, ఆ మాటకు వస్తే అంతవరకూ అనుభవంలో లేని ఇబ్బంది. ఈ కట్లు, టేకుల విషయం తెలియకుండా రికార్డింగుకు రావడం వల్ల, తెచ్చిన టేపులు సరిపోలేదు. ఆఘమేఘాల మీద పంపించి స్టూడియో నుంచి అదనపు టేపులు తెప్పించి రికార్డింగు ముగించామనిపించాల్సి వచ్చింది.

అసలు కథ స్టూడియోకు చేరిన తర్వాత మొదలయింది. ఏ టేపు విన్నా కట్లూ, టేకులూ అన్న రామారావుగారి స్వరమే. ఆరాత్రే ప్రసారం కావాల్సి వుండడంతో సిబ్బంది అంతా టెన్షన్ కు గురయ్యారు. సీ ఎం గారి మొదటి ప్రసంగం కావడం వల్ల రాష్ట్ర ప్రభుత్వ సమాచార శాఖ కమీషనర్ (పూర్వాశ్రమంలో తపాలా శాఖ డైరెక్టర్) సైదులు గారు, డైరెక్టర్ సీ.వీ. నరసింహారెడ్డి గారు అంతసేపూ మాతోపాటే రేడియో డబ్బింగు గదిలోనే వుండిపోయారు. కట్లూ టేకుల మధ్య వున్న ముఖ్యమంత్రిగారి సందేశాన్ని మా వాళ్లు కష్టపడి మాస్టర్ టేపు మీదకు ఎక్కించి డబ్బింగు పని పూర్తి చేసి ప్రసారం నిమిత్తం అనౌన్సర్ కి అప్పగించి వూపిరి పీల్చుకున్నారు. ఆశ్చర్యం ఏమిటంటే, డబ్బింగు పూర్తయిన తరువాత చూసుకుంటే మాకెంత నిడివి అవసరమో ముఖ్యమంత్రి సందేశం అంతే వ్యవధికి అతికినట్టు ఖచ్చితంగా సరిపోయింది. దటీజ్ ఎన్టీఆర్. అయితే ఈ ఉదంతం ఎంతగా చిలవలు పలవలు వేసిందంటే ఒక దశలో కేంద్ర రాష్ట్ర సంబంధాలకు సంబంధించిన వివాద స్థాయికి చేరుకుని ఆ పిదప అలాగే చల్లారిపోయింది.





భండారు శ్రీనివాసరావు
98491 30595

ఆంధ్రుల ఆత్మగౌరవం కన్ను మూసిన రోజు

రాజకీయ పార్టీని స్థాపించి, తొమ్మిది నెలల కాలంలోనే అధికారంలోకి తీసుకొచ్చి సరికొత్త రికార్డు సృష్టించిన తెలుగు వారి అభిమాన కథనాయకుడు, రాజకీయనేత నందమూరి తారక రామారావు ఇదే రోజున కన్ను మూశారు. ఎన్టీరామావు ప్రవేశపెట్టిన రెండు రూపాయలకు బియ్యం పథకం ఇవాళ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలూ అమలు చేస్తుండడం విశేషం. దేశంలోనే తొలిసారిగా మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత కూడా ఎన్టీఆర్‌దే. మహిళలకు ప్రత్యేకంగా యూనివర్శిటీని నెలకొల్పడం, పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు వంటి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలను ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ తీసుకొని చరిత్ర సృష్టించారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవ హరిస్తోందని, రాష్ట్రాలకూ హక్కులు ఉంటాయని, సమాఖ్య స్ఫూర్తికి కొత్త జీవం పోసిన ఎన్టీ రామారావు ఆంధ్రుల ఆత్మ గౌరవానికి, పౌరుషానికీ ప్రతీకగా నిలిచారు.

స్వచ్ఛంద మరణాలు సమ్మతమేనా?

ప్రేమతో త్యాగాలు మాత్రమే కాదు ప్రాణాలు కూడా తీయడం సబబేనా! జాలి, దయ, కరుణ అనే ఎమోషన్స్ ఎక్కువైపోతే చివరికి మనిషెలా మారిపోతాడు? అత్యంత ప్రేమతో చంపడం వేరు, ప్రేమ పేరుతో నయవంచన చేసి చంపడం వేరు. మనం నిజంగానే ఒక వ్యక్తిని ప్రేమిస్తే అతని బాధను తట్టుకోలేకపోయినప్పుడు వారి ఇష్టపూర్వకంగా బాధ నుండి విముక్తి కలగజేయడం మన ధర్మమేనా! సయ్యద్ సలీం గారు ఇలాంటి విషయాలతో రాసిన నవలే మరణకాంక్ష. పెరిగే వాతావరణాన్ని బట్టే వారి ప్రవర్తన ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా బాల్యంలో గుచ్చుకునే గాయాలు జీవితాంతం సలుపుతూనే ఉంటాయి. అందుకే బాల్యం అత్యంత విలువైనది. అలాంటి బాల్యంలో తండ్రిని పోగొట్టుకోవడం, ఆ వెంటనే మందులేని అనారోగ్యానికి గురికావడం, క్షణక్షణం మరణభీతి, కావాలనుకున్నవారు దూరం కావడం, చిన్న కోరికలు సైతం తీర్చుకోలేని దయనీయ స్థితి, కదలలేకపోయిన తన చిన్నానాటి స్నేహితురాలు తనని ప్రేమిస్తుంది అనుకోవడం అవివేకమే అనుకుందామా, ప్రేమకోసం ఆరాటం అందామా! దీనికి కారణం తన ఒంటరిదనమే అనుకుంటాను. తల్లితో సపర్యలు చేయించుకుంటూ బ్రతికే బ్రతుకు ఒక బ్రతుకేనా! ఎన్నాళ్లని తల్లి పిల్లాడికి సేవలు చేయాలి, భర్త చనిపోయి తనకంటూ ఎలాంటి ఆశలు లేకుండా జీవించడం చివరికి తనకు కూడా క్యాన్సర్ మహమ్మారి పట్టి పీడించడం. కొడుకు నరకయాతన భరించలేక తన చివరికోరిక ''అమ్మ నన్ను చంపు'' అని కోరుకుంటుంటే తల్లి మనసు ఎలా తల్లడిల్లిపోయింది. చివరికి కొడుకు మరణం కోసం తల్లి ఆరాటపడడం ఈ నవలలో కనపడుతుంది.

ఆధునికంగా పరుగులు పెడుతున్న ఈ సమాజం, వ్యవస్థ ఇంకా కొన్ని రోగాలకు మందులు కనిపెట్టకపోవడం మన లోపమేనా! ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలైన తిండి, గుడ్డ, నీడ, వైద్యం ఇవ్వడంలో ఘోరంగా విఫలం అవుతూనే ఉన్నాయి. ఈ నవలలో మందులు లేని జబ్బు ''ప్రసాద్'' అనే పాత్రకు వస్తుంది. మరి మందులు ఉండి నిర్లక్ష్యంతో మరణిస్తున్న వారెందరో! జాలిలేని సమాజంలో కొన్ని జీవితాలు చితికిపోతున్నాయి. కరమైన, స్వార్థమైన మనుషులు మధ్య కొందరు ఉండలేక సతమతం అవుతున్నారు. ఇలాంటి సమాజాన్ని నిర్మించిన దేవుడు తప్పు చేశాడా! లేక దేవుడు మనుషులని బాగానే పుట్టించినప్పటికి మనిషే రాను రాను రాతి మనిషిగా మారిపోయాడా! అవును ఇది ముమ్మాటికి నిజమే మనిషి మారిపోయాడు. కరగలేనంతగా మారిపోయాడు, గడ్డకట్టుకుపోయాడు, బిగుసుకుపోయాడు. మనిషిని కరిగించే యంత్రాలు కావాలిప్పుడు. దేవుడు నిజంగా ఉంటే ఇలాంటి మరణాన్ని ఇవ్వడం ఏంటి? ప్రజలు దేవుడికి భయపడి పూజిస్తున్నారా, తప్పులను క్షమించమని వేడుకుంటున్నారా! కోరికలు తీర్చమని మొరపెట్టుకుంటున్నారా! ఏమో మీ అంతరంగానికే తెలియాలి. శిక్షించేవాడు ఎప్పటికీ దేవుడు కానేకాదు. దేవుడు శిక్షిస్తాడని, దేవుడిని ఒక శాడిస్ట్‌గా మార్చేసిన సమాజాన్ని, దేవుడిని ఒక వ్యాపారంగా ఉపయోగించుకుంటున్నా వారిని ఏమనాలి? దేవుడు అంటే దయచేసి ఏ ఒక్క మతమో అనుకోకండి అన్ని మతాల దేవుళ్ళ గురించి మాట్లాడుతున్న. ఈ నవలలలో రచయిత గొప్పదనం ఏంటంటే వివిధ సందర్భాలలో మనిషి ఆలోచన విధానాన్ని వివరంగా వివరించడం, రకరకాల సందర్భాలలో మనుషులు ఆలోచనలు ఏ విధంగా మారిపోతాయో కళ్ళకు కట్టినట్లు వ్రాయడంలో వంద శాతం సఫలమయ్యారు.

అదే జబ్బు ఈ నవలలోని వేరే పాత్రకు వచ్చిన ఆ పాత్ర తన తల్లితండ్రుల సహాయంతో ఏ విధంగా విజయాలను సాధించింది, అపారమైన పట్టుదల ఉంటే మనిషి దేనినైన జయించగలడు. మనం తీవ్రమైన బాధలో ఉన్నప్పుడు మనలో చైతన్యాన్ని నింపి, స్ఫూర్తినిచ్చే మాటల ద్వారా మనం ఏదైనా సాధించగలమని నిరూపించిన పాత్ర. తను నడవలేకపోయినా, శరీరంలో సగభాగం పనిచేయకపోయినా సమాజంతో పోరాడి విజయాలు సాధించింది. తనను ప్రేమించే వారిని పెళ్లి చేసుకొని సుందరమైన జీవితాన్ని అనుభవించింది. జీవిత నిర్మాణ క్రమంలో మనకు ఎదురైనా సంఘటనలే మనల్ని ఎలా నడుచుకోవాలో నిర్దేశిస్తాయి.

మెర్సీ కిల్లింగ్‌పై వివరంగా చర్చించి అందులో ఉన్న లోపాలేంటి? మెర్సీకిల్లింగ్ మన భారదేశంలో అమలుపరిస్తే ఎలాంటి నష్టాలు జరుగుతాయి. అలాంటి చట్టాలు చేయడం అవసరమా కాదా అని వివిధ పాత్రలతో చర్చించారు. సిద్ధార్థ అనే పాత్ర నరకయాతన అనుభవిస్తున్న వారిని చంపేయడం అది సబబేనని సమర్ధించుకోవడం చూస్తాం. ఈ పాత్రను గమనిస్తే చిన్నప్పుడు ఆ పాత్రకు జరిగిన అనుభవమే అలా ప్రవర్తించేలా చేసిందని అనుకుంటాను. అందుకే ముందు చెప్పినట్టు బాల్యం అత్యంత విలువైనది. మనం అనుకుంటాము కాని పిల్లలకి ఏమి తెలుసులే అని వారి మెదడు పొరల్లో అన్ని నిక్షిప్తం అవుతూనే ఉంటాయి. కావున పిల్లలతో ఆచితూచి మాట్లాడాలి. ఏది మంచో, చెడో చెప్పునేదాని యొక్క ప్రాసెస్ కూడా వివరించాలి. అంటే ఒక పనిచేయడానికి ఒక లీగల్ మార్గం ఉంటుంది. అది మంచిపనే అయినా లీగల్‌గా ప్రొసీడ్ అవ్వకపోతే ఎలాంటి పరిణామాలు ఎదుర్కొంటామో సిద్ధార్థ అనే పాత్ర నుండి నేర్చుకోవచ్చు.

నవలలోని ఒక్కో పాత్రలో ఎన్నో వైవిధ్యాలను చూపించడంతో మనిషి ఆలోచన ధోరణి తెలుసుకోవచ్చు. ఇక మెర్సీకిల్లింగ్ విషయంలో కొన్ని నిబంధనలతో సుప్రీంకోర్టు సమర్ధిస్తూ ఒక సందర్భంలో తీర్పునిచ్చింది. వ్యక్తిగతంగా నేను దానిని సమర్ధిస్తాను అత్యంత దుర్భరమైన జీవితాన్ని గడిపే కన్న హుందాగా చనిపోవాలి అని కోరుకోవడంలో న్యాయం ఉంది. అవును నేను జీవితంలో అన్ని చూశాను ఒకానొక సందర్భంలో శరీరం మొత్తం చచ్చుపడిపోయి నరకం అనుభవించడం, వేరొకరికి సమస్యగా మారడం దయనీయమైన స్థితి. ఆ స్థితి నుండి మరణమే మేలు అనుకోవడంలో తప్పు లేదు. కాని ఈ మెర్సీకిల్లింగ్ విషయంలో చట్టాలు చాలా కఠినంగా ఉండాలి. కొత్త అంశాలతో సలీం గారి నవలలు ఎప్పుడూ ఆకట్టుకుంటూ ఉండటమే కాకుండా వారి నవలలు చర్చకు దారి తీసేలా ఉంటాయి.

- లై, 9491977190

చమురు దొంగలు దొరికారు

- ఐఓసీ,బీపీసీఎల్ కీలక పైప్‌లైన్లకు కన్నం
- 1.3 లక్షల లీటర్ల డీజిల్ చోరీ
- అంతర్రాష్ట్ర ముఠా గుట్టు రట్టు
- నలుగురు నిందితుల అరెస్టు
- పరారీలో 8 మంది
- రెండు ట్యాంకర్లు, రూ.90 లక్షల నగదు స్వాధీనం
- రాచకొండ సీపీ మహేష్ భగవత్




హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రముఖ చమురు సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్ పైప్‌లైన్ల నుంచి భారీఎత్తున డీజిల్ దొంగతనానికి పాల్పడుతున్న ముంబైకి చెందిన అంతరాష్ట్ర ముఠా గుట్టును మల్కాజ్‌గిరి సీసీఎస్, కీసర పోలీసులు రట్టు చేశారు. ముఠాలోని 12 మంది నిందితులలో నలుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.90,40,000 నగదుతో పాటు రెండు ట్యాంకర్లు, ఓ మోటార్ సైకిల్, ఓ శ్యాంసంగ్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో హాఫీజ్ అజీజ్ చౌదరి, మహమ్మద్ అబ్దుల్ అబ్రార్, మారోజు జయకృష్ణ (సూర్యాపేట జిల్లా ట్యాంకర్ ఓనర్ (ట్యాంకర్ నెం.ఏపీ 16టీజీ 2753), బిన్ని శ్రీనివాసులు ఉన్నారు. ఈ ముఠాకు చెందిన జియాహుల్ చాంద్ షేక్, సునీల్ అనిల్ మదీవర్, వాసు, వజినేపల్లి శ్రీకాంత్, నరేష్ రెడ్డి, రంగీలాల్ రాంబాలి యాదవ్, సురేష్‌కుమార్ ప్రజాపతి, సర్జులు పరారీలో ఉన్నట్లు రాచకొండ పోలీసు కమిషనర్ మహేష్ భగవత్ తెలిపారు.

పథకం ఇదీ... చోరీ ఇలా...

ముంబైలో స్నేహం కుదిరిన హాఫీజ్, జియాహుల్ చాంద్ షేక్, శ్రీనివాస్ డీజిల్ చోరీకి పథకం వేశారు. వీరిలో కీలకమైన హాఫీజ్ స్వస్థలం వెస్ట్‌బెంగాల్ అయినప్పటికీ ముంబైలో స్థిరపడ్డాడు. హైదరాబాద్ బహదూర్‌పురాకి చెందిన యువతిని వివాహం చేసుకుని నగరంలోని పరిస్థితులపై దృష్టిపెట్టాడు. ఆ తరువాత తన పథకాన్ని ఆచరణలో పెట్టాడు. చర్లపల్లి నుంచి ఘట్‌కేసర్ వరకు విస్తరించిన వివిధ ఆయిల్ కంపెనీలకు చెందిన రన్నింగ్ పైప్‌లైన్ నుంచి డీజిల్ దొంగిలించాలని పథక రచన చేశాడు. పథకంలో భాగంగా హాఫీజ్ అజీజ్ చౌదరి తన పేరు మీద బీపీసీఎల్, ఐఓసికి రెండు కిలో మీటర్ల సమీపంలో ఉన్న స్థలాన్ని మహేందర్‌గౌడ్ నుంచి లీజుకు తీసుకున్నాడు. ఇక లీజుకు తీసుకున్న స్థలంలో కాంపౌండ్ వాల్‌తో కూడిన షెడ్‌ని నిర్మించాడు. బీపీసీఎల్, ఐఓసీకి చెందిన పైపులైన్లకు సమాంతరంగా టన్నెల్ పాత్‌ను ఏర్పాటు చేశాడు. తద్వారా మెయిన్‌లైన్‌కు అనుసంధానం చేసే విధంగా రంధ్రం, ఫిక్స్‌డ్ క్లాంప్ ఏర్పాటు చేయడంతో పాటు ఎలక్ట్రికల్ మోటార్ కూడా ఫిక్స్ చేశాడు. ఈ విధంగా ఏడు ట్యాంకర్లలో బీపీసీఎల్ నుంచి 84,365 కెఎల్, ఐఓసీఎల్ నుంచి 46,236 కెఎల్‌లు మొత్తం 1,30,601 కిలో లీటర్స్ డీజిల్‌ను తస్కరించారు. నిందితుడు శ్రీనివాస్ ప్రధాన పెట్టుబడిదారుడితో పాటు పార్టనర్ కూడా. జయకృష్ణ, శ్రీకాంత్, వాసు, సునీల్‌లు మధ్యవర్తులుగా వ్యవహరించడంతో పాటు దొంగిలించిన డీజిల్‌ను విక్రయించేవారు ఇందుకుగానూ రెండు ట్యాంకర్‌లు సిద్ధం చేసుకున్నారు. ఆ ట్యాంకర్లు జయకృష్ణ (ఏపీ 16 టీజీ 2753), రంగీలీల్ రాంబాలి యాదవ్ (ఎంహెచ్ 43 వై 6267)లకు యజమానులు. జయకృష్ణ యాదవ్‌లు ఇచ్చిన డైరెక్షన్లతో డ్రైవర్లు నరేష్ రెడ్డి, సురేష్ కుమార్ ప్రజాపతిలు దొంగిలించిన డీజిల్‌ను వరంగల్, బాసుపల్లి, బూర్గుల, కోయలకొండ, ధర్మాబాద్, మహారాష్ట్రకు తరలించేవారు. పరారీలో వున్న ముఠా సభ్యుల కోసం స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మహేష్ భగవత్ తెలిపారు. నిందితుడు హాఫీజ్ అజిజ్ చౌదరిపై గతంలో రెండు కేసులు ఉన్నాయి. 2013లో ఫేక్ కరెన్సీ కేసులో నాంపల్లి పోలీసులు , అదే విధంగా 2015లో అదే కేసులో ముంబై జుహూ పోలీసులు హాఫీజ్‌ని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు మొహమ్మద్ అబ్దుల్ అబ్రార్ కూడా 2015లో షేక్ కరెన్సీ కేసులో ముంబై జుహు పోలీసులు అరెస్టు చేశారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని సీపీ భగవత్ అభినందించారు. వారికి రివార్డులను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 25%సీట్ల పెంపు

- అదే సంఖ్యలో రాష్ట్ర వర్సిటీల్లో పెరుగుదల
- సీట్ల పెంపుపై మార్చి 31లోగా విద్యా సంస్థలు తమ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి
- ఆఫీస్ మెమొరాండం జారీచేసిన హెచ్‌ఆర్‌డీ
- వచ్చే ఏడాది నుంచి అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో నూ రిజర్వేషన్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర విద్యా సంస్థలతోపాటు రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లోనూ సీట్లు పెరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం ఆర్థికంగా వెనుకబడిన విభాగాలు (ఈడబ్ల్యూఎస్) వారికి 10 శాతం విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లపై చట్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ చట్టం అమలు చేయాలంటే ఇప్పటికే ఉన్న సీట్లలో వీటిని అమలు చేయకుండా ఈడబ్ల్యూఎస్ వారికి రిజర్వేషన్లు అమలు చేయడం కోసం అదనంగా సీట్లను పెంచాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఉన్నత విద్యా విభాగం గురువారం ఆఫీస్ మెమోరాండను జారీ చేసింది. ఈ మేరకు అన్ని కేంద్ర విద్యా సంస్థలు తమ సంస్థలో బ్రాంచ్‌లు, కోర్సుల వారీగా సీట్లను పెంచాలని అందుకు సంబంధించిన వివరాలను మార్చి 31 లోపు విద్యా సంస్థల వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని కోరుతూ యూజీసీ ఛైర్మన్, ఐఏసీటీఈ ఛైర్మన్, ఎన్‌సీటీఈ ఛైర్మన్‌తోపాటు ఉన్నత విద్యా ఉన్నతాధికారులకు లేఖలు హెచ్‌ఆర్‌డీ ఆఫీస్ మెమోరాండం పంపింది.

25 శాతం సీట్ల పెంపు

వచ్చే విద్యా సంవత్సరం 2019-20 నుంచి దేశంలోని అన్ని ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల్లోనూ రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. అదేవిధంగా కేంద్రీయ విద్యా సంస్థల్లో ఇప్పటికే అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లతోపాటు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. ఈడబ్ల్యూఎస్ వారికి 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే ఇప్పటికే అమలు జరుగుతున్న రిజర్వేషన్ సీట్లలో ఇబ్బంది రావద్దని అదేవిధంగా 10 శాతం ఈడబ్ల్యూఎస్ వారికి పెంచుతున్నందున ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కూడా వారికి అమలు జరుగుతున్న సీట్లలో ఇబ్బంది రాకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రతి కేంద్రీయ ఉన్నత విద్య సంస్థల్లోనూ 25 శాతం సీట్లను పెంచాలని నిర్ణయించినట్టు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. గతంలో 2007లో కూడా అన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఓబీసీలకు 27 శాతం సీట్లను రిజర్వేషన్ల రూపంలో ఇవ్వాలని నిర్ణయించారు.. ఆ సమయంలో ఇప్పటికే అమలు జరుగుతున్న ఎస్సీ, ఎస్టీల సీట్లకు ఇబ్బంది రాకూడదంటే అదనంగా 54 శాతం సీట్లను పెంచాలని సూచిస్తూ హెచ్‌ఆర్‌డీ ఆఫీస్ మోమోరాండం జారీ చేసింది. అదేవిధంగా ఇప్పుడు కూడా ఈడబ్ల్యూఎస్ వారికి 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలంటే ఉన్న వారికి ఇబ్బంది కాకూడదు కాబట్టి కనీసం 20 శాతం సీట్లను పెంచాల్సి ఉంటుంది కాబట్టి... 25 శాతం సీట్లను పెంచుకోవాలని హెచ్‌ఆర్‌డీ సూచించింది. దీంతో అన్ని కేంద్రీయ విద్యా సంస్థల్లోనూ 25 శాతం సీట్లు పెరగనున్నాయి.

విద్యాసంస్థ	సంఖ్య	ప్రస్తుత సీట్లు	పెరగనున్న సీట్లు
ఐఐటీ	23	11,279	2819
ఎన్ఐటీ	31	17,967	4491
ఐఐఐటీ	20	4023	1005

రాష్ట్ర వర్సిటీల్లోనూ పెరగనున్న సీట్లు...

కేంద్రీయ విద్యా సంస్థల్లో ఈడబ్ల్యూఎస్ వారికి 10 శాతం సీట్లు రిజర్వేషన్లతో కేటాయించనుండగా అదేవిధంగా రాష్ట్ర వర్సిటీల్లోనూ ఈడబ్ల్యూఎస్ వారికి 10 శాతం సీట్లను కేటాయించాల్సి ఉంటుంది. కాబట్టి ఇప్పటికే రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఉన్న సీట్లకు అదనంగా సీట్లను పెంచాల్సి వస్తోందని ఉన్నత విద్యా మండలి చెబుతోంది. అయితే కేంద్రం జారీ చేసే ఉత్తర్వులకు అనుగుణంగా సీట్లను పెంచడానికి తగిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి జారీ చేసే అవకాశం ఉంది. అయితే సీట్ల పెంపును అన్ని విద్యా సంస్థలు మార్చి 31లోపు పెంచాలని హెచ్‌ఆర్‌డీ ఆఫీస్ మోమోరాండం జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్రంలోని వర్సిటీల్లోనూ సీట్ల పెంపును మార్చి 31లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఐఐటీ, ఎన్ఐటీల్లో పెరగనున్న సీట్లు..

జాతీయ స్థాయిలోని ఐఐటీ, ఎన్ఐటీలతోపాటు ట్రిపుల్ ఐటీల్లోనూ సీట్లు పెరగనున్న నేపథ్యంలో ఇటు తెలంగాణ విద్యార్థులతోపాటు అటూ ఏపీ విద్యార్థులకు ఎక్కువ సీట్లు సొంతం చేసుకునే అవ కాశం ఉంటుందని నిపు ణులు పేర్కొంటున్నారు. జాతీయ స్థాయిలో జరిగే జేఈఈ మెయిన్స్, అ డ్వాన్స్‌డ్‌లో రెండు తెలు గు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు 15 నుంచి 18 శాతం సీట్లను సొంతం చేసుకుంటున్నారని... ఈ నేపథ్యంలో సీట్లు పెరగడంతో మరికొందరు కూడా సీట్లను సొంతం చేసుకునే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు.

దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ వచ్చే ఏడాది 2019-20 నుంచి రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. కేంద్రం చట్టం చేసిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కూడా అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయడం కోసం హెచ్‌ఆర్‌డీ అన్ని శాఖలకు ఆఫీస్ మోమోరాండంను జారీ చేసింది. దేశంలో 40వేల ప్రభుత్వ కాలేజీలుండగా 900 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఒక దేశంలో 32,426 ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల్లో కలిపి 4 కోట్ల మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నట్టు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు జరగనున్నాయి.

గుప్తనిధుల కేసులో నలుగురి అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న వికారాబాద్ డీఎస్పీ శిరీష

వికారాబాద్, ప్రభ న్యూస్ : కోట్‌పల్లి నాగసాన్‌పల్లి గ్రామంలో గుప్త నిధుల తవ్వకాలు జరిపి సంబంధిత పంచలోహ విగ్రహాన్ని, శఠగోపాన్ని, బిందెను, నాణెలను విక్రయించేందుకు యత్నించిన ఐదుగురిలో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు వికారాబాద్ డీఎస్పీ శిరీష తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీఎస్పీ, మోమిన్‌పేట సీఐ బి.శ్రీనివాస్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. వికారాబాద్ జిల్లా నాగసాన్‌పల్లి గ్రామంలోని శ్రీనివాస్ గౌడ్ పొలంలోవున్న పురాతన ఆలయంలో విలువైన పంచలోహ విగ్రహాలున్నాయన్న పూజారి వెంకటేష్ సూచన మేరకు రమేష్, శ్రీనివాస్, ఉపేందర్ గౌడ్ ఈ నెల 2 వ తేది రాత్రి సదరు విగ్రహాన్ని, నాణేలను బయటికి తీసి విక్రయించేందుకు బేరం కుదుర్చుకోగా బుధవారం సాయంత్రం ఏఎన్‌ఆర్ దాబా వద్ద అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మరో వ్యక్తి ఉపేందర్ గౌడ్ పరారీలో ఉన్నాడని, సంబంధిత పురాతన వస్తువులను పురావస్తు శాఖకు, ప్రభుత్వానికి అందజేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కేసును ఛేదించటంలో మోమిన్‌పేట ఎస్ఐ రవికుమార్, నవాబ్ పేట ఎస్ఐ క్రిష్ణ కానిస్టేబుళ్లు ధర్మారెడ్డి తదితరులను డీఎస్పీ శిరీష అభినందించారు.

తెలంగాణవాసులను భారత్‌కు పంపండి

భారత్ కాన్సలేట్‌కు సీఎస్ లేఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తమ రాష్ట్రం నుంచి ఉపాధి కోసం ఇరాక్‌కు వెళ్ళిన 15 మందిని కాపాడేందుకు సంక్షేమ నిధి నుంచి ఆదుకోవలసిందిగా ఇరాక్‌లోని భారత కాన్సులేట్ జనరల్‌ను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు బతుకు తెరువు కోసం వెళ్ళిన ఉపాధి లభించక ఆకలితో అలమటిస్తున్నారని, వెంటనే వారిని కాపాడాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ఈ మేరకు కాన్సులేట్ జనరల్‌కు లేఖ రాశారు.

ఈ బాధితులను ప్రత్యేకంగా పరిగణించి వారి తరఫున జరిమాన చెల్లించి విమాన టికెట్లు కొని భారత్‌కు పంపించాల్సిందిగా ప్రభుత్వం కోరింది. బాధితులకు ముందుగా ఆహారం సరఫరా చేయాలని, అలాగే అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి వాళ్ళ సమస్యలను పరిష్కరించాలని ప్రధాన కార్యదర్శి ఆ లేఖలో కోరారు.

కొచ్చిలో ఐఏఏ వరల్డ్ కాంగ్రెస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇంటర్నేషనల్ అడ్వర్‌టైజింగ్ అసోసియేషన్ (ఐఏఏ) ఓ ప్రపంచ సదస్సు కొచ్చిలో నిర్వహించనున్నారు. న్యూయార్క్ కేంద్ర కార్యాల యంతో 55 దేశాలకు విస్తరించిన ఈ అసోసియేషన్ ఫిబ్ర వరి 20 నుంచి 22వ తేదీవరకు నిర్వహించనున్నట్లు అసో సిషన్ ఛైర్మన్ శ్రీనివాసన్ స్వామి తెలిపారు. ఈ ప్రపంచ సదస్సు ప్రతి రెండేళ్ళకోసారి ప్రపంచంలోని ముఖ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని, 44 వ సదస్సుకు భారత్ వేదికగా నిలుస్తుందని ఆయన చెప్పారు. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కాంగ్రెస్ గవర్నింగ్ కౌన్సిల్‌కు ఛైర్మన్‌గా ఉంటూ మార్గదర్శకత్వం వహిస్తున్నారని చెప్పారు. ఈ సదస్సుకు అన్ని దేశాల నుంచి రెండువేల మంది ప్రతినిధులు హాజరవుతారని శ్రీనివాసన్ చెప్పారు. ఈ అసోసియేషన్‌కు భారత చాప్టర్ ప్రెసిడెంట్ పునీత్ గోయెంకా, సదస్సు స్టీరింగ్ కమిటీ కో-ఛైర్మన్లుగా ప్రదీప్ గుహ, కౌశిక్ రాయ్ వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. మార్కెటింగ్, కమ్యూనికేషన్స్, వాటికి సంబంధిం చిన టెక్నాలజీలపై ఈ సదస్సులో చర్చిస్తారని ప్రదీప్ గుహ చెప్పారు. ఈ సదస్సులో 35 మంది స్పీకర్లు వివిధ అంశా లపై వృత్తిపరమైన కోణాల్లో ప్రసంగిస్తారని చెప్పారు. మార్కెటింగ్, అడ్వటైజింగ్, మీడియా, టెక్నాలజీ తదితర రంగాలకు చెందిన నిపుణులు, అకడమిక్స్, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

పక్షులను కాపాడిన అటవీ శాఖ

- చైనా మాంజాపై ఫలించిన ప్రచారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి పండుగ నేపథ్యంలో పంతంగుల ఉత్సవాల్లో భాగంగా చైనామాంజా నిషేధంపై అటవీశాఖ చేపట్టిన ప్రచారం ఫలించింది. హైదరాబాద్ నగరంలో ఈనెల 13 నుంచి 17 వరకు చైనా మంజాకు చిక్కుకుని ప్రాణాలమీదకు తెచ్చుకున్న ఎనిమిది పక్షులను అటవీ శాఖ సిబ్బంది కాపాడగలిగారు. మొత్తం తొమ్మిది పక్షులు మాంజాకు చిక్కుకోగా, వాటిలో ఒకటి చనిపోయింది. ఐదు తీవ్రంగా గాయపడ్డాయి, మిగిలిన మూడుపక్షులను గాలిలోకి వదిలిపెట్టారు. గాయపడిన పక్షులను చికిత్స నిమిత్తం నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు తరలించారు.

గ్లాస్ కోటింగ్‌తో తయారయ్యే చైనామాంజా (నైలాన్ దారం) పక్షులకు హానీ చేస్తున్నాయని గుర్తించి 2016లోనే నిషేదం విధించారు. సెక్షన్ 5 ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ చట్టం 1986 ప్రకారం ప్రమాదకరమైన నైలాన్ దారం విక్రయించడం చట్ట విరుద్ధం. ఈ ఏడాది చైనా మాంజా నిషేధంపై అటవీ శాఖ అధికారులు అరణ్యభవన్‌లో ప్రత్యేక టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడంతో పాటు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సంక్రాంతి సీజన్‌లో మాంజా విక్రయాల దుకాణాలపై నిఘా పటిష్టం చేశారు. భవనాల పైకప్పులు మీద, చెట్లమీద, ఎలక్ట్రికల్ వైర్లు, టెలిఫోన్ వైర్లుపైన చిక్కుకున్న మాంజాలను తొలగించాలని జంటనగరాల ప్రజలకు అటవీశాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. అవసరమైతే సహాయపడేందుకు 18004255364, 040-23231440 నెంబర్లకు ఫోన్ చేస్తే సిబ్బంది వచ్చి దారాలను తొలగిస్తారని అధికారులు వెల్లడించారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాల్లో పెట్రోల్ బంక్‌లు

- ఆదాయం కోసం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి
- అయిల్ కంపెనీల ప్రతినిధులతో ఈడీ చర్చలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నష్టాలలో కూరుకుపోయిన ఆర్టీసీని గట్టెక్కిం చేందుకు కొంత కాలంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్‌టీసీ) చేస్తున్న ప్రయత్నాలు మరింత ముమ్మరమయ్యాయి. ప్రయాణికుల ద్వారా సమకూరే ఆదాయంపైనే కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమకూరే ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. సంస్థకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీ స్థలాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లను వినియోగంలోకి తీసుకువచ్చి ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్న ఆలోచనతో ఉన్న అధికారులు పలు కోణాలలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సంస్థకున్న ఖాళీ స్థలాలలో పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసే అంశంపై సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం గురువారం హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్ ప్రతినిధులతో చర్చించారు. అవుట్‌లెట్ ప్రదేశాలలో మౌలిక సదుపాయాల కల్పన వంటి విషయాలపై చర్చించారు. ఇంధన ఔట్ లెట్‌ల నిర్వహణ ద్వారా వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ప్రయత్నించినపుడే లక్ష్యం నెరవేరుతుందని ఈడీ పేర్కొన్నారు. సంస్థ అధికారులు, ఆయిల్ కం పెనీల ప్రతినిధులు సమన్వయంతో కలిసి పని చేయడానికి పరస్పరం అంగీకారం తెలుపుకున్నారు. అంతేకాకుండా సర్వీస్ ప్రొవైడర్స్, అకౌంట్ అధికారులు, డిపో మేనేజర్లతో కలిసి ఒక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న నిర్ణయానికి వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థకున్న ఖాళీ స్థలాలెన్నీ, అందులో వాణిజ్యపరంగా అనుకూలంగా ఉండే స్థలాలెన్ని అనే అంశాలను కూడా పరిశీలించనున్నారు. సంస్థను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకై ఎక్కడెక్కడ సంస్థ ఖాళీ స్థలాలు ఉన్నాయో, వాటిని ఏ ఒకంగా ఉపయోగించుకుని ఆదాయ వనరులను సమకూ ర్చుకోవచ్చనే విషయంపై కూడా ప్రత్యేక దృష్టిసారించినట్లు ఈడీ తెలిపారు.

సంక్రాంతి ఆదాయం రూ. 63.35 కోట్లు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకి సంక్రాంతి బొనాంజ అందింది. పండుగ రద్దీని ఆదాయంగా మలచుకునేందుకు అధికార యంత్రాంగం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈ నెల 10నుంచి 15 వ తేదీ వరకు ఆరు రోజులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా సంస్థకు రూ. 63.35 కోట్ల ఆదాయం సమకూరింది. సంక్రాంతి రద్దీని ముందే అంచనా వేసిన అధికారులు 4622 ప్రత్యేక బస్సులను వివిధ రూట్లలో నడిపించారు. గతేడాది సంక్రాంతి పండుగకు 3222 ప్రత్యేక బస్సులను నడిపిన అధికారులు ఈ ఏడాది అదనంగా 1400 బస్సులను నడిపారు. గతేడాది రూ. 62.48 కోట్ల ఆదాయం కాగా ఈ ఏడాది రూ. 87 లక్షలను అదనంగా ఆర్జించింది. అంటే రోజుకు సగటున 10.55 కోట్ల ఆదాయాన్ని సంస్థ ఆర్జించింది. సాధారణ రోజులలో సంస్థ ఆదాయం రోజుకు రూ. 9 కోట్లుగా ఉంటుంది. పండుగ ప్రత్యేక రోజులలో రోజుకు కోటిన్నర రూపాయలను అదనంగా సంస్థ ఆర్జించింది.

12 న రూ. 13.25 కోట్లు వసూలు

పండుగ రద్దీ నివారణ కోసం సంస్థ ఆరు రోజుల పాటు ప్రత్యేక బస్సులను నడిపినప్పటికీ 12 వ తేదీన సంస్థకు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. 12వ తేదీన అధికంగా రూ. 13.25 కోట్లు ఆదాయంగా వచ్చిందని అధికారులు వివరించారు. 10 వ తేదీన రూ. 10.6 కోట్లు, 11 వ తేదీన రూ. 11.96 కోట్లు, 13 వ తేదీన రూ. 12 కోట్లు, 15 వ తేదీన అత్యల్పంగా రూ. 6.14 కోట్ల ఆదాయం వచ్చిందని గణాంకాలు తెలిపాయి. ఆర్టీసీ గణాంకాల ప్రకారం పండుగకు మొత్తం 30 లక్షల మంది స్వంతూళ్ళకు వెళ్ళగా టీఎస్‌ఆర్టీసీ బస్సులలో సుమారు 10 లక్షల ప్రయాణం చేశారని తేలింది. పండుగ నేపథ్యంలో టీఎస్‌ఆర్‌టీసీ ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పట్టణాలతో పాటు కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు కూడా ప్రత్యేక బస్సులను నడిపించింది. ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం, ప్రయాణికులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు పలు ఏర్పాట్లను చేశారు. పండుగలకు ఊళ్ళకు వెళ్ళిన వారిలో చాలా మంది వచ్చే రెండు మూడు రోజులలో తిరిగి వస్తుంటారని, ఈ రెండు మూడు రోజులు కూడా ఆదాయం బాగానే ఉండవచ్చని అధికారులంటున్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్

మార్చి నాటికి కాళేశ్వరం పూర్తి కావాలి

- గోలివాడ పంప్‌హౌజ్ పనుల్లో వేగం పెంచాలి
- సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్

పెద్దపల్లి/మహాదేవపూర్, ప్రభ న్యూస్ : మార్చి నెలాఖరులోగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావాలని సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్ అధికారులతోపాటు గుత్తేదారులను ఆదేశించారు. గురువారం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పెద్దపల్లి జిల్లా గోలివాడలో నిర్మిస్తున్న పంపు హౌజ్ పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, మార్చి చివరి నాటికి ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీలు, పంపు హౌజ్‌లు పూర్తి స్థాయిలో నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. పంపు హౌజ్‌ల డ్రైరన్‌లు పూర్తి చేసి ఏప్రిల్ మాసంలో వెట్ రన్‌లు నిర్వహించాలన్నారు. వచ్చే వానాకాలం పంటకు రైతాంగానికి కాళేశ్వరం జలాలను సాగు నీరుగా అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు వెలుతున్నారన్నారు.

గోలివాడ పంప్ హౌజ్ పనుల పురోగతి విష యంలో అధికారుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. హౌజ్ నిర్మాణంలో మరింత వేగం పెంచాలని, యంత్రాలు, కార్మికులను పెంచి సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పంపు హౌజ్ పరిధిలో 18 లైన్‌ల పైపులైను పనుల్లో 487 పైపులను 17964 ఆర్ఎంటీతో వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 15044 ఆర్ఎంటీ పైపులైను వేశామని, మిగిలిన పనుల్లో వేగం పెంచుతూ మార్చి వరకు పూర్తి చేయాలని తెలిపారు. పంపు హౌజ్ పరిధిలోని 9 పంపులు, మోటార్లకు సంబంధించిన సామాగ్రి సమకూరిందని, మిగిలిన అవసరమైన భాగాలు ఫిబ్రవరి 20 వరకు చేరుతాయన్నారు. పంప్ హౌజ్ పరిధిలో 1,09,05,573 క్యూబిక్ మీటర్ల మట్టి పనిలో ఇప్పటి వరకు 1,08,58,272 క్యూబిక్ మీటర్ల మట్టి పని పూర్తయిందని, 5,65,588 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనుల్లో భాగంగా 5,22,239 క్యూబిక్ మీటర్ల పని పూర్తయిందని మిగిలినవి సైతం త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. పంప్ హౌజ్ పనుల్లో వేగం పెంచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని, నిర్మాణ క్రమంలో వచ్చే సవాళ్లను అధిగమిస్తూ వేగంగా పనులు చేయాలని, ప్రభుత్వ లక్ష్యం ఏప్రిల్ మాసంలో వెట్ రన్ నిర్వహించేలా పనులు సాగాలని, అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎప్పటికప్పుడు పురోగతి గమనించాలని ఆమె అధికారులను ఆదేశించారు. జిల్లా క లెక్టర్ శ్రీదేవసేన, ఓఎస్డీ శ్రీదాస్ దేశ పాండే, ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, సీఈ వెంకటేశ్వర్ రావు, ఈఈ విష్ణు ప్రసాద్, సలహాదారులు పెంటారెడ్డి, ఏజెన్సీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పనులను గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్ సందర్శించారు. ముందుగా హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా మేడిగడ్డకు చేరుకుని అక్కడి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కన్నెపెల్లి పంపుహౌజ్‌కు చేరుకుని అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. పనుల్లో వేగం పెంచి మార్చి31లోపు ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. వీలైనంత వరకు కార్మికులను పెంచి పనుల్లో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా ఆదేశాలు జారీ చేసినప్పటికి గ్రావిటీ పనులు నత్తనడకన సాగుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రావీటి కెనాల్ పనుల్లో ఆలస్యం చేయకుండా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం నీళ్లందించే విధంగా అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు పనిచేయాలన్నారు. ఆమె వెంట జయశంకర్ భూపాపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, సీఈ నల్ల వెంకటేశ్వర్లు, ఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఈఈలు రమణారెడ్డి, యాదగిరి, డీఈలు సూర్యప్రకాష్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.


యూఎస్ జాతీయ సైన్స్ బోర్డుకు సురేష్ గరిమళ్ల నియామకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అమెరికాలో ప్రతిష్టాత్మకమైన జాతీయ సైన్స్ బోర్డుకు తెలుగు వాడైన డాక్టర్ సురేష్ వి.గరిమెళ్ళను ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియమించారు. ఈ పదవిలో ఈయన ఆరేళ్ళ పాటు కొనసాగుతారు. పరిశోధనలు, విద్య, అందించిన సేవలను పరిశీలించి నేషనల్ సైన్స్ బోర్డు సభ్యులను అధ్యక్షుడిని నియమిస్తారు. అన్వేషణలు, పోటీతత్వం, అకడమిక్ - కార్పొరేట్ భాగస్వామ్యం ద్వారా పెట్టుబడులు రాబట్టడం తదితర అంశాల్లో గరిమెళ్ళ ఎంతో కృషి చేశారు. పుర్ద్యూ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సురేష్ ఇటీవల హైదరాబాద్ సందర్శించిన సందర్భంగా ఆయన స్నేహితులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. గరిమెళ్ళ తదుపరి భారత సందర్శనలో ఈ యూనివర్సిటీ 150వ వసంతోత్సవాన్ని ముంబైలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, హెల్త్, సుస్థిరతపై నిపుణులు ప్రసంగిస్తారు. రానున్న 150 ఏళ్ళలో ప్రపంచం ఎదుర్కొనే సమస్యలు, సవాళ్ళపై నిపుణులను సభలో పాల్గొనే ప్రతినిధులు ప్రశ్నించేందుకు అవకాశం కల్పించనున్నారు.

'సుజనా సంస్థలపై విచారణ చేపట్టాలి'

హైదరాబాద్, (ఖైరతాబాద్), ప్రభ న్యూస్ : తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడ్డట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్యసభ సభ్యుడు సుజనాచౌదరి సంస్థల అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని హైకోర్టు అడ్వకేట్ రామారావు కోరారు. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఈ విషయమై రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్, సిరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 2014లో 50నుంచి 100 కంపెనీలు నెలకొల్పారని, అంతేకాకుండా సొంత తండ్రి పేరును ఒకసారి జనార్ధన్‌రెడ్డిగా, మరోసారి జనార్ధన్ చౌదరిగా పేర్కొంటూ మోసాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఫిర్యాదులు అందుకున్న సదరు సంస్థలు సుజనా చౌదరికి సంబంధించిన 22 కంపెనీలపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. రాజకీయ నాయకులు చేస్తున్న మోసాలు బయట పడ్డప్పుడు, ఇది కేవలం ఇతర పార్టీలు చేస్తున్న రాజకీయ కుట్ర అని ప్రజలను మభ్యపెట్టే ప్రకటనలు చేయడం సిగ్గుచేటని రామారావు అన్నారు. అవినీతికి పాల్పడ్డవారు ఏ స్థాయిలో ఉన్నా సమగ్ర విచారణ జరిపి దోషులని తేలితే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

యోగి నాయకత్వంలో బీజేపీ పాదయాత్ర



లక్నో: పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ నిర్వహించతలపెట్టిన పాదయాత్రకు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వం వహించనున్నారు. వాస్తవానికి ఈ పాదయాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా నాయకత్వం వహించాల్సి ఉంది. అయితే ఆయన స్వైన్‌ఫ్లూతో ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడిందని వైద్యులు చెప్పారు. అయినా ఒక వేళ ఆయన 20 తేదీ నాటికి కొలుకుని మాల్దా చేరుకో లేని పక్షంలో ఆయకు బదులుగా పాదయాత్రకు యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్ నాయకత్వం వహిస్తారు.

గుడిలో మరాఠీ నిర్మాత ఆత్మహత్య


ముంబై: మరాఠీ సినీ నిర్మాత ఒకరు గుడిలో ఆత్మహత్య చేసుకున్నారు. గ్రాంట్ రోడ్‌లో ఉన్న లాడ్బా గణపతి ఆలయంలోని మెజ్జానిన్ ఫ్లోర్ (రెండవ అంతస్థు)లో సదానంద్ లాడ్ అనే సినీ నిర్మాత ఉత్మహత్యకు పాల్పడ్డాడు. ఒక డెవలపర్ వేధింపుల కారణంగానే తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు లాడ్ వద్ద నోట్ లభ్యమైంది. దీని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుమారు 15 సంవత్సరాల క్రితం ఈ ఆలయం నిర్మాణానికి లాడ్ ఆర్థిక సహకారం అందించారు. లాడ్ మరాఠీలో 12కు పైగా సినిమాలు నిర్మించారు.



రబ్బర్ రంగానికి చేయూత

కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు

ముంబై: రబ్బర్ రంగంలో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని నేషనల్ రబ్బర్ పాలసీలో కొన్ని మార్పులు చేయనున్నట్టు కేంద్ర వాణిజ్య, ఇండస్ట్రీ అండ్ సివిల్ ఏవియేషన్ మంత్రి సురేష్ ప్రభు గురువారం తెలిపారు. సమస్యలను గుర్తించడంతో రబ్బర్ ఉత్పత్తిని పెంచడానికి వాణిజ్య శాఖ పాలసీని రూపొందిస్తున్నదన్నారు. 10వ ఇండియా రబ్బర్ ఎక్స్‌పో 2019 కార్యక్రమ ప్రారంభోత్సవానికి సురేష్ ప్రభు ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబ్బర్ పారిశ్రామిక రంగం ఎంతో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రంగంలో మరిన్ని ఉపాధి అవకాశాలు సృష్టించాల్సిన ఉందని, అదేవిధంగా ఎగుమతి కూడా పెంచేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి



ఉపయోగపడుతుందని వివరించారు. రానున్న ఐదేళ్ల కాలంలో భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని, ఇందులో మ్యానుఫాక్చరింగ్ రంగం 20 శాతం వాటా ఉండాలని భావిస్తున్నామని, రబ్బర్ ఇండస్ట్రీ ప్రధాన పాత్ర పోషించేలా చూస్తామని తెలిపారు. గత 13 నుంచి 14 నెలల కాలంలో ఇండియా నుంచి ఎగుమతి 10 శాతం వృద్ధి చెందిందని అన్నారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికాతో స్వేచ్ఛాయుత వాణిజ్యం కోసం భారత్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

రికార్డు స్థాయిలో రిల్ లాభాలు

న్యూఢిల్లీ : అక్టోబర్-డిసెంబర్ నాటికి మూడో త్రైమాసికం నికర లాభం 8.8 శాతానికి పెరిగినట్టు రిలయన్స్ ఇండస్ట్రీస్ గురువారం తెలిపింది. లాభం రూ. 10,251 ఉందని వివరించింది. ఒక త్రైమాసికంలో రూ.10వేల కోట్లకు పైన నికర లాభం పొందిన మొదటి ఇండియా కంపెనీగా రిలయన్స్ నిలిచింది. ఈ ఆర్థికసంవత్సరంలో రెవెన్యూ వృద్ధి రూ.1,71,336 కోట్లు (56 శాతం) పెరిగింది. గత ఆర్థికసంవత్సరంలో మూడో త్రైమాసికంలో రూ.9,420 కోట్ల నికర లాభాన్ని గడించింది. గతేడాది ఒక్కో షేర్ రూ.16 పలికింది.

జియో నెట్ ప్రాఫిట్ రూ.831 కోట్లు

న్యూఢిల్లీ : మూడో త్రైమాసికంలో రిలయన్స్ జియో నికర లాభం 65 శాతం పెరిగింది. అక్టోబర్-డిసెంబర్ నెల్లో రూ.831 కోట్ల లాభాన్ని పొందింది. కస్టమర్స్ ద్వారానే అత్యధిక లాభాలు గడించినట్టు కంపెనీ వివరించింది. గతేడాది మూడో త్రైమాసికంలో రూ.681 కోట్ల నికర లాభాన్ని పొందింది. డిసెంబర్ చివరి నాటికి 28 కోట్ల కస్టమర్లు అయ్యారు. గతేడాది 16 కోట్ల కస్టమర్లు ఉన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ ముఖేష్ అంబానీ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధిక కస్టమర్లు కలిగిన కంపెనీగా జియో పేరు తెచ్చుకుందన్నారు. అన్ని చోట్ల, అందరికీ సేవలు అందించాలనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, అందరికీ అందుబాటు ధరలో డేటా ప్యాకులు అందజేయడం జరుగుతోం దన్నారు.

ఫెడరల్ బ్యాంక్ లాభం 28.3 శాతం

న్యూఢిల్లీ : డిసెంబర్ 31, 2018 నాటికి మూడో త్రైమాసికంలో రూ.333.63 కోట్ల నికర లాభాన్ని గడించినట్టు ప్రయివేటు రంగ ఫెడరల్ బ్యాంకు గురువారం తెలిపింది. 28.3 శాతం లాభం పెరిగినట్టు వివరించింది. గత ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికంలో నికర లాభం రూ.260 కోట్లు రాబట్టుకుంది. ఈ ఆర్థికసంవత్సరంలో మూడో త్రైమాసికం పూర్తి ఆదాయం రూ.3,299.96 కోట్లు అని వివరించింది. గతేడాది రూ.2,729.83 కోట్లు అని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వివరించింది. ఎన్‌పీఏ 3.14 శాతం పెరిగింది. 2017-18లో 2.52 శాతం వృద్ధి చెందింది.

హెచ్‌యూఎల్ ప్రాఫిట్ రూ.1,444 కోట్లు

న్యూఢిల్లీ: మూడో త్రైమాసికంలో నికర లాభం 9 శాతం పెరిగినట్టు ఎఫ్ఎంసీజీ మేజర్ హిందుస్థాన్ యూనిలివర్ (హెచ్‌యూఎల్) తెలిపింది. డిసెంబర్ 31, 2018 నాటికి రూ.1,444 కోట్లు లాభపడినట్టు వివరించింది. గతేడాది అక్టోబర్-డిసెంబర్ కాలంలో రూ.1,326 కోట్ల నికర లాభాన్ని పొందింది. ఈ ఏడాదిలో అమ్మకాలు రూ.9,357 (12.42 శాతం పెరుగుదల) నిలిచింది. గతేడాది రూ.8,323 కోట్ల వద్ద నిలిచినట్టు హెచ్‌యూఎల్ వివరించింది. దేశీయంగా 13 శాతం వృద్ధి సాధించిందని హెచ్‌యూఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ మెహతా తెలిపారు. వచ్చే త్రైమాసికంలో మరింత వృద్ధి సాధిస్తామని, డబుల్ డిజిట్ అభివృద్ధి ఉంటుందని తెలిపారు.

100 కోట్లు కట్టండి

24 గంటలు మాత్రమే సమయం..

లేదంటే ఎండీని అరెస్టు చేస్తాం



- కంపెనీ ఆస్తులు జప్తు చేసి చర్యలు తీసుకుంటాం
- నేటి సాయంత్రం 5 గంటల కల్లా అఫిడవిట్ దాఖలు చేయాలి
- ఫోక్స్ వ్యాగన్‌కు ఎన్‌జీటీ హెచ్చరిక



న్యూఢిల్లీ : భారత్ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించని జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీరంగ సంస్థ ఫోక్స్ వ్యాగన్‌కు జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) గట్టి షాక్ ఇచ్చింది. ఆదేశాలను బేఖాతరు చేయడంపై ఫోక్స్ వ్యాగన్‌పై ఎన్‌జీటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తప్పుడు డీజిల్ మీటర్లతో వినియోగదారులను మోసం చేశారంటూ దాఖలైన కేసుకు సంబంధించిన కేసు విషయంలో రూ.100 కోట్లు డిపాజిట్ చేయాలని నవంబర్ 16, 2018న ఆదేశించినా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు ప్రశ్నించింది. 24 గంటల్లో కంపెనీ రూ.100 కోట్లను డిపాజిట్ చేయాలని ఎన్‌జీటీ ఆదేశించింది. 2006లో దాదాపు 3.17 లక్షల వాహనాల ద్వారా వాస్తవానికంటే 40 రెట్లు నైట్రస్ ఆక్సైడ్ విడుదల చేసిందన్న ఫిర్యాదు నేపథ్యంలో ఎన్‌జీటీ గురువారం విచారణ చేపట్టింది. సెంట్రల్ కాలుష్య నియంత్రణ బోర్డుకు రూ.100 కోట్ల జరిమానా సొమ్ము డిపాజిట్ చేయాలని, లేదంటే సంస్థ భారత్ విభాగం ఎండీని అరెస్టు చేయడంతో పాటు సంస్థకు చెందిన ఆస్తులను సీజ్ చేస్తామని హెచ్చరించింది. ఎన్‌జీటీ నలుగురు సభ్యుల ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న ఆదర్శ్ కుమార్ గోయల్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్‌జీటీ ఇచ్చిన తీర్పుపై ఎలాంటి స్టే లేదని, అయినా కంపెనీ ఎందుకు డబ్బులు జమ చేయలేదని ప్రశ్నించారు. గడువు ఇవ్వాలని కంపెనీ తరఫు న్యాయవాది కోరినా ఎన్‌జీటీ నిరాకరించింది. ఇక ఎలాంటి గడువు ఇవ్వబోమని, 24 గంటల్లో డబ్బులు జమ చేసి, శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోపు అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. లేదంటే కంపెనీపై తీవ్ర చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఎన్‌జీటీ హెచ్చరించింది. నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసి మరీ విచారించినట్టు తెలిపింది. అయినా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేసింది.



ఆది నుంచే కంపెనీపై విమర్శలు

ఫోక్స్ వ్యాగన్ ఇండియా ఆది నుంచే తీవ్ర విమర్శలు ఎదుర్కొంటూనే వస్తోంది. డిసెంబర్, 2015లో 3,23,700 ఫోక్స్ వ్యాగన్ కార్లను ఆటో మోటీవ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) రీకాల్ చేసింది. కొన్ని మోడల్ కార్లలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రన్ చేసినట్టు పరీక్షల ద్వారా ఏఆర్ఏఐ గుర్తించింది. బీఎస్-4 వాహనాలకు సంబంధించిన నిబంధనల పరంగా ఆన్ రోడ్‌పై 1.1 కంటే 2.6 సార్లు అత్యధికంగా ఉద్గారాలను విడుదల చేస్తున్నట్టు తేటతెల్లమైంది. అమెరికా, యూరప్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఇతరాత్ర దేశాల్లో విక్రయించిన 11 మిలియన్ డీజెల్ ఇంజన్ కార్లలో ఓ ప్రత్యేక డిజైన్‌ను అమర్చినట్టు తెలిసింది. ఉద్గార ఫలితాలను తప్పుదోవ పట్టించేందుకుగాను దీన్ని వాడినట్టు బహిర్గతమైంది. ఈఏ 189 డీజెల్ ఇంజిన్ కార్లను గుర్తించి ఏఆర్ఏఐ 3.23 లక్షల కార్లను రీకాల్ చేసింది.

కానీ కంపెనీ వాదన మాత్రం భిన్నంగా ఉంది. దేశంలో తమ వాహనాలు స్టేజ్ 4 నిర్దేశించిన ఉద్గార నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని చెప్పుకొస్తున్న డి.ఫోక్స్ వ్యాగన్ ప్రతినిధి మాట్లాడుతూ.. భారత్ నిబంధనలకు అనుగుణంగానే తాము ముందుకు వెళ్తున్నామని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టుకు కూడా వెళ్లామని వివరించారు. అందుకే రూ.100 కోట్లు కట్టాలన్న ఎన్‌జీటీ ఆదేశాలను పట్టించుకోలేదన్నారు.

స్కూల్ టీచర్ ఫిర్యాదుతో వెలుగులోకి..


ఫోక్స్ వ్యాగన్ వాహనాలతో వాతావరణ కాలుష్యం జరుగుతోందని, ఆ కార్లపై నిషేధం విధించాలంటూ సలోనీ అయిలావాడీ అనే స్కూల్ టీచర్‌తో పాటు పలువురు కలిసి జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఫోక్స్ వ్యాగన్ డీజెల్ వాహనాల్లో ఓ రకమైన డివైజ్‌ను ఏర్పాటు చేసి వాతావరణ కాలుష్యానికి పాల్పడుతోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది పర్యావరణానికి చాలా నష్టం కలుగజేస్తోందని, వాస్తవం కంటే 40 రెట్లు నైట్రస్ ఆక్సైడ్ విడుదల చేసిందని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపిన ఎన్‌జీటీ ఓ రకమైన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ప్రత్యేక డివైజ్‌నే డీజిల్ కార్లలో ఉపయోగించినట్టు నిర్ధారించింది. భారతదేశంలోని నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని ఎన్‌జీటీ నిర్ధారించింది. ప్రపంచ వ్యాప్తంగా కాలుష్య ఉద్గారాలపై ఇప్పటికే ఫోక్స్ వ్యాగన్ ఇండియా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఢిల్లీలో కాలుష్యం పెరగడానికి కంపెనీ కూడా కారణం అవుతోందని ఎన్‌జీటీ ఆగ్రహం వ్యక్తం చేసింది.

స్వల్ప లాభాలతో ముగింపు

- సెన్సెక్స్ 52.79 పాయింట్లు, నిఫ్టీ 14.90 పాయింట్ల లాభం
- కుదేలైన ఫార్మా, ప్రభుత్వ రంగ బ్యాంకు షేర్లు


ముంబై : దేశీయ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లు సానుకూలంగా ఉండటంతో ఉదయం లాభాలతోనే ప్రారంభమయ్యాయి. కొన్ని కీలక రంగాల్లో వెల్లువెత్తిన అమ్మకాలతో సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ప్రారంభమైన ఊపు మెల్లి మెల్లిగా తగ్గిపోయింది. ఒడిదుడుకుల మధ్య సాగిన మార్కెట్ చివరికి స్వల్ప లాభాలను మూటగట్టుకుంది. మార్కెట్ ముగిసే సమయానికి 52.79 పాయింట్లు (0.15 శాతం) లాభపడి సెన్సెక్స్ 36,374.08 పాయింట్ల వద్ద స్థిరపడింది. అదేవిధంగా నిఫ్టీ 14.90 పాయింట్లు లాభపడి (0.14 శాతం) 10,905.20 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 100 పాయింట్లకు పైగా లాభపడింది. నిఫ్టీ కూడా 10,900 మార్క్ పైన ట్రేడ్ అయ్యింది. ఈ జోరు ఎంతో సేపు నిలవలేదు. ఆసియా మార్కెట్‌ల మిశ్రమ సంకేతాలతో ఫార్మా, ప్రభుత్వ రంగ బ్యాంకు షేర్లు కుదేలయ్యాయి. దీంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 100 పాయింట్లు నష్టపోయింది. మార్కెట్ ముగింపునకు గంట ముందు కొనుగోళ్లు ఊపందుకోవడంతో స్వల్ప లాభాలతో ముగిసింది.

సెన్సెక్స్ బుధవారం 36,321.29 వద్ద ముగిసింది. గురువారం 36,413.60తో అంతర్జాతీయ మార్కెట్ ప్రారంభమైంది. అత్యధికంగా 36,468.42



పాయింట్ల వద్ద ట్రేడ్ అయ్యింది. అతి తక్కువగా 36,170.80 నమోదైంది. సెన్సెక్స్ ప్యాక్‌లో యాక్సిస్ బ్యాంక్ (1.91 శాతం), హెచ్‌సీఎల్ టెక్ (1.77 శాతం), మహీంద్రా అండ్ మహీంద్రా (1.19 శాతం), టీసీఎస్ (1.34 శాతం), హెచ్‌డీఎఫ్‌సీ (1.51 శాతం), కోటక్ మహీంద్రా బ్యాంక్ (1.24 శాతం), పవర్ గ్రిడ్ (1.09 శాతం), హీరో మోటార్ కార్పొరేషన్ (0.90 శాతం), వేదాంత (0.54 శాతం) కంపెనీలు టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. అత్యధికంగా యాక్సిస్ బ్యాంక్ లాభం 1.91 శాతం పెరిగింది. టాప్ లూజర్స్ విషయానికొస్తే.. సన్‌ఫార్మా అత్యధికంగా (5.78 శాతం) నష్టపోయింది. అదేవిధంగా ఎస్ బ్యాంక్ (3.31 శాతం), ఎస్‌బీఐ (1.78 శాతం), బజాజ్ ఫైనాన్స్ (1.45 శాతం), హెచ్‌యూఎల్ (1.12 శాతం), టాటా స్టీల్, భారతీ ఏయిర్ టెల్‌తో పాటు ఓఎన్‌జీసీలు నష్టాలు చవిచూశాయి. ఆర్ఐఎల్, హెచ్‌యూఎల్ త్రైమాసిక ఫలితాల కంటే 1.12 శాతం నష్టాన్ని మూటగట్టుకున్నాయి. అదేవిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 21 పైసలు పెరిగింది. ప్రస్తుతం డాలర్‌తో రూపాయి విలువ 71.03 వద్ద నిలిచింది. వరుసగా నాలుగు రోజులు రూపాయి విలువ పడిపోతూ వచ్చింది. గురవారం నాటి మార్కెట్ పుంజుకోవడానికి ఐటీ స్టాక్స్ ఎంతో ఉపయోగపడ్డాయనే చెప్పుకోవాలి. క్రూడ్ ఆయిల్ ధర 0.95 శాతం పడిపోయి బ్యారెల్ 60.74 డాలర్ల వద్ద నిలిచింది. జెట్ ఎయిర్‌వేస్ లాభాలు 5.09 శాతం పెరిగాయి. గురువారం ఒక్కో షేర్ విలువ రూ.284.80 వద్ద నిలిచింది.


పెరిగిన బంగారం ధరలు



ఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడికి డిమాండ్ పెరగడంతో గురువారం ధర స్వల్పంగా పెరిగింది. వరుసగా నాలుగో రోజు బంగారం ధర పెరిగింది. స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడంతో పసిడి ధర పెరుగుతూ వస్తోందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. గురువారం పది గ్రాముల బంగారంపై రూ.110 పెరిగింది. 10 గ్రాముల బంగారం ధర రూ. 33,300 పలికింది. ఇక కిలో వెండిపై రూ.300 తగ్గింది. ప్రస్తుతం స్వచ్ఛమైన వెండి కిలో రూ.40,200గా ఉంది. అంతర్జాతీయంగా నాణేలకు డిమాండ్ తగ్గినట్టు తెలుస్తున్నది. ఢిల్లీ విషయానికొస్తే.. పది గ్రాముల 99.9 శాతం స్వచ్ఛమైన బంగారం ధర రూ. 33,300గా, 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం రూ.33,150గా ఉంది.

జీడీపీ పెరగాలంటే..

మరింత కరెన్సీ అవసరం: ఆర్బీఐ



కోల్‌కతా : దేశ జీడీపీ క్రమంగా పెరుగుతోందని, ఇది శుభసూచకమే అయినా దీనికి మరింత కరెన్సీ అవసరం అవుతుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు తెలిపారు. నవంబర్, 2016లో పెద్ద నోట్ల రద్దు తరువాత భారత్ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర పరిణామాలు చోటు చేసుకున్నాయని, ఇప్పుడు స్థూల దేశీయోత్పత్తికి మరింత కరెన్సీ అవసరం అవుతుందని వివరించారు. పెద్ద నోట్ల రద్దులో భాగంగా రూ.500, రూ.1000 నోట్లను నిషేధించిందని, కానీ ఆ తరువాత రూ.500 కొత్త నోటు పరిచయం చేసినా రూ.1000 విడుదల చేయలేదని తెలిపారు. రూ.2000 నోటును మార్కెట్‌లోకి విడుదల చేసిదన్నారు. ఇప్పటికే నకిలీ నోట్లు మార్కెట్‌లో చెలమణి అవుతున్నాయని, ఏది ఏమైనా ప్రస్తుతం మనీ సర్క్యూలేషన్ అనేది గందరగోళ పరిస్థితుల్లో ఉందని వివరించారు. బ్యాంకులు కూడా కరెన్సీ విషయంలో కట్టుదిట్టమైన భద్రతాపరమైన చర్యలు తీసుకొస్తుందని సెంట్రల్ బ్యాంక్ అధికారి ఒకరు తెలిపారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీస్ (ఎన్‌బీఎఫ్‌సీ) గురించి మరో అధికారి మాట్లాడుతూ.. ఎన్‌బీఎఫ్‌సీ డిపాజిట్‌ల విషయంలో అంబుడ్స్‌మెన్‌ను నియమిస్తుందని ఆర్‌బీఐ చెప్పుకొచ్చింది. అదేవిధంగా సూక్ష్మ, స్థూల, చిన్న తరహా పరిశ్రమల కోసం ఆర్‌బీఐ ఓ నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేస్తుందని వివరించారు. దీంతో పరిశ్రమలు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా రుణాలు తీసుకునే వీలుంటుందని సెంట్రల్ బ్యాంక్ అధికారి ఒకరన్నారు.

2020 నాటికి జీడీపీ 7.5 శాతం

2019-20 నాటికి దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడి జీడీపీ 7.5 శాతం వద్ద నిలుస్తుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ గురువారం ప్రకటించింది. ప్రధాన రంగాలైన ఇండస్ట్రీ, సర్వీసెస్‌లో అభివృద్ధి ఉంటుందని తెలిపింది. సెంట్రల్ స్టాటిక్స్ ఆఫీస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరానికి 7.2 శాతం ఉంటుం దని, గతేడాది 6.7 శాతం జీడీపీ నమోదైందని తెలిపింది. జీఎస్టీ అమలు, పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో 2018-19లో మెరుగుదల సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ముడి చమురు ధర పెరగడం, అమెరికా డాలర్ పడుతుం డటంతో జీడీపీ వృద్ధి మరింత మెరుగైందని తెలిపింది.

పెరగనున్న హోండాకార్ల ధరలు

న్యూఢిల్లీ : వచ్చే నెల నుంచి తన కార్ల ధరలు రూ.10,000 పెంచుతున్నట్టు హోండా కార్స్ ఇండియా గురువారం ప్రకటించింది. ఫారెన్ ఎక్స్ఛేంజ్ రేట్స్, ముడి సరుకు ధరలు పెరగడమే దీనికి కారణం అని చెప్పుకొచ్చింది. ప్రీమియం ఎస్‌యూవీ సీఆర్-వీ పైన రూ.10,000, ఇతరాత్ర మోడల్స్‌పై రూ.7000 వరకు పెంచుతున్నట్టు తెలిపింది. ఈ ధరలు ఫిబ్రవరి నుంచి అమల్లోకి రానున్నట్టు హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌సీఐఎల) వివరించింది. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ రాజేష్ గోయల్ మాట్లాడుతూ.. వీలైనంత మేరకు ముడిసరుకు ధరల తీవ్ర ఒత్తిడిని తట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. త్వరలో మారుతి సుజుకీ కూడా ఎంపిక చేసిన కొన్ని మోడళ్లపై రూ.10000 వరకు ధరలు పెంచే అవకాశాలు ఉన్నాయి. మారుతీ సుజుకీ ఇండియా ఆటో రంగ తయారీ సంస్థలు అయిన టొయోటా కిర్లోస్కర్ మోటర్, యుటిలిటీ వెహికిల్స్ తయారీ కంపెనీలు ఈసుజు మోటార్స్ ఇండియా జనవరి నుంచి కొన్ని మోడళ్లపై ధరను పెంచుతున్నట్టు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

ఫ్లిప్‌కార్ట్‌కు రూ.1,431 కోట్లు


న్యూఢిల్లీ : వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఇండియా సింగపూర్‌కు చెందిన మాతృ సంస్థ నుంచి రూ. 1,431 కోట్లు అందుకుంది. వీటికి సంబంధించిన పత్రాలు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఫ్లిప్‌కార్ట్ గురువారం అందజేసింది. 4.86 లక్షల షేర్‌లను ఫ్లిప్ కార్ట్ ఇండియా పొందింది. అందజేసిన పత్రాల ఆధారంగా ఒక్కో ఫ్లిప్ కార్ట్ షేర్ ధర రూ.29,400గా ఉన్నట్టు తెలుస్తున్నది. గతేడాది డిసెంబర్‌లో ఫ్లిప్‌కార్ట్ రూ. 2,190 కోట్ల పెట్టుబడిని ఫ్లిప్‌కార్ట్ ఇండియాలో పెట్టింది. విదేశీ ఈ కామర్స్ సంస్థల విషయంలో కొత్త పాలసీలు తీసుకురావడం జరిగింది. ఈ నేపథ్యంలో రెగ్యులేటరీ ఫ్రంట్ ఎదుట ఫ్లిప్ కార్ట్ కొన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తున్నది. కొత్త నియమ నిబంధనలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఆర్థిక గణాంకాల సేకరణకు

ప్రభుత్వం ప్రణాళికలు

సర్వే కోసం ప్రత్యేక ఏజెన్సీ... రూ.300 కోట్ల కేటాయింపు

న్యూఢిల్లీ : 2019-20 కోసం దేశ వ్యాప్త ఆర్థిక గణాంకాల సేకరణ నిర్వహించడానికి ప్రభుత్వం ఓ ఏజెన్సీని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. దేశంలో కొనసాగుతున్న అన్ని రకాల వ్యాపారాలకు సంబంధించిన సమాచారం సేకరించేందుకు ఉపయుక్తంగా ఉంటుందని ఓ ఉన్నతాధికారి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించుకునేలా ఏజెన్సీని ఏర్పాటు చేయనున్నట్టు సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియాతో కలిసి నిర్వహించిన వర్క్‌షాప్‌లో కేంద్ర గణాంకాల, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ప్రవీణ్ శ్రీవాత్సవ్ తెలిపారు. ఏడో ఆర్థిక గణాంకాల సేకరణ కోసం సీఎస్‌సీ ఎస్‌పీవీ సహకారం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఫలితంగా కేంద్ర గణాంకాల, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ మంత్రిత్వ శాఖ వద్ద పక్కా సమాచారం అందుబాటులో ఉంటుందని వివరించారు. దీన్ని జాతీయ సంపదగా గుర్తించి భవిష్యత్ కాలంలో తీసుకొచ్చే వివిధ పథకాలకు దీన్ని ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని శ్రీవాత్సవ్ తెలిపారు. సకాలంలో డేటా సేకరణ పూర్తవుతుందని భావిస్తున్నామని, సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ దేశ వ్యాప్తంగా 3 లక్షల కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లు కలిగి ఉందని, ఒక్కో సీఎస్‌సీ ద్వారా ఐదు ఎన్యుమరేటర్లను క్రియేట్ చేసి వారికి సీఎస్‌సీ ఎస్‌పీవీ ద్వారా శిక్షణ అందిస్తామని అన్నారు. వీరిని ఆర్థిక గణాంకాల సేకరణకు వినియోగించుకోవచ్చని, గుర్తింపు పొందిన ఎన్యుమరేటర్స్‌ను జన గణన వంటి అన్ని రకాల సర్వేల కోసం ఉపయోగించుకోవచ్చని అన్నారు. పేపర్ ఉపయోగించకుండా అత్యాధునిక టెక్నాలజీ ద్వారా ఈ గణాంకాల సేకరణ చేపడుతున్నామని వివరించారు. ఆరు నెలల్లో గణన పూర్తవుతుందని, గతంలో రెండేళ్ల సమయం పట్టేదని సీఎస్‌సీ ఎస్‌పీవీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దినేష్ త్యాగి తెలిపారు. 1977 నుంచి ఆరు ఎకనామిక్ సర్వేలు చేపట్టడం జరిగిందని అన్నారు. దేశ వ్యాప్తంగా 20 కోట్ల కుటుంబాలు నివసిస్తున్నాయని అంచనా వేస్తున్నామని, ఒక్కో కుటుంబానికి ఎన్యుమరేటర్‌కు రూ.15 నుంచి 20 చెల్లించడం జరుగుతుందని, దీంతో మొత్తం సుమారు రూ.300 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంటుందన్నారు. అనుకున్న సమయంలో ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. భారత జనాభా లెక్కల్లో సీఎస్‌సీ రంగంలోకి దిగితే రెండేళ్ల కోసారి నిర్వహించే అవకాశం ఉంటుందని త్యాగి ధీమా వ్యక్తం చేశారు.



రేపు సెంట్రల్ సెలబ్రేట్స్ 'రెడ్ హుట్'

న్యూఢిల్లీ : భారతదేశ అభిమాన ఫ్యాషన్ డిపార్ట్‌మెంట్ స్టోర్ సెంట్రల్‌లో రేపు రెడ్ హుట్ జరగనుంది. ఇండియా, యూ షాప్, వీ పేతో మీ దుకాణాన్ని సెంట్రల్‌లో ఉన్నట్టుగా ఇప్పుడు పూర్తి స్థాయిలో షాపింగ్ చేయవచ్చు. సెంట్రల్‌లో ప్రతీ శనివారం ఫ్లాట్ 50 శాతం డిస్కౌంట్‌తో లభిస్తుంది. అలాగే, దుకాణదారులకు ఫ్యూచర్ పే ద్వారా లభించే వారి సెంట్రల్ వ్యాలెట్‌లో రూ.3000 కనీస కొనుగోలుతో 50 శాతం క్యాష్ బ్యాక్ పొందే అవకాశం ఉంటుంది.

ఈ రెడ్ హుట్ శనివారం అదనపు ప్రయోజనాలు పొందడానికి, వినియోగదారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సెంట్రల్ అండ్‌మీ.కామ్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఇన్‌సైడర్.ఇన్‌లో రెడ్ హుట్ ఎంట్రీ పాస్ నమోదు చేసుకోవచ్చు. లేదా 080-46224242కు మిస్ కాల్ ద్వారా చేయవచ్చు. యాక్సిస్ బ్యాంక్ వినియోగదారులకు 10 శాతం డిస్కౌంట్ కూడా లభిస్తుంది.

కోటి దాటిన పీఎంఆర్‌పీవై లబ్ధిదారులు

న్యూఢిల్లీ : ప్రధాన్ మంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహ యోజన (పీఎంఆర్‌పీవై) కింద లబ్ధి పొందుతున్న ఉద్యోగుల సంఖ్య 1 కోటి మార్కును దాటిందని గురువారం ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ప్రోత్సాహక ఉద్యోగులకు కొత్త ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ పథకం లక్ష్యం. ఈ పథకంలో భాగంగా ఈపీఎఫ్, ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం ద్వారా 12 శాతం కాంట్రిబ్యూషన్ అందజేయడం జరుగుతోంది. 2016, ఏప్రిల్ 1 తరువాత ఉద్యోగుల నెల వేతనం రూ.15000 ఉండి, ఈపీఎఫ్ఓలో పేరు నమోదు చేసుకుని ఉంటే ఈ పథకానికి అర్హత సాధిస్తారు. జనవరి 14, 2019 నాటికి ప్రభుత్వం అనుకున్న లక్ష్యానికి చేరుకుందని, ఉపాధి కల్పనలో భాగంగా ఈ పథకాన్ని తీసుకురావడం జరిగిందని సంబంధిత కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 2016, ఆగస్టు 7న పీఎంఆర్‌పీవై పథకాన్ని ఉపాధి, కార్మిక మంత్రిత్వ శాఖ తీసుకొచ్చింది. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ద్వారా దీన్ని కేంద్ర ప్రభుత్వం పరిచయం చేసింది.

ఇక 'ఓలా మనీ పోస్ట్‌పెయిడ్'

బెంగళూరు : క్యాబ్ సర్వీసుల్లో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్న ఓలా ఓ కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. డిజిటల్ క్రెడిట్ పేమెంట్‌లో భాగంగా ఓలా మనీ పోస్ట్ పెయిడ్‌ను పరిచయం చేస్తున్నది. గతేడాదే పైలట్ ప్రాజెక్టుగా దీన్ని తీసుకొచ్చారు. ప్రతీ నెలా ఎంతో మంచి ఆదరణ లభించడంతో పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి తీసుకురానుంది. దేశ వ్యాప్తంగా డిజిటల్ ఎకనామీని వృద్ధి పర్చడానికి ఓలా మనీ పోస్ట్ పెయిడ్‌ను పరిచయం చేస్తున్నట్టు ఓలా ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నితిన్ గుప్తా తెలిపారు. ఎలాంటి ఓటీపీ, పాస్‌వర్డ్ లేకుండా ఒక్క క్లిక్‌తో డబ్బులు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. లక్షలాది మంది ఓలా సేవలు వినియోగించుకుంటున్నారని, ప్రపంచంలో మొదటి సారిగా ఈ విధానం తీసుకొస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఓలా సేవలు అందిస్తోందని, క్యాష్ లెస్ ఎకానమీ కోసం తనవంతు కృషి చేస్తోందన్నారు.

సుస్థిర వ్యవసాయం కోసం
మోడీ కృషి

- చిత్తశుద్ధితో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- 2020 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు
- ప్రధాని మోడీ లక్ష్యం అదే
- అగ్రివిజన్ సదస్సులో ఉపరాష్ట్రపతి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: దేశంలో సుస్థిర వ్యవసాయం దిశగా ప్రణాళికల అమలుకు కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం కృషి చేస్తోందని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. గురువారం హైదరాబాద్‌లో అగ్రివిజన్-2019 అంతర్జాతీయ సదస్సును ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వెంకయ్య నాయుడు మాట్లాడుతూ దేశంలో 2020 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని ప్రధాని లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగం ఎంతో కీలకమని, అధికశాతం ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దీనిపై ఆధారపడి ఉన్నారని అన్నారు. వ్యవసాయరంగం అభివృద్ధికి అవసరమైన అనుకూల పరిస్థితులు కల్పించడం వల్ల పేదరికాన్ని తగ్గించడమే కాకుండా ఈ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మంది జీవన ప్రమాణాలు మెరుగు పరచవచ్చని అన్నారు. దేశ జీడీపీలో 40శాతం ఉన్న వ్యవసాయం రంగం వాటా ఇప్పుడు 18శాతానికి తగ్గిపోయిందని, అయినప్పటికీ 50శాతం జనాభాకు ఉపాధి కల్పిస్తోందన్నారు. 2017-18లో 248.83 మిలియన్ టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగిందని అన్నారు.


అభివృద్ధి సాధిస్తున్నాం

ప్రభుత్వాలు ఏవైనా గత దశాబ్ద కాలంగా అధిక ఉత్పత్తులనిచ్చే వంగడాలను విడుదల చేయటం, అదనపు సాగునీటి అవకాశాలు పెంచటం, వ్యవసాయ యాంత్రీకరణ , రుణలభ్యత పెంపు , మద్దతు ధరల కల్పన, మౌలిక వసతుల పెంపుదల వల్ల హరితవిప్లవం పరిఢవిల్లుతోందన్నారు. వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతలు గణనీయంగా పెరిగాయన్నారు. గ్రామీణాభి వృద్ధి జరిగి ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగు పడ్డాయన్నారు.

దేశం నేడు ఆహారోత్పత్తుల్లో స్వయం సమృద్ధిని సాధించటమే కాక ఎగుమతుల్లో ప్రపంచంలోనే ఏడవ స్థానం సాధించిందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో దేశం ఇంకా ముందుకెళ్లాలని, ఆహారోత్పత్తుల వృధాను అరికట్టాలన్న ఆయన దేశంలో సేంద్రీయ వ్యవసాయం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాల ద్వారా వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక మార్పులు తీసుకురావా లన్నారు. డాక్టర్లు , లాయర్లు, వ్యాపారులు , ఉద్యోగులు తమ పిల్లలను తమ తమ రంగాల్లోనే నిలుపుకుంటున్నారని, రైతులు మాత్రం తమ పిల్లలను వ్యవసాయానికి దూరం పెడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు.

వ్యవసాయం గిట్టుబాటు కాకపోవటమే ఇందుకు కారణం అన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. వ్యవసాయ పరిశోధనల్లో పెట్టుబడులు పెరగాలి , డిజిటల్ టెక్నాలజి వినియోగం మంరిత అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమయంలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డా.వి.ప్రవీణ్ రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో పలు సంస్కరణల ద్వారా దేశంలోనే రెండవ స్థానంలో నిలిపామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పంట కాలనీల ఆలోచనకు అనుగుణంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పనిచేస్తోందన్నారు. పంటల సరళిలో మార్పులు తెస్తున్నామని, వ్యవసాయ విద్యకు ప్రాధాన్యత పెరుగుతూ వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్నెల్ వర్శిటి బోర్డు మెంబర్ జి.గిరీష్ రెడ్డి, సీఐఐ ఛైర్మన్ సంజయ్ సింగ్ తదితరులు తమ ప్రసంగాల్లో వ్యవసాయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు , అధికారులు , విద్యార్థులు పాల్గొన్నారు.

మోహన్ కందా పుస్తకానికి వెంకయ్య ప్రశంసలు



మాజీ ఐఎఎస్ అధికారి మోహన్ కందా రచించిన ఎథిక్స్ ఇన్ గవర్నెన్స్ - రిజుల్యూషన్ ఆఫ్ డైలమాస్ పుస్తకంలోని ప్రతి అక్షరం వాస్తవమని ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ప్రశంసించారు. సివిల్ సర్వీసుల్లోకి వచ్చే యువతకు ఈ పుస్తకం దిశానిర్దేశం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని ఆయన అన్నారు. గురువారం హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఉపరాష్ట్రపతికి మోహన్‌కందా తన పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. ఈ మధ్యే పుస్తకాన్ని పరిశీలించానని, పరిపాలనలో ధర్మ పరిపాలన వంటి అంశాలు అర్థవంతంగా ఉన్నాయని అన్నారు. పరిపాలనలో నీతి, రీతి ఉండాలన్నారు. తెలుగు ప్రజలకు సుపరిచితుడైన మోహన్ కందా సివిల్ సర్వీసుల్లో గర్వించదగిన మంచి అధికారి అని, ఆయన అనుభవాలను పుస్తకంలో క్రోడికరించారని అన్నారు.

సంస్కరణలు అవసరం

- ఆలోచనల్లో మార్పులు రావాలి
- ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలో సంస్కరణలు అవసరమని భారత ఉపరాష్ట్రపతి ఎంకయ్యనాయుడు అన్నారు. గురువారం ఎంసిహెచ్ఆర్‌డీలో కేరళ సెంట్రల్ యూనివర్శిటి చాన్సలర్ ప్రొ.ఎస్ వెంకట శేషగిరిరావు రాసిన పుస్కకావిష్కరణ సభలో వెంకయ్య ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత దేశం ఇతర దేశాలతో ఎన్నడూ యుద్దాలు కోరుకోదు. అదే సమయంలో ఆత్మరక్షణ చర్యల్లో ఎంతో బలంగా ఉంటుంది. తీర భద్రత కూడా ఎంతో ముఖ్యం. ప్రతి భారతీయుడు దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంపై ఆలోచించాలి. ప్రొ.శేషగిరిరావు రాసిన పుస్తకం దేశ భద్రత అంశంలో ఎంతో కీలకమైనది. సార్వభౌమాధికారాన్ని నిలబెట్టే విధంగా ఎన్నో సూచనలు చేశారన్నారు. సమయానుకూలంగా ఈ పుస్తకాన్ని రచించి సకాలంలో అందించారు. దేశానికి సమాజానికి ఆయన సేవలు ప్రశంసనీయం. అనుభవాలు, సమగ్ర అధ్యయనాలతో కూడిన రచనలు సమాజానికి మార్గదర్శనం చేసాయి. నేనిప్పుడు రాజకీయాల్లో రిటైర్ అయ్యాను. కానీ ప్రజాజీవితంలో మాత్రం ఇంకా టైర్డ్ కాలేదు. రాజ్యాంగ పదవిలోకి వచ్చాక కొంత స్వేచ్ఛ తగ్గింది. ఉపరాష్ట్రపతిగా నేను ఐదు అంశాలను ఎంచుకున్నాను. విశ్వవిద్యాలయాల ప్రాధాన్యత, పరిశోధనా సంస్థల ప్రాముఖ్యత , వ్యవసాయ సమస్యలు సవాళ్లు పరిష్కారాలు, కళలు కళావేదికల్లో పాల్గొనటం, సంఘ సేవకులను ప్రోత్సహించే కార్యక్రమాల్లోనే అధికంగా పాల్గొంటున్నాను. దేశం గురించి ఆలోచించే వారికి శేషగిరి రావు రచనలు ఎంతో ఉపయోగకరం. అండమాన్ దీవులు మన దేశానికి పెద్ద ఆస్తి. దేశ ప్రజల ఆలోచనా తీరు మారాలని, బలహీనతలు అధిగమించా లని వెంకయ్య నాయుడు సూచించారు.

కార్పొరేట్ బాదుడును అడ్డుకోవాలి

- ఒకే చికిత్సకు ఒకే చార్జి
- వీనస్ అసోసియేషన్ సదస్సులో గవర్నర్ నరసింహన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కార్పొరేట్ వైద్యానికి ఆసుపత్రికి ఒక రకమైన ఛార్జీలు వసూలు చేయ డాన్ని నివారించాలని రాష్ట్ర గవర్నర్ నరసింహన్ సూచించారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఒకే చికిత్సకు వివిధ రకాల ఛార్జీలు వసూలు చేస్తున్నారని, ఈ పద్ధతిని మానుకోవాలని ఆయన చెప్పారు. అన్ని కార్పొరేట్ యాజమాన్యాలపై దీనిపై ఒక నిర్ణయం తీసుకునేందుకు ఉన్నత స్థాయిలో ఒక సదస్సు నిర్వహించుకుని ప్రజలకు అందుబాటులో ఉండే ఛార్జీలు నిర్ణయించాలని ఆయన చెప్పారు. వీనస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 12వ వార్షిక సదస్సుకు గవర్నర్ గురువారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, వైద్య చికిత్స మధ్య తరగతి వర్గాల వారిపై పెను ఆర్థికభారం మోపుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో పరిశీలిస్తే కార్పొరేట్ వైద్యం అందించే నిమ్స్ లో మాత్రమే ఛార్జీలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని, కార్పొరేట్ ఆసుపత్రులు దీన్ని పరిశీలించాలని ఆయన సూచించారు. ఎలాంటి అనారోగ్యంతో వెళ్ళినా కార్పొరేట్ ఆసుపత్రులు అనేక రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, ఇది సామాన్యులపై ఆర్థికభారం మోపుతుందన్నారు. అనేక వ్యాధులు ఇంటి వైద్యంతోనే నయమవుతాయని, దీనిపై రోగులకు అవగాహన కల్పించాలని ఆయన డాక్టర్లను కోరారు. అనారోగ్యంతో ఆందోళనగా వచ్చిన రోగులకు వెంటిలేటర్ చికిత్స ఒక్కటే మార్గం కాదని, రోగ నిర్ధారణ తర్వాతే అలాంటి ప్రక్రియ చేపట్టాలని ఆయన చెప్పారు. ప్రాణాలు కాపాడడంలో డాక్టర్ల సేవ ప్రశంసనీయమని, అయితే ఆసుపత్రులు అందించే చికిత్సలో ప్రజలపై పడే ఆర్థిక భారాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలని గవర్నర్ చెప్పారు. ఈ సదస్సులో అపోలో హాస్పిటల్స్ జేఎండీ సంగీతారెడ్డి, సర్జన్స్ ఆఫ్ ఇండియా అసోసియేషన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.రఘురామ్ కూడా పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ ఛైర్మన్ ప్రొఫెసర్ పింజల రామకృష్ణ స్వాగతం పలుకుగా, కార్యదర్శి డాక్టర్ నిహార్ రంజన్ ప్రధాన్ వందన సమర్పణ చేశారు. ఈ సదస్సు ఈనెల 17 నుంచి 20వ తేదీవరకు నిర్వహించనున్నారు.

నమో యువ

- యువత ఆకాంక్షల సాధనకు బీజేపీ కట్టుబడి వుంది
- వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి: ప్రధాని మోడీ
- లోక్‌సభ ప్రచార కార్యక్రమానికి బీజేవైఎం శ్రీకారం



న్యూఢిల్లీ: దేశంలోని ప్రతిభావంతులైన యువకుల స్వప్నాలను సాకారం చేయాలన్న లక్ష్యానికి భారతీయ జనతాపార్టీ పూర్తిగా కట్టుబడివుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పునరుద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ గెలుపు నినాదంతో కాషాయపార్టీ యువజన విభాగం (బీజేవైఎం) చేపట్టిన ప్రచార కార్యక్రమం నేపథ్యంలో మోడీ ట్వీట్‌చేశారు. ఉత్తేజితమైన, శక్తివంతమైన బీజేవైఎం బృందం సంకల్పించిన విజయ్ లక్ష్-2019 ఉద్యమం దేశవ్యాప్తంగా యువతను చైతన్యం చేస్తుందని నేను విశ్వసిస్తు న్నాను. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఘన విజయం సాధించే దిశగా బీజేవైఎం కృషిచేస్తుంది. మనదేశంలోని యువ ప్రతిభావంతుల ఆకాంక్షలను నేరవేర్చేందుకు మా పార్టీ కట్టుబడి వుంది. నమో యువ అంటూ మోడీ ట్వీట్‌చేశారు. బీజేవైఎం చీఫ్ పూనం మహాజన్ యూత్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువతరాన్ని లక్ష్యంగా చేసుకుని మొత్తంగా 17 రకాల కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సంకల్పించారు. లక్ష్య హమారా.. మోడీ దుబారా (మళ్లీ మోడీ.. మన లక్ష్యం..) అనే నినాదంతో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. విజయ్ లక్ష్య - 2019 పేరుతో బీజేవైఎం భారీ ఎత్తున దేశవ్యాప్తంగా ప్రచార ఉద్యమానికి సిద్ధమైంది.

రేపు గోవా కార్యకర్తలతో చర్చ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం గోవా బీజేపీ శ్రేణులతో నేరుగా మాట్లాడనున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బూత్‌స్థాయి కేడర్‌తో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించున్నారు. దక్షిణ గోవాలోని మార్గోవా పాఠశాల మైదానంలో జరిగే ఈ కార్యక్రమానికి దాదాపు నాలుగు వేల మంది హాజరవుతారని భాజపా ఎంపీ నరేంద్ర సవైకార్ మీడియాకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఉత్తర, దక్షిణ గోవా పార్లమెంట్ నియోజకవర్గాలను బీజేపీ గెలిచి తీరుతుందని సవైకార్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ భాజపా అధికారంలో పెద్దఎత్తున అభివృద్ధి జరిగిందని అన్నారు. కేంద్రం సహకారంతో వంతెనల నిర్మాణం చేపట్టామని, భాజపా పాలనలో రాష్ట్రంలో మౌలిక అభివృద్ధి వేగవంతమైందని సవైకార్ చెప్పారు.

హైదరాబాద్ ఐఐటీలో కృత్రిమ మేథ కోర్సు

- 20 సీట్లతో కోర్సు ప్రారంభం
- ఏఐ కోర్సు అందిస్తున్న తొలి భారతీయ విద్యాసంస్థ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఐఐటీ హైదరాబాద్‌లో నూతన సాంకేతిక కోర్సు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)ను బీటెక్‌లో ప్రారంభించనుంది. ఈ కోర్సును వచ్చే విద్యాసంవత్సరం 2019-20 నుంచేప్రారంభిస్తున్నట్లు ఐఐటీ హైదరాబాద్ డైరక్టర్ యూబీ దేశాయ్ తెలిపారు. కోర్సులో 20 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏఐలో పూర్తిస్థాయి బీటెక్ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తున్న తొలి భారతీయ విద్యా సంస్థ ఐఐటీ హైదరాబాదేనని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ కోర్సును ఐఐటీ హైదరాబాద్ కాకుండా అమెరికాలోని రెండు విద్యాసంస్థలు మాత్రమే అందిస్తున్నాయని తెలిపారు. కర్నెగీ మెలన్ యూనివర్సిటీతోపాటు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) రెండు విద్యా సంస్థల్లో ఇప్పటికే ఏఐ కోర్సును కొనసాగిస్తున్నారు. కోర్సులో భాగంగా విద్యార్థులకు ఆర్టిఫిషియల్, మెషిన్ లెర్నింగ్‌లో మూల సిద్ధాంతం, ప్రాథమిక అంశాలు, ప్రాక్టికల్స్‌పై అత్యున్నత శిక్షణ అందిస్తారు. పెరుగుతున్న డిమాండ్‌లకు అనుగుణంగా విద్యార్థులను దేశీయ, అంతర్జాతీయ పరిశ్రమల్లో రాటుదేలేలా తీర్చిదిద్దుతారు. పరిశోధనకు అనువైన వాతావరణం ఏర్పాటు చేయడమే ముఖ్య ఉద్దేశంగా కోర్సును ప్రవేశ పెడుతున్నట్టు దేశాయ్ తెలిపారు. ఏఐలో బీటెక్, ఎంటెక్ సహా పలు ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. విద్యాపరమైన అంశాలతోపాటు పరిశోధన, అభివృద్ధికీ మెరుగైన ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు.

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి


హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని బీసీ టీచర్స్ అసోసియేషన్(బీసీటీఏ) డిమాండ్ చేసింది. ప్రమోషన్లలో బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్లు అమలు చేయాలని గురువారం జరిగిన బీసీటీ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె కృష్ణుడు అధ్యక్షతన రాష్ట్రకార్యవర్గ సమావేశం బీసీ భవన్‌లో జరిగింది. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, వి రమేష్, ఏ యాదగిరి, గురుప్రసాద్ గౌడ్, రాఘవేందర్, సుభాష్, నీలం వేణు తదితరులు పాల్గొన్నారు. చైతన్యవంతమైన బీసీ టీచర్లు బీసీ ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన 27 శాతం నుంచి 52 శాతానికి పెంచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులపై గల క్రిమీలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని,ఆదాయపు పన్ను పరిమితిని 2.5 లక్షల నుంచి 8 లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 60వేల ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని.. యాజమాన్యాల వారీగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఘన్‌పూర్ ఎంపీడీవో సస్పెన్షన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పంచాయతీ ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించకపోవడంతో వనపర్తి జిల్లా ఘన్‌పూర్ మండల ఎంపీడీవోపై సస్పెన్షన్ వేటు వేశారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఘన్‌పూర్ ఎంపీడీవో ఎం ఫయాజుద్దీన్ సక్రమంగా ఎన్నికల విధులను నిర్వర్తించకపోవడంతో ఆయనను ఎన్నికల విధులనుంచి తొలగించి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్తానంలో డీఆర్‌డీఏ ఏపీవో కృష్ణయ్యకు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజా రవాణా వ్యవస్థతో ఇంధనం ఆదా

- వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గాలి
- ఇంధన సంరక్షణ క్షమత మహోత్సవంలో అకున్ సబర్వాల్
- నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- 20న ఉస్మానియా యూనివర్సిటీలో సైకిల్ డే



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వం నిర్వహిస్తున్న రవాణా సౌకర్యాలను ప్రజలు వినియోగించుకోవడం ద్వారా పెట్రోల్, డీజిల్ వంటి ఇంధన వినియోగాన్ని తగ్గించవచ్చని, పెట్రోల్‌ను ఆదా చేయాలంటే అందుకు ప్రత్యామ్నాయ సౌకర్యాలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కమిషనర్ అకున్ సబర్వాల్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో వంటి అధునాతన సౌకర్యాలను విస్తృతంగా వినియోగించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో పెట్రోలియం కన్జర్వేషన్ రీసెర్చ్ అసోసియేషన్(పీసీఆర్ఏ) ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలు ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, గెయిల్‌లతో కలిసి రాష్ట్రస్థాయిలో ఇంధనం సంరక్షణ క్షమత మహోత్సవం-2019 పేరిట అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. జ్యోతి ప్రజల్వన కార్యక్రమం అనంతరం ఆయన సభికులనుద్దేశించి ప్రసంగించారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను వాడుకోవాలని, ఎలక్ట్రానిక్ బస్సులను వినియోగించుకోవడం ద్వారా పెట్రోల్ ఆదాతో పాటు ఇతరత్రా సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

చైతన్యం కోసం కార్యక్రమాలు

ఈ క్రమంలో పీసీఆర్ఏ.. ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలతో కలిసి పలు కార్యక్రమాలను చేపట్టనుంది. వీటిలో వివిధ శిక్షణ కార్యక్రమాలు, గ్రూప్ టాక్స్, క్విజ్ డిబేట్స్, టెక్నికల్ వర్క్‌షాపులు, కన్సర్ట్స్, టాలెంట్ షోలు, 20వ తేదీన సైకిల్ ర్యాలీ 200 పట్టణాల్లో(పాన్-ఇండియా), ఫిబ్రవరి 3న ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో వాక్‌థాన్‌ల నిర్వహణ ద్వారా ఫ్యూయల్ ఎఫిషియంట్ కుకింగ్ కాంటెస్ట్స్, ఫ్యూయల్ ఎఫిషియంట్ డ్రైవింగ్ కాంటెస్ట్స్ నిర్వహణ, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్, టెలివిజన్, రేడియో, ప్రింట్ మీడియా పబ్లికేషన్ తదితరాల ద్వారా ఇంధనం ఆదా అంశంపై అవగాహనను పెంపొందించనున్నారు. రాష్ట్రంలో నెలరోజుల పాటు ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వర్తించనున్నారు. ఇదే సందర్భంలో 20వ తేదీన సైకిల్ డేను ఉదయం 8-30 నుంచి 10-30 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తారు. ఇంధనం ఆదా అంశానికి సంబంధించి విద్యార్థులలో ఎంతమేర అవగాహన ఉందన్నదానిపై రవీంద్రభారతిలో కేంద్రీయ విద్యాలయాలకు చెందిన పది స్కూల్స్ నుంచి తరలి వచ్చిన దాదాపు 500 మంది విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్, క్విజ్ పోటీలను నిర్వహించారు. ట్రాన్స్‌పోర్ట్, ఇండస్ట్రియల్ సెక్టార్‌లలో ఇంధనం ఆదా అంశానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వాహనాల వినియోగం, ఇండస్ట్రియల్ సెక్టార్, ట్రాక్టర్లలో డీజిల్ ఆదా చేసేందుకు ఉపయోగమైన చిట్కాలు, లిఫ్ట్ ఇరిగేషన్ పంపులలో డీజిల్ ఆదా చేసేందుకు అనేక మార్గాలను ఈ సందర్భంగా చెప్పారు. అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఏ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జె.పాండురంగ నాయక్, డిప్యూటీ జనరల్ మేనేజర్, రీటైల్, హెచ్ఎల్‌సీ, హెచ్‌పీసీఎల్, సికింద్రాబాద్ టి.రాజేష్, ఎస్‌సీజెడ్, హెచ్‌పీసీఎల్, హైదరాబాద్ జనరల్ మేనేజర్ నరసింహాసీకే, గెయిల్ హైదరాబాద్ జోనల్ ఆఫీస్ జోనల్ జనరల్ మేనేజర్ సంజయ్ షిండే, టీపీఎస్, ఐఓసీఎల్ హైదరాబాద్ ఈడీ రాహుల్ భరద్వాజ్, తెలంగాణ, ఏపీ బీపీసీఎల్(ఎల్‌పీజీ) స్టేట్ హెడ్ ఎస్.ధనపాల్, పీసీఆర్ఏ డిప్యూటీ డైరెక్టర్ బి.రాజేష్ నాయక్ ప్రభృతులు పాల్గొని ప్రసంగించారు.

'అఖిలేష్.. మాయావతిని నమ్మకు'

లక్నో: బహుజన సమాజ్ పార్టీ అధినేత మాయావతిని నమ్మొద్దని, ఆమెతో చాలా జాగ్రత్తగా ఉండాలని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌ను ఆయన బాబాయి శివపాల్ యాదవ్ హెచ్చరించారు. మాయావతి తన మీద, మరి కొందరు నాయకుల మీద చేసిన ఆరోపణల గురించి ప్రస్తావిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛందోలీలో శివపాల్ ఒక సభలో మాట్లాడుతూ మాయావతి తనపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. ఆమె ఆరోపణలు చేసినప్పుడు ఏ విచారణకైనా తాను సిద్ధంగా ఉన్నానని చెప్పానని, నార్కో పరీక్షకు కూడా సిద్ధమయ్యానని అన్నారు. మాయావతి కూడా నార్కో టెస్టుకు సిద్ధం కావాలని తాను డిమాండ్ చేయగా తిరస్కరించారని చెప్పారు. గతంలో ములాయం సింగ్‌ను దుర్భాషలాడిందని, అలాంటి వ్యక్తిని ఎలా నమ్ముతావని అఖిలేశును శివపాల్ ప్రశ్నించారు.

విద్యాలయాల్లో కాషాయ మతోన్మాదులు

రోహిత్ వేముల వర్ధంతి సభలో స్కైలాబ్ బాబు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉన్నత విద్యాలయాల్లో కాషాయ మతోన్మాదులు విషపురుగులుగా మారి భావ ప్రకటనా స్వేచ్ఛను హరించి వేస్తున్నారని కులవివక్షవ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ ఆందోళన వ్యక్తం చేశారు. రోహిత్ వేముల 3వ వర్ధంతి సభను కేవీపీఎస్ గురువారం నిర్వహించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కడిగల్ల భాస్కర్ అధ్యక్షతన వర్ధంతి సభ జరిగింది. సభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం ధర్మానాయక్, నాయకులు శ్రీనివాస్ బహదూర్, ఎంవి రమణ, మహేందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. మతసామరస్య, ప్రగతిశీల భావాలను అభివృద్ధి చేయడం మతోన్మాదులను ప్రతిఘటించడం ద్వారానే సాధ్యం అవుతుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, మైనారిటీలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. భావి మేధావులు, జర్నలిస్టులు, ప్రశ్నించే గొంతుకలను బీజేపీ ప్రభుత్వం మట్టుబెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అమెరికా అగ్ని ప్రమాదం

నేడు హైదరాబాద్‌కు ముగ్గురి మృతదేహాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అగ్రరాజ్యం అమెరికాలో సజీవదహనమైన తెలంగాణకు చెందిన టీనేజర్ల మృతదేహాలు నేడు భారత్‌కు చేరుకోనున్నాయి. అమెరికాలోని కొలిరివిలీలో క్రిస్మస్ పర్వదినం రోజున సంభవించిన అగ్ని ప్రమాదంలో తెలంగాణకు చెందిన సాత్వికా నాయక్, సుహాస్ నాయక్, జయ్‌లు సజీవదహనమైన సంగతి తెలిసిందే. ఘటన జరిగిన 25 రోజుల తరువాత డెడ్ బాడీలను స్వదేశానికి తీసుకువస్తున్నారు. ప్రత్యేక విమానంలో శంషాబాద్ తీసుకువచ్చి అక్కడ్నించీ నారాయణగూడలోని చర్చికి తరలించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం స్వగ్రామమైన నల్గొండ జిల్లా గుర్రపుతండాకు తరలిస్తారు. శనివారం రోజున మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. స్వదేశానికి తరలించడంలో అడుగడుగునా ఆటంకాలు ఎదురుకావడంతో దాదాపు 25 రోజుల తరువాత మృతదేహాలను భారత్‌కు తీసుకువస్తున్నారు. అమెరికాలోని కొలిరవిలీలో క్రిస్మస్ రోజున ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సాత్వికా నాయక్, సుహాస్ నాయక్, జయ్‌లు చనిపోయారు. వీరు ముగ్గురు తోబుట్టువులు కాగా వీరి వయసు 14 నుంచి 17 ఏళ్ల లోపే. వీరి ముగ్గురితో పాటు అమెరికన్ మహిళ కారీ క్రూడిట్ అనే 46 ఏళ్ల మహిళ కూడా మృతి చెందింది. మృతులు ఏడాది క్రితం స్కాలర్‌షిప్‌తో చదువుకునేందుకు అమెరికా వెళ్లారు. తల్లిదండ్రులు క్రిస్మస్ వేడుకలకు భారత్ వచ్చారు. దీంతో సాత్విక్, సుహాస్, జయ్ ముగ్గురూ కొలిర్‌విలీలోని చర్చిల ప్రార్థనలు చేశారు. ఆ తరువాత తమ కుటుంబ స్నేహితులైన క్యారిక్రూడిట్ ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఉన్నట్టుండి మంటలు చెలరేగడంతో విద్యార్థులతో పాటు క్యారి క్రూడిట్ కూడా చనిపోయింది. ఈ ప్రమాదంలో క్యారి క్రూడిట్ భర్త, కొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. అగ్ని ప్రమాదానికి క్యారిక్రూడిట్ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఫర్నిచర్‌తో పాటు లోపల వస్తువులన్నీ కాలిబూడదయ్యాయి.

నకిలీ ఆర్డర్ కాపీలతో రూ. 80 లక్షలు టోకరా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ ఎల్ అండ్ టీ మెట్రో రైలులో ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువతకు కుచ్చుటోపి పెట్టిన కేసులో ఇద్దరు నిందితులు అంబర్‌పేటకు చెందిన వెలగపూడి రామకృష్ణ, యర్రమంజిల్ కాలనీకి చెందిన చిల్లా మహాలక్ష్మిలను యుప్పల్ పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు గడ్డం శ్రీధర్‌రెడ్డి, బండారు లక్ష్మణ్‌రావులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నెల్లూరుకు చెందిన రామకృష్ణ చాలా కాలం కిందట హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డాడు. పలుచోట్ల పీఆర్‌వో పనిచేశాడు. ఉద్యోగాలపేరుతో యువతను మోసం చేసినందుకు రెండు రాష్ట్రాల్లో 15 కేసులు నమోదై ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. 2017 నుంచి రామకృష్ణ ,మహాలక్ష్మిలు కలిసి జీవిస్తున్నారు. రామకృష్ణ.. హైకోర్టు అడ్వకేట్‌గా ఉన్న జి.శ్రీధర్‌రెడ్డి, మంచిర్యాలలో మిషన్ భగీరథ డీఈగా పనిచేస్తున్న బావమరిది బి.లక్ష్మణ్‌రావులను కలిశాడు. ఈ నలుగురు కలిసి మెట్రో రైలు ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువత నుంచి 80 లక్షలను వసూలు చేసి, ఆ సొమ్ముతో జల్సా చేశారు. నిరుద్యోగులకు నకిలీ ఆర్డర్ కాపీలను నకిలీ వెబ్‌సైట్ ద్వారా పంపారు. చివరకు మెట్రో రైలు అధికారుల వద్దకు వెళ్లడంతో అసలు విషయం బోధపడింది. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఉప్పల్‌లో సైతం ఫిర్యాదు అందింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరు ప్రధాన నిందితులు రామకృష్ణ, మహాలక్ష్మీలను అరెస్టు చేశారు. వారి నుంచి మారుతీ కారు, రెండు సెల్‌ఫోన్‌లు, 161 మంది అభ్యర్థులు నకిలీ ఆర్డర్ కాపీలు(జిరాక్స్), రూ.70 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఎన్ఐఏకు సిట్ ఝలక్!

అమరావతి, ఆంధ్రప్రభ : ఏపీ ప్రతిపక్ష నేత, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసులో గురువారం కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలను ఎన్ఐఏకు సమర్పించేందుకు ఏపీ సిట్ నిరాకరించింది. సిట్ పోలీసుల తీరుపై ఎన్ఐఏ కోర్టులో ఎన్ఐఏ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిమీద గురువారం విజయవాడలోని ఎన్ఐఏ స్పెషల్ కోర్టులో వాదనలు జరిగాయి. ఈ కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ దాఖలు చేసి విచారణ చేపట్టినప్పటికీ కేసు రికార్డులు అందజేసేందుకు సిట్ నిరాకరించడాన్ని ఎన్ఐఏ తీవ్రంగా తప్పుబట్టింది. సిట్ తీరుపై తాము న్యాయపరమైన పోరాటం చేస్తామని చెబుతున్నారు. ఈ కేసుకు సంబంధించి ఈనెల 9న రికార్డులు అప్పగించమని కోర్టు ఉత్తర్వులు జారీచేసినప్పటికీ ఇప్పటివరకూ రికార్డులు అందించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి ఈనెల 23కు 90 రోజులు పూర్తవుతుందని, ఈలోగా చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉందని ఎన్ఐఏ కోర్టుకు తెలిపింది. కోర్టు ఉత్తర్వులిచ్చినా రికార్డులు అప్పగించకుండా కోర్టు ఉల్లంఘనకు పాల్పడ్డట్టు ఎన్ఐఏ తరపు న్యాయవాది వాదించారు. వాదనలు విన్న కోర్టు ఈ కేసు విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

ముగిసిన విచారణ

ఇదిలా ఉండగా జగన్‌పై జరిగిన కోడికత్తి కేసులో నిందితుడు శ్రీనివాసరావుపై ఎన్ఐఏ విచారణ ముగిసింది. వారం రోజులపాటు కస్టడీలోకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు దాడికి సంబంధించి అన్ని కోణాల్లో విచారణ జరిపారు. విచారణ పూర్తవ్వడంతో తుది వాంగ్మూలాన్ని అధికారులు గురువారం నమోదు చేశారు. అనంతరం నిందితుడు శ్రీనివాసరావును విజయవాడ తరలించి శుక్రవారం ఎన్ఐఏ కోర్టులో హాజరుపర్చే అవకాశం ఉంది.

మరోవైపు అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్య కేసులో ఐదుగురు నిందితులను అధికారులు ఎన్ఐఏ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు.

ద్వివేది చేతికి ఎన్నికల పగ్గాలు



అమరావతి, ఆంధ్రప్రభ : ఎన్నికలు సమీపిస్తున్నవేళ ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారిని బదిలీ చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న రామ్ ప్రకాశ్ సిసోడియాను బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో కొత్త ఎన్నికల అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ ద్వివేదిని నియమించింది. 1993 బ్యాచ్‌కు చెందిన ద్వివేది ప్రస్తుతం ఏపీ పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. గోపాలకృష్ణ ద్వివేదికి ఎలాంటి అదనపు బాధ్యతలు అప్పగించరాదని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. బోగస్ ఓట్ల అంశంలో అందిన ఫిర్యాదుల నేపథ్యంలోనే సిసోడియాపై బదిలీ వేటు పడినట్లు తెలుస్తోంది.

నిష్పక్షపాతంగా వ్యవహరిస్తాం

అందరి సహకారంతో ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని కొత్త ప్రధాన ఎన్నికల అధికారి గోపాలకృష్ణ ద్వివేది పేర్కొన్నారు. ఏపీ ప్రధాన ఎన్నికల అధికారిగా ద్వివేది నియమితులైన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఓటరు జాబితాలో అవకతవకలుంటే సరిచేస్తామన్నారు. తప్పులు చేసేవారిపై చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని హెచ్చరించారు. ఓటు విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఓటరు ఎప్పటికప్పుడు ఓటు ఉందో లేదో తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నప్పటికీ సమర్థవంతంగా నిర్వహిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రక్షణ కోరుతూ సుప్రీంలో ఇద్దరు మహిళల పిటిషన్

న్యూఢిల్లీ: శబరిమలైకి మహిళలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తరువాత, జనవరి ప్రారంభంలో అక్కడికి వెళ్లి సంచలనం సృష్టించిన ఇద్దరు మహిళలు తమకు రక్షణ కల్పించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. యాభై ఏళ్ళ వయసు లోపు ఉన్న కనకదుర్గ, బిందు అమ్మిణి అనే మహిళలు సుప్రీం తీర్పు తరువాత శబరిమలై వెళ్లిన సంగతి తెలిసిందే. వీరు అక్కడికి వెళ్లిన తరువాత సంప్రదాయవాదుల నుంచి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నారు. రెండు వారాలుగా కొచ్చి శివార్లలో గుర్తుతెలియని ప్రాంతంలో రాష్ట్రప్రభుత్వ రక్షణలో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం కనకదుర్గ ఇంటికి రాగా అత్తగారు ఆమెపై దాడి చేసింది. ఈ ఇద్దరు మహిళల ప్రాణాలకు, స్వేచ్ఛకు ముప్పు ఏర్పడిందని వీరి తరపు న్యాయవాది ఇందిరా జైసింగ్ సుప్రీం కోర్టుకు తెలియచేశారు. దాడిలో గాయపడిన మహిళా ఆస్పత్రిలో ఉందని, వీరికి నిరంతర రక్షణ కావాలని కోర్టుకు విన్నవించారు. వీరి పిటిషన్ పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరుపుతుంది.

దురంతలో ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో సాయుధ దుండగులు గురువారం జమ్ము-దురంతో రైలులో కత్తులతో బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. దురంతో ఎక్స్‌ప్రెస్ గురువారం తెల్లవారుజామున 3.30 సమయంలో ఢిల్లీ శివారులో బద్లీవద్ద సిగ్నల్ కోసం ఆగింది. ఆ సమయంలో దొంగలు ఏసీ బోగీల్లోకి ప్రవేశించి ప్రయాణికులను బెదిరించి వారివద్ద నుంచి పర్సులు, నగదు, క్యారీబ్యాగ్స్, ఫోన్లు, బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. ఏడు నుంచి పదిమంది దుండగులు ట్రైన్ నెంబర్ 12266లోని బీ3, బీ7 ఏసీ కోచ్‌ల్లోకి ప్రవేశించి దోపిడీ చేశారు.

జల్లికట్టులో.. మత ఘర్షణలు

చెన్నై: తమిళనాడులో చట్టవిరుద్ధంగా నిర్వహించిన జల్లికట్టు వేడుక రెండు కులాల మధ్య చిచ్చురేపింది. హింసాత్మక పరిణామాలకు దారితీసింది. తిరుచ్చి జిల్లా అథావరూర్‌లో వెనుకబడిన సామాజిక వర్గం నిర్వహించిన వేడుకలో పరుగులు తీస్తున్న ఎద్దును ఎస్సీ సామాజిక వర్గం వ్యక్తి పట్టుకోవడం వివాదాస్పదమైంది. ఎద్దును తాకుతావా అంటూ సదరు వ్యక్తి (గురు)ని ముత్తరైయార్ కులస్తులు చితకబాదారు. ఈ సంఘటన తర్వాత 40 మంది ఎస్సీ కమ్యూనిటీ కాలనీపైకి దాడికివెళ్లారు. వారి ఇళ్లను తగులబెట్టారు. అక్కడ కనిపించిన గురు స్నేహితులు ముగ్గురిపై దాడిచేశారు. తీవ్ర గాయాలవడంతో వీరిని ఆసుపత్రికి తరలించారు. ఆగ్రహించిన బాధిత ఎస్సీలు పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వాళ్లంతా రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. తిరుచ్చి - వలయూర్ జాతీయ రహదారిని స్తంభింపజేశారు. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. చివరకు పోలీసులు వచ్చి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇనియనూర్ గ్రామంలో 500 కుటుంబాలు ముత్తరైయార్ సామాజిక వర్గానివి కాగా, 45 కుటుంబాలు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవి ఉన్నాయి.

ఆ 50 కొడితే జనసేనదే జయం!

- తెదేపా, వైకాపా పార్టీల్లో అత్యంత అవినీతి పరులే టార్గెట్
- వారిని ఎండగట్టాలని నిర్ణయం
- జనంలో చైతన్యం పెరుగుతుంది
- ఓట్ల రూపంలోకి మారుతుంది
- ఆశించిన మార్పు సాధ్యమౌతుంది
- మేధావుల్తో ఇప్పటికే చర్చలు
- పవన్‌కల్యాణ్ సరికొత్త వ్యూహం



అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: ఎన్నికలకు పెద్దగా సమయం లేకపోవడంతో జనసేన వ్యూహాత్మకంగా అడుగులేస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మొత్తం 175 స్థానాల నుంచి పోటీ చేస్తామని ప్రకటించారు. వామపక్షాలు మినహా ఏ పార్టీలతోనూ పొత్తులుండవని తేల్చేశారు. ఐదు జిల్లాల్లో పవన్ ప్రజాపోరాట యాత్ర పూర్తయింది. మరికొన్ని జిల్లాల్లో ఆయన అడపాదడపా పర్యటనలు చేశారు. ఆయన ఎక్కడికెళ్ళినా వేలు, లక్షల సంఖ్యలో జనం వస్తున్నారు. ఆయన పర్యటనలు ఆ ఒక్క ప్రాంతానికే కాకుండా పరిసర ప్రాంతాలపై కూడా తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. అక్కడి ప్రజల్లో రాజకీయ చైతన్యం తెస్తున్నాయి. పవన్ ఆశించిన సామాజిక, రాజకీయ మార్పులకు అనుగుణంగా ప్రజల్ని ప్రేరేపిస్తున్నాయి.

రాజకీయాలు, ప్రభుత్వ పాలనలో సరికొత్త మార్పే లక్ష్యంగా పార్టీ ఏర్పాటు చేసిన పవన్ ఎన్నికల ప్రచారంలో కొ౦డా సరికొత్త వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు మేధావులతో ఆయన ఈ విషయంపై చర్చలు జరిపినట్లు వార్తలొస్తున్నాయి. రాజకీయాల్లో అవినీతిని పూర్తిగా ప్రక్షాళన చేయాలన్నది పవన్ ప్రధాన ఆకాంక్ష. ఇందుకోసం రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలకు చెందిన అత్యంత అవినీతిపరులైన 50మంది అభ్యర్థులు పోటీ చేసే నియోజకవర్గాల జాబితాను సిద్ధం చేయాలని ఆయన తన అనుచరుల్ని ఆదేశించినట్లు తెలిసింది. ఆయా నియోజకవర్గాల్లో పవన్ నేరుగా పర్యటించాలన్నది ప్రణాళికలో భాగం. అక్కడ పోటీ చేసే అవినీతి అభ్యర్థుల అసలు స్వరూప, స్వభావాల్ని బట్టబయలు చేసి ఇలాంటి దోపిడీదార్లను ఎన్నికల్లో ఓడించండంటూ పిలుపునివ్వడం ద్వారా తాను ఆశించిన రీతిలో స్వచ్ఛమైన అభ్యర్థుల్ని అసెంబ్లీకి పంపించుకునే వెసులుబాలు ఏర్పడుతుందన్నది ఆయన వ్యూహంలో భాగంగా తెలుస్తోంది. మొత్తం 175 నియోజక వర్గాల్లోనూ పవన్ నేరుగా పర్యటించాల్సిన పనిలేదు. ఈ 50 నియోజక వర్గాల్ని ఎంపిక చేసి అత్యంత అవినీతిపరులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే చాలు ఖచ్చితంగా జనసేనకు విజయావకాశాలు మెరుగౌతాయి. ప్రస్తుతం సమాజంలోని అన్ని వర్గాల్లోనూ రాజకీయాల పట్ల ఏహ్యాభావం పెరుగుతోంది. రాజకీయాల్లో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, దోపిడీలు పెరిగిపోయాయన్న ఆవేదన రగిలిపోతోంది. వీటన్నింటినీ ప్రక్షాళించాల్సిన బాధ్యతను ప్రజలు ఇప్పుడిప్పుడే గుర్తెరుగుతు న్నారు. అయితే ఇంతకాలం పిల్లి మెడలో గంటకట్టే వారెవరంటూ ఎదురుచూశా రు. ఇప్పుడు ఆ పనిని పవన్ చేపట్టారు. దీంతో ఎంతటి బలవంతుడైనా సరే అవినీతి అభ్యర్థిని ఎన్నికల్లో ఓటుహక్కు ద్వారా తిప్పికొట్టాలన్న ఆకాంక్ష ప్రజల్లో వ్యక్తమౌతోంది. తద్వారా నూతన రాజకీయ శకానికి నాందిపలకాలన్న ఆతృత కనిపిస్తోంది. ఈ ఎంపిక చేసిన 50 నియోజక వర్గాల్లో అవినీతిపరుల్ని పవన్ బహిరంగంగా ఎండగడితే ఇలాంటి ఆలోచనున్న ఓటర్లలో చైతన్యం మరింత పెరుగుతుంది. అది ఓట్ల రూపంలోకి మారుతుం దని పరిశీలకులు జరిపిన అధ్యయనాల్లో వెల్లడైంది. పవన్ ధవళేశ్వరం బ్యారేజ్‌పై కవాతు నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి పది లక్షల మందికిపైగా ఈ కార్యక్రమంలో భాగస్తులయ్యారు. అనంతపురంలో జరిపిన కవాతుకు రాయలసీమ నుంచి జనం వెల్లువె త్తారు. గుంటూరులో పర్యటిస్తే కృష్ణ గుంటూరు జిల్లాల నుంచి జనమొచ్చారు. శ్రీకాకుళం పర్యటనకు ఉత్తరాంధ్ర కదలొచ్చింది. పవన్ ఎక్కడ పర్యటన చేసినా ఆ ప్రభావం ఆ ప్రాంతానికే పరిమితం కావడం లేదు. పరిసర నియోజక వర్గాలు, జిల్లాల్లో కూడా పవన్ ప్రచారం సానుకూల ఫలితాల్నిస్తోంది. దీన్ని పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేసిన 50 నియోజక వర్గాల్లో వ్యూహా త్మకంగా ప్రచారం చేస్తే ఆ ప్రభావం మొత్తం 175 నియోజక వర్గాలపై కూడా ఉంటుం దన్నది ఈ వ్యూహాత్మక సారాంశంగా తెలుస్తోంది.

గతంతో పోలిస్తే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అత్యంత అవినీతిపరులుగా మారిపో యారు. అత్యధికులు బహిరంగంగానే దోపిడీకి పాల్ప డుతున్నారు. అధికారులపై దాడులు చేస్తున్నారు. అడ్డొచ్చిన వారిని భౌతికంగా కూడా మట్టుబెట్టేస్తు న్నారు. ఇసుక, మట్టి దోపిడీ విచ్చలవిడిగా సాగుతోం ది. అక్రమ పర్మిట్లతో రవాణా వ్యవస్థను గుప్పెటప ట్టారు. రొయ్యలు, చేపల సాగు కోసం అక్రమంగా చెరువుల నిర్మాణా లకు ముడుపులు పొంది అనుమతులిచ్చే స్తున్నారు. అక్రమ లేఅవుట్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ఊరూరా జూద గృహాలు ఏర్పాట య్యాయి. వాడవాడలా బెల్ట్‌షా పులున్నాయి. వీటన్నింటి వెనుక ప్రజాప్రతినిధులే కీలకపాత్ర పోషిస్తున్నారు. వారి సహకారం లేకుండా ఇవేవీ నడిచేఅవకాశాల్లేవు. సంక్రాంతి సంప్రదాయాల్ని పరిరక్షిసామంటూ పరోక్షంగా హింసతో కూడిన కోడిపందాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చే సింది. తద్వారా ప్రజల్లో సానుకూ ల సంతృప్త స్థాయి అనూహ్యంగా పెరుగుతుందని అంచనా లసింది. అయితే సంప్రదాయం వరకు సరిపెట్టుకున్నా ప్రజలు పందాల్లో విచ్చలవిడిగా సాగిన రక్తపాతం, జూదం, అసాంఘిక కార్యక్ర మాలతో చిర్రెత్తిపోయారు. సాక్షాత్తు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు వీటిని దగ్గరుండి కాపుకాయడం పట్ల మండిపడుతున్నారు. ప్రభు త్వం ఓ విధంగా ఆశిస్తే అందుకు విరుద్ధంగా ప్రజ లు దీనిపై స్పందిస్తు న్నారు. ఈ సంప్రదాయ వేడు కలకు కూ డా ప్రజాప్రతినిధుల పట్ల వ్యతిరేకత పెరగడానికి దోహదపడ్డాయి. వారి అవినీతి విశ్వరూపాన్ని ప్రజలకు చూపించి ఇలాంటి వారం దర్నీ ప్రజా జీవితం నుంచి వెళ్ళగొట్టాలన్న కసి ప్ర జల్లోనూ వ్యక్తమౌ తోంది. సరిగ్గా ఇదే అంశా న్ని తనకు సానుకూలంగా మలచు కోవాలని పవన్ బృందా నికి నిపుణులు సూచించినట్లు సమాచారం.

నవ్యాంధ్రలో మరో విద్యాకుసుమం



అమరావతి ఆంధ్రప్రభ : అమరావతిలో మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థకు అంకురార్పణ జరిగింది. దేశం లోని బి స్కూల్స్‌లో ఒకటైన జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎక్స్ఎల్ఆర్ఐ) క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. ఐనవోలు గ్రామం వద్ద క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాలెడ్జికి చిరునామాగా మారుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రముఖ ఎక్స్ఎల్ఆర్ఐ దక్షిణ భారతదేశంలో మొదటి క్యాంపస్ అమరావతిలో నెలకొల్పుతోందని, దాని నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. 1949లో ప్రారంభమైన ఈ సంస్థకు జంషెడ్‌పూర్, భువనేశ్వర్‌లలో క్యాంపస్‌లు ఉన్నాయని తెలిపారు. మనం 50 ఎకరాల భూమి ఇస్తే 235 కోట్లతో ఇక్కడ క్యాంపస్ నిర్మిస్తున్నారని తెలిపారు. దేశంలో అత్యున్నత విద్యాసంస్థగా ఈ క్యాంపస్ ఎదగాలన్న ఆకాంక్షను ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు. ప్రపంచం లోని అత్యున్నత పరిశోధనా సంస్థలతో ఈ సంస్థ అవగాహన ఒప్పందాలు చేసుకుంటుందని తెలిపారు. ఈ సంస్థ నిర్మించబోయే పాఠశాలకు ఎనిమిది ఎకరాల భూమి ఇస్తున్నట్లు సీఎం ప్రకటించారు. దేశం లోని టాప్ 20 విద్యాసంస్థల్లో కనీసం పది సంస్థలను ఇక్కడకు రప్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే విట్, ఎస్సారెమ్, అమృత వంటి సంస్థలు వచ్చాయని, ఇపుడు ఎక్స్ఎల్ఆర్ఐ కూడా వచ్చిందన్నారు. భవిష్యత్‌లో దేశం లోని అత్యున్నత విద్యాసంస్థలన్నీ అమరావతిలో కొలువుదీరతా యన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. నాలెడ్జిపై పెట్టుబడులు పెడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

పార్ధీ గ్యాంగ్ పట్టివేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కారు అద్దాలు పగులగొట్టి చోరీకి తెగబడుతున్న పార్ధీ గ్యాంగ్‌ను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన పార్ధీ గ్యాంగ్ గత కొంతకాలంగా ఈ తరహా నేరాలకు తెగబడుతోంది. దర్యాప్తు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపారు. లోకల్ గ్యాంగ్‌ల పనా? ఇతర రాష్ట్రాలకు చెందిన వారా? అన్నదానిపై దర్యాప్తు కొనసాగింది. అయితే ఈ తరహా నేరాలకు లోకల్ గ్యాంగ్‌లు చేసిన సందర్భాలు తక్కువేనని వెల్లడి కావడంతో కచ్చితంగా ఇది బయట రాష్ట్రాల నుంచి వచ్చిన గ్యాంగ్‌ల పనే అని నిర్ధారణకు వచ్చారు. దీంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు కొనసాగించి చిట్టచివరకు చోరీలకు పాల్పడింది పార్ధీ గ్యాంగ్‌గా నిర్ధారించుకున్నారు. ఏడుగురు సభ్యులతో ఉన్న పార్ధీ గ్యాంగ్‌నుంచి రూ.6.5 లక్షల విలువ చేసే ల్యాప్‌టాప్‌లు తదిత రాలు స్వాధీనం చేసుకున్నారు.

బీజేపీకి విరాళాల వెల్లువ

న్యూఢిల్లీ: జాతీయ పార్టీలకు 2017-18 ఆర్థిక సంవత్సరంలో లభించిన విరాళాల్లో బీజేపీకి 90శాతానికిపైగా విరాళాలు అందాయి. జాతీయ పార్టీలకు మొత్తం రూ.469.89కోట్లు విరాళాలు రాగా అందులో బీజేపీకి అధికంగా రూ.437.04కోట్లు లభించాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫామ్స్ తెలిపింది. కాంగ్రెస్ పార్టీకి 26.658 కోట్లు విరాళా లభించాయి. ఎన్సీపీకి రూ.2.087కోట్లు, సీపీఎంకి రూ.2.756కోట్లు, సీపీఐకి రూ.1.146కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కి రూ. 20లక్షలు విరాళాలు అందాయని ఏడీఆర్ తెలిపింది. కాగా కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎం, టీఎంసీ పార్టీలు అందుకున్న విరాళాలు కంటే బీజేపీకి వచ్చిన 12రెట్లు ఎక్కువ.

అజిత్ దోవల్ కుమారులు

నల్ల కుబేరులు

- *దోవల్ కుమారుల కంపెనీకి డీ కంపెనీగా నామకరణం*
- *నల్ల రహస్యాలను వెలుగులోకి తెచ్చిన ది కారవాన్ పత్రిక*
- *కేమన్ దీవిలో హెడ్జ్ ఫండ్ కంపెనీ నిర్వహిస్తున్న వివేక్ దోవల్*
- *కేమన్ నుంచి భారత్‌కు భారీగా పెట్టుబడులు*

న్యూఢిల్లీ: ఇండియన్ జేమ్స్ బాండ్ గా పిలువబడే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కుమారుల నల్ల రహస్యాలు వెలుగులోకి తీసుకొచ్చింది ది కారవాన్ పత్రిక. ఇన్నాళ్లు డీ కంపెనీ అంటే దావూద్ గ్యాంగ్ అని తెలుసు. అయితే ఇప్పుడు దోవల్ కుమారులకు డీ కంపెనీ అని కారవాన్ పత్రిక పేరు పెట్టింది. జడ్జి లోయా అనుమానాస్పద మృతిపై 27 రిపోర్టులను ప్రచురించిన ఈ పత్రిక డీ కంపెనీ వ్యవహారాన్ని బహిర్గతం చేసింది. పన్ను ఎగ్గొట్టే గ్యాంగ్ లకు అడ్డా అయినా కేమన్‌లో అజిత్ దోవల్ చిన్న కుమారుడు వివేక్ దోవల్ హెడ్జ్‌ఫండ్‌ను నిర్వహిస్తున్నట్లు కనుగొంది.పన్ను ఎగవేతదారులకు స్వర్గసీమలుగా ఉన్న దీవులు, దేశాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్న ఒక రిపోర్టులో గతంలో అజిత్ దోవల్ పేర్కొన్నారు. ఇప్పుడు ఆయన కుమారులే అలాంటి దీవి కేమన్‌లో హెడ్జ్ ఫండ్ నిర్వహిస్తున్నారు. అంటే నల్లధనాన్ని తెల్లధనంగా మారుస్తున్నారు. ది కారవాన్ కథనం ప్రకారం...2016 నవంబర్ లో పెద్దనోట్లను రద్దు చేస్తూ భారత ప్రధాని నరేంద్రమోడీ నిర్ణయం తీసుకొన్న 13 రోజుల తర్వాతే వివేక్ దోవల్ దీన్ని స్థాపించారు. యూకే పౌరసత్వం కలిగిన వివేక్ దోవల్ సింగపూర్ లో నివాసముంటున్నారు. ఆయన హెడ్జ్‌ఫండ్ జీఎన్‌వై ఏసియా ఫండ్‌కు డైరక్టర్‌గా ఉన్నారు. ఈ కంపెనీకి ఆయనతో పాటు డాన్ డబ్ల్యూ ఇబ్యాంక్స్, మహమ్మద్ అల్తాఫ్ ముస్లియం వీటిల్‌లూ డైరక్టర్లుగా ఉన్నారు. మోడీ సర్కారుకు సన్నిహితంగా ఉన్న థింక్‌ట్యాంక్ ఇండియా ఫౌండేషన్ హెడ్, బీజేపీ నేత శౌర్య దోవల్ నిర్వహిస్తున్న వ్యాపారాలతోనూ వివేక్ కంపెనీకి సంబంధాలున్నాయి. నకిలీ ఆఫ్‌షోర్ కంపెనీల వివరాలను వెల్లడించిన ప్యారడైజ్ పేపర్లలో ఇబ్యాంక్స్ పేరు ఇప్పటికే వెల్లడైంది. నకిలీ కంపెనీలు స్థాపించి పెట్టుబడుల పేరుతో నగదును కావాల్సిన చోటుకి పంపే షెల్ కంపెనీల వివరాలను బయటపెట్టిన పనామా పేపర్లు, ప్యారడైజ్ పేపర్లలోనూ పేరున్న వాకర్స్ కార్పొరేట్ లిమిటెడ్ కంపెనీ.. వివేక్ కంపెనీ జీఎన్‌వై ఏసియా ఫండ్‌కు సంరక్షణగా ఉన్నట్లు దస్తావేజుల్లో తేలింది. భారత్‌లోని అజిత్ దోవల్ పెద్ద కుమారుడు శౌర్యదోవల్ కంపెనీ ఉద్యోగులు వివేక్ కంపెనీఉద్యోగులు చాలా సన్నిహితంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ సోదరుల వ్యాపార సంబంధాలు సౌదీ అరేబియా పాలక వంశానికి చెందిన సౌద్ కంపెనీలతో జరిపే కార్యకలాపాలు పెద్ద ఆర్థిక సామ్రాజ్యాన్ని నడుపుతున్నట్లు సంకేతాలనిస్తున్నాయి. నోట్ల రద్దు అనంతరం 2016 నవంబర్ 21న కేమన్‌లో ఈ కంపెనీ ప్రారంభం కాగా 2017లో ఎఫ్‌డీఐల రూపంలో కేమన్ దీవి నుంచి భారత్‌కు పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు వచ్చాయి. ఆర్బీఐ వార్షిక నివేదిక ప్రకారం..ఆ దేశం నుంచి వచ్చిన పెట్టుబడుల్లో 2,226 శాతం పెరిగినట్లు తేలింది.

లోక్‌పాల్ సెర్చ్ కమిటీకి సుప్రీం గడువు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు గురువారం లోక్‌పాల్ సెర్చ్‌కమిటీకి లోక్‌పాల్ నియామకానికి సంబంధించిన పేర్లను ఫిబ్రవరి నెలాఖరిలోగా సిఫార్సు చేయాలని డెడ్‌లైన్ విధించింది. దేశ మొట్టమొదటి అవినీతి నిరోధక అంబుడ్స్‌మెన్ నియామకానికి సంబంధించి అర్హులైనవారి పేర్లను ఫిబ్రవరి మాసాంతంలోగా సిఫార్సు చేయాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. సెర్చ్ కమిటీ లోక్‌పాల్ అభ్యర్థుల ఎంపిక బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బందిని కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం ధర్మాసనాన్ని ఆదేశించింది. సుప్రీం చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్‌తోపాటు జస్టిస్ ఎల్ఎన్ రావు, జస్టిస్ ఎస్‌కే కౌల్‌తో కూడా సుప్రీం ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తూ తదుపరి విచారణను మార్చి 7కు వాయిదా వేసింది. కాగా లోక్‌పాల్ సెర్చ్ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజన్ ప్రకాశ్ దేశాయ్ నేతృత్వం వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ సుప్రీం ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన ధర్మాసనం ఎదుట మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, తగిన సిబ్బంది లేకపోవటంతో సెర్చ్ కమిటీ లోక్‌పాల్ నియామక అంశంలో తగిన నిర్ణయాలు సమర్థవంతంగా తీసుకోలేకపోతుందని తెలియజేశారు. తొలుత సుప్రీంకోర్టు లోక్‌పాల్ నియామకంలో జరుగుతున్న అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జనవరి 4న లోక్‌పాల్ నియామకానికి సంబంధించిన తీసుకున్న చర్యలపై అఫిడవిట్ సమర్పించవలసిందిగా ఆదేశించింది.

గాంధీ శాంతి బహుమతి విజేతలు వీరే

న్యూఢిల్లీ: జాతిపిత మహాత్మాగాంధీ పేరిట ఏటా శాంతి బహుమతులు కేంద్ర అందజేస్తోంది. అందులో భాగంగా 2015 నుంచి 2018 వరకు నాలుగేళ్ల కాలానికి గాంధీ శాంతి బహుమతుల విజేతల పేర్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2018 సంవత్సరానికి ఈ అవార్డును యోహీ ససకావా గెలుచుకున్నారు. ఈయన ప్రపంచ ఆరోగ్య సంస్థ తరపున ప్రపంచవ్యాప్తంగా కుష్టు నివారణకు కృషి చేస్తున్నారు. 2015 సంవత్సరానికి వివేకానంద, 2016కు అక్షయ పాత్ర ఫౌండేషన్, సులభ్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఈ అవార్డును గెలుచుకున్నాయి. 2017 ఏడాదికి ఏకై అభియాన్ ట్రస్ట్‌ను, 2018కి కుష్టు వ్యాధి నిర్మూలన కోసం డబ్ల్యూహెచ్‌వో సౌహార్ద రాయబారిగా ఉన్న యోహీ ససకవాకు అవార్డులను ప్రకటించారు. ఈ బహుమతి కింద రూ.కోటితోపాటు ప్రశంసాపత్రం ఇస్తారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని జ్యూరీ ఈ అవార్డులను ప్రకటించింది. ఈ జ్యూరీలో కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే, ఎల్‌కే అద్వానీ సభ్యులుగా ఉన్నారు.

కాంగ్రెస్ వల్లే ముసలం?

- *కర్ణాటక సంక్షోభంపై స్వపక్షంలో అంతర్మథనం*
- *సిద్ధరామయ్య వర్సెస్ డీకే విభేదాలు కారణమంటున్న నేతలు*
- *నేడు కాంగ్రెస్ శాసనసభాపక్షం సమావేశం*
- *ఆపరేషన్ లోటస్ అసత్య ప్రచారం: యడ్యూరప్ప*

బెంగళూరు: భారతీయ జనతాపార్టీ చేపట్టిన ఆపరేషన్ కమల్ విఫలం అయింది. కాంగ్రెస్ నాయకత్వానికి ఒకింత ఊరట లభించింది. ముఖ్యమంత్రి కుమారస్వామి గట్టిగా ఊపిరి పీల్చుకున్నారు. కానీ, అసలు ఈ పరిణామానికి కారణం ఏమిటి? అన్న కోణంలో పరిశీలిస్తే.. దీనంతటికీ కాంగ్రెస్‌లో సీనియర్ల మధ్య ఆధిపత్య పోరే కారణమని తెలుస్తోంది. రాహుల్ గాంధీ, కుమారస్వామి అప్రమత్తతో ప్రస్తుతానికి సంక్షోభం సమసినట్లు కనిపించినా, కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు వీరిలో గుబులు పుట్టిస్తోంది. నాలుగు రోజుల ఉత్కంఠకు కారణం మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, నీటిపారుదల మంత్రి డీకే శివకుమార్ మధ్య తలెత్తిన విభేదాలేనని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ ప్రయత్నించిందని వారు అభిప్రాయపడుతున్నారు. ఉప ముఖ్యమంత్రి జి. పరమేశ్వర సైతం అంతర్గత విభేధాలను అంగీకరించారు. కేబినెట్‌పై ఆశలు పెట్టుకున్న వారు, అసంతృప్తి వ్యక్తం చేయడం సహజమే. క్రమంగా పరిస్థితులు సర్దుకుంటాయి. అందరికీ కేబినెట్‌లో చోటు సాధ్యం కాదని వారే గ్రహిస్తారు. వారికి సముచిత స్థానం కల్పించేందుకు మావంతు ప్రయత్నం చేస్తున్నాం అని పాటిల్ వివరించారు. ఇదిలావుండగా, ఆపరేషన్ లోటస్ ఆరోపణలను బీజేపీ నేత, మాజీ సీఎం యెడ్యూరప్ప తోసిపుచ్చారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఆలోచనేదీ తమకు లేదన్నారు. తమ ఎమ్మెల్యేలను కొనేందుకు ముఖ్యమంత్రి కుమారస్వామి ప్రయత్నించారని ఆరోపించారు. వారి వైఫల్యాలను, అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, జేడీఎస్ దుష్ప్రచారానికి దిగాయని విమర్శించారు.

మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎల్‌పీ భేటీ

నాలుగు రోజుల నాటకీయ పరిణామాల నేపథ్యంలో ఈ రోజు మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్షం సమావేశం కాబోతున్నది. ఎమ్మెల్యేలంతా పార్టీవెంటే ఉన్నారని ముఖ్యనేతలు చెబుతున్నా, నేటి సమావేశానికి అందరూ హాజరవుతారా? లేదా? అన్న సందేహం కాంగ్రెస్ వర్గీయులను వెంటాడుతోంది. రాజకీయ వర్గాల్లోనూ ఈ భేటీపై ఆసక్తి నెలకొంది. ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు విరమించడం, మూడు నుంచి నాలుగు మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరిపారన్న వదంతుల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కిన విషయం తెలిసిందే. కాగా, జేడీ(ఎస్)-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఐదేళ్లు అధికారంలో ఉంటుందని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ ధీమా వ్యక్తంచేశారు.

రిసార్ట్‌లోనే బీజేపీ ఎమ్మెల్యేలు..

హర్యాణా రాష్ట్రం గుర్‌గావ్‌లోని రిసార్ట్‌లో మకాం వేసిన కర్నాటక బీజేపీ ఎమ్మెల్యేలు శుక్రవారం సాయంత్రం వరకు అక్కడే ఉండే అవకాశం ఉంది. నేడు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం జరగనున్న నేపథ్యంలో, వేచిచూసే ధోరణిలో భాజపా నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. తుంకూర్‌లోని సిద్ధగంగ మఠాధిపతి శివకుమార స్వామీజీ అస్వస్థత సమాచారంతో, మాజీ ముఖ్యమంత్రి యెడ్యూరప్ప తోపాటు డజనుమంది ఎమ్మెల్యేలు గురువారమే బెంగళూరు చేరుకున్నారు. శోభ కాగా, కరంద్లజె తోపాటు 75 మంది ఎమ్మెల్యేలు ఇంకా రిసార్ట్‌లోనే ఉన్నట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి.

అవిశ్వాసం గట్టెక్కిన థెరిసా ప్రభుత్వం

- బ్రెగ్జిట్‌పై మళ్లీ చర్చలకు సిద్ధమని వెల్లడి



లండన్: బ్రిటన్ పార్లమెంట్ లో ప్రధాని థెరిసా మేకు ఊరట లభించింది. ఆమెకు వ్యతిరేకంగా ప్రతిపక్ష లేబర్ పార్టీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. బుధవారం జరిగిన ఓటింగ్‌లో 19 ఓట్ల తేడాతో కన్జర్వేటివ్ ప్రభుత్వం ఈ అవిశ్వాస పరీక్షలో నెగ్గింది. 325మంది ఎంపీలు అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయగా 306మంది మద్దతుగా ఓటు వేశారు. అవిశ్వాస తీర్మానం వీగిపోయిన తర్వాత ప్రధాని థెరిసా మే మాట్లాడుతూ.. బ్రెగ్జిట్ ఒప్పందంపై చర్చలకు అన్ని పార్టీల నేతలను ఆహ్వానిస్తున్న ట్లు తెలిపారు. బ్రెగ్జిట్ ఒప్పందంపై త్వరగా ఓ నిర్ణయానికి రావాలని ఆమె కోరారు. అంతకు ముందు మంగళవారం బ్రెగ్జిట్ బిల్లును బ్రిటన్ పార్లమెంట్ భారీ ఆధిక్యంతో తిరస్కరించిన విషయం తెలిసిందే. 100మందికిపైగా సొంత పార్టీ ఎంపీలే ఈయూతో థెరిసా కుదుర్చుకొన్న బ్రెగ్జిట్ ఒప్పందానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. బ్రెగ్జిట్ ఒప్పంద తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ 423మంది సభ్యులు ఓటు వేయగా 202 మంది సభ్యులు ఆమోదిస్తూ ఓటు వేశారు.

బ్రెగ్జిట్ ఒప్పందం ఓడిపోయిన వెంటనే ప్రతిపక్ష లేబర్ పార్టీ నేత జెరెమీ కార్బిన్ పార్లమెంట్‌లో ప్రధానిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. బ్రిటన్ పార్లమెంట్ నిబంధనల ప్రకారం.. ఏదైనా బిల్లు తిరస్కరణకు గురైతే మూడు పార్లమెంట్ పనిదినాల్లోగా మళ్లీ ప్రత్యామ్నాయ బిల్లును సభలో ప్రవేశపెట్టాల్సిన బాధ్యత ప్రధానిపై ఉంటుంది. ఒకవేళ ఆ బిల్లుకు కూడా ఆమోదం లభించని పక్షంలో మరో ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేసుకోవడానికి ప్రధానికి మూడు వారాల సమయం లభిస్తుంది. ఒక వేళ ఒప్పందం లేకుండా ఈయూ నుంచి బ్రిటన్ వైదొలిగినట్లయితే బ్రిటన్ తీవ్రంగా నష్టపోయే అవకాశముందన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి.

సభలో నేడు..

స్పీకర్ ఎన్నిక ప్రకటన.. బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ శాసనసభ శుక్రవారం ఉదయం 11గంటలకు ప్రారంభం కానుండగా ప్రోటెంస్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి ఎన్నికను ఏకగ్రీవంగా ప్రకటిస్తారు. ఆ తర్వాత స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించనుండగా సభకు విరామం ప్రకటిస్తారు. విరామ సమయంలో నూతన స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో శాసనసభ బిఏసి సమావేశం నిర్వహిస్తారు. తర్వాత మండలి బీఏసీ సమావేశం కూడా జరగనుంది. బీఏసీ సమావేశం అనంతరం శుక్రవారం సభ కార్యక్రమాలు ముగియనున్నాయి. శనివారం ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనుండగా, ఆదివారం ధన్యవాద తీర్మానాలతో తొలి సమావేశాలు ముగియనున్నాయి.

తెదేపా, భాజపాకు కేటాయించని సభాపక్ష కార్యాలయాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర శాసనసభ కొలువుదీరిన వేళ శాసనసభ ఆవరణలోని వివిధ పార్టీల శాసనసభా కార్యాలయాలకు నూతన బోర్డులు ఆవిష్కృతమయ్యాయి. వివిధ పార్టీలకు గతంలో కేటాయించిన సభాపక్షం కార్యాలయాల బోర్డులను శాసనసభ రద్దు కాగానే తొలగించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే మళ్ళీ గతంలో కేటాయించిన బోర్డులను అదే కార్యాలయాలకు తగిలించారు. అయితే గతంలో ఐదుగురు సభ్యులున్న భాజపాకు ప్రస్తుత సభలో ఒకే ఒక్కరు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఆ పార్టీకి కార్యాలయాన్ని కేటాయించలేదు. మరోవైపు ఇద్దరు సభ్యులున్న తెదేపాకు గతంలో కార్యాలయం ఉన్నప్పటికీ ఈసారి కేటాయించకపోవడం గమనార్హం.

వివాదాలకు పోను..



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుపై తాను ఎలాంటి వివాదాలకు పోనని, సాధ్యమైనంత వరకు సామరస్యంగానే నిధులు రాబట్టుకునేందుకే ప్రయత్నిస్తానని కాంగ్రెస్ శాసనసభ్యుడు తూర్పు జయప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి) స్పష్టంచేశారు. ముఖ్యమంత్రిని దూషించవద్దని తమ పార్టీ శాసనసభ్యులకు కూడా సూచించానని, దూషిస్తే నిధుల సాధించలేమని అనుభవ రీత్యా తెలుసుకున్నామని ఆయన అన్నారు. గురువారం శాసనసభ సమావేశాలకు ముందు అసెంబ్లీ లాబీల్లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కేసీఆర్‌తో తనకు అవసరం ఉందని, తన అవసరం ఆయనకు లేదని అంగీకరించారు. తన నియోజకవర్గానికి (సంగారెడ్డి) కేసీఆర్ వస్తే సన్మానం చేస్తానని, రాకుంటే మౌనంగా ఉండిపోతానని జగ్గారెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం ముఖ్యమంత్రిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరుతానని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించే వరకు వేచి చూస్తానని అన్నారు. నిధుల కోసం ముఖ్యమంత్రిని అడుగుతానని, నిధుల విడుదల కోసం వేచి చూస్తాం.. చూస్తాం.. చూస్తామని చివరకు వాస్తవాలను ప్రజలకు చెప్పుకుంటామని ఆయన అన్నారు. చివరి వరకు ఎదురు చూడడమే అవుతుందేమోనని జగ్గారెడ్డి అన్నారు.

పార్టీ మారేది లేదు


• కాంగ్రెస్ ఎమ్మెల్యే హరిప్రియ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తనను పార్టీ మారమని అధికార టీఆర్ఎస్ పార్టీ నుంచి ఒత్తిడి చేస్తూ ఫోన్లు వస్తున్నాయంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని ఆ పార్టీ ఎమ్మెల్యే హరిప్రియ స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో హరిప్రియ మాట్లాడారు.. చిన్నవయస్సులో తాను శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యాయని, తనను గుర్తించి శాసనసభ్యురాలిగా అవకాశమిచ్చిన ఇల్లందు నియోజకవర్గం ప్రజలకు సేవ చేసి రుణం తీర్చుకుంటానని అన్నారు. పోడు భూముల రైతాంగ సమస్యలు, బయ్యారం స్టీల్‌ప్లాంట్, నియోజకవర్గంలో గ్రామాలను అనుసంధానిస్తూ ప్రధాన రహదార్లకు బస్సు సౌకర్యం, బ్రిటీష్ కాలం నాటి రైల్వే లైన్లు అభివృద్ధి వంటి సమస్యలపై దృష్టి సారిస్తానని ఆమె చెప్పారు.

తెదేపా ప్రజల గొంతుక

• టీటీడీపీ అధ్యక్షుడు రమణ

• ఎన్టీఆర్ ఘాట్‌లో ఎమ్మెల్యే మచ్చా నివాళి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశంపార్టీ శాసనసభ్యులు ప్రజల గొంతుకగా ఉంటారని, ప్రజలకు ఎక్కడ సమస్య వచ్చినా అక్కడ నిలుస్తారని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షానే నిలుస్తుందని అన్నారు. మెచ్చా , తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రావులతో కలిసి గురువారం ఎన్‌టిఆర్ ఘాట్‌కు వచ్చి దివంగత ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ తమ పార్టీ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సమన్వయపరుస్తూ జిల్లాలోనే ఉన్నారని చెప్పారు.ఎన్‌టిఆర్ స్ఫూర్తితోనే పేదలకు అండగా ఉంటున్నానని తెదేపా శాసనసభ్యుడు మచ్చా నాగేశ్వరరావు చెప్పారు.

తెరాసలోకి వంటేరు!

(మొదటిపేజీ తరువాయి)



కాంగ్రెస్ నేత, టీపీసీసీ అధికారప్రతినిధి వంటేరు ప్రతాపరెడ్డి శుక్రవారం గులాబీకండువా కప్పుకోబోతు న్నారు. కేసీఆర్ స్వయంగా ఆయనకు గులాబీ కండు వా కప్పనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. గత శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ ప్రత్యర్థిగా పోటీచేసిన నర్సారెడ్డి టీఆర్ఎస్‌లో చేరి రోడ్డు అభివృద్ధిసంస్థ ఛైర్మన్‌గా పనిచేయగా, ఎన్నికలముందు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇక గత ఎన్నికల్లో కేసీఆర్‌పై పోటీచేసిన వంటేరు ప్రతాప రెడ్డి ఓడిస్తానని సవాల్ చేశారు. 2014, 2018ఎన్నికల్లో భీకరంగా పోరాడినా, బలమైన పోటీదారునిగా ప్రచా రం జరిగినా చివరకు కేసీఆర్ సునామీ ముందు నిలువ లేకపోయారు. కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కాగా భవిష్యత్ రాజకీయాలు, వ్యక్తిగత ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గులాబీకండువా కప్పుకోవాలని ప్రతాప్‌రెడ్డి నిర్ణయించినట్లు తెలుస్తోంది. గజ్వేల్ అభివృద్ధికోసమే తాను పార్టీమారు తున్నట్లు ప్రకటించినా ప్రతాపరెడ్డి రాజకీయ భవిష్యత్‌పై కేసీఆర్ భరోసానిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన హరీష్‌తో సంబంధం లేకుం డానే ఈ చేరిక వ్యవహారాన్ని నేరుగా సీఎం సన్నిహితులతో వంటేరు ప్రతాపరెడ్డి మాట్లాడుకున్నట్లు పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రతాపరెడ్డి స్వయంగా చేరికకు ముందు కరావ డంతో సీఎం సరేనన్నట్లు తెలు స్తోంది. రాష్ట్రరాజకీయచరిత్రలో తనపై పోటీచేసిన ప్రధాన ప్రత్యర్థికి తానే కండువాకప్పి పార్టీలో చేర్చుకోవడం అరుదైన విషయంగా నేతలు చెబుతున్నారు.

టీడీపీ వికెట్ డౌన్

రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ కేవలం రెండు అసెంబ్లీ స్థానాలు మాత్రమే విజయం సాధించగా, ఇపుడు ఆఇద్దరిలో ఒకరు ప్రమాణస్వీకారం చేయకుండానే గులాబీకండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయవర్గాలసమాచారం ప్రకారం శుక్రవారం ముఖ్యులతో కలిసి సండ్రవెంకటవీరయ్య గులాబీతీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. ఇప్పటికే నియోజకవర్గనేతలతో, ముఖ్య అనుచరులతో మాట్లాడిన సండ్ర పార్టీమార్పుకు నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం మంచి రోజు కావడంతో ముహూర్తం ఖరారుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు ఎమ్మెల్యేలు వస్తే చేర్చుకుంటామని టీఆర్ఎస్ చెప్పినా మరో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఇపుడే చేరేందుకు ససేమిరా అనడంతో ముందు తాను చేరేందుకు సండ్ర మార్గం సుగమంచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు చేరితే మంత్రి లేదా ఆ స్థాయి నామినేటెడ్ పదవులు ఇస్తామని టీఆర్ఎస్ ఆఫర్ చేసినట్లు ప్రచారం జరిగింది. సమావేశాల్లోపే రావాలని టీఆర్ఎస్ షరతు పెట్టడంతో సండ్ర వెంకటవీరయ్య తొలి రోజు సమావేశానికి రాకుండా ఇందుకు సంబంధించిన సన్నాహాల్లో నియోజకవర్గంలోనే ఉన్నట్లు తెలుస్తోంది. టిటిడిపి అధ్యక్షుడు ఎల్.రమణ, ముఖ్యనేత రావులచంద్ర శేఖర్‌రెడ్డి అసెంబ్లీకి హాజరుకాక పోవడంపై ఫోన్‌లో ఆరాతీయగా, నియోజకవర్గంలో గ్రామపంచాయతీ నామినేషన్ల ఉపసంహరణలు ఉండడంతో రాలేకపోతున్నట్లు చెప్పినట్లు సమాచారం. అయితే టీఆర్ఎస్ వర్గాల్లో శుక్రవారం చేరబోతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

రైతునేతగా తొలి అడుగు.. ఇరవై ఏళ్ల రాజకీయ ప్రస్థానం

• టీడీపీలో తొలి అవకాశాలు • కాంగ్రెస్‌లో చేరిక.. ఇప్పుడు కారెక్కుతున్న వంటేరు

సిద్దిపేట ప్రతినిధి/గజ్వేల్, ప్రభ న్యూస్ : తెరాసలో చేరనున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంటేరు ప్రతాప్‌రెడ్డి దాదాపు 20 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీల కార్యకర్తగా చేరి అప్పటి దివంగత ఎమ్మెల్యే సంజీవరావు అనుచరునిగా తదుపరి అడుగులు వేసిన వంటేరు... అనంతరం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో రైతు సమన్వయ సమితి రాష్ట్ర కార్యదర్శిగాపనిచేశారు. ఆ సమయంలో అద్భుత మైన పనితీరుతో చంద్రబాబు నాయుడు దృష్టిలో పడ్డారు. ఆయన పనితీరు కారణంగానే 2009 ఎన్ని కల్లో తెలుగుదేశం పార్టీ తరపున గజ్వేల్ నియోజక వర్గం నుంచి బరిలో దిగేందుకు అవకాశం ఇచ్చారు. నిజానికి అప్పట్లో గజ్వేల్ టికెట్ కోసం ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జడ్పీచైర్మన్ మణికొండ లక్ష్మీకాంతారావు, ఉమ్మడి జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్, ప్రస్తుతం టీఆర్ఎస్‌లో రాష్ట్ర ఆహార సంస్థచైర్మన్‌గా కొన సాగుతున్న గంగుమల్ల ఎలక్షన్ రెడ్డి, వంటేరు ప్రతాప్ రెడ్డిలు పోటీపడ్డప్పటికీ వంటేరువైపే చంద్రబాబు మొగ్గారు. ఆ ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి చేతిలో కేవలం 7వేల పైచిలుకు ఓట్లతో ప్రతాప్‌రెడ్డి ఓటమి చవిచూశారు. అయిన ప్పటికీ చంద్రబాబు నాయుడు వంటేరు ప్రతాప్‌రెడ్డిని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా పదవి అప్పజెప్పారు. దీంతో 2014 ఎన్నికల్లో వంటేరు ప్రతాప్‌రెడ్డికి చంద్రబాబు మరోసారి గజ్వేల్ టికెట్ కేటాయించారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి గులాబీ దళపతి, టీఆర్ ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతో తలపడ్డారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌పై 19వేల పైచిలుకు ఓట్లతో వంటేరు ఓటమి చెందారు. అయినప్పటికీ రాష్ట్ర రైతుసంఘం అధ్యక్ష పదవితోపాటు సిద్దిపేట టీడీపీ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు అప్పజెప్పారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా ఉందని ప్రతాప్‌రెడ్డి గ్రహించి కార్యకర్తలతో సమావేశం నిర్వహించి 2018 మే నెలలో టీటీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసి అదేనెలలో 25న ఢిల్లీలో అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సత్సంబంధాలు కలిగివుండి వంటేరు ప్రతాప్‌రెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గ అసెంబ్లీ టికెట్ తెచ్చుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మరోసారి పోటీలో దిగారు. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో 58వేల పైచిలుకు ఓట్ల తేడాతో మూడో ఓటమిని ఎదుర్కొన్నారు. కేసీఆర్‌తో రెండుసార్లు తలపడ్డ వంటేరు... చివరికి తెరాసలో... అదీ కేసీఆర్ సమక్షంలో చేరడం విశేషం.



(మొదటిపేజీ తరువాయి)

చెప్పారని తెరాసలో గుసగుసలు వినిపిస్తున్నాయి. గృహప్రవేశం సందర్భంగా అమరావతిలో ఫెడరల్ ఫ్రంట్

14న అమరావతికి కేసీఆర్?

ఏర్పాటుపై కేసీఆర్, జగన్‌లు పూర్తిస్థాయిలో చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోటస్‌పాండ్‌లోని జగన్ నివాసంలో కేటీఆర్ జగన్‌ల మధ్య జరుగుతున్న చర్చల సారాంశాన్ని కేటీఆర్ అక్కడి నుంచే కేసీఆర్‌కు ఫోన్‌లో వివరించారని, కేసీఆర్ జగన్‌తోనూ మాట్లాడారని ఆ సమయంలోనే కేసీఆర్‌ను జగన్ ఆహ్వానించారని చెబుతున్నారు.


కాగా కేసీఆర్ ఈనెల 21 నుంచి ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల సహస్ర చండీ యాగానికి జగన్‌ను కూడా ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకే జగన్ తన లండన్ పర్యటనను వాయిదా వేసుకున్నారన్న ప్రచారం తెరాసలో వినిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు సమ యం దగ్గర పడుతున్న సమయంలో నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించాలని భావించిన జగన్ తన లండన్ పర్యటనను వాయిదా వేసుకున్నారని వైకాపా నేతలు చెబుతున్నా కారణం ఇది కాదని కేసీఆర్ చేపట్టిన యాగంలో పాల్గొనేందుకే ఆయన విదేశాలకు వెళ్ళడం లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తు న్నాయి. వాస్తవానికి కుటుంబ సమేతంగా గురువారం జగన్ లండన్ వెళ్ళాల్సి ఉంది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో తన కుమార్తె వర్షను చూసి రావాలని భావించిన జగన్ ఐదు రోజులపాటు తన పర్యటన ఉండేలా షెడ్యూల్‌ను రూపొందించుకున్నారు. పార్టీ కార్యక్రమాలతో తన పర్యటనను రద్దు చేసుకున్నారని వైకాపా నేతలు చెబుతున్నారు.

ఆస్తానాకి ఉద్వాసన

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలో మరికొన్ని రోజుల్లో సెలక్షన్ ప్యానెల్ భేటీకానున్న తరుణంలో రాకేశ్ ఆస్తానాను ఏవియేషన్ సెక్యూరిటీ విభాగానికి బదిలీ చేయడం సంచలనంగా మారింది. సీబీఐ పూర్తి స్థాయి డైరెక్టర్ బాధ్యతలు తనకు అప్పచెబుతారని ఆశిస్తున్న రాకేశ్ ఆస్తానాకి తాజా ప్రభుత్వ ఉత్తర్వులు ఆశనిపాతంగా మారాయి. సీబీఐలో బాధ్యతల నుంచి తొలగించిన మిగిలిన ముగ్గురు అధికారులను వారి మాతృసంస్థలకే పంపే అవకాశముందని లేదా ఇతర కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో వారి సేవలు ఉపయోగించుకోవచ్చని భావిస్తున్నారు. అయితే ఈ ముగ్గురు అధికారులను వారి మాతృసంస్థలకే పంపించడానికే ఎక్కువ అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆస్తానా, అరుణ్ కుమార్ శర్మ గుజరాత్ కేడర్ కాగా, సిన్హా ఆంధ్రప్రదేశ్, జె.జయంత్ మహారాష్ట్ర కేడర్‌కి చెందిన అధికారులు. జనవరి 24న ప్రధాని నేతృత్వంలోని సెలక్షన్ ప్యానెల్ తదుపరి సీబీఐ డైరెక్టర్‌ను ఎంపిక చేయనుంది. ఇక అలోక్ వర్మను తొలగిస్తూ సెలక్షన్ ప్యానెల్ నిర్ణయం తీసుకున్న తరువాత సీబీఐ డైరెక్టర్‌గా తాత్కాలిక బాధ్యతలను నాగేశ్వరరావు నిర్వర్తిస్తున్నారు.

గత వారం సుప్రీంకోర్టు ఆదేశాలతో మరోసారి డైరెక్టర్ బాధ్యతలు చేపట్టిన అలోక్ వర్మను ప్రధాని నేతృత్వంలోని సెలక్షన్ ప్యానెల్ తొలగించడంతో మనస్థాపం చెందిన ఆయన ఐఏఎస్ సర్వీసుకే గుడ్ బై చెప్పడం తెలిసిందే. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ, స్పెషల్ డైరెక్టర్‌గా రాకేశ్ ఆస్తాన మధ్య గొడవలు ప్రభుత్వం పరువు తీశాయి. దీంతో వీరిద్దరినీ దీర్ఘకాలిక సెలవుపై పంపి నాగేశ్వరరావును తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించారు. ఇక పశు మాంస వ్యాపారి మొయిన్



ఖురేషీ కేసులో అవినీతి ఆరోపణలపై ఆస్తానాపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. ఆస్థానాకి ఖురేషీ తరుపున తాను లంచం ఇచ్చినట్లు హైదరాబాద్‌కి చెందిన వ్యాపారవేత్త సన సతీశ్ బాబు వెల్లడించారు. రాకేశ్ ఆస్తానాపై వచ్చిన ఆరోపణలపై విచారించడానికి సీబీఐకి ఢిల్లీ హైకోర్టు పదివారాల సమయం ఇచ్చింది. ఆనాటి సీబీఐ డైరెక్టర్ అలోక్ శర్మ కూడా అవినీతి పాల్పడ్డారని స్పెషల్ డైరెక్టర్‌గా ఉన్న ఆస్తానా ఆరోపించారు. సీబీఐ ఉన్నతస్థాయి అధికారుల మధ్య పరస్పర ఆరోపణలు కేంద్ర ప్రభుత్వానికి పెద్ద తలనెప్పిగా మారాయి. దీంతో ఇద్దరినీ రాత్రికి రాత్రి సెలవుపై పంపారు. అయితే దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన అలోక్ శర్మ తిరిగి ఉన్నత న్యాయ స్థానం ఆదేశాలతో సీబీఐ డైరెక్టర్‌గా తాత్కాలిక డైరెక్టర్ నాగేశ్వర్‌రావు స్థానంలో నియమితులైయ్యారు. సీబీఐ పగ్గాలు చేపట్టిన వెంటనే శాఖపరమైన బదిలీలకు అలోక్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఆ తరువాత ప్రధాని మోడీ నేతృత్వంలోని సెలక్షన్ ప్యానెల్ అలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్‌గా తొలగిస్తూ.. మరో శాఖకి బదిలీ చేసింది. దీనిపై మనస్థాపం చెందిన అలోక్ వర్మ తన ఐపీఎస్ సర్వీసుకే రాజీనామా చేశారు.

కోర్టు కేసులే కారణమా?

గత శుక్రవారం నాడు తనపై దాఖలైన అవినీతి కేసులో ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఆస్తానాకి అక్కడ చుక్కెదురైంది. ఈ కేసు విచారించిన సింగిల్ జడ్జి బెంచ్.. ఆస్తానాకి మధ్యంతర రక్షణ కల్పించడానికి తిరస్కరించింది. ఆస్తానాపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను మరో రెండు వారాల పాటు కొనసాగించాలని సీబీఐని ఆదేశించింది. ఈ ఆదేశాలపై మార్పులు కోరుతూఆస్తానా మరోసారి ఢిల్లీ హైకోర్టు మెట్లెక్కారు. నిజానికి గురువారం ఆస్తాన్ పిటిషన్ ఢిల్లీ హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది. అయితే ఈలోగా ఆస్థానాతో సహా మరో ముగ్గురు సీబీఐ అధికారులను దర్యాప్తు సంస్థ బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్వీయ అవినీతి ఆరోపణలతో కోర్టు మెట్లెక్కిన ఆస్తానాను సీబీఐ అధికారిగా కొనసాగించడం కూడా ప్రభుత్వానికి తలవంపులే అన్న అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో వినిపిస్తోంది. సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తప్పించడంతో ఐఏఎస్ సర్వీస్‌కే రాజీనామా చేసిన అలోక్ వర్మ ఉదంతం కూడా తాజాగా నలుగురు అధికారులపై వేటుకి కారణమై ఉంటుందనే వాదనా వినిపిస్తోంది.

నేటి నుండి అంతర్జాతీయ యువజన సదస్సు

• ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ కవిత

• 103 దేశాల నుండి హాజరుకానున్న 550 మంది ప్రతినిధులు



ఆంధ్రప్రభ, హైదరాబాద్ : తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం నుండి 20వ తేదీ వరకు మూడురోజుల పాటు అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సును నిర్వహిస్తుండగా, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో ఈసదస్సు జరగనుండగా, సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకురాలు తెలంగాణ జాగృతి వ్యవ స్థాపకురాలు నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత గురువారం పరిశీలించారు. 19వతేదీన ప్రారంభ సమావేశానికి అన్నా హజారే ముఖ్యఅతిధిగా హాజరు కానుండగా, కల్వకుంట్ల కవిత కీనోట్ అడ్రస్ చేస్తారు. 20వ తేదీ సాయంత్రం జరిగే సమావేశానికి గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిధిగా హాజరుకానున్నారు. ఇక తొలిరోజు యువత అభివృద్ధిపై ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా చర్చాగోష్టిని నిర్వహిస్తారు. 2030వరకు భవిష్యత్ మానవాళి మను గడకు అవసరమైన ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 17అంశాల లక్ష్యాల సాధనలో భాగంగా తెలంగాణ జాగృతి ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నదని ఆమె వివరించారు. 103దేశాల నుండి 550మంది ప్రతినిధులు సదస్సుకు హాజరవుతున్నారని 16దేశాల నుండి 70మంది వక్తలు, 40మంది ప్రత్యేక ఆహ్వానితులు హాజరు కానున్నారు.


డేరా బాబాకి యావజ్జీవం!



పంచకుల: పదహారు సంవత్సరాల క్రితం చేసిన పాపం గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను పాపంలా వెన్నాడింది. 2002లో జర్నలిస్ట్ రామచందర్ చత్రపతి హత్య కేసులో డేరాబాబాతో పాటు మరో ముగ్గురికి ఇక్కడి ప్రత్యేక సీబీఐ న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. డేరా సచ్ సౌధా అధిపతి గుర్మీత్ సింగ్‌కి సహకరించిన నిర్మల్ సింగ్, కులదీప్ సింగ్, క్రిష్ణ లాల్‌ను జర్నలిస్టు ఛత్రపతి హత్య కేసులో దోషులుగా తేలుస్తూ ప్రత్యేక న్యాయస్థానం యావజ్జీవ శిక్ష విధించింది. నలుగురు దోషులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించిన న్యాయస్థానం శిక్ష ఖరారు చేసినట్లు సీబీఐ న్యాయవాది హెచ్‌పీఎస్ వర్మ వెల్లడించారు. యావజ్జీశిక్షతో పాటు ప్రతి ఒక్కరికీ రూ.50 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఇదే కాకుండా నిర్మల్ సింగ్, క్రిష్ణలాల్‌కి ఆయుధ్ చట్టం కింద మరో అయిదు వేలు జరిమానా, మూడేళ్ల జైలు శిక్షను అదనంగా విధించినట్లు చెప్పారు. ఈ రెండు శిక్షలను ఒకే కాలంలో అనుభవించాల్సి ఉంటుంది. భారత శిక్షా స్మృతిలోని 302, 120 బి సెక్షన్ల కింద సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం దోషులకు శిక్షలు విధించింది. మానభంగం కేసులో పడ్డ 20 సంవత్సరాల శిక్ష ముగిసిన తరువాతే తాజాగా విధించిన యావజ్జీవ శిక్ష అమల్లోకి వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది.

కేసీఆర్ వస్తారు.. దమ్ముంటే మాట్లాడు


• ఏపీ రాజకీయాల్లో తెరాస జోక్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో తమను అభిమానించే ప్రజలు ఉన్నారని, అక్కడ రాజకీయాల్లో టీఆర్ ఎస్ పార్టీ జోక్యం చేసుకుం టుందని ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూపించే అలవాటున్న చంద్ర బాబు చిల్లర రాజకీయాలకు పాల్పడు తున్నారని ఆయన విమర్శించారు. వచ్చే నెలలో తెలంగాణ ముఖ్యమంత్రి కెసీఆర్ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తారని, మీకు దమ్ముంటే మాట్లాడండి చూద్దాం అంటూ చంద్రబాబుకు తలసాని సవాల్ విసిరారు. వైసీపీ అధినేత జగన్‌తో తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చర్చలు జరిపితే.. దాని వెనకు ప్రధాని మోడీ కుట్ర ఉందని ఆంధ్రా దద్దమ్మ మంత్రులు అర్ధరహితంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రాలో ముఖ్యమంత్రి చంద్రబాబు వలన ఒరిగింది ఏమీ లేదని, అక్కడ ప్రజలకు టీఆర్ఎస్ సహకరిస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఆయన చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఆంధ్రా ప్రజలు తెలుగుదేశం పార్టీకి చుక్కలు చూపిస్తారని, ఆ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని ఆయన జోస్యం చెప్పారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లా డారు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాలలు, మాదిగల మధ్య, ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్‌లో కాపులు, బీసీల మధ్య చంద్రబాబు చిచ్చు పెట్టి గొడవలకు ఆజ్యం పోశారని ఆయన విమర్శించారు. ఎన్టీ రామారావు టిడిపి స్థాపించినప్పుడు పార్టీలో బీసీలను బాగా ఆదరించారని అన్నారు. ఆంధ్రాలో యాదవ కులస్థులనే కాదు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అన్ని వర్గాలకు తాము మద్దతు పలుకుతామని ఆయన చెప్పారు. చంద్రబాబు పాలన తమకొద్దని అక్కడి ఓసీ, బీసీ ప్రజలు నినాదిస్తున్నారని చెప్పారు.

గద్దల గోల.. ఓట్లకే వల!

• ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ : అసూయపరులంతా ఏకమై ఒకచోటకు చేరి ఏపీపై కుట్రలు పన్నుతున్నారని, గద్దల మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌పై వాలి కులాల మధ్య చిచ్చు, మతాల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారని సీఎం చంద్రబాబునాయుడు ధ్వజమెత్తారు. ఎలక్షన్ మిషన్ 2019 పై సీఎం చంద్రబాబునాయుడు గురువారం టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. శుక్రవారం జరుగనున్న ఎన్టీఆర్ వర్ధంతి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి తదితర అంశాలతోపాటు కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్, కేటీఆర్-జగన్‌ల భేటీ, టీడీపీపై షర్మిళ ఫిర్యాదులు, తలసాని కామెంట్లపై సీఎం స్పందించారు. శుక్రవారం జరిగే ఎన్టీఆర్ వర్ధంతి విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, ఇన్‌ఛార్జులు, బాధ్యులను సీఎం ఆదేశించారు. ఎన్టీఆర్ ఆదర్శాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి పేదల సంక్షేమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పింఛన్ల పెంపుపై రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతిని మించిపోయేలా సంబరాలు చేయాలని పార్టీ శ్రేణులకు సీఎం ఆదేశాలు జారీచేశారు. పింఛన్ మొత్తం ఏడాదికి రూ. 2400 నుంచి రూ. 24000 వేలకు పెంచటం జరిగిందని, ఐదేళ్లలో పింఛన్ పదిరెట్లు పెరగటం దేశంలోనే ఒక చరిత్ర అన్నారు. అదిచూసి అక్కసు పట్టలేకే బీజేపీ, వైకాపా, టీఆర్ఎస్‌లు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అంటే నరేంద్రమోడీకి అసూయ అని గుజరాత్ కంటే మించిపోతుందనే భయం పట్టుకుందన్నారు. ఏపీ అభివృద్ధి చెందకూడదని కేసీఆర్ పంతంతో ఉన్నారని, తన చేతకానితనం బయటపడుతుందని కేసీఆర్ భయపడుతున్నారన్నారు.

ఆనందమానందమాయే!

• తొలిసారి సభలోకి.. అంతా కొత్తగా... • నూతన ఎమ్మెల్యేల మనోగతం



ఆంధ్రప్రభ, హైదరాబాద్: ప్రజలదీవెనతో తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టిన ఎమ్మెల్యేలు కొత్త అనుభూతికి లోనయ్యారు. తమను దీవించిన ప్రజలకు, అవకాశమిచ్చిన నేతలకు రుణపడి ఉంటామని.. నియోజకవర్గమే దేవాల యంగా పనిచేస్తామని, ప్రజల నమ్మకం నిలుపుకుంటామని అన్నారు. సభలో తొలిసారి ప్రమాణస్వీకారం చేసిన నేతలు అనంతరం తమ అనుభూతిని ఆంధ్రప్రభతో పంచుకున్నారు.

చాలా ఆనందంగా ఉంది: హరిప్రియ నాయక్(ఇల్లందు)

ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగుపెట్టి ప్రమాణ స్వీకా రం చేయడం చాలా ఆనందంగా ఉంది. నాకు ఈ అవకాశమిచ్చిన కాంగ్రెస్‌పార్టీకి, దీవించిన ప్రజలకు రుణపడి ఉంటా. ఇల్లందు నియోజకవర్గ ప్రజలు నామీద పెట్టుకున్న ఆశలు నిలుపుకునేవిధంగా పనిచేస్తా.

సంతోషంగా ఉంది: నన్నపనేని నరేందర్ (వరంగల్ తూర్పు)

శాసనసభలో తొలిసారి అడుగుపెట్టి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయడం చాలా సంతోషంగా ఉంది. వరంగల్ మేయర్‌గా నగర ప్రజలకు సేవచేసిన నేను ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు ఇచ్చిన అవకాశంతో అసెంబ్లీలో అడు గుపెట్టా. వరంగల్ తూర్పు ప్రజలు టీఆర్ఎస్‌పై, నాపై పెట్టుకున్న ఆశలు నిలుపుకునేవిధంగా పనిచేస్తా.

నాకు కేసీఆర్ తిరుపతి వెంకన్న: బొల్లం మల్లయ్యయాదవ్(కోదాడ)

నేను పదిహేనేళ్ళుగా నియోజకవర్గంలో పోరాడుతున్నా. మహాకూటమిలో టికెట్ రాకుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ నా పాలిట తిరుపతివెంకన్న అయి టికెట్ ఇచ్చి గెలిపించారు. నేను కేసీఆర్ గారికి జన్మజన్మలు రుణపడి ఉంటా. అభివృద్ధిలో తెలంగాణ ముఖద్వారమైన కోదాడను సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లల సరసన నిలబెట్టే ప్రయత్నం చేస్తా.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా: క్రాంతికిరణ్(ఆందోల్)

నన్ను జర్నలిస్టుగానే గుర్తించి కేసీఆర్ గొప్ప అవకాశమిచ్చారు. వారికి రుణపడి ఉంటా. జర్న లిస్టుల సమస్యల పట్ల నాకు పూర్తి అవగాహన ఉంది. ఏ సమస్య ఎక్కడివరకు వచ్చిందో కూడా తెలుసు. అన్నీ పరిష్కారానికి నావంతు ప్రయత్నం చేస్తా. ఆందోల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపరుస్తా.

నల్లగొండకు ఐదేళ్ళలో మహర్దశ: కంచర్ల భూపాల్‌రెడ్డి (నల్లగొండ)

గత ఇరవైఏండ్లలో జరగని అభివృద్ధిని ఐదేండ్ల లో చేసి చూపిస్తా. నల్లగొండ ప్రజలు నామీద ఉంచిన నమ్మకానికి జీవితాంతం రుణపడి ఉంటా. అద్భుతంగా అభివృద్ధిచేస్తా.

తొలిసారి అసెంబ్లీకి వచ్చా: మల్లారెడ్డి, మేడ్చల్

గతంలో పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించిన నేను తొలిసారి ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగుపెట్టా. చాలా సంతోషంగా ఉంది. మేడ్చల్ నియోజకవర్గంలో చాలాసమస్యలున్నాయి. చాలా అభివృద్ధి చేయాల్సి ఉంది.

టార్గెట్ పూర్తి చేయలేదని పాకించారు

- చైనా సంస్థ అమానుష చర్య
- అంతర్జాలంలో వీడియో వైరల్
- రంగంలోకి పోలీసులు
- కంపెనీ సీజ్



బీజింగ్: చైనాకు చెందిన ఓసంస్థ నిర్వాకం పట్ల ప్రపంచ వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిర్దిష్ట లక్ష్యాలను చేరుకోలేదన్న అక్కసుతో సదరు కంపెనీ సిబ్బందిని దారుణంగా అవమానించింది. ఆధునిక చరిత్రలో ఎక్కడా ఎప్పుడూ ఎవరూ చూడని అధ్వాన్న శిక్షకు సంబంధించిన వీడియో అంతర్జాలంలో వైరల్ అవుతోంది. ఉద్యోగులను నడిరోడ్డుపై మోకాళ్లపై దోగాడేలా (పాకేలా) శిక్ష విధించింది. అలా సిబ్బంది రోడ్డుపై పాకుతూ వెళ్తున్న వీడియోలు పలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చాయి. దీన్ని వీక్షించిన నెటిజన్లు ప్రపంచ నలుమూలల నుంచి పెద్ద పెట్టున నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటన చైనాలోని టెంజౌ నగరంలో చోటు చేసుకుంది. విషయం పోలీసులకు చేరడంతో వెంటనే ఖాకీలు రంగప్రవేశం చేశారు. బానిసల్లా రోడ్డుపై వంగి నడుస్తున్న సిబ్బందికి విముక్తి కల్పించారు.

అమానవీయ ప్రవర్తనకు కారణమైన సంస్థను అధికారులు సీజ్ చేశారు. ఇందుకు బాధ్యులైన యాజమాన్యంపై కేసులు నమోదు చేశారు. సిబ్బందిని వేధించడం ఈ కంపెనీకి ఇదే కొత్త కాదు. గతంలోనూ ఇలాంటి దుర్మార్గాలకు ఒడిగట్టింది. కిందటిసారి ఉద్యోగులను వరుసగా నిలబెట్టి వరుసబెట్టి అందరి దవడలు ఎడాపెడా వాయించేసింది. అప్పట్లో దీనిపై పెద్దఎత్తున దుమారం రేగింది. మళ్లీ ఇప్పుడు ఇలా.. జరగడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యానికి ఇంతకంటే దారుణమైన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు.

బుల్లెట్ రైలు వచ్చింది

- అహ్మదాబాద్ వాణిజ్య ఎగ్జిబిషన్‌లో పట్టాలెక్కిన జపాన్ రైలు
- అందమైన, ఆధునిక రైలు బండిని ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు




న్యూఢిల్లీ: గుజరాత్‌కు బుల్లెట్ రైలు వచ్చింది. అహ్మదాబాద్ వేదికపై కొలువుదీరి సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గుజరాత్ వైబ్రాంట్ పేరుతో ప్రారంభమైన అంతర్జాతీ వాణిజ్య ఎగ్జిబిషన్‌లో బుల్లెట్ రైలు నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జపాన్ నుంచి ప్రత్యేకంగా ఓడ ద్వారా నాలుగు రోజుల కిందటే ఇక్కడకు చేరింది. గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ట్రేడ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. సదస్సు ముగిసిన తర్వాత దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలలో దీనిని ప్రదర్శనకు ఉంచనున్నట్లు జాతీయ హైస్పీడ్ రైలు కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్) తెలిపింది. ఆకుపచ్చ, గులాబీ, వెండి వర్ణాలతో కూడిన ఈ రైలు నమూనా సిరీస్ ఈ -5 సింకన్‌సేన్ తరహాకు చెందినది. గంటకు 320 కి.మీ వేగంతో దూసుకెళ్ల సామర్థ్యం దీని ప్రత్యేకత. జపాన్ కంపెనీ జేఆర్ (ఈస్ట్) నిర్మించిన ఈ రైలును భారత ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఆ సంస్థ ఇక్కడే ఉంచేందుకు అంగీకరించిందని ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. ఎగ్జిబిషన్‌కు వచ్చిన జపాన్ సందర్శకులతో కలిసి భారత్‌లో జపాన్ కౌన్సెల్ జనరల్ రైలును సందర్శించారు. భారత్‌లో బుల్లెట్ రైలు ప్రాజెక్టు తుది దశకు చేరిందన్నారు. తొలి రెండు ప్రొటోటైప్ సింకన్‌సేన్ రైళ్లను త్వరలో ఇండియాకు తరలిస్తామని చెప్పారు. సమీపకాలంలో సబర్మతి బహుళ రవాణా హబ్‌గా మారనుందని, భారతీయ రైల్వే, బుల్లెట్ రైలు, మెట్రో రైలు, బీఆర్‌టీఎస్‌తో ప్రయాణికులకు ఆకర్షణీయ అనుభూతి కలిగించనుందని చెప్పారు. మూడంచెల పార్కింగ్ సదుపాయం ఉంటుంది. దాదాపు 1115 కార్లు, 300 ద్విచక్ర వాహనాలను ఏకకాలంలో పార్కింగ్‌కు ఉంచవచ్చని వెల్లడించారు.



ఎమ్‌హెచ్‌ని నేను చూశా..!

కౌలాలంపూర్: మార్చి, 4, 2014వ తేదీని ఎవరూ అంత తేలిగ్గా మర్చిపోరు. ఆ రోజున కౌలాలంపూర్ విమానాశ్రయం నుంచి బయలు దేరిన ఎమ్‌హెచ్ 370 విమానం కనిపించకుండా పోయింది. అందులోని 239 మంది ప్రయాణీకులు మరణించారని భావిస్తున్నారు. ఇప్పటికీ ఆ విమానం ఎక్కడ కూలిందో ఎవరూ చెపలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఒక ఇండోనేషియన్ మత్స్యకారుడు ఎమ్‌హెచ్ 370 విమానం కూలిపోవడాన్ని తాను చూశానని చెప్పడం సంచలనంగా మారింది. విరిగిపోయిన గాలి పటంలాగా విమానం సముద్రంలో కూలిపోయిందని చెబుతున్నాడు. విమానం కూలిపోయిన సముంద్ర ప్రాంత గుర్తులను రికార్డు చేశానన్నాడు. 42 సంవత్సరాల రుస్లీ ఖుస్మిన్ అనే మత్స్యకారుడు విమానం కూలిపోయిన సమయంలో ఆ వివరాలు తన వద్ద ఉన్న జీపీఎస్ పరికరంలో నమోదు అయినట్లు వెల్లడించాడు. స్ట్రెయిట్ ఆఫ్ మలక్కా సముద్రంలో కూలిపోయినట్లు చెప్పాడు. ఇతను చెబుతున్న వివరాల ప్రకారం చూస్తే.. ఎమ్‌హెచ్370 విమానంతో సంబంధాలు తెగిపోయిన ప్రాంతం సరిపోలడంతో మలేసియన్ అధికారులు ఈ సమాచారాన్ని ప్రధానికి సైతం పంపించారు. విమానం పొగలు చిమ్ముతూ సముద్రంలో కూలిపోయిందని ఖుస్మిన్ చెప్పాడు. విమానం సముద్రంలో కూలడానికి ముందు గాల్లో బలమైన యాసిడ్ వాసనలు వచ్చినట్లు తెలిపాడు. అయితే ఈ విషయాన్ని వెల్లడించడానికి అయిదేళ్లు ఎందుకు వేచి ఉన్నాడో మాత్రం ఖుస్మిన్ చెప్పలేదు. ఎమ్‌హెచ్ 370 విమానాన్ని కనిపెట్టే ప్రయత్నాలను మలేసియన్ ప్రభుత్వం గత ఏడాదే విరమించుకున్న నేపథ్యంలో తాజాగా ఖుస్మిన్ ప్రకటన సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది.

అక్కడ కాపురం చేస్తే పిల్లలు పుడతారా?



లండన్: ఫలానా పూజలు చేస్తే, ఫలానా ఆకులు తింటే, తాయెత్తులు కట్టుకుంటే, ఆ గుడిలో పూజలు చేస్తే పిల్లలు పుడతారనే నమ్మకాలు మనకు ఉన్నట్లే తెల్లవారికి కూడా ఉన్నాయి. ఇంగ్లాండ్‌లో మంత్రగాళ్లు తక్కువేం కాదు. దాదాపు వెయ్యిమంది మంత్రగాళ్లు బ్రిటన్‌లో జనం నమ్మకాల మీద సొమ్ము చేసుకుంటున్నారు. అందులో కెవిన్ అనే మంత్రగాడి టాలెంట్ మరీ విడ్డూరంగా ఉంటుంది. భూమికి కొన్ని శక్తులుంటాయని, కొన్ని ప్రాంతాల్లో పిల్లలు లేని జంటలు సంభోగం చేస్తే గర్భం దాలుస్తారని నమ్మబలుకుతాడు. ఇరవై సంవత్సరాలుగా ఇదే వృత్తిలో ఉన్న కెవిన్ పిల్లలు కలగని జంటల నుంచి రోజుకి వంద పౌండ్లు ఫీజు వసూలు చేస్తూ హాయిగా జీవితం గడిపేస్తున్నాడు. ఇంగ్లాండ్‌లో కొన్ని ప్రాంతాల్లో సంభోగం చేస్తే పిల్లలు కలుగుతారని, జంటలను కెవిన్ ఆయా ప్రాంతాల వద్దకు తీసుకెళ్లి.. క్రతువులాంటివి నిర్వహిస్తాడు. తరువాత ఆ జంట అక్కడ సంభోగం చేసుకోవడానికి ఏర్పాట్లు చేస్తాడు. కెవిన్ తీసుకెళ్లే ప్రాంతాల్లో కొండ చరియలు, మైదానాలు, కొన్ని స్మశానాలు కూడా ఉండడం విశేషం. సంతాన సాఫల్య కేంద్రాల కన్న తన విధానంలోనే 90 శాతం ఫలితాలు వస్తున్నట్లు కెవిన్ చెప్పడం విశేషం. ఇలా అడవుల్లో పిల్లల కోసం సంభోగం చేసుకుంటున్న ఒక జంట పోలీసులకు పట్టుబడడంతో కెవిన్ తన భాగోతాన్ని బయటి ప్రపంచానికి వెల్లడించాడు. తన ఇరవై సంవత్సరాల కెరీర్‌లో 40 జంటలకు సంతాన యోగ్యం కల్పించినట్లు చెప్పాడు.

వరదలు ఆపడానికి బాలల బలి!



లిమా (పెరు రాజధాని): ప్రపంచ చరిత్రలోనే అత్యంత క్రూరమైన చర్యకు పెరు దేశం వేదికగా నిలిచింది. ఈ దేశంలో పురాతన కాలంలో అయిదు నుంచి పద్నాలుగు సంవత్సరాల పిల్లలను బలి ఇచ్చే సంప్రదాయం ఉండేది. దుష్టశక్తులకు అలా బలి ఇచ్చిన 270 చిన్నారుల కంకాళాలు ఇటీవలే వెలుగు చూశాయి. ఇక్కడి చిము తెగ ప్రజలు ఈ ఘోరానికి పాల్పడినట్లు చరిత్రకారులు గుర్తించారు. పెరు తీర ప్రాంతంలో వరదలు రాకుండా నివారించడానికి ఆనాటి ఆ తెగ ప్రజలు ఈ ఘోరమైన చిన్నారుల బలులకు పాల్పడినట్లు భావిస్తున్నారు. ఈ ఘోర ఉదంతం గత ఏడాది ఏప్రిల్‌లోనే వెలుగు చూసింది. అప్పుడు 137 చిన్నారుల కంకాళాలను పురాతత్వ శాస్త్రవేత్తలు గుర్తించారు. మరిన్ని తవ్వకాలు జరపడంతో మొత్తం 270 పిల్లల కంకాళాలు వెలుగు చూశాయి. ఇంత వరకు 42 మంది చిన్నారులను బలి ఇచ్చిన ఉదంతం మాత్రమే ప్రపంచానికి తెలుసు. మెక్సికో నగరం సమీపంలోని ఒక దేవాలయం వద్ద ఆరువందల సంవత్సరాల క్రితం 42 మంది చిన్నారులను బలి ఇచ్చిన సంఘటన చరిత్ర పుటల్లో నిక్షిప్తమైంది. మూడు వందల మైళ్ల తీరం వెంబడి నివసించే ఆనాటి చిము తెగ ప్రజలు వరదల కారణంగా వ్యవసాయం దెబ్బ తిని ఆహారం లేక ఆకలితో వేలాదిగా మరణిస్తున్న నేపథ్యంలో ఈ బాలల బలులకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. తమ తెగను రక్షించుకోవడానికి చిము పూజారులు, తెగ నాయకులు ఉమ్మడిగా నిర్ణయం తీసుకొని చిన్నారుల బలులకు తెగబడ్డారని గుర్తించారు.

భారతీయ ఆధ్యాత్మిక మైకంలో పడొద్దు

- పౌరులకు చైనా ప్రభుత్వం హెచ్చరిక
- స్థానిక ట్విట్టర్‌లో వీడియో వైరల్
- సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చ





బీజింగ్: ఇండియన్ ఆధ్యాత్మిక పాఠశాలల కోర్సులు, అనుమానిత మత విశ్వాసాలపట్ల అప్రమత్తంగా ఉండాలంటూ తమ దేశ పౌరులను చైనా హెచ్చరించింది. ఆధ్యాత్మిక కోర్సుల బోధిస్తున్న కొన్ని స్కూళ్లు లైంగిక వేధింపుల కేసుల్లో చిక్కుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. దక్షిణభారత దేశానికి చెందిన ఓ సంస్థకు చెందిన ఆధ్యాత్మిక కోర్సులను తైవాన్ నటి ప్రమోట్ చేస్తున్న నేపథ్యంలో పబ్లిక్ సెక్యూరిటీ మంత్రిత్వశాఖ, చైనా పోలీసులు ఈ విధమైన హెచ్చరికలు జారీ చేశారు. దీనిపై చైనా వ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. తైవాన్ నటి నిజంగానే మత విశ్వాసాలను ప్రచారం చేస్తోందా? అని చైనీయులు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు. యి నెంజింగ్ (అన్నీ యి) తైవాన్‌కు చెందిన ప్రముఖ నటి. అమ్మ, భగవాన్ పేరుతో ఆధ్యాత్మిక అంశాలను ప్రమోట్ చేస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సోమవారం సినో వైబొ (చైనా వెర్షన్ ట్విట్టర్) లో పోస్టు చేయబడింది. ఈ వీడియోను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరుకు చెందిన వన్నెస్ యూనివర్సిటీ రూపొందించినట్లు గ్లోబల్ టైమ్స్ టాబ్లాయిడ్ కథనాన్ని ప్రచురించింది. ఇప్పుడిది చైనాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో చైనా హోంశాఖ, మతవిశ్వాసాల వ్యతిరేక సంఘం (సీఏసీఏ) ఈ పోస్టును వైబొలో వైరల్ చేస్తూ, పౌరులను హెచ్చరిస్తున్నారు. కాగా, తొలుత వీడియోను పోస్టు చేసిన తైవాన్ నటి, దీన్ని ట్విట్టర్ నుంచి తొలగించివేసింది. డేరా బాబా పేరు (గుర్మీత్ రాం రహీమ్ సింగ్) ను పరోక్షంగా ప్రస్తావిస్తూ పౌరులకు ప్రత్యేక హెచ్చరికలు చేస్తున్నారు. మత విశ్వాసాల పేరుతో దక్షిణభారత సంస్థలు కొన్ని ఆధ్యాత్మిక పాఠాలను ఆఫర్ చేస్తున్నాయని చైనా మేథావులు ముక్తకంఠంతో వ్యాఖ్యానించినట్లు సదరు పత్రిక పేర్కొంది.

కట్టుతప్పిన ఆధ్యాత్మికం నేరం

- ఇదిలావుంటే, బీజింగ్‌కు చెందిన విద్యావేత్తలు కొందరు ఈ కోర్సులను మరింత లోతుగా విశ్లేషించారు. బుద్ధుడి బోధనలు, క్రైస్తవం మిళితమైన ఆధ్యాత్మిక పాఠ్యాంశాలుగా గుర్తించారు. దీనినే చైనా కేబినెట్ మత విశ్వాసాల ప్రచార పాఠ్యాంశాలుగా భావిస్తోంది.
- ఇదొక చట్టవిరుద్ధమైన మత ప్రచార సంస్కృతి. శ్వాస వ్యాయామాలను కలిగివున్న ఒక రకమైన శస్త్రచికిత్సకు సంబంధించిన అభ్యాసం. దీనిద్వారా అభ్యాసకులను మోసపూరితంగా నియంత్రిస్తుంది అని చైనా సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.
- సామాజిక సంస్కర్త వాదులు ఈ విధమైన కోర్సులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇవి విపరీత పరిణామాలకు దారితీస్తాయి. ఈ ప్రక్రియలో ఒకవేళ ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది మృత్యువాత పడితే, గరిష్టంగా ఏడేళ్ల జైలుశిక్ష, భారీ జరిమానా విధిస్తారని సిక్త్స్ టోన్ అనే వెబ్‌సైట్ పేర్కొంది.
- మతపరమైన విశ్వాసాల పట్ల చైనా అధికారులు కొన్నిదశాబ్దాలుగా చాలా అప్రమత్తంగా ఉంటున్నారు. ఇందుకు బలమైన కారణాలే ఉన్నాయి. 19 వ శతాబ్దంలో తైపింగ్ తిరుగుబాటు దారుడు ఒకరు, తనను తాను యేసు సోదరుడిని అంటూ ప్రచారం చేసుకున్నాడు. ఇది హింసాత్మక సంఘటనలకు దారితీసింది. సుమారు 14 ఏళ్లపాటు ఉద్రిక్తలు కొనసాగాయి. దాదాపు 2కోట్ల మంది పౌరులు బలయ్యారు అని విదేశీ పాలసీ మేగజైన్ తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.
- 2017లో చైనా మతవిశ్వాసాలకు వ్యతిరేకంగా ఓ వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేసింది. మత విశ్వాసాల ప్రచారాన్ని నియంత్రించడం దీని ఉద్దేశం. మతవిశ్వాసాల వ్యతిరేక చట్టానికి సంబంధించిన వివరణ ఇందులో పేర్కొనబడింది. దీనిద్వారా పౌరులను జాగృతం చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది అని చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది.
- ఈ వెబ్‌సైట్ ద్వారా పౌరులు అభ్యంతరకర మతప్రచారంపై ఫిర్యాదు చేయవచ్చు. దాంతో బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం మానసిక చికిత్సను అందిస్తుంది. తప్పిపోయిన బంధువుల ఆచూకీలో సహాయం చేస్తుంది. ఈ వెబ్‌సైట్ వేదికగా మత విశ్వాసాలకు నో అనే సందేశంతో ప్రజలచేత సంతకాలతో ప్రతిజ్ఞ చేయిస్తారు.

మహారాష్ట్రలో డ్యాన్స్ బార్లపై ఆంక్షలు సడలింపు

సీసీటీవీ కెమెరాల ఏర్పాటు వ్యక్తిగత గోప్యతకు భంగం: సుప్రీం



న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని డ్యాన్స్ బార్లపై ఆ రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను సుప్రీంకోర్టు సడలిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2016నాటి నిబంధనలను, లైసెన్సింగ్ విధానాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం పరిమితంచేయాలని, డ్యాన్స్ బార్లను తిరిగి ప్రారంభించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాగా డ్యాన్స్ బార్లలో సీసీటీవీల కెమెరాలు ఏర్పాటు, బార్‌రూమ్స్, డ్యాన్స్ ఫ్లోర్లను వేర్వేరు చేయాలంటూ 2016లో మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలను విధిస్తూ చట్టం తీసుకొచ్చింది. దీనిపై డ్యాన్స్‌బార్లు, రెస్టారెంట్ల యజమానులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రితోకూడిన ధర్మాసనం విచారించి ప్రభుత్వ నిబంధనలు కొన్నింటిని సమర్థించి మరి కొన్నింటిని వ్యతిరేకిస్తూ తీర్పు ఇచ్చింది. 2005 నుంచి ఇప్పటివరకూ కేవలం ఒక్కవ్యక్తికే డ్యాన్స్‌బార్‌కోసం లైసెన్స్ ఇవ్వలేదు. అది సాధ్యంకాదు. నిబంధనలు ఉండవచ్చు కానీ అది మొత్తం నిషేధానికి దారితీయకూడదని సుప్రీం ధర్మాసనం తీర్పును వెలువరిస్తూ వ్యాఖ్యానించింది. డ్యాన్స్ బార్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి కాదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. సీసీటీవీ కెమెరాల ఏర్పాటు వ్యక్తిగత గోప్యతకు వ్యతిరేకమని వ్యాఖ్యానించింది.

డ్యాన్సర్లపై నోట్లు విసరడం నిషేధం

బార్లలో ఆర్కెస్ట్రా ఏర్పాటుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకారం తెలిపింది. అయితే డ్యాన్స్‌చేసే డ్యాన్సర్లపై నోట్లు విసరడాన్ని సుప్రీంకోర్టు వ్యతిరేకిస్తూ వారికి టిప్ ఇవ్వొచ్చని సూచించింది. ఆయాల మతాల ప్రార్థన స్థలాలు, విద్యాసంస్థలకు కిలోమీటర్ దూరంలో డ్యాన్స్ బార్లు ఉండాలన్న ప్రభుత్వ ఆంక్షలను సుప్రీంకోర్టు రాజ్యాంగవిరుద్ధం అని పేర్కొంది. సాయంత్రం 6నుంచి రాత్రి 11.30 గంటలవరకు మాత్రమే డ్యాన్స్‌బార్లు పనిచేయాలని ప్రభుత్వ నిబంధనలను సుప్రీంకోర్టు న్యాయమూర్తి సిక్రీ సమర్థించారు. డ్యాన్స్ చేసే ప్రదేశంలో మద్యం సరఫరాకు కోర్టు అంగీకరించింది. డ్యాన్స్ ఫ్లోర్లు, బార్ రూమ్‌లో వేర్వేరుగా ఉండాలన్న నిబంధన అవసరంలేదని ధర్మాసనం కొట్టేసింది. కాగా 2016లో మహారాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డ్యాన్స్‌బార్ రెగ్యులేషన్ బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. డ్యాన్స్ చేసే ప్రదేశాల్లో మద్యం సరఫరా నిషేధించడం, రాత్రి 11.30 తరువాత బార్లను తప్పనిసరిగా మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. అయితే నృత్యం చేసే ప్రదేశాల్లో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం విధిచిన నిబంధనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

డోక్లాంలో చైనా గోడ..

తుది దశకు నిర్మాణ పనులు

బీజింగ్: భారత సరిహద్దులో రహదారుల నిర్మాణ పనులను చైనా వేగవంతం చేసింది. ఈ రహదారులకు అడ్వాన్స్ టెక్నాలజీని వినియోగిస్తోంది. గతేడాది ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమైన డోక్లాం సరిహద్దు వద్ద అన్ని రకాల వాతావరణాలకు అనుగుణమైన రోడ్లను నిర్మిస్తున్నది. నిఘా వర్గాల తాజా సమాచారం ప్రకారం, డోకాలం సమీపంలో మెరుగ్ లా - డోక్లాంలో బ్లాక్ ట్యాప్ రోడ్డు పనులు తుదిదశకు చేరాయి. గతేడాది సెప్టెంబర్ నుంచి ఈ పనులు కొనసాగుతున్నాయి. ఇది పూర్తయితే, మరిన్ని బలగాలను డోక్లాంకు తరలించే ప్రమాదం ఉంది. మరొక ప్రధాన మార్గమైన యాతుంగ్ - జెలెప్ లా కూడా బ్లాక్‌ట్యాప్ టెక్నాలజీతో నిర్మిస్తున్నారు. తాజా పరిణామాలపై గతవారం భారత ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ వివరణ ఇచ్చారు. సరిహద్దుల్లో మనం కూడా రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేశాం. ప్రస్తుతం చైనాతో సైనిక సంబంధాలు మెరుగ్గానే ఉన్నాయి. ఇటీవలే సంయుక్త విన్యాసాలు పూర్తిచేశాం. మిలటరీ స్థాయి చర్చలకు ముందడుగేశాం. డోక్లాంలో ఉద్రిక్త నుంచి సానుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి అని రావత్ తెలిపారు.

బొగ్గుగనిలో చిక్కుకున్న 15 మంది మృత్యువాత

- నెలరోజుల తరువాత ఆశలు ఆవిరి
- పలువురి అస్థిపంజరాల గుర్తింపు
- డీఎన్ఏ పరీక్ష ద్వారా మృతుల వివరాల నిర్ధారణకు యత్నాలు



న్యూఢిల్లీ/షిల్లాంగ్: మేఘాలయ బొగ్గు గనిలో చిక్కుకున్న 15మంది కార్మికులను వెలికి తీసేందుకు రెస్క్యూ సిబ్బంది చేసిన ప్రయత్నాలన్నీ నిష్ఫలమయ్యాయి. వీరిలో ఒకరి మృతదేహాన్ని గురువారం నేవీ డైవర్లు గుర్తించారు. అనంతరం సహాయక బృందాలు మరికొంతమంది అస్థిపంజరాలను గుర్తించాయి. దీంతో గనిలో చిక్కుకున్న కార్మికులందరూ మృత్యువాత పడినట్టు భావిస్తున్నామని అధికారులు వెల్లడించారు. రిమోర్ట్ ఆపరేటెడ్ వెహికల్స్ (ఆర్‌వోవి) ద్వారా గనిలో అస్థిపంజరాలను వీరు గుర్తించారు. అస్థిపంజరాలను బయటకు తీసుకొచ్చాక డీఎన్ఏ పరీక్షద్వారా మృతుల వివరాలను నిర్ధారించనున్నామని అధికారులు తెలిపారు. ఎలుక రంధ్రాలుగా ఉన్న బొగ్గుగని సుమారు 160 అడుగుల నుంచి 210 అడుగులకు పైన లోతు ఉందని నౌకాదళ ప్రతినిధి ట్విటర్‌లో తెలిపారు. భారత్‌లో రెస్క్యూ సిబ్బంది నిర్వహించిన సుదీర్ఘ ఆపరేషన్ బహుశా ఇదే అయిఉండొచ్చాన్నారు. తూర్పు జయంతియా జిల్లాలో డిసెంబర్ 13న సుమారు 15మంది కార్మికులు ఎలుక రంధ్రాల్లాంటి బొగ్గు గనిలోకి వెళ్లి చిక్కుకుపోయారు. వారు గనిలో ఉన్న సమయంలో వరదలు సంభవించడంతో పక్కనే ప్రవహిస్తున్న లిటైన్ నది నీరు గనిలోకి పోటెత్తింది. అప్పటినుంచి అధికారులు వారిని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. గనిలో నీరు ఎక్కువగా ఉండటంతో సహాయకచర్యలకు అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. అయితే సహాయక చర్యలను ఆపొద్దని ఏదైనా అద్భుతం జరిగి ఎవరైనా ప్రాణాలతో బయటపడొచ్చని సుప్రీంకోర్టు సూచించింది. గనిలో ఉన్న నీటిలో సల్ఫర్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల మరణించిన వారి మృతదేహాలు త్వరగా కుళ్లిపోయి ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు. వాటిని బయటకు తీసి ఎవరి మృతదేహం అనేది నిర్ధారించేందుకు డీఎన్ఏ పరీక్ష చేయడానికి ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకోనున్నారు. దాదాపు 33రోజులుగా నేవీ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితోపాటు, అగ్నిమాపక సిబ్బంది గనిలో చిక్కుకుపోయిన కార్మికుల ఆచూకీ తెలుసుకునేందుకు వారు ఎడతెగకుండా ప్రయత్నిస్తున్నారు.

నో డ్రైవర్... నో డీజెల్

మేడిన్ ఇండియా సోలార్ బస్సు



పగ్వారా: భారతీయ పరిశోధక విద్యార్థులు సోలార్ పవర్‌తో పనిచేసే బస్సును ఆవిష్కరించారు. నూతన నమూనాలో రూపొందించిన ఈ బస్సు తయారీకి రూ.15లక్షలు ఖర్చు అయిందని పరిశోధకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకూ అభివృద్ధి చేసిన ఆటోమెటిక్ వాహనాలను పరిశీలిస్తే పెట్రోల్, డీజిల్, సీఎన్జీలు, గ్రిడ్ ఆధారిత విద్యుత్‌ను ఉపయోగించుకుని ప్రయాణిస్తాయి. నూతనంగా ఆవిష్కరించిన సోలార్ బస్సును ఒక్కసారి ఛార్జ్ చేస్తే సుమారు 70కిలోమీటర్లు నడుస్తుందని తెలిపారు. వాహనంపైన అమర్చిన సోలార్ ప్యానెల్స్ ద్వారా ఛార్జింగ్ అవుతుందని తెలిపా రు. సోలార్ ప్యానెల్స్ ద్వారా రెండు కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి ఆరు యాసిడ్ బ్యాటరీలను కూడా ఛార్జ్ చేయవచ్చాన్నారు. ఈ బస్సు డ్రైవర్ లేకుండానే ప్రయాణిస్తుందన్నారు. రోడ్డుపైన, పరిసరాల్లోని వాహనాలు, వస్తువులను సెన్సింగ్ పరికరాల ద్వారా బస్సు గుర్తిస్తుం దని తెలిపారు. సూర్యుని సాయంతో బ్యాటరీలను నిరంతరంగా ఛార్జింగ్ చేస్తూ ఎంతదూరమైన ప్రయాణం చేయవచ్చని లేదా ఒకసారి ఛార్జింగ్ చేస్తే సుమారు 70కిలోమీటర్లు ప్రయాణిస్తుందని తెలిపారు. పగ్వారాలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులు ఈ సోలార్ బస్సును రూపొందించారు.

శబరిమలకు ఎలక్ట్రిక్ బస్సులు

కేరళ శబరిమల రూట్‌లో ఐదు ఎలక్ట్రికల్ బస్సులను ప్రయోగాత్మకంగా నడిపారు. ఈ మేరకు కేరళ సీఎం కార్యాలయం ట్వీట్ చేసింది. ఈ బస్సులను నడపడం ద్వారా కిలోమీటర్ కు రూ.56 ఆదాయం వచ్చిందని ఆ ట్వీట్‌లో పేర్కొంది. డీజెల్ బస్సులకు కిలోమీటర్‌కు రూ.31లు వ్యయం అవుతుంటే.. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల కిలోమీటర్‌కు అయ్యే వ్యయం కేవలం ఆరు రూపాయలు మాత్రమేనని సీఎం కార్యాలయం పేర్కొంది. కాలుష్య నివారణ లక్ష్యంగా ఎలక్ట్రికల్ బస్సులను విరివిగా వాడకంలోనికి తీసుకురావాలని కేరళ సర్కార్ యోచిస్తున్నది.


ఝూరి (కలశం) కు మొక్కుతున్న మెస్రం వంశీయులు

నాగోబాకు మహాపూజ

ఫిబ్రవరి 4న జాతర.. 7న దర్బార్

ఇంద్రవెల్లి, ప్రభన్యూస్ : ఆదివాసుల ఆరాధ్య దైవం , రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కెస్లాపూర్ నాగోబా జాతరలో భాగంగా మహాపూజకు అవసరమగు గంగా జలం కోసం బుధవారం ఆదిలాబాద్ జిల్లా , కెస్లాపూర్ నుంచి పాదయాత్రతో బయలుదేరిన మెస్రం వంశీయులు ముత్నూర్ గ్రామ పోలిమేరలో బసచేశారు. తమ గ్రామానికి వచ్చిన ఝూరి (కలుషం) దేవతకు గురువారం ఉదయం ముత్నూర్ గ్రామస్థులు, మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. ఝూరి దేవతతో వచ్చిన మెస్రం వంశీయులకు భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం ముత్నూర్ నుంచి పాదయాత్రతో మెస్రం వంశీయులు ఉట్నూర్ మండలంలోని సాలెవాడ గ్రామానికి చేరుకుని బస చేశారు. ఇలా ఇంద్రవెల్లి, ఉట్నూర్ , నార్నూర్, జైనూఢ్ , జన్నారం మండలాల్లోని మెస్రం వంశీయుల ఉన్న గ్రామాల్లో బస చేస్తూ వెళ్లి ఈనెల 25న జన్నారం మండలంలోని గోదావరి హస్తీన మడుగు చేరుకుని ప్రత్కే పూజలతో గంగాజలం సేకరించనున్నట్లు తెలిపారు. గంగాజలం సేకరించి తీరు ప్రయాణంలో భాగంగా ఈనెల 31 న ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలతో గంగాజలం సేకరించనున్నట్లు తెలిపారు. గంగాజలం సేకరించి తిరుగు ప్రయాణంలో భాగంగా ఈనెల 31న ఇంద్రవెల్లి మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అదేరోజు సాయంత్రం కెస్లాపూర్ సమీపంలోని మర్రి చెట్టు (పడమర) వద్దకు చేరి బస చేయనున్నారు. మర్రి చెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు ఫిబ్రవరి 1, 2,3 వరకు విశ్రాంతి తీసుకోవడంతోపాటు సంప్రదాయ తూమ్ (కర్మకాండ) పూజలు చేయనున్నట్లు కటోడ మెస్రంహన్మంత్ రావ్ తెలిపారు.

ఫిబ్రవరి నాలుగున పుష్యమాసం అమావాస్య ను పురస్కరించుకుని గోదావరి నది హస్తీన మడుగు నుంచి తీసుకువచ్చిన గంగాజలంతో నాగోబ ఆలయాన్ని శుద్ధి చేసి మహాపూజలు నిర్వహించి నాగోబా జాతరను ప్రారంభించనున్నారు. పిబ్రవరి ఏడు దర్బార్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా మెస్రం వశంకం కటోడ (పూజారి) ,మెస్రంహన్మంత్ రావ్, మెస్రం వంశీయులు మెస్రం కోసు, మెస్రం తిరుపతి మెస్రం గణపతి తదితరులున్నారు.


ముత్నూర్ నుంచి పాదయాత్రతో గంగాజలానికి వెళుతున్న మెస్రం వంశీయులు



తారాస్థాయిలో పంచాయతీ ప్రచారం

వికారాబాద్ జిల్లాలో కారు జోరు

కాంగ్రెస్‌కు కష్టాలు


గ్రామాలలో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి

వికారాబాద్, ప్రభన్యూస్: జిల్లాలో మొదటి విడత పంచాయతీల పోలింగ్‌కు మూడు రోజులే మిగిలి ఉంది. తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలలోని పంచాయతీలలో మొదటి విడత ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ పంచాయతీలలో ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరుకుంది. గ్రామ పంచాయతీలలో పాగా వేసేందుకు ముఖ్యనేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలలో మెజార్టీ స్థానాలను సాధించాలని టీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే పార్టీ నేతలను ఆదేశించింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా ఇదే వ్యూహంతో ముందుకు సాగుతోంది. దీంతో ఆయా పార్టీలకు చెందిన ముఖ్యనేతలు పంచాయతీ ఎన్నికలలో కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు. తాండూరులో టీఆర్ఎస్ తరపున మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి..కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ముమ్మర ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఉండడంతో టీఆర్ఎస్ నేతలు జోరుగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నేతలు గ్రామాలలో ప్రజలకు సర్ది చెప్పడం విషయంలో కొంత ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలలోని 249 గ్రామ పంచాయతీలలో మొదటి విడత ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో 34 పంచాయతీలలో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మిగి లిన పంచాయతీలలో ఎన్నికలకు జిల్లా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 21న ఈ పంచాయతీలలో పోలింగ్ ఉంటుంది. అదే రోజు ఫలితాలు సైతం వెలువడుతాయి. పోలింగ్‌కు కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉండడంతో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. పంచాయతీలలో టీఆర్ఎస్.. కాంగ్రెస్ మద్దతుదారుల మధ్య ద్విముఖ పోరు సాగుతోంది. తాండూరు నియోజకవర్గంలోని 143 పంచాయతీలలో ఇప్పటికే 16 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ఏకగ్రీవ పంచాయతీలలో టీఆర్ఎస్ మద్దతుదారులు మెజార్టీ స్థానాలను దక్కించుకున్నారు. మిగిలిన పంచాయతీలలో పోరు నువ్వా..నేనా అన్నట్లు సాగుతోంది.

టీఆర్ఎస్ మద్దతుతో పంచాయతీ బరిలో ఉన్న అభ్యర్థుల గెలుపు కోసం ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి విస్తృత ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. గత మూడు రోజులుగా నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటిస్తున్నారు. టీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని మహేందర్‌రెడ్డి సూచిస్తున్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందని.. గ్రామాల అభివృద్ధికి ఇదే చక్కటి అవకాశం అని పేర్కొంటున్నారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ నిధులతో పాటు జిల్లా పరిషత్ నుంచి మంజూరు చేసిన నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకున్నామని మహేందర్‌రెడ్డి పేర్కొంటున్నారు. అభివృద్ధికి దూరంగా ఉండిపోయిన అనుబంధ గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా చేసిన ఘనత కూడా టీఆర్ఎస్ పార్టీది అని పేర్కొంటున్నారు. టీఆర్ఎస్ మద్దతుతో గ్రామ పంచాయతీలలో పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఇక కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఎన్నికల ప్రచారంలో అభ్యర్థిస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గ్రామాలలో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రోహిత్‌రెడ్డి పేర్కొంటున్నారు. ఎక్కడి నుంచి గ్రామాల అభివృద్ధికి నిధులను తీసుకువస్తారు అనే ప్రశ్నలకు మాత్రం ఆయన సమాధానం చెప్పడం లేదు. రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఆ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులు దూసుకపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో టీఆర్ఎస్ ఘన విజయం సాధించడంతో పాటు ఆ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గ్రామాలలో ఆ పార్టీ అభ్యర్థులు గెలుపుపై ధీమాగా కనిపిస్తున్నారు. కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రావు అని క్షేత్రస్థాయిలో గులాబీ నేతలు చేస్తున్న ప్రచారం కొంత ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. పల్లెలపై ముఖ్యనేతలు గురి పెట్టడంతో పంచాయతీ పోరు ఆసక్తికరంగా మారింది.


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

అర్ధనారీశ్వరుడి ప్రతిరూపాలం

- హిందూ ధర్మంలో మాకూ వాటా ఉంది
- కుంభమేళాలో ఉద్ఘాటించిన కిన్నర్ అఖాడా
- చరిత్రలో తొలిసారి హిజ్రాలకు ఆశ్రమం, మేళాలో ఆశ్రయం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కుంభమేళా ఓ చారిత్రక ఘట్టానికి వేదికైంది. చరిత్రలోనే తొలిసారిగా హిజ్రాలకు ఆశ్రయం కల్పిస్తూ ఆశ్రమం ఏర్పాటైంది. ప్రధాన సాధుసంతులు, పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామీజీల అఖాడాలతో సమానంగా హిజ్రాలు ఏర్పాటు చేసుకున్న 'కిన్నర్ అఖాడా'కు గౌరవం దక్కింది. మకర సంక్రాంతి రోజు హిందూ మత గురువులు, సాధుసంతుల పుణ్యస్నానాలతో మొదలైన అర్ధ కుంభమేళాలో హిజ్రా సాధ్వీలకు కూడా చోటు దక్కింది. ఇంతకాలం మతగురువులుగా మగవారికే అగ్రతాంబూలం దక్కగా, మహిళా సాధ్వీలు సైతం అఖాడాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే స్త్రీ, పురుషులు కాకుండా సమాజంలో భాగంగా ఉన్న థర్డ్ జెండర్ 'హిజ్రాల'కు కూడా ఆశ్రమం ఏర్పటవడం హిందూ ధార్మిక చరిత్రలోనే తొలిసారి. సమాజంలోనే కాదు హిందూ ధర్మంలోనూ తాము భాగమేనని తమ అఖాడా చాటి చెబుతోందని కిన్నర్ అఖాడా అధిపతి ఆచార్య లక్ష్మీనారాయణ త్రిపాఠి చెబుతున్నారు. సాధారణ జనంలో భాగంగా వచ్చి పుణ్యస్నానాలు చేసే తమకు కుంభమేళాలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేయడం ఆధ్యాత్మిక దివ్యానుభూతినిచ్చిందని తెలిపారు.

కుంభమేళాలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు ఆశ్రమాలను ఏర్పాటు చేసుకుంటారు. అయితే వాటిలో 13 ప్రధాన అఖాడాలకు మాత్రమే అధికారిక గుర్తింపు ఉంది. అయినా సరే మిగతావారికి అడిగిన చోట ప్రభుత్వం స్థలం కేటాయిస్తూ తగిన ప్రాధాన్యత కల్పిస్తూనే ఉంటుంది. కానీ తొలిసారిగా హిజ్రాల ఆశ్రమానికి ప్రభుత్వం స్థలాన్ని ఏర్పాటు చేయగా, 'కిన్నర్ అఖాడా' పేరుతో వారంతా అత్యద్భుతంగా ఆశ్రమాన్ని తీర్చిదిద్దారు. హిజ్రా సాధువుల ఆశీస్సులు పొందేందుకు కుంభమేళాకొచ్చిన వేలాది మంది భక్తులు కిన్నర్ అఖాడా ముందు క్యూ కడుతున్నారు. 2014లో భారత దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బ్రిటీష్ కాలం నాటి చట్టాన్ని రద్దు చేస్తూ హిజ్రాలను మూడో లింగంగా గుర్తించాలంటూ తీర్పునివ్వడం వారికి కొండంత బలాన్నిచ్చింది. అయితే అది సమాజంలో విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు పొందడానికి ఉపయోగపడుతుందేమో తప్ప హిందూ ధార్మిక పీఠాల్లోకి ఆహ్వానం మాత్రం అంత సులభంగా అందలేదు. ఇందుకోసం హిజ్రా సాధువులు పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చింది. అయితే ఇది తమ హక్కుల కోసం చేసే పోరాటంగా వారు అంగీకరించడం లేదు. తాము లేని హక్కుల కోసం అడగడం లేదు, హిందూ పురాణేతిహాసాల్లో హిజ్రాల ప్రస్తావన ఉందని, కిన్నరలుగా తమను పేర్కొనేవారని అఖాడాలో ఇతర హిజ్రా సాధువులు చెబుతున్నారు. హిందూ ధర్మంలో భాగమైన తమకు గుర్తింపు, సామాజిక ఆమోదం మాత్రమే కోరుకుంటున్నామని వారు తెలిపారు. సామాజిక ఆమోదం పొందే క్రమంలో కుంభమేళాలో చోటివ్వడం ఒక పెద్ద విజయంగా వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి హిజ్రాల ఆశ్రమం ఏర్పాటుకు హిందూ మతగురువుల నుంచి తొలుత తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. స్త్రీ, పురుషులతో సమానంగా తమకూ అఖాడా ఏర్పాటు చేసుకునే అవకాశమివ్వాలని హిజ్రా సాధువులు కోరినప్పుడు తమవి శతాబ్దాల కిందటి అఖాడాలని, కొత్త సమూహాన్ని ఏర్పాటు చేయటానికి అంత సులభంగా అంగీకరించలేమని అఖాడాల అధిపతులు అడ్డుకున్నారు. అందరితోపాటుగా హిజ్రా సాధువులు, వారి సమాజం మొత్తం కుంభమేళాకు ఆహ్వానితులేనని, కానీ వారిని అఖాడాగా గుర్తించలేమని 13 అఖాడాల్లో అతి పెద్దదైన జునా అఖాడా అధికార ప్రతినిధి విద్యానంద్ సరస్వతి ప్రకటించారు. ఆధ్యాత్మికతను, మతాన్ని విస్తరించాలని ఎవరు కోరుకున్నా తాము దానికి వ్యతిరేకం కాదని, కానీ కొన్ని నిర్దిష్ట అంశాలను తమకే వదిలివేయాలని వ్యాఖ్యానించారు.



కానీ ఆ తర్వాత కిన్నర అఖాడాకు జునా అఖాడా సహా దాదాపు అందరూ మద్ధతిచ్చారు. కిన్నెర అఖాడా ప్రయాగలో జరిగుతున్న కుంభమేళాలో తొలిసారి అఖాడా ఏర్పాటు చేసినప్పటికీ, 2016లో ఉజ్జయినీలో కుంభమేళాలో వీరు ర్యాలీ నిర్వహించారు. అయితే హిందూమతంలో అత్యంత పవిత్రమైన నగరాల్లో ఒకటైన ప్రయాగ త్రివేణి సంగమంలో ప్రదర్శన నిర్వహించటం ఒక ప్రత్యేకమైన విషయమైతే, ఏకంగా అక్కడ ఆశ్రమాన్నే ఏర్పాటు చేయడం మరింత విశిష్టమైన అంశం.ఇందుకోసం చేసిన పోరాటంలో ప్రజల నుంచి తమకు అనూహ్యమైన మద్ధతు లభించిందని వారు చెబుతున్నారు. సమాజం నుంచి అవహేళన, అవమానాలతో పాటు ప్రత్యేక గౌరవం కూడా తమకు ఉంటుందని, పిల్లలు పుట్టినప్పుడు, పెళ్లిళ్లు వంటి శుభకార్యాల్లో తమ ఆశీస్సులు తీసుకుంటూ ఉంటారని హిజ్రా సాధువులు గుర్తుచేశారు. కానీ తమను హిందూ మత గురువులుగా కూడా సమాజం గుర్తించడం ఎంతో భిన్నమైన అనుభవమని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ మహాశివుడే అర్ధనారీశ్వరుడిగా పూజలందుకోగా, అర్ధనారీశ్వరుడికి ప్రతిరూపమైన హిజ్రా సాధువులను మత గురువుగా గుర్తించడంలో అభ్యంతరం ఏముంటుందని భక్తులంటున్నారు.

శ్రీశైలంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

పార్వతీ సమేత మల్లికార్జునుడికి ప్రత్యేక పూజలు

స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేకంగా పూర్ణాహుతి





కర్నూలు, ప్రభ న్యూస్ బ్యూరో : శ్రీశైలంలో బ్రహోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి.మకర సంక్రమణ పుణ్యకాలంను పురస్కరించుకొని పంచాహ్నిక దీక్ష తో నిర్వహించబడే సంక్రాంతి బ్రహోత్సవాలలో అరవరోజు పార్వతి సమేత మల్లికార్జునునుకి విశేష పూజలు నిర్వహించారు.ఇక శ్రీస్వామి యాగశాలలో శ్రీ చండీశ్వరసామికి ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి.పూజాధి కార్య క్రమం అనంతరం పూర్ణహుతి,కలశోద్వాసన,త్రిశూల స్నానం,మహాదాశీర్వచనం నిర్వహించారు.పూర్ణహుతి కార్యక్రమంను శాస్త్రోక్తంగా నారికేళాలు,సుగంద ద్రవ్వాలు, ముత్యం, పగడం, బంగారం, వెండి, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్వాలను హోమగుండలంలోకి అహుతిగా సమర్పించి రుద్రయాగ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం జరిగిన వసంతోత్సవంలో అలయ అర్చకులు,వేదపండితులు వసంతాన్ని సంత్రక్తంగా భక్తులపై ప్రోక్షించారు. ఆ తర్వాత చండీశ్వర స్వామికి అలయ ప్రాంగణంలోని మల్లికా గుండంలో వైదిక శాస్త్రోక్తంగా అవబృధస్నానం నిర్వహించారు.

సదస్యం నాగవల్లి

బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంత్రం స్వామి, అమ్మవార్లకు నిత్య కళ్యాణ మండపంలో సదస్యం, నాగవల్లి కార్యక్రమాలు నిర్వహించారు. సదస్యం కార్యక్రమంలో వేదపండితుల చేత వేదస్వస్తి నిర్వహించారు. నాగవల్లిలో భాగంగా సంక్రాంతి పర్వదినాన కళ్యాణోత్సవం నిర్వహించబడిన పార్వతీదేవి అమ్మవారికి ఆగమశాస్త్ర సాంప్రదాయం మేరకు మెట్టలు, నల్లపూసలు సమర్పించారు. ఇక సాయంకాలం ధ్వజారోహన కార్యక్రమం కూడా చేపట్టారు. ఇందులో భాగంగా మొదటిరోజున బ్రహ్మోత్సవ ప్రారంభోత్సవ సూచకంగా ఆలయ ధ్వజస్థంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపతం, అవరోహణ చేశారు.

సుబ్రమణ్యస్వామికి విశేష అభిషేకం

లోకకళ్యాణ నిమిత్తం కృతిక నక్షత్రాన్ని పురస్కరించుకొని దేవస్థాన ఆలయ ప్రాంగణంలోని సుబ్రమణ్యస్వామికి విశేష పూజలు నిర్వహించారు. కృతిక నక్షత్రం, షష్టితిథి రోజులలో సుబ్రమణ్యస్వామికి విశేష అభిషేకం, పూజాధికారలు, దేవస్థానం సేవగా నిర్వహించబడతాయి. అందులో భాగంగానే కుమార స్వామి జన్మ నక్షత్రమైన కృతిక నక్షత్రంలో ఆయనకు పూజలు జరపడం ఆనవాయితీగా వస్తుందని అర్చకులు పేర్కొన్నారు. లోకకళ్యాణమే కాకుండా ప్రతిఒక్కరికీ ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలిగి ఆయా పనులు సక్రమంగా జరగడమే కాకుండా సుబ్రమణ్యస్వామి అనుగ్రహంతో ఎటువంటి శత్రు బాధలు, గ్రహపీడలు, దృష్టి దోశాలు మొదలైనవి తొలిగి మానవుడికి మరింత శక్తివంతంగా పనిచేసుకునే అవకాశం లభిస్తుందన్నది విశ్వాసం. అలాగే సంతానం కోసం పూజించే వారికి తప్పక సంతాన సౌభాగ్యం లభిస్తుందని ఈ పూజలో విశేషాలు. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, పాడి సంవృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా చూడాలని, అన్ని సామాజిక వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటూ అర్చక స్వాములు సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం తర్వాత నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ జరిపి అనంతరం సుబ్రమ ణ్యస్వామికి అభిషేకం, అష్టోత్తరణలు, పారాయణము చేశారు. సుబ్రమణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతమైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. వీటివల్ల ఎంతో ఫలితం ఉంటుందన్నది ఆగమాలు చెబుతున్నాయి.

నేటి కార్యక్రమాలు

శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలలో చివరిరోజులో భాగంగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలతో పాటు అశ్వవాహన సేవ, ఆలయ ఉత్సవం, స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం, సైనోత్సవం, ఏకాంత సేవ పూజలను నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన పురోహితులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

డిచ్‌పల్లి, ప్రభన్యూస్ : నిజామాబాద్ జిల్లా, డిచ్‌పల్లి పోలిస్ స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారి నాకాతాండ వద్ద ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా పలువురుకి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ నవీన్ కువ ార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్‌కు చెందిన గౌర్ శెట్టివార్ ప్రకాష్, చందా దంపతులు వారి కుటుంబ సభ్యులు ఈ నెల 11న తీర్థయాత్రలకు బయలుదేరివెళ్లారు. తీర్థయాత్రలు ముగించుకుని విమానాశ్రయంలో బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకుని విశ్రాంతి తీసుకున్న అనంతరం గురువారం రాత్రి బయలుదేరి వస్తుండగా తెల్లవారుజామున డిచ్‌పల్లి మండలంలోని నాకాతాండ 44వ జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు కుప్పకూలిందని ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి క్షతగాత్రులను బయటకు తీశారు. ప్రమాదంలో ప్రకాష్(74), చందా(68)లు మరణించారన్నారు. మృతుల కుమారుడు శ్రీనివాస్, అతని భార్య సుష్మిత, పిల్లలు శ్రీతేజ, జగన్నాథ్, మరో కుమా రుడు శివప్రసాద్ అతని భార్య హారిక, పిల్లలు గాయత్రి, శౌర్యలు గాయపడగా ఆంబు లెన్స్‌లో జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

దుబాయిలో నిజామాబాద్ జిల్లావాసి ఆత్మహత్య

ముప్కాల్, ప్రభన్యూస్ : నిజామాబాద్ జిల్లా, ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన అనికేశి హన్మాండ్లు, ప్రమీలకు ముగ్గురు సంతానం . ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కొడుకు అనికేశి మారుతి , చిన్న కుమారుడు అనికేశి అరుణ్ (29) గల్ఫ్ దేశం (దుబాయి) లో బుధవారం అతని గదిలోని ఎవరు లేని సమ యంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అతని స్నేహితుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో మృతుని కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. ఆత్మహత్యకు కారణాలు ఇంకా ఏమి తెలియదని వారి కుటుంబ సభ్యుల్లో ఒకరు మృతదేహాన్ని దుబాయి నుంచి స్వగ్రామానికి తొందరగా వచ్చేటట్లు చర్యలు చేపట్టాలని అధికారులకు , నాయకులకు కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

ఆసీస్ గడ్డపై తొలివన్డే సిరీస్‌ను గెలుచుకోవడానికి కోహ్లీ సేన తహతహలాడుతోంది. మెల్‌బోర్న్‌లో నేడు చివరి వన్డేలో ఆస్ట్రేలియా పై గెలిచి వన్డే సిరీస్ గెలిచిన జట్టుగా వీడ్కోలు చెప్పాలని భారత్ భావిస్తోంది. ఇప్పటివరకు మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో చెరొక మ్యాచ్‌ను గెలిచిన ఇరు జట్లకు ఈ వన్డే కీలకంగా మారింది. నేటి వన్డేలో గెలిస్తే భారత్ 2018-19 టూర్లో ఆస్ట్రేలియాలో ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా పర్యటన ముగించిన జట్టుగా కూడా కోహ్లీ సేన పేరు సాధిస్తుంది. ఈ పర్యటనలో భారత్ ఇప్పటికే టీ20 సిరీస్‌ను 1-1తో డ్రా చేయగా, టెస్ట్ సిరీస్‌ను 2-1తో గెలుచుకుంది.

చారిత్రాత్మక గెలుపు కోసం...

- కోహ్లీ సేన సిద్ధం
- నేడు ఆస్ట్రేలియా- భారత్ మధ్య మూడో వన్డే

ఉ.7.50 గం. నుంచి మ్యాచ్ ప్రారంభం



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో భారత్ పర్యటన తుది దశకు చేరుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారిగా వన్డే సిరీస్‌ను గెలిచేందుకు భారత్ సిద్ధమైంది. ఆస్ట్రేలియాలో టెస్ట్ మ్యాచ్ సిరీస్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించిన కోహ్లీ సేన, వన్డే సిరీస్ గెలుపుపై కన్నేసింది. 1-1తో సమానంగా ఉన్న ఇరుజట్లు శుక్రవారం జరిగే మ్యాచ్‌లో ఎవరు గెలిస్తే వారికే ఈ సిరీస్ సొంతమవుతుంది. సిడ్నీలో జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 34 పరుగుల తేడాతో గెలువగా, అడిలైడ్‌లో జరిగిన రెండో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారత జట్టు ఇప్పటివరకు ఆసీస్ గడ్డపై వన్డే సిరీస్ గెలుపొందలేదు. ఆస్ట్రేలియాలో జరిగిన 1985- వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ క్రికెట్‌లో విజేతగా నిలిచిన భారత్ అనంతరం 2008లో సీబీ సిరీస్‌లో విజేతగా నిలిచింది. 2016లో ఆస్ట్రేలియా లో చివరిసారిగా భారత్ ఆడిన వన్డే సిరీస్‌లో 4-1తో పరాజయం పాలైంది. నేటి వన్డేలో గెలిస్తే భారత్ 2018-19 టూర్లో ఆస్ట్రేలియాలో ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా సిరీస్ ముగించిన జట్టుగా కోహ్లీ సేన పేరు సాధిస్తుంది. టీ20 సిరీస్‌ను 1-1తో డ్రా చేయగా, టెస్ట్ సిరీస్‌ను 2-1తో గెలుచుకుంది. రెండో వన్డేలో సాధించిన గెలుపుతో ఉత్సాహంతో మూడో వన్డే బరిలోకి దిగనున్న భారత జట్టుకు ఐదో బౌలర్ లేని లోటు స్పష్టంగా కన్పిస్తోంది.

ఓపెనింగ్ భాగస్వామ్యం సమస్యలో ఆసీస్

ఆరోన్ ఫించ్, అలెక్స్ కేరీలు దీర్ఘమైన ఇన్నింగ్స్ ఆడుతూ.. ఓపెనింగ్ భాగస్వామ్యం చేయక పోవడంతో ఆజట్టుకు బలమైన ప్రారంభం దొరకటంలేదు. ఆస్ట్రేలియా మూడో వన్డేకోసం జట్టులో రెండు మార్పులు చేసింది. రెండు వన్డేల్లో ఒక్క వికెట్ కూడా పడగొట్టని స్పిన్నర్ నాథన్ లియాన్ స్థానంలో అడం జంపా జట్టులోకి వచ్చాడు. కాగా పేసర్ జాసన్ బెహ్రన్‌డార్ఫ్ గాయంతో మూడో వన్డేకు దూరమయ్యాడు. అతని స్థానంలో బిల్లీ స్టాన్‌లేక్ జట్టులోకి వచ్చాడు. ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్‌కు మరోసారి మొండిచెయ్యి చూపారు. నాథన్ లియాన్ రెండు వన్డేల్లో వికెట్లు పడగొట్టనప్పటికి బౌలింగ్ బాగా వేశాడని కెప్టెన్ ఫించ్ పేర్కొన్నాడు. అయినా పరిస్థితులను బట్టి మార్పులు తప్పలేదని పేర్కొన్నాడు. ఎంసీజీమైదానంలో ఇరు జట్లు 14 వన్డేలు ఆడగా.. 9 వన్డేల్లో ఆస్ట్రేలియా గెలిచింది.

ఐదో బౌలర్ లేని లోటు

ఇప్పటివరకు ఈ సిరీస్‌లో సీనియర్ పేసర్లు భువనేశ్వర్ కుమార్, మహ్మద్ షమీ తమ ప్రతిభను చాటగా, లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజాలు బంతిపై పట్టు సాధించినప్పటికి పూర్తిస్థాయిలో రాణించలేదు. హార్దిక్ పాండ్యా గైర్హాజరీలో భారత్ ఫుల్‌టైం సీమర్‌ను ఆడించాల్సి వచ్చింది. ఖలీల్ అహ్మద్ (0/55), మహ్మద్ సిరాజ్‌లు (0/76) వికెట్లను పడగొట్టడంలో విఫలమయ్యారు. గత రెండు వన్డేల్లో కొనసాగించిన బ్యాటింగ్ లైనప్‌నే మూడో వన్డేలో భారత్ కొనసాగించడం కీలకంగా మారింది. అంబటి రాయుడిని మళ్లీ బౌలింగ్‌కు దించేందక ు కోహ్లీ సంసిద్ధంగా లేడు. అతని బౌలింగ్‌పై ఇప్పటికే ఐసీసీ అనుమానాలు వ్యక్తం చేసి అతని పరీక్షించాలని నిర్ణయించింది. సీమ్ బౌలింగ్ ఆల్ రౌండర్ విజయ్ శంకర్, లెగ్ స్పిన్నర్ యుజువేంద్ర చాహల్ ఇద్దరూ జట్టులో స్థానంకోసం పోటీపడుతున్నారు. గురువారం ఎంసీ మైదానంలో వీరివురూ తీవ్రంగా ప్రాక్టీస్‌లో మునిగిపోయారు. శంకర్ మూడో సీమ్ బౌలర్‌గానే కాక, అదనపు బ్యాట్స్‌మన్‌గా ఉంటూ బ్యాటింగ్ లైనప్‌ను మరింత పటిష్టం చేసే అవకాశాలున్నాయి. అయితే భారత టీం మేనేజ్‌మెంట్ శంకర్‌ను విశ్వసించి వన్డేల్లో అరంగేట్రానికి అతనికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఒక ఎత్తైతే.. అతినితో పూర్తిగా 10 ఓవర్లను బౌలింగ్‌ను చేయనిస్తారా అన్నది సందేహమే. మహ్మద్ సిరాజ్ తన బౌలింగ్ బాధ్యతను నెరవేర్చడంలో తడబడ్డాడు. రెండో వన్డేలో చివరి మూడు ఓవర్లు వేసిన తీరు ఇచ్చిన పరుగులను చూస్తే.. కోహ్లీకి అతని బదులు యుజువేంద్ర చాహల్‌ను తీసుకుంటే ఉత్తమమన్న ఆలోచనలో ఉన్నాడు. విశాలమైన ఎంసీజీ మైదానంలో అటాకింగ్ బౌలింగ్ చేస్తూ.. తొలి పది ఓవర్లలోనే స్పిన్ బౌలింగ్ చేయాలంటే.. చాహల్‌కు మించిన ఆప్షన్ ఉండదని పరిశీలకులంటున్నారు. ఒకవేళ శంకర్‌ను ఆడిస్తే.. బ్యాటింగ్ లైనప్‌కు అంతరాయం కలుగుతుంది. అదేవిధంగా కేదార్ జాదవ్‌కు అవకాశం కల్పించాల్సి వస్తుంది. ఐదో బౌలర్‌గా జాదవ్, శంకర్‌లకు చెరి ఐదో ఓవర్లు లేదా పరిస్థితులకనుకూలంగా అవకాశమివాల్సి ఉంటుంది. వీరికి చోటిస్తే.. అంబటి రాయుడు లేదా దినేష్ కార్తీక్‌లను పక్కన పెట్టాల్సి వస్తుంది. కార్తీక్, రాయుడులు ఇటీవల జట్టులో కీలకంగా మారిన నేపథ్యంలో వారిద్దరిలో ఎవరో ఒకరిని పక్కన పెట్టడం సమస్యే. రోహిత్, శిఖర్ ధావన్, ధోని, దినేష్, రాయుడు, కోహ్లీలు మంచి ఫామ్‌లో ఉండటంతో రెండో వన్డేలో బౌలర్ల మార్పుతోనే కోహ్లీ ఇతరులకు అవకాశమిచ్చి బరిలోకి దిగే అవకాశముంది.

జట్లు

భారత్: విరాట్ కోహ్లీ(కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, అంబటి రాయుడు, దినేష్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోని(వి.కీ), కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చాహల్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్, విజయ్ శంకర్.

ఆస్ట్రేలియా(ఫైనల్ ఎలవన్): ఆరోన్ ఫించ్(కెప్టెన్), అలెక్స్ కేరీ(వి.కీ), పీటర్ హాండ్స్ కోంబ్, ఉస్మాన్ ఖవాజా, షువాన్ మార్ష్, గ్లెన్ మాక్స్‌వెల్, జే రిచర్డ్‌సన్, పీటర్ సిడిల్, బిల్లీ స్టాన్‌లేక్, మార్క్స్), బిల్లీ స్టాన్‌లేక్, మార్కస్ స్టొయినెస్, అడం జంపా.

క్వార్టర్ ఫైనల్లో సైనా, కిదాంబి



కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత టాప్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్‌లు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఏడో సీడ్‌తో బరిలోకి దిగిన సైనా హాంకాంగ్‌కు చెందిన ప్యూ యిన్ యిప్‌ను 21-14, 21-16 తేడాతో ఓడించింది. 39 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్ తొలి గేమ్ ప్రారంభం నుంచి సైనా ఆధిక్యాన్ని చాటింది. రెండో గేమ్‌లో అదే జోరుతో సాగి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో సైనా 2017 వరల్డ్ చాంపియన్ రెండో సీడ్ జపాన్‌కు చెందిన నజోమి ఒకుహరాను ఢీకొననుంది. ఒకుహరాతో ఇప్పటివరకు ఆడిన 12 మ్యాచుల్లో సైనా 8 గెలువగా, ఒకుహరా 4 మ్యాచుల్లో విజయం సాధించింది. ఇందులో గత ఏడాది డెన్మార్క్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెనల్లో ఆడిన మ్యాచులున్నాయి.

శ్రీకాంత్ విజయం

గత ఏడాది ఒక్క టైటిల్‌ను కూడా గెలుచుకోకుండా 2018 సీజన్‌ను ముగించిన కిదాంబి శ్రీకాంత్ ఈ ఏడాది పోటీలను ఆశావహంగా ప్రారంభించాడు. పురుషుల సింగిల్స్‌లో రెండో రౌండ్లో హాంగ్‌కాంగ్‌కు చెందిన వాంగ్ వింగ్ కి విన్సెంట్‌ను 23-21, 8-21, 21-18 తేడాతో ఓడించాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్ టై బ్రేకర్ వరకు సాగింది. చివరికి గేమ్‌ను శ్రీకాంత్ సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో వాంగ్ వింగ్ పూర్తిగా పైచేయి సాధించి విజయం సాధించాడు. మూడో గేమ్‌లో పుంజుకున్న శ్రీకాంత్ గేమ్‌ను సొంతం చేసుకుని మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. క్వార్టర్స్‌లో శ్రీకాంత్ కొరియాకు చెందిన వరల్డ్ నెంబర్ 5 ఆటగాడు సాన్ వాన్ హోతో తలపడనున్నాడు. సాన్ వాన్‌తో ఇప్పటివరకు తొమ్మిది సార్లు తలపడగా, శ్రీకాంత్ నాలుగుసార్లు సాన్‌వాన్ 5 సార్లు గెలుపును అందుకున్నారు. మాజీ కామన్వెల్త్ క్రీడల్లో చాంపియన్‌గా నిలిచిన పారుపల్లి కశ్యప్ ఇండోనేషియాకు చెందిన అంథోని సినిసుక చేతిలో 17-21, 23-25తేడాతో ఓటమి పొంది టోర్నీ నుంచి వైదొలిగాడు. మహిళల డబుల్స్‌లో కూడా ఈరోజు కలిసి రాలేదు. అశ్విని పొన్నప్ప- ఎన్ సిక్కిరెడ్డి జోడీ 18-21, 17-21 తేడాతో ఇండోనేషియా జోడీ నికిటట్ మహాదేవి ఇస్త్రాణి- రిజ్కి అమీలియా ప్రదీప్తా జోడీ చేతిలో పరాజయం పాలైంది.



భారత్‌తో వన్డేలకు కివీస్ జట్టు ఇదే!



వెల్లింగ్టన్: భారత్‌తో ఆడే వన్డే సిరీస్‌కోసం న్యూజిలాండ్ జట్టులోకి తిరిగి టామ్ లాథమ్, కోలిన్ గ్రాండొమ్మి వచ్చారు. వరల్డ్ నెంబర్ 2 జట్టు భారత్‌ను ఎదుర్కొనేందుకు న్యూజిలాండ్ గట్టి జట్టును బరిలోకి దించే ప్రయత్నంలో వీరిని తిరిగి జట్టులోకి తీసుకున్నట్లు న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. గురువారం, న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు భారత్‌తో ఆడే వన్డేసిరీస్‌కోసం 14మంది ఆటగాళ్ల జాబితాను ప్రకటించింది. 23న నేపియర్‌లో ఇరు జట్ల మధ్య జరిగే తొలి వన్డేతో సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో భారత్ ఐదు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. ఇటీవల ముగిసిన శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌కు టామ్ లాథమ్, గ్రాండొమ్మిలకు విశ్రాంతినిచ్చిన న్యూజిలాండ్ సెలెక్టర్లు భారత్‌తో ఆడే వన్డే సిరీస్‌కు వీరిని 14 మంది ఆటగాళ్ల జట్టుకు ఎంపిక చేశామని తెలిపింది. శ్రీలంకతో ఆడిన టీ20 మ్యాచ్‌కు ఎంపిక కాని స్కిప్పర్ కానె విలియమ్సన్, పేసర్ ట్రెంట్ బోల్ట్‌తో పాటు ఫిట్‌నెస్ సాధించిన మిచెల్ సాంట్‌నర్ పేర్లను కూడా ఆటగాళ్ల జాబితాలో చేర్చారు. 10 నెలల పాటు గాయాల కారణంగా జట్టుకు దూరమయిన సాంట్‌నర్ శ్రీలంకతో జరిగిన టీ20తో జట్టులోకి వచ్చాడు. న్యూజిలాండ్ కోచ్ గారిస్టెడ్ మాట్లాడుతూ.. జట్టు ఎంపి కలో రెండు అంశాలను దృష్టిలో పెట్టుకున్నాము. ప్రథమం గా వరల్డ్ కప్‌ను దృష్టిలో పెట్టుకోగా, రెండు ప్రాధాన్యతగా వరల్డ్ నెంబర్ 2 భారత్‌ను ఓడించాలన్న లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని జట్టు ఎంపిక చేశామని చెప్పాడు.

న్యూజిలాండ్ జట్టు: కానె విలియమ్సన్ (కెప్టెన్), ట్రెంట్ బోల్ట్, డౌడ్ బ్రాస్‌వెల్, కోలిన్ డి గ్రాండొమ్మి, లాకి ఫెర్గున్‌సన్, మార్టిన్ గుప్తిల్, మ్యాట్ హెన్రీ, టామ్ లాథమ్, కోలిన్ మున్రో, హెన్రీ నికోలసన్, మిచెల్ స్టాంటర్, టిమ్ సోదీ, రాస్ టేలర్.



మనుషులే తప్పులు చేస్తారు

పాండ్యా, రాహుల్‌కు గంగూలీ మద్దతు

కోల్‌కతా: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హార్దిక్ పాండ్యా, రాహుల్‌లకు మద్దతుగా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ నిలిచాడు. తప్పులు మనుషులే చేస్తారు. వారు తమ తప్పిదాలను గుర్తించి పశ్చాత్తాప పడుతారు. తప్పులు చేయకుండా ఉండేందుకు మనుషులు యంత్రాలు కాదు. మళ్లీ ఇటువంటి తప్పిదాలు జరుగకుండా మనం జాగ్రత్త పడాలని గురువారం ఒక ఈవెంట్లో పాల్గొన్న గంగూలీ అన్నాడు.

మూడో రౌండ్లోకి సెరీనా, జకోవిచ్



మెల్‌బోర్న్: అమెరికన్ స్టార్ వీనస్ విలియమ్స్ తన 24 గ్రాండ్ స్లామ్ టైటిల్ దిశగా సాగుతూ ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో మరో గెలుపును అందుకుంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో సెరీనా 6-2, 6-2 తేడాతో కెనడాకు చెందిన రాడ్ లావెర్ అరెనాను ఓడించింది. ఈరోజు గెలుపు తేలికగానే అందుకున్నాను అని 37 ఏళ్ల సెరీనా మ్యాచ్ అనం తరం వ్యాఖ్యానించింది. పురుషుల సింగిల్స్‌లో నెం1 సెర్బియాకు చెందిన నొవా క్ జకోవిచ్ ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌కు చెందినే జొ విల్ ఫ్రెడ్ టిసాం గాను ఓడించి తర్వాతి రౌండ్లోకి చేరగా.. యువకి శోరం అలెగ్జాండర్ జెవెరెవ్, మెద్వెదేవ్ కూడా మూడో రౌండ్లోకి ప్రవేశించాడు. మహిళల సింగి ల్స్‌లో టాప్ సీడ్ సిమోనా హలెప్‌తో పాటు వీనస్ విలియమ్స్, ముగురుజా, స్విటోలినా, ఎ న్.ఓసాకా, కెప్లిస్కోవా, ఎం కీస్, ఎ సెవాస్టొవాలు కూడా 3 రౌండ్లోకి ప్రవేశించారు.

గ్రామీణ క్రీడాకారుల కోసమే క్రికెట్ ఫెడరేషన్

- రాజీవ్ ట్రోఫీ పోటీలను ప్రారంభించిన వీహెచ్, అజారుద్దీన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : క్రికెట్ ఆట డబ్బున్నవాళ్లకే పరిమితమైందని క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు అన్నారు. ప్రతిభ గల గ్రామీణ క్రీడాకారులకు క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం సీఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్ ఇండియా రాజీవ్‌గాంధీ 32 క్రీడోత్సవాలను వాటర్ వర్క్స్ క్రికెట్ గ్రౌండ్‌లో మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఇండియన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజారుద్దీన్ కలిసి ప్రారంభించారు. ఈ క్రీడల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామీణ క్రిడాకారుల టీమ్‌లు పాల్గొన్నాయి. మొదటి రోజు హైదరాబాద్, నేపాల్‌కు చెందిన టీమ్‌లు తలపడగా హైదరాబాద్ టీమ్ విజయం సాధించింది. బీహర్- రాజస్థాన్, విదర్భ- అండమాన్ నికోబర్ రాష్ట్రాల టీమ్‌లు పోటి పడగా బీహర్, విదర్భ రాష్ట్రాల టీమ్‌లో విజయం సాధించాయి. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ క్రికెట్ ఆటలో చాలా మంది గ్రామీణ యువతకు ఎంతో ప్రావీణ్యం ఉన్నప్పటికి పోటీ ప్రపంచలో రాణించలేకపోతున్నారని ఆయన తెలిపారు. విజేతలైన క్రిడాకారులకు ఇచ్చే ప్రోత్సాహంపై పన్నును ఎత్తివేయాలని ఆయన సూచించారు. ప్రతి జిల్లా కేంద్రంలో 10 ఎకరాల్లో క్రీడా మైదానాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని వీహెచ్ కోరారు. సీఎస్ఐ ఆధ్వర్యంలో గ్రామీణ యువతకు ప్రోత్సాహం ఇవ్వడం అభినందనీయమని మాజీ ఎంపీ అజారుద్దీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో రంజీ ప్లేయర్ అసదుద్దీన్, శేషునారాయణ, హైదరాబాద్ క్రికెట్ సోషియేషన్ కార్యదర్శి హరూన్‌హుస్సేన్, సీఎఫ్ఐ అధ్యక్షులు సయ్యద్ సాదిక్‌పాష, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌గౌడ్, తమిళనాడు క్రికెట్ సంఘం అధ్యక్షులు ఇఫ్తార్ షరీఫ్, కార్యదర్శి అమర్‌జిత్ కుమార్ హాజరయ్యారు.

పాండ్యాతో జట్టులో సమతూకం

శిఖర్ ధావన్

మెల్‌బోర్న్: టీవీ షోలో మహిళలపై అను చిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన బౌలింగ్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టుకు అవశ్యమని భారత ఓపెనర్ శిఖర్ ధావన్ పేర్కొన్నాడు. టీవీ షోలో చేసిన పాండ్యా వ్యాఖ్యలను కెప్టెన్ కోహ్లీ కూడా ఖండించాడు. ఈ నేపథ్యంలో పాండ్యా జట్టులో చేరితే జట్టులో సమతూకం ఏర్పడుతుందని శిఖర్ పేర్కొనడం ఆసక్తిగా మారింది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న ప్రస్తుత వన్డే సిరీస్‌లో భారత్ ఐదో బౌలర్ లేమితో కష్టపడుతోందన్నాడు. శుక్రవారం ఆసీస్‌తో ఆడే వన్డేకోసం మెల్‌బోర్న్‌కు జట్టుతో పాటు చేరుకున్న ధావన్ గురువారం ప్రీ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు. నేడు వన్డే సిరీస్ విజేతను తేల్చే నిర్ణాయక మ్యాచ్‌లో భారత్ ఆతిథ్య దేశంతో ఆడనుంది. తొలి రెండు వన్డేల్లో విఫలమైన ఖలీల్ అహ్మద్, మహ్మద్ సిరాజ్‌లను పక్కన పెట్టే ఆలోచనలో టీం మేనేజ్‌మెంట్ ఉంది. ధావన్ ఈ ఇద్దరు పేసర్లకు మద్దతు తెలుపుతున్నప్పటికి.. జట్టులో ఒక ఆల్ రౌండర్ ఉంటే జట్టు సమతూకంగా ఉంటుందన్నాడు. 'పాండ్యా మాతో చేరితే జట్టులో సమతూకం ఏర్పడుతుంది' అని ధావన్ అన్నాడు. కేదార్ జాదవ్ అడినప్పుడు కూడా అతని స్పిన్ బౌలింగ్ మాకు కీలకమే. అతను బంగారు చేతులాంటివాడు. చాలాసార్లు అతను పెద్ద భాగాస్వామ్యాలను విడదీశాడు. టెస్టుల్లో ఆల్ రౌండర్ల పాత్రకు ఎంత ప్రాముఖ్యత ఉందో అంతే స్థాయిలో వన్డేలో కూడా వారికి ఉందన్నాడు. పేసర్లు ఖలీల్, సిరాజ్‌లపై వ్యాఖ్యానిస్తూ.. వారు ఇప్పుడే జట్టులోకి వచ్చారు. యంగ్‌స్టార్స్ సమయంతోపాటు పరిణితి సాధిస్తారన్నాడు.

టెన్నిస్ బాల్ బాయ్స్‌తో క్రికెటర్లు



మెల్‌బోర్న్ పట్టణం అటు ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ అభిమానులతో సందడిగా మారగా, ఇటు భారత్- ఆస్ట్రేలియా చివరి వన్డే మ్యాచ్ ఇక్కడే నిర్వహించనుండటంతో క్రికెట్ అభిమానులు కూడా వెల్లువెత్తుతు న్నారు. భారత క్రికెటర్లు గురువారం జరిగిన టెన్నిస్ మ్యాచ్‌లను తిలకిం చారు. అనంతరం బాల్ బాయ్స్‌తో కలిసి ఫొటోలకు పోజిచ్చారు. క్రికెటర్లు కేదార్ జాదవ్, విజయ్ శంకర్, మహ్మద్ షమీ, దినేష్ కార్తీక్, రోహిత్ శర్మలు వీరిలో ఉన్నారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
Lively
Interaction
For
Ever
లైఫ్
శుక్రవారం 18 జనవరి 2019

ఆర్గాంజా...

అన్ని సందర్భాలకు


ఈమధ్యకాలంలో ఆర్గాంజా బాగా ప్రాధాన్యత సంతరించుకుంటోంది. ఇదిప్పుడు ఎక్కువ ట్రెండ్‌లో ఉన్న ఫ్యాబ్రిక్. ఇందులో నైలాన్, పాలియెస్టర్ లాటి వివిధ సింథటిక్ మెటీరియల్ లో కూడా చీరలు వస్తున్నాయి. చీర అంతా ఒకేలాగా డిజైన్, నేత ఉంటుంది. చీర నేసిన నాణ్యతనుబట్టి దాని లుక్ ఉంటుంది. మెత్తటి, పల్చని ఆర్గంజా అన్ని సందర్భాలలో కట్టుకోవడానికి అందరూ ఇష్టపడుతున్నారు. ఈ చీరలు, సాయంత్రపు దుస్తులుగా ధరిస్తోరు. ఆర్గాంజాలో పెళ్లికూతురికోసం ప్రత్యేక చీరలు నేస్తారు. చీరలే కాదు కర్టెన్లు, రెడీమేడ్ డ్రస్‌లు, ఇలా ఎన్నో విధాలుగా ఆర్గాంజా వస్త్రాన్ని ఉపయోగిస్తున్నారు. చూడటానికి, అందంగా, హుందాగా కనిపించే వివిధ డిజైనర్ ఆర్గాంజా చీరలివి.





సూర్యాస్తమయ నగరం..సరస్సుల నగరం.. ప్రేమ నగరం.... రాజపుత్రుల రాజసానికి,సంస్కృతికి,విజ్ఞానానికి నిదర్శనం.. ఉదయపూర్. శ్వేతనగరంగా కూడా పేరున్న ఈ నగరం పశ్చిమ భారతంలోని రాజస్థాన్ రాష్ట్రంలో ఉంది. దేశంలోనే అత్యంత పర్యాటక ఆకర్షణ కలిగిన నగరం ఇది. ఇక్కడి సరస్సులు, రాజప్రాసాదాలు, అబ్బురపరిచే స్థానికుల జీవన విధానం ..స్వదేశీ,విదేశీ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఉదయపూర్ పర్యటనలో తప్పక సందర్శించాల్సిన అంశాల గురించి తెలుసుకుందాం!

పర్యాటక ప్రేమ నగరం!




☞ రాజస్థాన్ రాష్ట్రంలోనే అత్యంత సుందరమైంది... రాజపుత్రుల రాజసానికి అద్దం పట్టేది...ఉదయపూర్ సిటీప్యాలెస్! పిచోలా సరస్సు ఒడ్డున ఉన్న ఈ భవనంలో భద్రపరిచిన చారిత్రాత్మక కళాఖండాలను చూసి తీరవల్సిందే. ఈ ప్యాలెస్‌లో అందంగా అలంకరించిన గదులు, ఇతర నిర్మాణాలు. ఎంతో విలువైన పెయింటింగ్స్‌ను చూసేందుకు రెండు కళ్లూ చాలవంటే అతిశయోక్తి కాదు.

☞ ఈ భవనం కూడా పిచోల సరస్సు ఒడ్డున ఉంది. రాజపుత్రుల కాలం నాటి శిల్పశైలికి ఇది దర్పణంగా నిలుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ రాజస్థానీ సాంస్కృతిక సంగీతం, నృత్యాలు ప్రదర్శించబడుతున్నాయి. ముఖ్యంగా ధారోహర్ జానపద నృత్యం, తోలుబొమ్మల ప్రదర్శన, వివిధ రాజస్థానీ నృత్యాలు, సంగీత రూపాలు పర్యాటకుల మనస్సులను రంజింప చేస్తాయి.అందుకే బగోర్ కి హవేలి భవన శిల్పకళావైభవంతో పాటు ఆ ప్రదర్శనలు తప్పక సందర్శించాలి.

☞ ఉదయపూర్‌లోని సరస్సులకే తలమానికం ఈ పిచోలా సరసు. నాలుగు కిలోమీటర్ల పొడవు,మూడు కిలోమీటర్ల వెడల్పు కల్గిన ఈ సరస్సులో జగ్ నివాస్,జగ్‌మందిర్ అనే రెండు ద్వీపాలున్నాయి. ఈ సరస్సు ఒడ్డున అందమైన నిర్మాణాలు, హోటళ్లు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. ఇక్కడ స్నానం చేసేందుకు వీలుగా ఘాట్‌లు కూడా నిర్మించారు. సరసు మధ్యలో లేక్ ప్యాలెస్ ఉంటుంది. సరస్సులో షికారు చేసేందుకు బోట్లు అందుబాటులో ఉంటాయి. వర్షాకాలంలో ఈ సరస్సులో బోటుప్రయాణం అందమైన అనుభూతి.



☞ ఉదయపూర్ పర్యటనలో అక్కడ లభించే ఎంబ్రాయిడరీ జాకెట్లను కొనడం మరిచి పోవద్దు.అంత అందమైన డిజైన్లతో జాకెట్లు దేశంలో మరెక్కడా లభించవు. వివిధ డిజైన్లు, రంగులు, రకరకాల మోడళ్లలో ఇక్కడ లభించే జాకెట్లు పర్యాటకుల మనస్సులను దోచుకుంటాయి.

☞ భోజన ప్రియులకు ఫతే సాగర్ లేక్ పరిసరాలు స్వర్గధామమే. ఫతే సాగర్ సరస్సు పిచోలా లేక్‌కు ఉత్తర భాగంలో ఉంది. సరుస్సు పరిసరాల్లో లభించే ఆహార పదార్థాలు నోరూరిస్తాయి. సరస్సు అందాలను తిలకిస్తూ..ఆహారాన్ని భుజించడం మీ పర్యటనలో మరిచిపోలేని మధురానుభూతిగా మిగిలిపోతుంది.

చర్మ రక్షణకు రసాలు

అందంగా ఉండాలని జెండర్ తేడా లేకుండా అందరూ అనుకుంటారు. కాని చర్మపు మెరుపు కోసం పైనుంచి వాడే కాస్మెటిక్‌ల వలన ఉపయోగం ఎక్కువ ఉండదు. చర్మం కాంతులీనాలంటే సంతులిత ఆహారం తీసుకోవడంతో పాటు ఆహారంలో జ్యూస్‌లను చేర్చుకుని కొన్ని చర్మసంరక్షణ ప్రక్రియలు చేపట్టాలి. క్రమం తప్పకుండా వీటిని తాగితే మంచి ఫలితం ఉంటుంది.

కొలాజెన్ పెంచేస్మూతీలు

ఒక కప్పు చిలగడదుంపలు(ఉడికించి పొట్టుతీసి), 115 గ్రాముల అనాస, 1 ఆరెంజ్1 స్పూన్ అవిసెగింజలు, ఒక అరస్పూన్ కేము కేము పౌడర్, ఒక కప్పు నీరు, ఒక కప్పు ఐసు వేసి జ్యూస్ చేయాలి.

చర్మం డీటాక్స్ కోసం

ఒకటిన్నర కప్పు పాలకూర, కీరదోస ఒకటి, ఒక నాస్పతి, ఒక నిమ్మకాయరసం, 2 ఉల్లికాడలు, ఒక స్పూన్ సబ్జా గింజలు, ఒక కప్పు నీరు, ఒక కప్పు ఐస్. జ్యూస్ చేయాలి.



చిన్న విషయాలే... ఛిద్రం చేస్తాయి

ప్రేమ అనే పదానికి విస్తృత అర్థం ఉంది. నిజమైన ప్రేమలో స్వార్థం ఉండదు. కట్టిపడేసుకోవాలనే తాపత్రయం ఉండదు. బంధంలో ఉన్న అవతలివ్యక్తిని స్వేచ్ఛగా ఉండనిస్తారు. ఆవిడకి/ఆయనకి నేను చాలా స్వేచ్ఛనిచ్చాను అని కొంతమంది దగ్గర వింటుంటాం. కాని స్వేచ్ఛ అనేది ఇంకొకరు ఇవ్వలేరు. వేరొకరు తీసుకోలేరు. అప్పుడు అది స్వేచ్ఛ ఎలా అవుతుంది? నియంత్రణ అవుతుంది.

తాను ప్రేమిస్తున్నా అనే వ్యక్తి ఎలా ఉంటే అలా స్వీకరించగలిగిన విశాలదృక్పథం ఇద్దరికీ ఉండాలి. మనం ప్రేమించే వ్యక్తి మీద అనుక్షణం నిఘాపెట్టి తనకు నచ్చినట్లే అవతలి వ్యక్తి ఉండాలనే భావనవలననే ప్రేమ పేరుతో దగ్గరైనవారు, పెళ్లిచేసుకున్న దంపతుల మధ్య పొరపొచ్చాలు మొదలయ్యేది అక్కడే. అతను/ఆమె నా సొంతం అనుకుంటారు. సొంతం అవడానికి వారు వస్తువు కాదు. భావావేశాలున్న మనిషి. వారిలో ఉన్న ప్లస్‌లు, మైనస్‌లు అన్నిటినీ తీసుకోవాలి.

ఆ వ్యక్తి నాకే సొంతం అనే భావన ఎప్పుడైతే వెర్రితలలు వేస్తుందో అప్పుడు అది మానసిక వ్యధకు కారణం అవుతుంది. ప్రతి చిన్న విషయం భూతద్దంలో కనిపిస్తుంది. వారి చుట్టూ రక్షణ వలయం గీయడమో లేదా వారిని కోల్పోతామని అనుక్షణం భయపడుతూ ఉండటం వలన అవతలివ్యక్తి చికాకుకు లోనవుతారు. మిమ్మల్ని వదిలించుకుని ఎలా వెళ్లాలా అని ఆలోచించే అవకాశం ఉంది. మీరు చూపించే నాది అనేభావంలో అభద్రతాభావం ఉండచ్చు. అతి ప్రేమ ఉండవచ్చు, లేదా అమాయకత్వం ఉండవచ్చు. కాని దాని ఫలితం మీ శారీరక, మానసిక ఆరోగ్యం మీద, అలానే మీ బంధం మీద తప్పకుండా పడుతుంది. ముందుగా అవతలి వ్యక్తి మీద ఈ అంచనాలు చాలా చిన్నగానే మొదలవుతాయి. మనిద్దరం కలిసి మరింత సమయం ఎందుకు గడపట్లేదు? నాకంటే మీ కుటుంబానికే ఎక్కువ ప్రాముఖ్యతనిస్తున్నావు. ఎందుకు పని పేరు మీద ఎప్పుడూ ఊళ్లు తిరుగుతావు. నాకు ఇవన్నీ నచ్చవు.

ఇలా మొదలైన వివాదాలు నెమ్మదిగా భావోద్వేగాల నియంత్రణ వరకు వచ్చేస్తాయి. వీటికి పరిష్కారం మన ఆలోచనాధోరణి నుంచే రావాలి. నాది మాత్రమే అనే భావన మొదలైంది అంటే అభద్రత భావన పెరుగుతోంది. కాబట్టి అది పోగొట్టుకోవాలి. ఆమె/అతని మీద ఎక్కువగా ఆధారపడి ఉండకూడదు. దానివలన వారు మీకు మరింత ప్రాముఖ్యత ఇవ్వాలన్న అంచనాని పెంచుతుంది. కాబట్టి ఈ అంశం మీద దృష్టిపెట్టాలి. ప్రతివారికి తమ మీద తమకి ప్రేమ ఉండాలి. తన మీద తనకి ప్రేమ ఉన్నవారికి ఇతరుల ప్రేమ కావాలనే అతి కోరిక ఉండదు. ఆత్మవిశ్వాసం అలవరచుకోవాలి. నాకు మాత్రమే సొంతం అనే భావన మిమ్మల్ని పట్టి పీడించదు. వారి ఫేస్‌బుక్, వాట్సాప్ ఎకౌంట్ల మీద నిఘా పెట్టడం, అనుమానించడం మానెయ్యాలి. వారితో దగ్గరగా ఉండే వ్యక్తులను అనుమానాస్పద దృష్టితో చూడటం సరికాదు. వారి భావోద్వేగ నియంత్రణ మీ చేతుల్లో ఉండాలనే ఆలోచన విరమించుకోవాలి. ఇలా చిన్న చిన్న విషయాల మీద దృష్టి పెడితే మీ నుంచి మిమ్మల్ని రక్షించుకుంటారు. ఎప్పుడూ సంతోషంగా ఉంటారు. మీతో బంధంలో ఉన్నవారు కూడా ఆనందంగా ఉండగలుగుతారు.



సహజ స్థితి అంటే?

చింతన



గాఢ నిద్రలోనూ, తీవ్ర ధ్యానంలోనూ అసలు నేను ఉంటుంది. అసలు నేను అంటే ఆత్మే. ఆ స్పృహే ఎరుక. ఎరుక లేనివాడు బయటి ప్రపంచాన్ని, అది అందించే అనేక అనుభవాలకు, సవాళ్లకు ప్రతిస్పందిస్తూ, కాలాన్ని వెళ్లదీస్తుంటాడు. మనసు, బుద్ధి, చిత్తం, అజ్ఞానం ఆధారంగా ప్రతి విషయాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తూ, నిరంతర ఘర్షణకు లోనవుతాడు. ప్రపంచంతో ఉన్న సంబంధమంతా ఇంద్రియాలకు లోబడే ఉంటుంది. అనుక్షణమూ మార్పు చెందే సర్వ ప్రపంచాన్ని వాస్తవంగా భావింపబడిన దాని యందు మమకారాన్ని పెంచుకుంటాడు.

అతిశయంతో, అదే ప్రపంచంతో పోటీపడి దానిపై ఆధిపత్యం కోసం ఆరాట పడతాడు. పోరాటం చేస్తాడు. ఆ ప్రయత్నంలో విజయం సాధించలేకపోయినపుడు విషాదాన్ని అనుభవిస్తాడు. నిజానికి ఇదంతా ఒక వృధా ప్రయాసే.

దేహం జడం. ఇంద్రియాలు జడం. ప్రాణంగా పిలువబడే వాయువు, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆత్మానందమయ అనబడే పంచకోశాలు, మనసు, బుద్ధి, అహంకారం ఇవన్నీ జడమే. అవిద్య, అజ్ఞానం కూడా జడమే. అన్నీ నీడల వంటివే. ఇవన్నీ కానిదే 'సత్'. అది చైతన్య విలసితం. అదే ఆత్మ.

ఇటువంటి పరిస్థితులలో జ్ఞాని ఎలా ఉంటాడు? జ్ఞాని సాక్షిగా ఉంటాడు! ఆత్మవలె నిశ్చలంగా ఉంటాడు. ఆ స్థితి సర్వానందమయం.

'నేనుగా' మేనుతో ఉన్నా, 'అసలు నేనుగా' ఉంటాడు. ఉన్నదంతా విభూతి స్థితే. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలను దాటి వాటికి అతీతంగా ఆత్మ వలె ఉంటాడు.

దేహం జడం. ఇంద్రియాలు జడం. ప్రాణంగా పిలువబడే వాయువు, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆత్మానందమయ అనబడే పంచకోశాలు, మనసు, బుద్ధి, అహంకారం ఇవన్నీ జడమే. అవిద్య, అజ్ఞానం కూడా జడమే. అన్నీ నీడల వంటివే. ఇవన్నీ కానిదే 'సత్'. అది చైతన్య విలసితం. అదే ఆత్మ. ఏది నిత్యమో, సత్యమో, శాశ్వతమో అది మాత్రమే ఆత్మ. మిగిలినవన్నీ అనాత్మే. ఈ స్పృహ కలగటం కోసం తీవ్ర సాధన చేయాలి.

ఏది అన్ని కాలాలలో ఉన్నదో, దానిని వెదకవలసిన పనిలేదు. అది కనబడుతూనే ఉన్నది. చేయవలసిందల్లా ఆత్మను అనుభవంలోకి తెచ్చుకోవటమే. ఏ దేహాన్ని నిత్యసత్యంగా భావిస్తున్నామో అది నిజం కాదని ఎరగటమే ఎరుక.

జీవుడు, ఈశ్వరుడు రెండూ నిజానికి ఒకటే. ఉన్న తేడా అంతా నామరూప తత్త్వాలలోనే. మనసుతో చూచినంతకాలం ఇదే భావముంటుంది. తన నిజ రూపాన్ని అనుభవించాలన్న అన్వేషణలో చివరకు భేదం లేదని గ్రహించి స్థిమితం కలుగుతుంది.

వ్యక్తి ఒకడే. అతడే ఒకరికి తండ్రి, మరొకరికి కొడుకు, అల్లుడు, స్నేహితుడు, యజమాని, భర్త ఇలా...

నటుడు ఒక పాత్రను పోషించే సమయంలో ఆ పాత్రే తానుగా వెలిగిపోతాడు. రంగు తుడుచుకుని, వేషం తీసివేయగానే తన సహజ స్థితిలో ఉంటాడు. ఉన్న తేడా అంతా వేషంలోనే.

ఆ విధంగానే జీవుడు కూడా తన స్థితిని స్పష్టంగా ఎరిగి, తన స్వస్వరూపాన్ని తెలుసుకోగలిగితే తన అసలు స్థితి దైవమే అన్న భావనలో స్థిరపడతాడు. అప్పుడు జీవుడు, జగత్తు జగదీశ్వరుడు ఒకటే అనే అద్వైత స్థితిని పొంది ఆనంత స్వరూపుడై ఉంటాడు. అదే ఆత్మ నిష్ఠ, ఉద్వేగమెరుగని నిజ స్థితి. సహజ స్థితిఅది, ద్వంద్వాలు లేని ఏక స్థితి. శూన్య పూర్ణ స్థితులు ఏకమైన స్థితి. జ్ఞానాజ్ఞానాలు అంటూ ఏమీ లేని స్థితి. కానీ అన్నీ ఉన్న స్థితి. నిరంతరానందం శాశ్వతంగా నిలకడ చెందిన స్థితి. అదే ఎరుక.

ఏకాంతంలో సమూహాన్ని, సమూహంలో ఏకాంతాన్ని అనుభవించగలిగితే అది ఆత్మ నిష్ఠ. అహం అంతమైన వేళ. ఆత్మను ఎరిగి ఉండటమే అసలు తపస్సు. చీకటి లేదు అంటే ఉన్నది వెలుగే అని అర్థం.



- వి.యస్.ఆర్. మూర్తి
9440603499

జీవులు, భౌతిక ప్రకృతి అనాది



అధ్యాయం 13, శ్లోకం- 20

**ప్రకృతిం పురుషం చైవ
విద్ధ్యనాదీ ఉభావపి।
వికారాంశ్చ గుణాంశ్చైవ
విద్ధి ప్రకృతిసంభవాన్॥**

తాత్పర్యం

జీవులు, భౌతిక ప్రకృతి రెండూ అనాది అని తెలిసికొనవలెను. వాని యందలి పరివర్తనములు, భౌతిక గుణములనునవి భౌతిక ప్రకృతి నుండి ఉద్భవించినవి.

భాష్యం

జీవుడు మరియు పరమాత్మ ఇరువురూ భగవంతుని విభిన్న వ్యక్త రూపములేనని అర్థం చేసుకొనవలెను. అయితే జీవుడు శక్తిలో భాగమయితే, పరమాత్మ భగవంతుని విస్తార అవతారము. వారిరువురూ శాశ్వతమైన వారే. అనగా వారు సృష్టికి పూర్వము నుండే ఉండి, అవసరమైనపుడు వ్యక్తమవుతారు. నిజానికి జీవుడు స్వతహాగా భగవంతునిలో విభిన్న అంశ. అయితే విధేయతను కోల్పోయినపుడు ఈ భౌతిక ప్రకృతిలో బంధింపబడతాడు. ఈ ప్రక్రియ ఎలా జరుగుతుందో అర్థం చేసుకోవటము అంత ముఖ్యము కాదు. అది భగవంతునికే తెలుసు. భౌతిక ప్రకృతిని అనుభవించాలనే కోరికే, జీవి ఈ ప్రపంచమున ఇన్ని ఇబ్బందులు పడటానికి కారణమవుతుందని చెప్పబడినది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఏసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

అనన్య శరణాగతునికి కొదవేమిటి?

మహనీయుల జీవకారుణ్యం

పరమాత్మపై లేదా సద్గురువుపై అనన్య భక్తి ఉన్న వారికి లౌకిక భయాలు వంటివి ఉండవు. కష్టాలు వచ్చినా వారు శరణువేడేది ఆ భగవంతునే లేదా గురువునే. వారి కంటె సమర్థులైన పరిష్కర్తలు లోకంలో ఎవరుంటారు?

జీవించినా మరణించినా భగవత్సేవే

అనంతాచార్యులు శేషాంశ సంజాతుడు. గురువైన శ్రీరామానుజుల ఆజ్ఞ ప్రకారం, తన సతీమణితో తిరుమలకు వచ్చి అక్కడ నివాసం ఏర్పరచుకున్నారు.



మాధవరావు

ఆయన వేంకటేశ్వరునితో సంభాషించటం సర్వసాధారణ విషయం.

ఒకరోజు వేంకటేశ్వరుని కోసం పుష్ప సేకరణ చేస్తున్నారు తోటలో. ఆయనను ఒక నాగు పాము కాటు వేసింది. ఆయన నియమ నిష్ఠలు తెలిసినవాడు అయినందున పాము తనను తాకిందనే ఉద్దేశంతో స్నానం చేసి వచ్చి మళ్లీ పుష్ప సేకరణ చేయసాగాడు. పాము కాటు గురించి విన్న ఆయన శిష్య బృందం చికిత్సకు ప్రయత్నించగా ఆయన వారించాడు. ఈ వార్త కొద్ది సేపటిలోనే శేషాచలమంతా వ్యాపించింది. శ్రీవేంక టేశ్వరునికి తెలియకుండా ఉంటుందా? సేవకై తన వద్దకు వచ్చిన అనంతాచార్యునితో శ్రీ వేంకటేశ్వర స్వామి, 'ఓయీ! అనంతాచారీ! పాము కాటు వేసినది కదా! చికిత్స చేయించు కోవేమి? అని ప్రశ్నించాడు. దానికి అనంతాచార్యులు సమాధా నమిస్తూ, 'కాటువేసిన పాము విషము బలమైనదయితే నేను మృతుడనై విరజా నదిలో జలకమాడి శ్రీవైకుంతనాథుని పరిచర్య చేస్తాను. లేదా నేను (శేషాంశ సంభూతుడను) కనుక బలవంతుడనయితే ఇక్కడే ఉన్న పుష్కరిణిలో స్నానమాడుతూ పద్మావతీ సమేతుడవైన నీకు పరిచర్య చేస్తాను. నీ కృపాకటాక్షపాత్రుడగు నన్ను విషమేమి చేయ గలదు? సకలరోగాలకు అలౌకిక వైద్యుడవు నీవుండగా, లౌకిక వైద్యుడిని ఆశ్రయించే గతి ఏమి?' అని నిశ్చింతగా సమాధాన మిచ్చాడు.

ఇదే అనన్య శరణాగతి.

పాము విషం నివారణ ఒక లెక్కా!

ఇటువంటి అనన్య శరణాగతిని పాము కాటు విషయంలో చూపిన మరో భక్తుడు మాధవరావ్ దేశ్‌పాండే. సాయి భక్తుడైన మాధవరావును పాము కాటువేసింది. షిరిడీలోని ఆనవాయితీ ప్రకారం ఆయన విఠోబా మందిరానికి పోకుండా, తన దైవమైన సాయినాథునే శరణుజొచ్చాడు. సాంసారిక జీవితంలోని విషాన్ని తీసి ఆనందమయం చేయు దైవానికి, సద్గురునికి పాము విషం లెక్కలోనిదా? 'సర్పము (తన భక్తులకు) కనపడినంతనే వారు దానిని వినోదముగా చూతురు' అని సాయిబాబా ఒక సందర్భంలో పేర్కొన్నారు. సర్పమును తమ గురు స్వరూపముగా లేదా దైవ స్వరూప ముగా తలచు వారలకు భయమేమి? భీతి ఏమి? శిష్యులు, భక్తులు అట్లు భయరహితులుగా ఉండగా గురు స్థాయిలోని వారి విషయం ఇక చెప్పాలా?

ఋష్యాశ్రమ వాతావరణం

పశ్చిమ గోదావరి జిల్లా దువ్వ గ్రామంలో రాచకొండ వెంకట నరసింహ శర్మ గారుండేవారు. వారి ఆశ్రమం అక్కడే ఉండేది. ఆ ఆశ్రమానికి ద్వారకామాయికి వలె తలుపులు ఉండేవి కావు.


కుక్కలు, పిల్లులు, ఎలుకలు, ఇతర జంతువులు యధేచ్ఛగా లోపలికి వచ్చేవి. అవి తమ సహజ వైరాన్ని మరచిపోయేవి కూడా. శర్మగారు మంచంపై కూర్చుంటే పాము వచ్చి పడగ విప్పి వారిని కాసేపు చూచిపోయేది. ఆయన కోసం ఉంచిన పాలను ఒక్కోసారి తాగిపోయేది. ఎవరూ భయభ్రాంతుయ్యేవారు కాదు. ముచ్చటగాను, వినోదంగాను ఉండేది. భీమునిపాడు భీమలింగేశ్వరాలయంలో పద్మనాభ స్వామిగారు ఉండేవారు. అక్కడ పాములు, తేళ్లు, గబ్బిలాలు తిరిగేవి. వాటి మధ్యనే ఆయన ఉండేవారు. అక్కడే పడుకునేవారు. పాములు, తేళ్లు ఆయనపై నుంచి పాకేవి. అవి ఎవరికి హాని చేసేవి కాదు.

అన్నిటిలోనూ దివ్య చైతన్య దర్శనం

రామకృష్ణ పరమహంస శిష్యుడు స్వామి శివానంద. ఆయన ప్రతినిత్యం పశువులశాలకు వెళ్లి ఆవులకు అరటి పండ్లు, బెల్లపు నీరు, బార్లీ పిండి తినిపించేవారు. ఆయన పెంపుడు కుక్క పేరు కెలో. ఆయన దానిని చూపిస్తూ, 'కెలో నా పెంపుడు కుక్క. నేను నా గురుదేవుల కుక్కను' అనేవారు.

జీవుల మధ్య ఉండే ఏకత్వములో బంధం కూడా ఉంటుంది. ఒక రోజు స్వామి శివానంద తన గదిలో ధ్యానిస్తూ ఉండగా ఒక పిల్లి లోనికి ప్రవేశించింది. మ్యావ్ అని అరిచింది కూడా. శివానంద వంగి తన రెండు చేతులతో ఆ పిల్లికి నమస్కరించారు.


తరువాత ఆయన 'నేను చూసే ప్రతి విషయంలోను దివ్య చైతన్యమే వెల్లివిరిసేట్టు కనిపించేటటువంటి స్థితిలో నా గురుదేవులు నన్ను ఉంచారు. చైతన్య స్పృహను, ఈ గోడలో, ద్వారంలో, మంచంలో ఆఖరుకు ఈ పిల్లిలో కూడా చూస్తున్నాను' అన్నారు. అదే గదా జీవిత పరమావధి అంటే.



స్వామి శివానంద

- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

తొలిపలుకు



తన సోదరునికి లేఖలు వ్రాయు రీతిని నాగమ్మ శ్రీరమణ భగవానుని వాక్కులను గ్రంథరూపమున దీర్చినది. 1947లో వ్యయ జయంతీ కుసుమార్చనగా నీ గ్రంథము మొదటి భాగము ముద్రితమై వెలువడినది. ఇన్ని యేండ్లకు రెండవ భాగము ముద్రితమై భగవత్స్వరూపులగు భక్తజనుల పాదారవిందములకు సమర్పితము.

ఏలయనగా సాక్షాత్ భగవదవతారమూర్తి శ్రీరమణ రమణీయ స్థూల శరీరమిపుడు భూమిపై ప్రత్యక్ష పూజా పాత్రముగా లేదు. అది భక్తుల దురదృష్టము. ఇక ''భక్తజనుల శరీరమే నా మూర్తి'' యన్న శ్రీ కృష్ణభగవానుని దివ్యసూక్తిని బ్రమాణీకరించుకొనవలసియున్నది. వేదము భగవద్వాణి. భగవద్వాణి యే రూపమున నున్నను ప్రమాణమే. ఈ రూపమున నున్నపుడు శాసనరూపమున నుండక సుహృత్స మ్మతముగా నుండుటచే సకలజనుల హృదయములను ప్రవేశించునని యెన్నిక. ఈ పాటి సేవయే ముముక్షువులకు బ్రహ్మాండకోటి సేవ. వేరు లోకమున దేవతా స్వరూపముననో ఈ లోకమందంతటను అవ్యక్త జ్యోతిరూపముననో ఉన్న రమణనామక బ్రహ్మము ఈ సేవను గటాక్షించుగాక.

**శ్రీరమణాశ్రమం
1953సం.**

కృష్ణభిక్షు

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

అవతరణిక

ఈ లేఖలు వ్రాసిన శ్రీనాగమ్మగారు శ్రీశ్రీరమణమహర్షిని పదేండ్లు పరిచరించింది. వారి పరిచర్యలో ఉండగా ఈమెకు చాలాకాలం క్రితం నేనొక చీటీ వ్రాశాను. శ్రీమహర్షి వాగామృతం నాకేకాక తెలుగువారి కందరకూ పంచిపెట్టడానికి కూడా ఆశ్రమంలో ఉన్నానని అనుకో అని. ఆనాటికే ఆమె మహర్షి మాటలను మంత్రాలుగా గ్రహించి లేఖారూపంగా చిన్నన్నగారికి పంపుతూ వస్తుందట. కొన్నాళ్ల పిదప-'వ్రాసినంతవరకూ అచ్చువేయగోరుతాను'అని ఇంకో చీటీ వ్రాశాను. ఈనాటికి ముందే ఈమె ఆ ప్రయత్నంలో ఉన్నదట. లోగడ కొన్ని లేఖలు పుస్తకరూపమై రెండు భాగాలుగా మనకు దర్శనమిచ్చినవి. మరొక ఏబది లేఖలు ఈ పుస్తకం. ఈ 50 లేఖలూ సమగ్రమైన వారి దివ్యజీవనానికి సంగ్రహమని చెప ్పవచ్చు. మహర్షి చరిత్ర పలువురు వ్రాశారు. ఈలేఖా సంపుటి ఆ చరిత్రలకు సూక్ష్మదర్శిని.

జ్ఞాని అందరివలెనే ఉంటాడని గ్రంథాలు చెబుతవి-**'ధరోవర్త మానోపి లోకవత్'**. రమణులు అరుగువేస్తూనో గోడపెడుతూనో ఉండగా వారిని చూడవచ్చిన కొత్తవారు 'మహర్షి ఎక్కడ ఉన్నా'రని అడగడం ఒక లేఖలోనూ, భిక్షువు వ్రాసిన శ్రీరమణలీలలోనూ చూస్తాం. జ్ఞానికి బాహ్య చిహ్నలుగాని, వేషాలు గాని ఉండవట- **'అవ్యక్త లింగో అవ్యక్తాచారం:'** అయితే గోచీయేమిటి? అని అడగవచ్చు. గోచీ తీసి వేస్తే 'ఈ నగ్నతయేమి' అని అడగరా? కళ్లకు పసరు రాచుకొని చూచేవారు- ఈ గోచీకి వెనుకా ముంగలా మనస్తత్వాన్ని గమనించే ఓరిమి ఎరువైనా తెచ్చుకోవాలి. అది ఎన్ని మాట్లు పోయిందో మళ్లా ఎలా స్థిరపడిందో తెలిసికోవాలి. ఇందుకు పలువురు వ్రాసిన చరిత్రలు ఉపకరిస్తవి.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దిన ఫలాలు

మేషరాశి: కోర్టు సంబంధిత వ్యవహారాల్లో సానుకూలత ఉంటుంది. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. శుభవార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభరాశి: అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో చిరుసమస్యలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథునరాశి: వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసా గుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటకరాశి: దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగి స్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటిం చాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహరాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యారాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చికరాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయం లో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

ధనూరాశి: ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేక పోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకరరాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికి పోయి చెడు కోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన స్నేహాల ద్వారా లబ్ది చేకూరుతుంది. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతి కూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

రాశులు... మదుపు లక్షణాలు



Business సరిగమలు

మీ రాశినిబట్టి మీరు డబ్బు విషయంలో ఎలా ఆలోచిస్తారు, ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారో చూడండి.

మేషం(మార్చి21-ఏప్రిల్20)



భయం లేకుండా, ధైర్యంగా, పోటీతత్వంతో ఉండటం మీ మనస్తత్వం. మంచి ఆదాయాన్నిస్తూ సవాళ్లతో కూడుకున్న కెరీర్ ఎంచుకోవడాన్ని మీరు ఇష్టపడతారు. అలానే డబ్బు ఖర్చుపెట్టడానికి కూడా మీరు వెనకాడరు. ఖర్చుకు ఒక బడ్జెట్ ఏర్పాటు చేసుకుని దానికి అనుగుణంగా మాత్రమే ఖర్చు పెట్టాలంటే మీకు కష్టంగా అనిపిస్తుంది. రిస్క్ తీసుకోగలగడం మీకు పుట్టుకతో వచ్చిన లక్షణం. పెట్టుబడులు పెట్టే విషయంలోనూ వెనకాముందూ ఆలోచించకుండా అగ్రెసివ్‌గా నిర్ణయాలు తీసుకోగలరు. తొందరగా ధనవంతులు అవాలనే ఆశతో పెట్టుబడులు పెట్టే మనస్తత్వం ఉంటుంది.

మీరు ఏం చేయాలి: కొంత వాస్తవ ధృక్పథంతో పెట్టుబడులు పెట్టడం మంచిది. చాలా తక్కువ కాలంలో ఎక్కువ రిటర్న్‌లు వస్తాయని అవాస్తవంగా అనిపించే పథకాల జోలికి పోకుండా ఉండటమే మంచిది. స్టాక్ మార్కెట్లో ఉన్న ఆర్థిక రిస్కును తట్టుకోగలిగే ఫండ్‌లు, పథకాలు ఎంచుకుని ఆవిధంగా మీ డబ్బు దీర్ఘకాలికంగా స్థిరంగా పెరిగేటట్లుగా చూసుకోండి.

వృషభం(ఏప్రిల్ 21-మే21)



ఓపిక, నమ్మకం మీకు సరిపడేవి. బాగా కష్టపడి పనిచేసి విజయం మెట్లు ఎక్కుతూ ఒక పద్ధతి ప్రకారం పైకి వెళ్లాలనే మనస్తత్వం ఉంటుంది. మీలో ఉండే ఎక్కువ పట్టుదల, అంకితభావం వలన వ్యతిరేక ఫలితాలు రావలసిన చోట కూడా పరిస్థితులు సానుకూలం అవుతాయి. దానివలన మీరు వృత్తిపరంగా కొన్ని నియమాలు పాటిస్తారు. క్రమశిక్షణతో క్రమానుగతంగా ఆదా చేసుకుంటూ ఉంటారు. అయితే పెట్టుబడుల విషయానికి వచ్చేసరికి పిసినారితనం చూపిస్తారు.

మీరేం చేయాలి: జడత్వాన్ని వదిలించుకోండి. మంచి కెరీర్ ఆప్షన్లతో ముందుకు వెళ్లండి. రియల్ ఎస్టేట్ పెట్టుబడుల వలన ఎక్కువ విజయాలు పొందే అవకాశం ఉంది.


మిథునం(మే22-జూన్1)



కుతూహలం మీ ఇంటిపేరనుకోవచ్చు. మీరు ఎప్పటికప్పుడు మీ ఇష్టాలు, ఆసక్తుల ప్రకారం నడుస్తుంటారు. కొత్త విషయాలు నేర్చుకోవడం అంటే ఇష్టం. అందుకే ఎక్కువగా ఉద్యోగాలు మారుతుంటారు. అలా చేయడం వలన మీ ఆదాయ క్రమంలో మార్పులు వస్తాయి. దాని వలన మీ ఆర్థిక పరిస్థితుల మీద ప్రభావం పడుతుంది. మీ ఇంటి ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకులకు లోనవుతుంది. భారీ కొనుగోళ్లు చేస్తుంటారు. అందుకే డబ్బు దాచుకోవడం, పెట్టుబడులు పెట్టడం కష్టం అవుతుంది.

మీరేం చేయాలి: ఎప్పుడూ ఒకేలాటి బోర్ కొట్టే ఉద్యోగాలు చేయడంలో త్వరగా ఆసక్తిని కోల్పోతుంటారు. కాబట్టి మీకు ఒకే ఆదాయ వనరు ఉండకుండా వివిధ ఆదాయవనరులు ఉండేలా చూసుకోండి. మీరు ఆర్థిక ఒడిదుడుకులకు లోను కాకుండా ఉంటారు.

కర్కాటకం(జూన్22-జూలై22)



మీ కుటుంబం మీ మొదటి ప్రాధాన్యత అయి ఉంటుంది. కష్టపడి పనిచేసి బాగా డబ్బు సంపాదించి సంపద పెంచుకుందాం అనే మనస్తత్వం ఉంటుంది. డబ్బు కూడబెట్టాలనే తాపత్రయం ఉండటం వలన మీ ఇష్టాలు, కొన్ని అవసరమైన ఖర్చులు కూడా త్యాగం చేయవలసి ఉంటుంది. మీరు చాలా జాగ్రత్తగా ఆచితూచి ఖర్చు పెడతారు. అందుకే సాధారణంగా సురక్షితమైన పెట్టుబడులు పెట్టడానికి మాత్రమే సిద్ధపడతారు.

మీరేం చేయాలి: ఆర్థిక నిర్ణయాలు తీసుకునేటప్పుడు మీ మనసు మాట వినండి. కాని అప్పుడప్పుడు కొంత రిస్కుతో కూడుకుని ఉన్న సేవింగ్స్ చేయడానికి కూడా వెనకాడకండి. మీరు తీసుకున్న నిర్ణయం వలన మీ పెట్టుబడి మరింత ఎక్కువ పెరగడం మంచిదే కదా.

సింహం(జూలై23-ఆగస్టు21)



కేవలం బతకడానికి మాత్రమే డబ్బు సంపాదన అనే నియమాన్ని మీరు పాటించరు. మీరు ఆశావాదులు. సౌకర్యవంతమైన జీవితం గడపడాన్ని ఇష్టపడతారు. మీరు ఆనందించడమే కాదు, మీ స్నేహితులు, కుటుంబసభ్యుల కోసం కూడా బాగా ఖర్చు పెడతారు. అంటే డబ్బును పొదుపు చేయడం అన్నది మీకు చాలా కష్టమైన పని. కాని అవసరాలు ఉండటం వలన లేదా ఇతరులను చూసి పోటీతత్వం వలన మీరు కూడా డబ్బు ఆదా చేయడం, కొంత డబ్బు కూడబెట్టడం వంటివి చేయాల్సి వస్తుంటుంది.

మీరేం చేయగలరు: మీకు జీవితాన్ని ధగధగాయమానంగా గడపాలని ఉంటుంది కాబట్టి కార్లు, గ్యాడ్జెట్ల మీద ఖర్చు పెట్టడం కంటే బంగారం మీద ఖర్చు పెట్టండి. అది మీ ఖర్చు పెట్టే సరదాని తీరుస్తుంది దానితోపాటే మీ భవిష్యత్తు ఆర్థిక అవసరాలను తీరుస్తుంది.


కన్య(ఆగస్టు22-సెప్టెంబర్3)



మీరు వాస్తవ ధృక్పథం ఉన్న మనుషులు. మీకు వచ్చే ఆదాయం ఎంత, పెట్టే ఖర్చు ఎంత అనే అంశం మీద పూర్తి అవగాహనతో ఉంటారు. మీరు నమ్మిన కారణం కోసం పనిచేయడడం, సమాజానికి మీ సహాయసహకారాలు అందించడం మీకు ఇష్టం. ఇతరులకు సహాయపడే, సేవచేసే బుద్ధితో ఉంటారు. అందుకే మీరు ఎక్కువగా ఆదాయం మీద దృష్టి పెట్టరు. తక్కువ ఆదాయం ఉండే ఉద్యోగాలలోనే ఉంటారు. అయినా బడ్జెట్ ప్రకారం నడవాలనే నైపుణ్యం, ఆదా చేసేతత్వం అలవరచుకోవాలనుకుంటారు.

మీరేం చేయాలి: పెట్టుబడుల విషయంలో కొంత పరిశోధన అవసరం. మీ ఆర్థిక పెట్టుబడులలో ఈక్విటీలు కూడా ఉండేలాగా చూసుకోవాలి.

తుల(సెప్టెంబర్24-అక్టోబర్23)



చిహ్నంలో స్కేల్ ఉన్నా కూడా నియంత్రణ చేసుకోవడం మీకు చేతకాదు. వ్యక్తిగతంగా లగ్జరీల మీద ఖర్చు చేస్తారు. అందువలన జీతంలో చాలాభాగం ఖర్చయిపోతుంది. నిర్ణయాలు తీసుకోవడంలో బలహీనంగా ఉంటారు. మీ వ్యక్తిత్వంలో ఉన్న సానుకూల అంశం ఏంటంటే, భాగస్వామ్యాలలో బాగా పనిచేయగలుగుతారు. మీకు ఎవరైనా వెంట ఉండి చెప్పేవాళ్లుంటే నిర్ణయాలు బాగానే తీసుకోగలుగుతారు.

మీరేం చేయాలి: ఖర్చు పెట్టేముందు కొంతభాగం పక్కనపెట్టాలి. ప్రొఫెషనల్ సలహాదారుడి దగ్గరనుంచి సలహా తీసుకుంటే సరైన ఆర్థిక నిర్ణయం తీసుకోగలుగుతారు.


వృశ్చికం(అక్టోబర్24-నవంబర్22)



మీ తెలివైన నిర్ణయాలు, బుద్ధి కుశలత, నైపుణ్యాలు మీ తోటివారిలో మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెడతాయి. డబ్బుని తెలివిగా ఎలా నిర్వహించాలో మీకు బాగా తెలుసు. మీ ఆదా చేసే అలవాట్లు, పెట్టే పెట్టుబడుల గురించి మీ జీవితభాగస్వామికి కూడా తెలియనివ్వరు.

మీరేం చేయాలి: ముందుచూపు ఉందికాబట్టి మీ ఆర్థిక జీవితం ఒడిదుడుకులు లేకుండా ఉంటుంది. సమయానికి సరైన నిర్ణయాలు తీసుకుంటే అత్యవసర సమయాల్లో మీకు ఆ డబ్బు సహాయపడుతుంది. మీరు ఫ్యామిలీ ప్లాన్ తీసుకుంటే భవిష్యత్తులో ఉపయోగపడుతుంది.

ధనస్సు(నవంబర్30-డిసెంబర్22)



కేర్‌ఫ్రీగా ఉండటం, అన్నిటినీ తేలిగ్గా తీసుకోగలిగే మీ మనస్తత్వం మీ వ్యక్తిత్వ ప్రత్యేకత. దాని వలన మీరు ఆశావాదంతో ఉండి సమయానికి తగినట్లు ప్రవర్తించగలుగుతారు. అయితే బాధ్యతారహితంగా ఉండే అవకాశం కూడా ఉంది. మీరు స్వతంత్రంగా పనిచేయడం ఇష్టపడతారు. స్వీయ అనుభవంతో తెలుసుకోవడం మీకు నచ్చుతుంది. కాని అసహనం ఎక్కువ. కాబట్టి ఆర్థికంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఆర్థిక సమస్యల నుంచి తేలిగ్గానే బయటపడగలిగినా కాని ఆర్థికంగా బలపడటం కష్టమే.

మీరేం చేయాలి: డబ్బు నిర్వహణ కూడా ఒక నేర్చుకునే అనుభవంలాగా భావించండి. మీ ఆర్థిక వ్యవస్థ బావుంటుంది.


మకరం(డిసెంబర్23-జనవరి20)



ఒక క్రమపద్ధతిలో నడిచేవారు మీరు. డబ్బుకు సంబంధించి వాస్తవ ధృక్పథం ఉంటుంది. సహజంగానే మీరు ఎక్కువ ఖర్చుపెట్టేవారు కాదు. ఆర్థిక క్రమశిక్షణ కలిగినవారు. డబ్బు ఆదా చేసి దీర్ఘకాలిక లక్ష్యాలు కలిగి ఉంటారు. ఏమైనా డబ్బును జాగ్రత్తగా ఆదా చేసే అలవాటు ఉంటుంది కాని దాన్ని పెట్టుబడులు రూపంలో పెట్టడాన్ని నియంత్రించుకుంటారు. అందువలన మీ డబ్బు ఆస్తుల రూపంలోకి మారదు. మీకు పీనాసివారన్న బిరుదు తగిలిస్తారు.

మీరేం చేయాలి: పెట్టుబడులలో వైవిధ్యం పాటించండి. డబ్బు గురించిన ఆందోళనలు మానేయండి. మీ పెట్టుబడులలో కొంత రిస్కు తీసుకోండి.

కుంభం(జనవరి21-ఫిబ్రవరి19)



నియమాలకు కట్టుబడి ఉండటం మీకు కష్టమైన పని. అది కెరీర్ ఛాయిస్ అయినా అదే మనస్తత్వంతో ఉంటారు. మీ పనిలో భిన్నత్వం ఉండాలనుకుంటారు. మీ వృత్తిలో కూడా మీ ప్రత్యేకత చాటుకోగలుగుతారు. మీ ఆర్థిక పరిస్థితిని మించి మానవత్వంతో, ఉదారస్వభావంతో ఇతరులకు సహాయం చేస్తారు. కాని ఒక్కోసారి అది శృతిమించవచ్చు కూడా. అటువంటి స్వభావం వలన మీ ఆర్థిక పరిస్థితి ఒడిదుడుకులకు లోనవచ్చు. ఒక్కోసారి చేతిలో డబ్బులేక అవస్థలు పడే సందర్భాలు కూడా ఎదురవచ్చు. అదే పెట్టుబడులకు సంబంధించి అయితే మీరు ఏమాత్రం భయపడరు. ఇతరులకు చాలా రిస్కీ అనిపించినవాటిలో మీరు పెట్టుబడులు పెట్టడానికి సిద్ధం అవుతారు.

మీరేం చేయాలి: మీ ఆర్థిక పరిస్థితులు ఒడిదుడుకులకు లోనుకాకుండా చూసుకోండి. మొత్తం ఇతరుల కోసం దానం చేసేయకుండా మీకోసం మీరు దాచుకోవడం సూచించతగినది.

మీనం(ఫిబ్రవరి20-మార్చి20)


పనిని నిబద్ధతతో చేయడం మీ ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. డబ్బుకి రెండవ స్థానం ఇస్తారు. అయితే మీరు పనిపట్ల అంకితభావంతో ఉంటారు కాబట్టి డబ్బు దానంతట అదే వెనక వస్తుంది. అయినప్పటికీ మీ జీవితానికి రక్షణ కోసం ఆర్థిక నిర్వహణ చేసుకోవాలి. డబ్బు విషయానికి వచ్చేసరికి మీ ఆదర్శభావాలు మోసగాళ్లకు మంచి అవకాశాన్నిస్తాయి. మీరు అటువంటివారి చేతికి చిక్కే అవకాశం ఉంటుంది.

మీరేం చేయాలి: ఆర్థిక నిర్వహణ బాగా చేసుకోవాలి. కేవలం భావావేశాలకి మాత్రమే ప్రాధాన్యత కాకుండా ప్రాక్టికల్‌గా ఆలోచించడం అలవరచుకోవాలి.



'పిపిఐ'కి రక్షణ కవచం

దగ్గర క్యాష్ పెట్టుకునే అలవాటు చాలామందికి తగ్గిపోతోంది. ప్రత్యామ్నాయంగా ఈ వ్యాలెట్ వినియోగిస్తున్నారు. అందులో భాగమే ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్ (పిపిఐ). పిపిఐలు మూడురకాలు. క్లోజ్‌డ్ సిస్టమ్ పిపిఐ, సెమి క్లోజ్‌డ్ సిస్టమ్ పిపిఐ, ఓపెన్ సిస్టమ్ పిపిఐ. అంటే ఇవి ఒకరకంగా గిఫ్ట్ కార్డులు. వీటిద్వారా కొన్ని ప్రత్యేక ప్రదేశాలలో కొనుగోళ్లు చేసుకోవచ్చు. అయితే వీటి ద్వారా ఒక ఎకౌంట్ నుంచి ఇంకొక ఎకౌంట్‌కి డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయడం కుదరదు. సెమీ క్లోజ్‌డ్ పిపిఐలకు ఉదాహరణ ఆక్సిజన్, మొబివిక్. వీటితో ఎటువంటి వస్తువులను, సేవలను అయినా కొనుక్కోవచ్చు. ఓపెన్ సిస్టమ్ పిపిఐలు బ్యాంకులు మాత్రమే ఇస్తాయి. వీటితో ఎక్కడైనా, ఏవైనా కొనుక్కోవచ్చు. అలానే డబ్బు విత్‌డ్రా కూడా చేసుకోవచ్చు. దీనికి ఉదాహరణ ట్రావెల్ కార్డు. ఇటువంటి ముందస్తు చెల్లింపు కార్డుల ద్వారా ఏ మోసాలు జరగకుండా, జరిగినా నష్టపోకుండా వినియోగదారులను రక్షించడానికి ఆర్‌బిఐ ఈ ఐదు రక్షణ కవచాలను ఏర్పరచింది.



వినియోగదారులకు మోసాల నుంచి రక్షణ

ఆర్‌బిఐ మార్గనిర్దేశకాల ప్రకారం ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్ కంపెనీ నిర్లక్ష్యం, ఉపేక్ష, పొరపాటు వలన మీ లావాదేవీలలో ఏవైనా తప్పులు జరిగితే దానికి మీరేం బాధ్యులు కారు. అదే కనుక మీద్వారా కాని కంపెనీ ద్వారా కాని కాకుండా మూడవ వ్యక్తి వలన మోసం జరిగితే మూడు రోజులలోపు కంపెనీకి తెలియచేయాలి. అలా కాకుండా మీరు విషయాన్ని ఏడురోజుల లోపు తెలియచేస్తే మీ లయబులిటీ 10,000 రూపాయల వరకు ఉంటుంది. అయితే అంతకన్నా ఎక్కువ ఆలస్యం చేస్తే మీరు జరిమానా చెల్లించవలసి ఉంటుంది. అదే కనుక కంపెనీ మీపట్ల ఉదారంగా ఉంటే పర్వాలేదు జరిమానా చెల్లించవలసి రాకపోవచ్చు. ఇతరులు మోసం చేయడానికి వినియోగదారుల నిర్లక్ష్యం కారణం అయినా వారు సకాలంలో స్పందిస్తే న్యాయం దొరుకుతుంది. జరిగిన మోసపు లావాదేవీ వలన మీరు ఫిర్యాదు చేయకముందే మీకు నష్టం జరిగి ఉంటే ఆ నష్టం మీరే(వినియోగదారుడే) భరించాలి. అలాకాకుండా లావాదేవీ జరగగానే పిపిఐ ఇచ్చిన కంపనీకి తెలియచేస్తే ఆ నష్టం కంపెనీ భరిస్తుంది. కాబట్టి ఫిర్యాదులో ఆలస్యం చేస్తే వినియోగదారుడే నష్టపోతాడు.

బ్యాంకేతర సంస్థలకు ఇది కొత్త నిబంధన

ఈవ్యాలెట్ ఖాతాదారుడికి మోసపూరిత లావాదేవీ జరగడం సాధారణం. అలా జరిగినప్పుడు వారికి ఎటువంటి పరిహారం దొరకకపోవడం ఇప్పటివరకు జరుగుతూ వచ్చింది. అటువంటి మోసాలకు గురైనవారికి ఆర్‌బిఐ ఒక ఊరట కల్పిస్తోంది. ఎలక్ట్రానిక్ చెల్లింపులు చేసే ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్(పిపిఐ)వినియోగదారులు ఇప్పుడు కొంచెం ఊపిరి పీల్చుకోవచ్చు. అయితే బ్యాంకింగ్ రెగ్యులేటర్‌కి 2017లోనే ఈ నిబంధన వచ్చింది.

కాలపరిమితి

ఏవైనా అనుమానాస్పద లావాదేవీల గురించి కంపెనీ దృష్టికి తీసుకెళ్తే వారు మీరు నష్టపోయిన డబ్బును పదిరోజులలోగా తిరిగి మీ వ్యాలెట్‌లో వేసేస్తారు. దాంతోపాటు కంపెనీలు బోర్డు ధృవీకరించిన పాలసీ నియమాలను అనుసరించి మీ ఫిర్యాదులను పరిష్కరించాలి. ఫిర్యాదు అందుకున్నాక ఈ ప్రక్రియ అంతా 90 రోజులలోపు పరిష్కరించాలి. ఒకవేళ ఇచ్చిన డెడ్‌లైన్‌లోగా పరిష్కారం చేయలేకపోతే వినియోగదారుని నిర్లక్ష్యం వలన జరిగిన పొరపాటయినా సరే వారికి కొంత పరిహారం చెల్లించవలసి వస్తుంది.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రీపెయిడ్ కార్డులు ఇచ్చిన కంపెనీలన్నీ తమ వినియోగదారులతో ఎస్ఎమ్ఎస్ అలర్ట్ రిజిస్టర్ చేసుకోవాలని ఆర్‌బిఐ చెప్పింది. దానిద్వారా ఎప్పటికప్పుడు ఎలక్ట్రానిక్ పేమెంట్ ట్రాన్సాక్షన్లు అప్‌డేట్ చేస్తుండవచ్చు. ట్రాన్సాక్షన్ అలర్ట్‌కి ఒక కాంటాక్ట్ నంబర్ లేదా ఈమెయిల్ ఐడి ఉండాలి. దాని వలన వినియోగదారుడు తనకు ఏవైనా అనధికారిక లావాదేవీలు లేదా ఏవైనా అభ్యంతరకరంగా అనిపించిన అంశాలు వారి దృష్టికి తీసుకువెళ్లే వీలుంటుంది. ఇంకా పిపిఐలు ఇచ్చే కంపెనీలు తమ వినియోగదారులకు ఈమెయిల్ అలర్ట్‌లు పంపించాలని ఆర్‌బిఐ చెప్పింది. వినియోగదారుల సరైన కాంటాక్ట్ వివరాలు తీసుకుని రిజిస్టర్ చేయాలి.

ఇప్పుడు ఫిర్యాదు సులువు

పిపిఐలు ఇచ్చే కంపెనీలు తమ వినియోగదారులకు అవగాహన కల్పించడం అవసరం. అనధికారికంగా వచ్చే ఫోన్‌కాల్స్, లేదా లావాదేవీలను నమ్మవద్దని, అటువంటివి ఏవైనా జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పాలి. ఫిర్యాదు చేయడంలో వినియోగదారుడు ఎంత ఆలస్యం చేస్తే కంపెనీతోపాటు వినియోగదారుడు కూడా నష్టపోతాడని తెలియచేయాలి. కంపెనీలు కూడా తమ వినియోగదారుల కోసం పూర్తి రక్షణ కవచం ఏర్పాటు చేయాలి. టోల్ ఫ్రీ నంబర్లు, ఫిర్యాదు చేసే వీలుగా ఈమెయిల్స్ సౌకర్యం, యాప్‌లు, వెబ్‌సైట్లు, ఎస్ఎమ్ఎస్ సేవలు అందచేయాలి. అప్పుడే ఎటువంటి మోసాలు జరిగినా వినియోగదారుడు కంపెనీ వరకు రాగలుగుతాడు. ఫిర్యాదు అందగానే ఫిర్యాదు ఎకౌంట్ నంబర్‌ను వెంటనే పంపించగలగాలి. కంపనీలు తమ వినియోగదారులకు అందించే సేవల్లో, లావాదేవీల్లో సాంకేతిక లోపాలు లేకుండా చూసుకోవాలి. పిపిఐకి సంబంధించి వారి ఫిర్యాదులు, వారికి జరిగిన నష్టాల నివారణకు కృషి చేయాలి. అయితే అంతా కంపెనీదే బాధ్యత కాబట్టి వినియోగదారుడు తనకేం సంబంధం లేదన్నట్లు ఉండటానికి వీల్లేదు. వారికి కంపెనీ నుంచి వచ్చిన ఎస్ఎమ్ఎస్ లేదా ఈమెయిల్ అలర్ట్‌లను నిర్లక్ష్యం చేయకూడదు. ఏదైనా మోసం జరిగిందనిపిస్తే తమ సమస్యలను వీలైనంత త్వరగా కంపెనీ దగ్గరకు తీసుకెళ్లాలి.



సిప్‌లు మంచి లాభాలకు దారులు

డబ్బు ఆదా చేస్తున్నామంటే చేస్తున్నాం అన్నట్లుగా కాకుండా చేసేది ఒక ప్రణాళిక ప్రకారం, సరైన పద్ధతులను ఎంచుకుని చేయాలి. చాలామందికి కొత్తతరహా మదుపు పథకాలంటే భయం ఉంటుంది. అందుకే సంప్రదాయ పద్ధతులకు మాత్రమే కట్టుబడి ఉంటారు. అలా కాకుండా నెలకి ఎంత ఆదా చేయాలి. చేసినదాంట్లో ఎంత పెట్టుబడి పెట్టాలి. దాన్ని ఎంతకాలం కొనసాగించాలి. అలా పెడితే ఎంత కాలానికి ఎంత రిటర్న్‌లు వస్తాయి. ఇవన్నీ దృష్టిలో ఉండాలి. అప్పుడే లాభం.

గత పదేళ్ల నుంచి మీరు ప్రతి నెల సిప్‌లో పదివేల రూపాయలను మధ్యతరహా ఈక్విటీ ఫండ్‌లలో పెట్టుబడి పెట్టారనుకోండి. ఇప్పటికి మీ దగ్గర 22 లక్షలు ఉండి ఉంటాయి. దీర్ఘకాలికంగా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పిపిఎఫ్‌ల వంటి సంప్రదాయ పెట్టుబడులు పెట్టినవారికి ఇంత డబ్బు రిటర్న్‌లో వచ్చే అవకాశం ఉంటుందా అని ఆశ్చర్యం వేయచ్చు. కాని ఎక్కువకాలం ఈక్విటీ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే ఈమాత్రం మొత్తం రావడం పెద్ద విషయం కాదు. ఇంకా బాగా రిటర్న్‌లు ఇచ్చే ఫండ్స్ అయితే 27 నుంచి 35 లక్షలవరకు కూడా నిధిని సమకూర్చి పెట్టవచ్చు. అయితే సాధారణ ఫండ్స్ ఏమాత్రం ఇస్తాయో అన్నది మాత్రమే పరిగణనలోకి తీసుకుని అంచనాకి రావడమే మంచిదని నిపుణుల అభిప్రాయం.

ఈమధ్య కొంతమంది పెట్టుబడిదారులు సిప్‌లలో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టడానికి ఇష్టపడుతున్నారు. అయితే పెట్టుబడిదారుల్లో ఎంత చేతన వస్తున్నప్పటికీ పదేళ్లపాటు నిరంతరం సిప్‌లలో పెట్టుబడి పెడుతూనే ఉండటం అంటే చాలామంది కష్టమైన పనే అనుకుంటారు. కాని సిప్ కల్చర్ పెరగాలి. అది కూడా దీర్ఘకాలికంగా నడవాలి అంటే కనీసం ఏడెనిమిదేళ్లపాటు. అప్పుడు మంచి రిటర్న్‌లు వచ్చే అవకాశాలు ఉంటాయి. ఒక ఆర్థిక నిపుణులు తన దగ్గరకు వచ్చే క్లైంట్‌ల అనుభావాలను ఇలా చెప్తున్నారు.... నేను ఒకతన్ని కలిశాను. అతనికి నెలకి ఆరంకెల జీతం ఉంటుంది. నెలకు 3 వేల చొప్పున ప్రతినెలా ఈక్విటీ సిప్‌లలో పెట్టుబడి పెడుతున్నాడు. దాన్నిన ఎక్కువ ఏళ్లనుంచి కొనసాగిస్తున్నాడు. సాధారణంగా పెట్టుబడిదారులు చేసే తప్పు అక్కడే. ఎక్కువకాలం సిప్‌లలో కొనసాగుతున్నాం కాబట్టి మంచి ఫలితాలే వస్తాయని అనుకుంటారు. కాని ఇక్కడ ఒక చిన్న తేడా ఉంది. పెట్టే పెట్టుబడి ఎంత ఉంటుందనేది లెక్కించాలి. తక్కువ పెట్టుబడి వలన వచ్చే గొప్పలాభం ఉండదు. వచ్చే ఆదాయంలో ఈక్విటీలలో కేవలం 3 శాతం పెట్టుబడి పెట్టడం వలన మీకు రిటర్న్‌లలో మంచి ఫలితాలుండవు. మీరు సిప్‌లలో నెలకి పెట్టే పెట్టుబడి శాతం పెరగాలి. మీరు ఎంత మంచి రిటర్న్స్ పొందుతారు అనేది పెట్టే పెట్టుబడి శాతాన్నిబట్టి ఉంటుంది. అలానే ఒక దంపతులు కొన్నేళ్లుగా కొద్దిమొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఆదా చేస్తున్నారు. కాని అంత డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్ కోసం మాత్రమే కాకుండా సిప్‌లలో పెట్టుబడి పెట్టమని నిపుణులు ఇచ్చిన సలహా మేరకు వాళ్లు గత పదిహేనేళ్లుగా సిప్‌లలో పెట్టుబడి ఆరంభించారు. మధ్యలో రెండుసార్లు నెలసరి పెట్టుబడి శాతాన్ని పెంచుకుంటూ వెళ్లారు. అది దాదాపు నెలకి 2,500 రూపాయలు చొప్పున అయింది. పదిహేనేళ్లలో 12 లక్షలు వచ్చాయి. అది వారికి రిటైర్మెంట్ కోసం ఉపయోగపడుతుంది. అలా చిన్న చిన్న ఖర్చులు త్యాగం చేసి ఆదా చేసిన డబ్బు ఇంత పెద్ద మొత్తాన్ని ఇస్తుందని ఊహించలేదు వారు. అయితే ఇంత మంచి ఫలితం రావడానికి కారణం వారు పెట్టిన నెలసరి వాయిదా మొత్తం కొద్దిగా ఎక్కువ ఉండటమే. అదే కనుక ఏ వెయ్యిరూపాయలో నెలకి పెట్టి, పైగా ఆ మొత్తాన్ని మధ్యలో ఏమాత్రం పెంచకుండా ఉంటే ఫలితం ఆశించినంత ఉండదు. అదే కనుక నెలకు 10,000 రూపాయల చొప్పున 2004 నుంచి పెట్టినట్లయితే(అంటే జీతంలో 20 శాతం)ఆ పెట్టుబడి శాతం ఇప్పటికి ఇంకో 7 శాతం పెరిగి ఉండాలి. అలా కాకున్నా సాధారణంగా సిప్‌లలో పెట్టుబడి పెట్టేవారు కనీసం ఏడాదికి 5 శాతం పెంచుతూ వెళ్లాలి. దానివలన ఆఖరున పెద్దమొత్తం చేతికి వస్తుంది. అయితే మీ ఆర్థిక లక్ష్యాలు చేరడానికి కేవలం అత్యధిక రిటర్న్‌లు మాత్రమే వస్తే సరిపోదు. దానికి తగినట్లు మరింతగా ఎక్కువ పెట్టుబడులు పెట్టాలి. అయితే సాంప్రదాయ పద్ధతుల్లో స్థిర ఆదాయం రావాలని అనుకోకుండా ఈక్విటీ ఆధారిత పెట్టుబడులలోకి మారవచ్చు. ముందుగా చిన్నగా మారడానికి సిద్ధం అయితే తర్వాత ధైర్యంగా ముందడుగు వేయవచ్చు. ఏళ్లకేళ్లు పాతపద్ధతులనే పట్టుకుని వేలాడకుండా కొత్తదనం వైపు సాగితే ఆర్థిక ప్రగతి సాధ్యం అవుతుంది.

రెండో షెడ్యూల్ కోసం భారీ సెట్స్


రామ్‌చరణ్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆర్ ఆర్ ఆర్ చిత్రం షూటింగ్ ఇప్పటికే మొదటి షెడ్యూల్‌ను పూర్తిచేసుకుంది. దీనికోసం ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు ఇద్దరూ పాత్రలకు తగ్గట్టుగా రాజమౌళి సూచన మేరకు మేకోవర్ అవుతున్నారు. హైదరాబాద్‌లో జరిగిన మొదటి షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌తో పాటు ఇతర ముఖ్యపాత్రధారులు పాల్గొన్న సన్నివేశాలను, కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించినట్లు తెలిసింది. కొద్దిరోజులు గ్యాప్ తీసుకుని సంక్రాంతి పండగ తర్వాత ఈ నెల 21 నుంచి ఈ చిత్రం రెండో షెడ్యూల్ మొదలు పెట్టబోతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వినయ విధేయ రామ విడుదల కావడంతో రామ్‌చరణ్ కూడా రెండో షెడ్యూల్ నుంచి సెట్స్‌లోకి ప్రవేశించబోతున్నారు. రెండో షెడ్యూల్‌లో ఇద్దరు హీరోల మధ్య వచ్చే సన్నివేశాలతో పాటు పలు కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారని అంటున్నారు. ఇందుకోసం హైదరాబాద్ పరిసరాల్లోని కోకాపేట, ఇంకా వికారాబాద్ వద్ద ప్రత్యేకంగా భారీ సెట్స్ నిర్మిస్తున్నారు. వాటిల్లో చిత్రీకరణ జరిపేందుకు చిత్రబృందం సమాయత్తమవుతోంది. అత్యంత క్రేజీ కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందుతుండటంతో అటు పరిశ్రమలోనూ, ఇటు ప్రేక్షకాభిమానుల్లోనూ ఎనలేని ఆసక్తి నెలకొంది. ఆర్ ఆర్ ఆర్ నుంచి ఏ అప్‌డేట్ వచ్చినా ఆతృతగా ఎదురు చూస్తున్నారు. దర్శకుడిగా ఎనలేని గుర్తింపు పొందిన రాజమౌళి ఈ చిత్రంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లను విభిన్నంగా చూపించబోతున్నారు. వారి గెటప్స్ కూడా కొత్తగా ఉంటాయని...రాజమౌళి మేజిక్ మరోసారి పునరావృతమవుతుందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి.


ఎన్టీఆర్


కైరా అద్వాని

కష్టపడితే సాధ్యంకానిది లేదు

కష్టే ఫలి అన్న చందాన కష్టపడే తత్వం ఉన్నవారికి సాధ్యం కానిది ఏదీ ఉండదని అంటారు. సరిగ్గా అలాంటి స్వభావంతోనే తాను ముందుకు వెళ్తున్నానని అందాల భామ పూజాహెగ్డే ముద్దు ముద్దుగా అంటోంది. వాస్తవానికి మనం ఎంచుకునే పనితో పాటు కష్టపడే తత్వం ఉంటే ఏ రంగంలోనైనా మంచి ఫలితాలే వస్తాయని అనుభవజ్ఞులు చెబుతుంటారు. ఇప్పుడు ఇదే విషయాన్ని పూజ కూడా నొక్కి వక్కాణించింది. మనం చేస్తున్న పనిని ఇష్టపడి...కష్టపడితే ప్రతిదీ సాధ్యమే అంటూ ఆమె ట్వీట్ చేసింది. అటు హిందీ, ఇటు తెలుగు సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న ఆమె ముంబాయి, హైదరాబాద్‌ల మధ్య ప్రయాణం సాగించాల్సి వస్తోంది. అరవింద సమేత చిత్రం చేసే సమయంలోనే హిందీలో హౌస్‌ఫుల్ 4 చిత్రం చేయాల్సి వచ్చింది.ఆ మధ్య అరవింద సమేత చిత్రం విడుదలకు సిద్దమైన సమయంలో రాజస్థాన్‌లోని ఓ హోటల్‌లో తాను ఉన్న గదిలోనే డబ్బింగ్ చెప్పేశానని ఆమె వెల్లడించింది. అందుకోసం తన గదినే డబ్బింగ్ స్టూడియోగా మార్చేశారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే అదంతా చాలా సరదాగా గడిచిపోయింది. అందుకే పనిపట్ల ఇష్టపడే స్వభావం ఉంటే ఇలాంటివన్నీ సాధ్యమే. సాద్యం కానిది ఉండనే ఉండదని ఆమె వివరించింది. ప్రస్తుతం మహేష్‌బాబు సరసన మహర్షి చిత్రంలోనూ, ప్రభాస్ సరసన జిల్ రాధాకృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలోనూ పూజ నటిస్తోంది.


పూజా హెగ్డే

చిత్రసీమ పితామహుడు ఎల్వీ ప్రసాద్



దక్షిణాది సినిమా దిగ్గజం ఎల్వీ ప్రసాద్ 111వ జయంతి వేడుకలు హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించారు. ఎల్వీ ప్రసాద్ కుమారుడు రమేష్ ప్రసాద్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో నటుడు బాలకృష్ణ, రమేష్ ప్రసాద్ కూతురు రాధ, దర్శకుడు వైవీఎస్ చౌదరి, సీనియర్ నటి గీతాంజలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ...సినిమానే శ్వాసగా జీవించిన వ్యక్తి మా నాన్నగారు. కుటుంబం కంటే ఎక్కువగా సినిమాను ప్రేమించారు. రోజులో దాదాపు 20 గంటలు సినిమాల కోసమే కష్టపడ్డారు. కారులో ప్రయాణాలు చేస్తున్న కాస్త సమయంలోనే విశ్రాంతి తీసుకునేవారు. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా నాన్న పరిశ్రమ అభివృద్ధికి చేసిన కృషి చాలా గొప్పది. ఆయన పడుతున్న కష్టమేంటో మాకు తర్వాత తర్వాత తెలిసొచ్చింది. ఆయన తన పిల్లలుగా మేమూ చిత్ర పరిశ్రమలోనే ఉండాలనుకున్నారు. నాకు నటనపై ఆసక్తి ఉండేది కాదు. నన్ను నటుడిని చేయాలన్నది ఆయన ఆలోచన. సంసారం చిత్రంలో చిన్న పాత్ర చేయమన్నారు. సెట్‌లోకి వెళ్లాక సన్నివేశం చేయడం ఆలస్యమైంది. నాన్నను అడిగి వెళ్లిపోతా అంటే...మిగతా నటీనటులతో నువ్వు కలిసి నటించాలి, వేచి ఉండు అన్నారు. మరో గంట తర్వాత వెళ్తే గద్దించారు. దాంతో నాకు నటనంటే పూర్తిగా అయిష్టం ఏర్పడింది. ఫృథ్వీరాజ్ కపూర్ గారి కంపెనీలో నాన్న నాటకాలు వేసేవారు. అలా ఫృథ్వీరాజ్ కపూర్ అంటే నాన్నకు బాగా అభిమానం. నేను ఆయన ఆశయాన్ని నటుడిగా కాకున్నా సాంకేతికంగా ముందుకు తీసుకెళ్తున్నాను. అన్నారు. నటుడు బాలకృష్ణ మాట్లాడుతూ...తెలుగు సినిమా కీర్తిని పెంచిన మహానుభావుల్లో ఎల్వీ ప్రసాద్ ఒకరు. ఒక్కడై పరిశ్రమకు వచ్చి ఒక మహా సామ్రాజ్యాన్ని సృష్టించారు. మనిషి శ్రమిస్తే ఎంతటి విజయాలు సాధించగలరో ఎల్వీ ప్రసాద్ గారు చేసి చూపించారు. నాన్నగారితో ఆయన రూపొందించిన షావుకారు సినిమా మరపురాని సినిమాగా మిగిలిపోయింది. సినిమాను ప్రేమించే వ్యక్తిగానే కాదు సమాజం మీద ఆయనకున్న ప్రేమతో కంటి ఆసుపత్రి ప్రారంభించారు. అన్నారు.

మీకే అంకితమిస్తున్నా

అతి తక్కువ కాలంలో తనను ఆదరిస్తున్న దక్షిణాది ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పుకుంటోంది బాలీవుడ్ భామ కైరా అద్వానీ. తనకు దక్కుతున్న గుర్తింపు, పురస్కార గౌరవాలు ప్రేక్షకులకే అంకితమిస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రాంతీయ సినిమాల్లో మంచి పేరు తెచ్చుకోవడం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పింది. కైరా స్పందిస్తూ...కొద్ది కాలంలోనే నాకింత గుర్తింపు ఇచ్చారు. నాపై ప్రేమ చూపిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. నాకొచ్చే గుర్తింపు, పురస్కారాలు అన్నీ వాళ్లకే అంకితమిస్తున్నాను. అంది. తెలుగులో భరత్ అనే నేను, వినయ విధేయ రామ చిత్రాల్లో నటించిన కైరా త్వరలో అల్లు అర్జున్ త్రివిక్రమ్ చిత్రంలోనూ నాయికగా ఎంపికైనట్లు సమాచారం. ఈ సినిమాను హారికా హాసినీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. సినిమాల్లో అవకాశాలు పెరిగినా కొద్దీ తనపై బాధ్యత కూడా పెరుగుతున్నట్లు భావిస్తున్నానని కైరా తెలిపింది. ముందుకంటే ఇప్పుడు ఇంకా బాధ్యతగా ఉంటున్నట్లు చెప్పింది. నటిగా శ్రమిస్తూనే, వస్తున్న గుర్తింపునకు సంతోషంగా ఉన్నానంది. బాలీవుడ్ తెలుగు చిత్రాలతో పాటు నెట్ ధారావాహికల్లోనూ కైరా నటిస్తోంది. ఎంఎస్ ధోనీ, మెషీన్ లాంటి చిత్రాల్లో మెరిసిన ఈ సుందరి..తెలుగులోకి వచ్చి స్టార్‌లతో సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం కైరా గుడ్ న్యూస్ అనే హిందీ చిత్రంలో అక్షయ్ కుమార్, దిల్జిత్ దోసంద్‌లతో కలిసి నటిస్తోంది. కరీనా కపూర్ మరో కీలక పాత్ర పోషిస్తోంది. గుడ్ న్యూస్ పంజాబీ నేపథ్యంలో సాగే కథ.

టైటిల్ బావుంటే సగం సక్సెస్: సూపర్‌స్టార్ కృష్ణ



నవీన్ విజయ్‌కృష్ణ, శ్రీనివాస్ అవసరాల కథానాయకులుగా... మేఘాచౌదరి, సోపియా సింగ్ నాయికలుగా రూపొందుతున్న చిత్రం ఊరంతా అనుకుంటున్నారు. బాలాజి సానల దర్శకుడు. రోవాస్కెర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శ్రీహరి మంగళం పల్లి, రమ్య గోగుల, పి.ఎల్.ఎన్.రెడ్డి, ఎ.పద్మనాభరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్ లోగోను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సూపర్‌స్టార్ కృష్ణ విడుదలచేశారు. అలాగే హీరో ఫస్ట్‌లుక్‌ను నరేష్, టీజర్‌ను కృష్ణ, విజయనిర్మల ఆవిష్కరించారు. ఇదే కార్యక్రమంలో హీరో నవీన్ విజయ్‌కృష్ణ కేక్ కట్‌చేసి తన పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ, టైటిల్ బావుంటే సినిమా సగం సక్సెస్ అయినట్లే. ఈ చిత్రానికి అలాంటి మంచి టైటిల్ దొరికింది. ఇంగ్లీష్ పదాలతో ఎక్కువ టైటిల్స్ వస్తున్న ఈ సమయంలో ఇలాంటి టైటిల్ రావడం ఆనందంగా ఉంది. నవీన్ చిన్నప్పట్నుంచి సినిమా వాతావరణంలో పెరిగాడు. తనలో మంచి ఈజ్ ఉంది. పాటలు, ఫైట్లు అన్నీ బాగా చేయగలుగుతున్నాడు. నరేష్ తాను కథ విన్నానని...బావుందని చెబుతున్నాడంటే తప్పకుండా సినిమాలో విషయం ఉండనే ఉంటుంది అని అన్నారు.సీనియర్ నటి విజయనిర్మల మాట్లాడుతూ, నవీన్‌తో పాటు ఈ చిత్రంలోని తారాగణాన్ని అంతా దీవించాలని పేర్కొనగా...సీనియర్ నటుడు నరేష్ మాట్లాడుతూ, నందిని నర్సింగ్‌హోమ్‌తో నవీన్ హీరోగా మంచిపేరు తెచ్చుకున్నారు. హీరోగా, ఆర్టిస్టుగా నిలదొక్కుకోవాలని ఆయన తాపత్రయం. ఐదారు స్క్రిప్టులు విన్న తర్వాత ఈ చిత్రకథ బాగా నచ్చింది. నేను బావున్నాయన్న సినిమాలు 90 శాతం ఫెయిల్ కాలేదు. ఇది మంచి ఎంటర్‌టైనర్ అవుతుంది అని అన్నారు. సంగీత దర్శకుడు కె.ఎం.రాధాకృష్ణన్ మాట్లాడుతూ, ఇందులో నవీన్ పాత్ర చాలా బావుంటుంది. కథాబలం ఉన్న సినిమా. గ్రామీణ నేపథ్యంలో సాగుతుంది అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ, గ్రామీణ యువకుడిగా నవీన్ ఈ చిత్రంలో మెప్పిస్తాడని, అతనిలోని పలుకోణాలు ఈ చిత్రంలో ఆవిష్కృతమవుతాయి అని అన్నారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో జయసుధ, కోట శ్రీనివాసరావు, రావు రమేష్, అన్నపూర్ణమ్మ, రాజారవీంద్ర, అశోక్‌కుమార్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కెమెరా: జి.ఎల్.ఎన్.బాబు, ఎడిటింగ్:మధు, ఆర్ట్: కృష్ణమాయ.

ఎన్టీఆర్ అతిథిగా

అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం మిస్టర్ మజ్ను. నిధి అగర్వాల్ నాయికగా నటిస్తోంది. శ్రీ వెంకటేశ్వరా సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకుడు. థమన్ సంగీతం అందించిన మిస్టర్ మజ్ను పాటలు ఇప్పటికే విడుదలై శ్రోతల


అఖిల్

ఆదరణ పొందుతున్నాయి. ఘనంగా సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమం జరగనుంది. ఈ నెల 19న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మిస్టర్ మజ్ను ప్రీ రిలీజ్ కార్యక్రమానికి ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నెల 25వ తేదీన సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

నాన్న ఆరోగ్యం మెరుగ్గా ఉంది

బ్రహ్మానందం తనయుడు గౌతమ్


బ్రహ్మానందం

ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం ఆరోగ్యం నిలకడగా ఉంది. ముంబైలోని ఏషియన్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌లో సోమవారం ఆయనకు గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన తనయుడు గౌతమ్ స్పందిస్తూ...కొంతకాలంగా నాన్నకు ఛాతిలో అసౌకర్యంగా అనిపించడంతో హైదరాబాద్‌లోని ప్రముఖ డాక్టర్‌ను సంప్రదించారు. వారి సలహా మేరరు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ప్రస్తుతం ఐసీయు నుంచి ఆయనను సాధారణ గదికి మార్చడం జరిగింది. నాన్నకు శస్త్ర చికిత్స జరిగిందని తెలిసి...అభిమానులు, శ్రేయోభిలాషులు, పరిశ్రమలోని వ్యక్తులు ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేయడం మొదలుపెట్టారు. వారందరికీ కృతజ్ఞతలు. అందరి ప్రేమాభిమానాలు, ఆశీస్సుల వల్ల నాన్న ఆరోగ్యం మెరుగ్గా ఉంది అని తెలిపారు. బ్రహ్మానందం దగ్గర కుటుంబ సభ్యులతో పాటు ఆయన తనయులు గౌతమ్, సిద్ధార్థ్ ఉన్నారు.

బాక్సాఫీస్ వద్ద సత్తా చాటింది


డి.వి.వి.దానయ్య

వినయ విధేయ రామ చిత్రానికి చక్కటి ప్రేక్షకాదరణ లభిస్తోందని నిర్మాత డి.వి.వి.దానయ్య తెలిపారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో డి.వి.వి.ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రం గురించి నిర్మాత దానయ్య మాట్లాడుతూ, రామ్‌చరణ్, బోయపాటి కాంబినేషన్‌లో సినిమా అనగానే భారీ అంచనాలు ఉంటాయనే విషయం తెలియంది కాదు. మేకింగ్‌లో ఎక్కడా రాజీపడకుండా సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించాం. అలాగే హీరోను మాస్ కోణంలో దర్శకుడు బోయపాటి ప్రజెంట్ చేశారు. అన్నదమ్ముల మధ్య అనుబంధం, ఫ్యామిలీ ఎమోషన్స్, కుటుంబ కథాచిత్రాల ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అలాగే పవర్‌ఫుల్ యాక్షన్ ఎపిసోడ్స్, డ్యాన్సులకు మాస్ ప్రేక్షకులు కనెక్ట్ అయ్యారు. బాక్సాఫీసు వద్ద సినిమా సత్తా చాటింది. ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలను తెలియజేస్తున్నాం అని అన్నారు.